RNI No. APTEL/2003/12253

# భావ వీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 8(1) Monthly August 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



## ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Telugu Literary, Culture & Language Study**

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 16 - Issue. 8(1) - August 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**, G.L.S. ENTERPRISES, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అనుభూతి కవి ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

'తేనెల తేటల మాటలతో... మన దేశమాతనే కొలిచెదమా... భావం భాగ్యం కూర్చుకొని, ఇక జీవనయానం చేయుదమా' అంటూ దేశమాతకు లలితగాన హారతి పట్టిన ప్రముఖ అనుభూతి కవి ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. తెలుగులో పొట్టి కథలకు 'కథానిక' అనే అద్భుతమైన పేరు సూచించి, ఆ సాహితీ ప్రక్రియకు ఒక సమున్నత స్థానాన్ని కల్పించిన ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారి వారసుడే శ్రీకాంతశర్మ.

అనుభూతి వాదానికి బలమైన కవిత్వ ప్రతినిధిగా పేరుపొందిన శ్రీకాంతశర్మ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో మే 29, 1944న జన్మించారు. తెలుగులో పట్టభద్రుడైన శర్మ గారు కొంతకాలం విద్యాభోదన చేసి, ఆ తర్వాత ఆంధ్రజ్యోతి వార పత్రికలో సబ్-ఎడిటర్‌గా చేశారు. 1976లో ఆకాశవాణి కేంద్రంలో చేరి, వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పత్రికల్లో గేయాలు, కవితలు, సాహిత్య వ్యాసాలు వ్రాశారు. అనేక రేడియో నాటికాలు, నాటకాలు, డాక్యుమెంట్‌లు, సంగీత రూపకాలు రచించారు. 1995లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకులుగా చేరారు.

హనుమచ్ఛాస్త్రి వారసత్వాన్ని నిలపడంతోపాటు అర్థవంతమైన రచనలెన్నో ఇంద్రగంటి శ్రీకాంతశర్మ చేశారు. 'అనుభూతి గీతాలు', 'శిలామురళి', 'ఏకాంతకోకిల', 'నిశ్శబ్దగమ్యం', 'సాహిత్య పరిచయం' వంటి ప్రముఖ రచనలు ఈయన కలం నుంచి జాలువారినవే. ఇటీవల తను రాసుకున్న ఆత్మకత "ఇంటిపేరు ఇంద్రగంటి" ఈ మధ్యకాలంలో వచ్చిన ఆత్మకథల్లో సాహితీ విమర్శకుల మన్ననల్ని కూడా పొందిన ఆత్మకథగా నిలిచింది. ఇది కేవలం ఒక ఆత్మకథ కాదు. అయిదు దశాబ్దాల తెలుగు సాహిత్య చరిత్ర. తెలుగువారి సాంస్కృతిక సమీక్ష. అటు సంప్రదాయ సాహిత్యానికి, ఇటు ఆధునిక కవిత్వానికి వారధిగా నిలుస్తున్నది.

"నువ్వు చెప్పేదేదైనా నీ అనుభవంలోంచి పలకాలన్నది అనుభూతి కవితకు ప్రాథమిక సూత్రం..." ఆ ధోరణిని పుణికిపుచ్చుకున్న కవి శ్రీకాంతశర్మ. ఆయన కవితలు, నాటికలు, విమర్శలతోపాటు "కృష్ణావతారం" (1982), "నెలవంక" (1983) మొదలైన సినిమాలకు దాదాపు 30 పాటలకు పైగా రాసి, తనలోని సినీ కవిని కూడా పరిచయం చేశారు. ఆయన సమగ్ర సాహిత్యానంతటినీ రెండు సంపుటాలుగా వెలువరించారు.

కథా రచయితగా, నవలాకర్తగా, సాహిత్య విమర్శకుడిగా, సమీక్షకుడిగా, యక్షగాన గేయకర్తగా, సంస్కృత గ్రంథాలు అనువాదకర్తగా, ఉపనిషత్తుల వ్యాఖ్యానంలో ప్రామాణికమైన పీఠికలు అందించడంలో అందెవేసిన చేయిగా శ్రీకాంతశర్మ ఎన్నో రంగాలలో రాణించి, తనదైన ముద్రను వేశారు. విమర్శకుల ప్రశంసలు సైతం అందుకున్న శర్మ ఎన్నో జాతీయ పురస్కారాలను సైతం చేజిక్కించుకున్నారు. సహృదయ సమీక్షకుడిగా, ఆకర్షణీయమైన వక్తగా వేలాదిమంది అభిమానాన్ని సంపాదించుకున్న శర్మ గారు సాహితీలోకాన్ని వీడి వెళ్ళడం బాధాకరం. వారికి భావవీణ శ్రద్ధాంజలి ఘటిస్తుంది.

- సంపాదక వర్గం

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | లంబాడీల వివాహంలో సగాయి - వదాయి | - డా॥ పి.భగ్గు నాయక్ | 6 |
| 2. | ఎనభై దశకం కథల్లో - విప్లవోద్యమ చిత్రణ | - ఆచార్య కె. శ్రీదేవి & బండి చంద్రమోహన్ | 14 |
| 3. | రాయలసీమ ఆధునిక కవిత్వం - రైతు జీవితం | - డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి | 20 |
| 4. | ఆధునిక సాహిత్యంలో వైవిధ్య ప్రవంతి వచన కవిత | - డా॥ మృణాళినిరాజ్ (కె.డి.డి. మృణాళిని) | 30 |
| 5. | ఆంధ్రప్రతిష్ఠ కావ్యంలో జాతీయతాంశాలు | - పసుపులేటి నాగమల్లిక | 35 |
| 6. | దేవాంగుల వరప్రదాయని- చౌడేశ్వరీ దేవి | - డా॥ గోపవరం పద్మప్రియ | 38 |
| 7. | జానపద హాస్య గేయాలు - నేటి సమాజం | - డి. రమేష్ | 41 |
| 8. | నిలువెత్తు సాధికారత నీలవేణి | - డా॥ పి.ఎ.సత్యనారాయణ | 43 |
| 9. | బోయి భీమన్న 'అసూయ' నాటకం ఇతివృత్త పరిశీలన | - సిహెచ్. రేవతి | 45 |
| 10. | గిరిజన కళారూపాల వైవిధ్యం | - జె. విజేందర్ | 48 |
| 11. | భిన్న కోణాలకు ప్రతీక "శిరంశెట్టి కాంతారావు కథలు" | - ధర్మారపు నాగయ్య | 51 |
| 12. | శ్రీకృష్ణతులాభారం - పద్యనిర్మాణ సౌందర్యం | - ధర్మకారి అశోక్ బాబు | 53 |
| 13. | ప్రశ్నను ప్రగతికి సంకేతం చేసిన కాళోజీ మార్గం | - డా॥ జి.కిషన్ ప్రసాద్ | 59 |
| 14. | 'వికారి' కవిత్వం- కవితా వైభవం | - డా॥ కె.లక్ష్మణ | 63 |
| 15. | "సామ్యవాద ఆణిముత్యం మహీధర రామమోహనరావు" | - కచ్చళ్ళ బలరామ్ | 69 |
| 16. | మన్నుబువ్వ కథలు - స్త్రీ అస్తిత్వం | - డా. శాంతిలక్ష్మి వి | 73 |
| 17. | కాళ్లకూరి నారాయణరావు 'చింతామణి' విశిష్టత | - డా. వెంకటరామయ్య గంపా | 78 |
| 18. | బంజారాలు - జీవనోపాధి వృత్తులు | - డా॥. హెచ్. కిషన్ | 83 |
| 19. | పోతన చింతనామృతం భాగవతం | - డా॥ చవ్వా వెంకటరెడ్డి | 89 |
| 20. | సత్యహరిశ్చంద్ర నాటకం - ఆస్తి అశాశ్వితం | - డా॥ గరికపాటి హరిబాబు | 94 |
| 21. | సమకాలీన తెలుగు సాహిత్యంలో జిగిరి నవల - సామాజిక దృక్పథం | - డా॥ అజ్మీరా సిల్మానాయక్ | 97 |
| 22. | Intricacies in Translation at News Broadcasting | *- Dr. Bolugadde Anil Kumar* | 103 |

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# లంబాడీల వివాహంలో సగాయి - వదాయి

- డా॥ పి.భగ్గు నాయక్, పోస్ట్ డాక్టోరల్ ఫెలో, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, తెలంగాణ.

## పరిచయం :

భారతదేశం అనేక మతాలకు, భాష సంస్కృతులకు, ఆచార సంప్రదాయాలకు నిలయం. ఈ భిన్నమైన జాతులలో లంబాడీ ఒక విశిష్టమైన జాతి. భారతదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలో నివసిస్తున్న వారి ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, భాషా, సంస్కృతులలో పెద్దగా తేడాలు లేవని వివిధ రాష్ట్రాలలో వివిధ పేర్లతో పిలవబడుతున్నప్పటి తమదైన ''గోర్‌బోలి'' భాషను మాట్లాడగలగడం విశేషమని పరిశోధకులు తెలియజేస్తున్నారు. దేశం నలుమూలల నివసిస్తున్న లంబాడీలు తమను తాము ''గోర్'' అని పిలుచుకుంటారు. అనగా తాము లంబాడీలమని చెప్పుకుంటారు. ''గోర్'' కానివారిని ''కోర్'' సమాజంగా పరిగణిస్తారు. భారతదేశంలో అత్యధిక మంది మాట్లాడుతున్న భాషల్లో ''గోర్‌బోలి'' కూడా ఒకటని తెలుస్తుంది. లంబాడీలు తమ జీవన సంస్కృతిలో ఆచార సంప్రదాయాలలో తమ భాష అయిన ''గోర్‌బోలి'' లోనే మాట్లాడుకుంటారు. పాటలు పాడుకుంటారు. క్షేత్ర పర్యటన ద్వారా నల్లగొండ జిల్లాలో సేకరించిన వారి మౌఖిక సాహిత్యంలోని సగాయి-వదాయి ప్రాముఖ్యాన్ని తెలియజేయడమే ఈ పత్రం ఉద్దేశ్యం.

## వివాహం :

సామాజిక, భాద్యతల్ని, బంధాల్ని వివాహ వ్యవస్థ పటిష్టపరుస్తుంది. వివాహం అనేది సంస్కృతికి సంబంధించినది. ఇది మానవ జీవితంలో మరపురాని ఘట్టం. సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడానికి, లైంగిక నడవడికను నియంత్రించడానికి పెళ్ళి చాలా అవసరం. సామాజిక, వైయక్తిక, నైతిక విలువల్ని సంరక్షిస్తుంది. లంబాడీల పెండిండ్లు సమిష్టి ఆచారాలు గలవి. వీరి వైవాహిక ఆచారాలలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఒక గోత్రంలోని వారందరిని స్వగోత్రీయులుగా పరిగణించి ''భాయిపణా'' అంటారు. ఇతర గోత్రాల వారిని ''సేగాషణ్'' అనగా వరసైన వారు అని అర్థం. వీరి వివాహంలో సగాయి, వదాయి, సాడి, వాయా అనేవి ముఖ్యఘట్టాలు.

## సగాయి :

ఒక తండాలో ఉన్న అమ్మాయికి మరో తండాలో అబ్బాయికి లేక ఒకే తండాలో ఉన్న అబ్బాయి అమ్మాయికి సంబంధం కుదర్చటంలో ఢాడి, ఢాలియాలదే ప్రధాన పాత్రగా చెప్పవచ్చు. ఢాడి, ఢాలియాలు ఏవరికైతే ఎదిగిన కూతురు ఉందో ఆ అమ్మాయి వరసయ్యే అబ్బాయి తగిన ఇల్లు, కుటుంబం, వంశచరిత్ర, ఆర్థికపరిస్థితి మొదలైన విషయాల గురించి తండా కార్‌భారి, నాయక్‌లకు చేరవేస్తాడు. కార్‌భారి ఆ విషయాన్ని అబ్బాయి తల్లి దండ్రులతో చర్చించి తుది నిర్ణయం తీసుకొని ఒక మంచి రోజు చూసుకొని ''సగాయి కరేర్'' అంటూ అమ్మాయి వాళ్ళ ఇంటికి వెళతారు. అబ్బాయి తరపువారు ఎప్పుడైతే అమ్మాయి ఇంటికి వెళతారో అప్పుడు అమ్మాయి తన ముఖం అబ్బాయి తరపు వారికి చూపించకుండా వాళ్ళ ఇంట్లో నుండి ప్రక్కనే ఉన్నా బాబాయి లేదా పెదనాన్న ఇంటికి వెళతారు. అప్పుడు అమ్మాయి తరపువారు తమ తండా కార్‌భారిని, ఇతర పెద్దలను పిలిచి అటువైపువారు ఇటువైపు వారు పలకరింపులు చేసుకుంటారు. ఇరువైపులా పెద్దలు కూర్చొని ఇచ్చిపుచ్చుకోవడం(ఖరార్ ధరార్) మాట్లాడుకొని ఒక నిర&ణయానికి వచ్చిన తరువాత అమ్మాయి తండ్రి తన తండాలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్ళి నా బిడ్డ సగాయి చేస్తున్నాం మా ఇంటికి రండి అని అందరిని పేరు పేరునా పిలువగానే, ఇంటికి ఒకరు చొప్పున తండా వారందరూ అమ్మాయి ఇంటికి వచ్చి వియ్యంకుల వారిని పలకరించి, అందరూ వలయాకారంలో కూర్చోవగానే కొబ్బరి కుడకలు, బెల్లం తీసుకొని వచ్చి అందరి ముందు పెడతారు. అప్పుడు వలయా

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

కారంగా కూర్చున్న వాళ్ళలో నుండి ఇద్దరూ లేచి వచ్చి తమ చేతిలో కుడకలు పట్టుకొని "నారళ్, నారళ్" అని చెప్పుకుంటూ వలయాకారంగా కూర్చున్న అందరి ముందు తిరుగుతూ ఒకరు తండా కార్‌భారి దగ్గరికి మరోకరు అబ్బాయి తరపున పెద్దవారికి ఇస్తారు. ఆ తరువాత బెల్లం తీసుకొని "షిణ్ణి, షిణ్ణి" అంటూ చుట్టూ తిరిగి ఒకరు ఆ తండా కార్‌భారికి మరోకరు అబ్బాయి తరపు వారికి ఇస్తారు. తరవాత ఒక రుపాయి నాణెంను పట్టుకొని "సాఖ్, సాఖ్" అంటూ తిరుగుతూ తండా కార్‌భారికి ఇస్తారు. ఆ రోజు అమ్మాయి, అబ్బాయిల "సగాయి" జరిగిన గుర్తుగా ఆ రుపాయిని తండా కార్‌భారి పెట్టు కుంటాడు. ఆ తరువాత కొబ్బరి, బెల్లం వచ్చిన వారందరికి పంచి సారా పోస్తారు. అందరూ సారా తాగడం అయి పోయిన తరువాత "హచరా పచారా" చెప్పుకుంటారు.

**హచరా పచారా :**

లంబాడీల సగాయి సమయంలో హచరా పచారా ఘట్టం చాలా కీలకమైంది. అందరూ బెల్లం తినడం, సారా తాగడం అయిపోయిన తరువాత మొదటగా అబ్బాయి తరపువారు చెప్తారు. ఆ తరువాత అమ్మాయి తరపువారు చెబుతారు.

సామళోర్ భాయిన్ సగే
పంచ్ పంచారి రాజా భోజారి సభా
పచారో లాఖ్ అన్‌పచారో సవాలాఖ్ ర నాయేక్
ఓర్ నాయేక్
దన్ దియాతో గీల మారియర నాయేక్
జ్యాన్ బాటి జాన్ గడ్ ర నాయేక్
గడ్ కతో గడ్ మత్ కేల ర నాయేక్
పాంచ్ దనియా బ్యాస ఊట జతజ్ గడ్ ర నాయేక్
ఓర్ నాయేక్
సమియాతో సగాళో ఛ భాయిర్ తో అణద్ ఛ
శేగాషణ్ తో కోసళ్ ఛ కాయిర నాయేక్
కోసళ్ ఛ నాయేక్
ఓర్ నాయేక్
సోనాకేరి ఝూరి రుపాకేరి థాళి
మాయి ఛ కస్తూరి తోలుతో కస్తూరి
మోలుతో పూరి ఖోలుతో మారి
ఓర్ నాయేక్ అజి కాయి కూర నాయేక్
కేతో జోర నాయేక్
నందీర్ కరాడే కేవడ్ బోయే, బోయే మాదర్ లాట్
తీన్ కడీర్ సైబర్ హాత్ ర నాయేక్
లాల్ మట్టికా గడ్ ర నాయేక్
గడ్ కూల్ జా మాటికా గడ్ రేజా ర నాయేక్
సయి ర నాయేక్
ఓర్ నాయేక్
లాల్ టోపి హరో జగా
దూర దేశేతి ఆయో మారో సగార్ నాయేక్
యేళా తపన్ ఆవతో ఛాతీర్ ధ్యాన్ ర నాయేక్
కేతో జో ర నాయేక్
ధ్యాన్ కతో ధ్యాన్ మత్ కేల ర నాయేక్
ఖళా రూంగళీర్ న్యాణ్ ఛర నాయేక్
సయి ర నాయేక్
ఓర్ నాయేక్
న్యాణ్ కతో న్యాణ్ మత్ కేల ర నాయేక్
మాయి ఛ గుందలా, హాతి ఖావ గుందలా
తేజూర్ కాన్ బరోబర్
శేగాషణ్ దోయి బరోబర్ ర నాయేక్
ఓర్ నాయేక్
కాంటీర్ తో భంజా మాటీర్ తో రేజా ర నాయేక్
సయి ర నాయేక్
అజి కాయి కూ ర నాయేక్
కేతో జో ర నాయేక్
మన్ ఛంగా తో కాకోటీమా గంగా
గంగా యాతీ జా గ్వారూ బాటి ఖాతేజార్ నాయేక్
సయి ర నాయేక్
తార్ తో బేటి మార్ బేటా
రాబ్డి రేటో ఘూలన్ పాళ్ పోస్ కర్ చి క నాయేక్

(ఆంగోత్ మంత్రియా:90 మేగ్యతండా, నిడ్మనూర్ మం నల్లగొండ)

## భావం :

వినండి అన్నతమ్ములు వియ్యంకుల్లారా! ఈ సమావేశం భోజరాజు సభతో సమానమైనది. నేను పలకరించిన వారికి లక్షా, పలకరించని వారికి లక్షా ఇరవై వేల దండాలు అనుకొండి. ఐదుగురు కూర్చోని లేచిన చోట మాత్రమే కోట ఉంటుంది. మంచి మనసులు ఉన్నచోటే మంచి కోట ఉంటుది. సమాజం మంచిగా ఉంది. వియ్యంకులు బాగున్నారా? నాయక్ అంతా బాగానే ఉన్నారు. బంగారు లోటా, వెండి పళ్ళెం అందులో ఉంది కస్తూరి కొలచిన తీసుకున్న చాలా ఉంటుంది. ఓ నాయకా ఇంకా ఏం చెప్పను. ఓ నాయకా చెప్పుకుంటనే పో. నది ఒడ్డున మోదుగా చెట్టును పెంచాం. ఎర్రమట్టితో కట్టిన కోటలు కూలిపోతాయి కాని మనసుల కోటలు ఉండిపోతాయి. నాయకా అవును నిజమే నాయకా. ఓ నాయకా తలకు గులాబి టోపి పెట్టుకొని, పచ్చని చొక్కా ధరించి దూర దేశం నుండి వచ్చిండు నా వియ్యంకుడు. వేళకు వస్తే మంచి వియ్యంకుడు వేళ తప్పి వస్తే గుండే మీద భారం పడ్డట్టే. భారం అంటే భారం అనుకోకు నాయేక్ కాలువలో ఉండే నాచులాంటిది నాయేక్. నాచు అంటే నాచు అనుకోకు నాయేక్ అందులోనే ఉంది ఎనుగు తినే ఆహారం. గుర్రం చెవులు సరిసమానంగా ఎలా ఉంటాయో వియ్యంకులు ఇద్దరూ సమానమే. ఓ నాయేక్ ముల్లతో వేసిన కంచే పోతుంది కాని గ్వార్ అనబడే లంబాడీలు వేసినది మాత్రం అలాగే ఉండిపోతుంది. అవును నాయేక్ ఇంకా ఏం చెప్పను. చెప్పుకుంటూ పో నాయేక్. మనసు మంచిదయితే కాకోటి(రొట్టెల పిండి పిసికే పరికరం)లో ఉన్న నీళ్ళే గంగానది నీళ్ళలాగా భావించ వచ్చు. గంగానది ఎలా పారుతుందో అలా లంబాడీలు రొట్టెలు తింటూనే ఉంటారు. ముందు చక్కెర తరువాత బెల్లం నోట్లో వేసుకున్నాం. అంతా తియ్య తియ్యగా ఉంది. రాబోయే కాలాన్ని ఎవరూ చూశారు చెప్పండి. మీ అబ్బాయి చేతిలో మా అమ్మాయిని పెడుతున్నాం చారు పులుసు పెట్టి బతికించుకొండి.

లంబాడీల సగాయి కార్యంలో అత్యంత ముఖ్యమైన ఘట్టం ఇది. బెల్లం తినే రోజు ఇరువర్గాల వారు విని పించుకుంటారు. దీని వలన లంబాడీల ప్రకృతి జీవన సౌందర్యం తెలుస్తుంది. ఎర్రమట్టితో కట్టిన కోటల ప్రస్తావన, ఐదుగురు కలిసి తీసుకున్న నిర్ణయానికి తిరుగులేదని, మంచి మనసు ఉంటే చిన్న కుండలో ఉన్న నీటినే గంగాజలంగా స్వీకరించవచ్చనే తార్కికం అసలే కరువు కాటకాలతో అల్లాడే వారు కాబట్టి వియ్యం కులు వేళకు ఇంటికి చేరుకోవాలని ఆశిస్తున్నారు. ఇద్దరూ వియ్యంకులు సమానమనే విషయాన్ని తెలియపరచ డానికి గుర్రం చెవులతో పోల్చడం, గంగానది ప్రవహించి నట్లే లంబాడీలు రొట్టెలు తింటూనే ఉంటారని చెప్పడం అలాగే బెల్లం చక్కెర కలిపితే ఎంత తీపి వస్తుందో, వియ్యంకుల సంబంధాలు కూడా అలాగే ఉండాలని, వాళ్ళు తినే ఆహార పదార్థాలైన చారు రసం లాంటివి పెట్టి అమ్మాయి అబ్బాయిలను పెంచుకోమని చెప్పడం వారి ఆహారపు అలవాట్లను తెలుపుతున్నాయి. లంబాడీల ఆచారాలు విలక్షణమైనవిగా ఈ హచారాపచారా ద్వారా స్పష్టమవుతున్నది.

ఈ హచారాపచారా చెప్పటం అయిపోయిన తరువాత మోదుగుపూల రంగులను ఒకరిపై మరొకరు ఆనందంతో చల్లుకుంటారు. ఆ తరువాత వచ్చిన వియ్యకులందరికి పప్పన్నం తినిపిస్తారు. దీనితో "గ్వాళ్ ఖాయేర్" కార్యక్రమం పూర్తవుతుంది.

## రప్యామాండేర్ :

బెల్లం తినడం అయిపోయిన తరువాతి రోజు ఉదయం బెల్లంతో తయారు చేసిన గ్వాళేర్ దళియా (బెల్లం కలిపి వండిన అన్నం)తో వియ్యంకులను విందు భోజనం ఏర్పాటు చేస్తారు.విందు భోజనం అయిపోయిన తరువాత అమ్మాయిని అలంకరించి వియ్యంకులను చూపిస్తారు. అయితే మొదట అసలు అమ్మాయిని కాకుండా అమ్మాయి చెల్లెళ్ళను చూపిస్తారు. మేము అనుకున్న అమ్మాయా? కాదా? అని గుర్తు పట్టడానికి పరీక్ష పెడ తారు. అలా ఇద్దరూ, ముగ్గురూ అమ్మాయిలను

చూపించిన తరువాత అసలు అమ్మాయిని తీసుకొస్తారు. అమ్మాయి ముసుగు కప్పుకొని ఉండగా అబ్బాయి తర పున ఒకరు ముసుగు గుడ్డలో నుండి చాకచక్యంగా ఆమె ముఖం చూసి ఆమె చేతిలో డబ్బులు పెట్టడానికి అబ్బాయి అన్న వరస అయ్యేవాళ్ళు ప్రయత్నిస్తారు. అప్పుడు పక్కనున్న స్త్రీలు ఈ విధంగా పాటలు పాడు తారు.

ఝణకారియా లాల్ కేరే హకమేతి ఆయో మారో లాల్
ఝణకారియా లాల్ బాయి బాయి కరతో ఆయో మారో లాల్
ఝణకారియా లాల్ పాంచ పచ్చీస్ గణ మారో లాల్
ఝణకారియా లాల్ బాయి బాయి కీస తో మానియూ మారో లాల్
ఝణకారియా లాల్ కేరే హకమేతి ఆయో మారో లాల్
ఝణకారియా లాల్ నాయేకేరే హకమేతి ఆయో మారో లాల్
ఝణకారియా లాల్ ఏక రపడితి మానుకొని లాల్
ఝణకారియా లాల్ పాంచ పచ్చీస్ ద మారో లాల్
ఝణకారియా లాల్ వాంసళీరో మూండో ఛోడ మారో లాల్
ఝణకారియా లాల్ పాంచ పచ్చీస గణమారోలాల్

(మూడు నానకు : 50 పలుగుతండా, త్రిపురారం మం. నల్లగొండ జిల్లా)

**భావం :**

ఓ వియ్యంకుడా! నువ్వు ఎవరి ఆజ్ఞతో ఇక్కడికి వచ్చావు. నువ్వు అక్క అక్క అనుకుంటూ వచ్చావు కదా! ఇరవై ఐదు రుపాయలు లెక్కపెట్టి ఇచ్చి అక్కా అక్కా అంటేనే మేం ఒప్పుకుంటాం. నువ్వు ఎవరి అనుమతి తీసుకొని ఈ తండాకు వచ్చావు. తండా నాయకుని అను మతితో వచ్చావు. నువ్వు ఇచ్చే ఒక్క రుపాయితో మేం సరిపెట్టుకోలేం. నీ నడుముకు కట్టుకున్న సంచి మూటను విప్పి ఇరవై ఐదు రుపాయలు ఇవ్వాల్సిందేనని పాడు తున్నారు.

**సాగా దోలేరో :**

రప్యా మాండేరో అయిపోయిన తరువాత తండా వాళ్ళందరూ కలిసి, వచ్చిన వియ్యంకులందరిని తిరిగి పంపటానికి వెళతారు. దీనినే "సాగా దోలేరో" అంటారు. ఈ సందర్భంగా స్త్రీలు పాడే పాటలు ఈ విధంగా ఉన్నాయి.

అంబారి బాగేమా బ్యాటోర మళావోర బాగేమా లాలి చ్వాకేమా
బ్యాటోర మళావో కిదేర సగాయి బాగేమా లాలి చ్వాకేమా
ఆయేజకో మళావో ఠాలోర హూబోర బాగేమా లాలి చ్వాకేమా
సోమాణిరి గ్వారణి జభర వడ్డాళర బాగేమా లాలి చ్వాకేమా
సోళపట్టి సాదరి మూండో మోడ ఘాలిర బాగేమా లాలిచ్వాకేమా

(అంగోత్ పరేంగన్ : 50 నాగార్జున పేట, పెద్దవూర మ)

**భావం :**

మామిడి తోటలో మగవాళ్ళ గుంపు ఉంది. ఆ గుంపు సగాయి చేశారు. ఆ సందర్భంగా మిఠాయిలు తిన్నారు. ఆ వచ్చిన గుంపు అలాగే నిలబడి ఉంది. ఎందుకంటే ఆ ఇంటి ఇల్లాలు చాలా పొగరు కలది. అందుకే పదహారు పట్టీల చాపను ముఖం తిప్పుకుంటూ వేసింది. అలాగే నీళ్ళ లోటాను ముఖం ముడుచుకుంటూ ఇచ్చింది.

జిగూడమే పర మళావో బ్యాటోచ
వత ఖాదేరే కవితా బాయిరో గ్వాళ్
ఢాలియా ఢపడియా మాంగణీన ఆ యే
వో దినేరే పచ్చీస ధరం
ధరమ దినేతో దావా దీయ
వత లాగియరే లాఖూసు ఫళ్

(సపావట్ దసరు:60 జువ్విగూడెంతండా, గుర్రంపోడ్ మం. నల్లగొండ జిల్లా)

**భావం :**

జి గూడెం తండాలో మగవాళ్ళ గుంపు కూర్చోని కవితా బెల్లం తిన్నారు. అప్పుడు ఢాలియాలు,ఢపడియాలు వచ్చారు. వాళ్ళకు ఇరవై ఐదు రుపాయలు దానంగా ఇచ్చారు. దానం ఇస్తే మంచి జరుగుతుంది.మీకు లక్షల విలువ చేసే ఫలాలు కలుగుతాయి.

**వదాయి(వడుగు) :**

తెలుగు వారి వడుగు సంప్రదాయం ఎలా ఉందో లంబాడీలలో కూడా ఈ వడుగు సంప్రదాయం పాటిస్తున్నారు. వడుగు సందర్భంలో తమ పితృ దేవతలను పూజించి, తరువాత మేకలను కోసి బంధు మిత్రులకు విందు భోజనం పెడతారు. అయితే వదాయిలో ముఖ్యమైన ఘట్టమైన వాతపెట్టడం(దాగ్‌దేర్) తరతరాలుగా వస్తున్న సంప్రదాయం ఈ సందర్భంగా పాడే పాట

క్వాళి యావ క్వాళి జావా క్వాళి మాయి జోగ్ సమాళ
ధ్వాళో ఘోడో హాంసలో పాతళీయ సమాళ్
ముంగే అత్ర డాయేలో, తల్లి ఆత్ర కమాల్
ఆవో భాయి పాంచ్ లోకో గోసాయి బావా సదార్
సదార్

(పాన్‌గోత్ హన్మ:85 లచియాతండా, త్రిపురారం)

**భావం :**

లంబాడీల వదాయి సందర్భంలో వరుడి వీపుపై వాత పెట్టడం ఆనవాయితిగా వస్తున్నది. ఐదుగురు అన్నదమ్ములు కలిసి వచ్చి గోసాయి బాబాను వినతి చేయండి. అదే విధంగా ఈ వాత తరువాత నలుగురిలో కలిసి పోయాడని చెపుతారు.

వడేమాకి మారే టేళేపరే బ్యాటి
టేళేరో బానో రకాడి కోని వడజోని మాకి
వడేమాకి మారే మళాయేపరే బ్యాటి
మళాయేరో బానో రకాడికోని వడజోని మాకి
వడేమాకి మారే ఝురలే పరే బ్యాటి
ఝురలేరో బానో రకాడి కోని వడజోని మాకి
వడేమాకి మారే యాతడు పరే బ్యాటి
యాతడూరో బానో రకాడి కోని వడజోని మాకి

(అంగోత్ పికిలి:75 రంగూడ్ల అనుముల మం. నల్లగొండ జిల్లా)

**భావం :**

ఓ ఎగురుతున్న ఈగ బంతి మీద కూర్చున్నావు తరువాత మళావో మీద కూర్చున్నావు అలాగే పెండ్లికొడుకు మీద కూర్చున్నావు.నీవు ఎక్కడ కూర్చున్న కూడా ఎవరికి విలువ ఉంచలేదు కాబట్టి నీవు ఎగిరిపో. లంబాడి సమాజంలో విలువ లేని వాళ్ళ స్థానం ఏ విధంగా ఉంటుందో ఈ గేయం తెలియజేస్తున్నది.

సామళో బాపు కాకా దాదావో
హాంస్ ఘాలు హవేలి ఘాలు ఫేరన్ ఘాలు పేటి
పాంచ్ పంచారిర్ తాళి భాందు మ బాపేర్ బేటి

(పాన్‌గోత్ లక్కి:85 లచియాతండా, త్రిపురారంమం. నల్లగొండ)

**భావం :**

ఓ తాత తండ్రులారా మెడకంటే పెట్టుకున్నాను, తలపై వస్త్రం కప్పుకున్నాను, పేటి తిప్పి పెట్టుకుంటాను. నేను మా నాన్నకు కూతురిని మీ అందరి కంచాలను అన్నం తిననీయకుండా కట్టేస్తున్నాను. బంజారా సమాజంలో పెండ్లి వేడుకలు చాలా భిన్నమైనవి అయితే ఈ వేడుకలలో బంతి భోజనాలు తినడానికి పెద్దలంతా వచ్చి కూర్చోవగానే వాళ్ళను అన్నం తిననీయకుండా కంచాలను కట్టివేస్తూ పలికే వాక్యాలు ఇవి.అప్పుడు పెద్దలలో ఒకరు లేచి ఈ విధంగా విప్ప తీస్తారు.

సామళో యాడి ఢావి సాణివో
వణ్ కాటు వణియారి కాటు వణేరో గేదా కాటు
సాతే హాతేర్ ఖాడు లేగో, ఖాడుమా సాండ్యా,
సాండ్యార్ గొద్ది, గొద్దిపర్ గాది, గాదిపర్ ఝూరి
ఆంగ బ్యాటి హాంసలే వాళి, లార బ్యాటి భూరియా
వాళి, భగల బ్యాటి ఛడావాళి
ఛోడో ఛోడో డావిసాణి పాంచ్ పంచారిర్ థాళి

(దానావత్ సామా: 90 లచియాతండా,త్రిపురారం మం. నల్లగొండ)

**భావం :**

వినండి ఓ ముసలివాళ్ళు వణ్ కోస్తా, మీరు కట్టినది విప్పుతీస్తా అరవై అడుగుల పశువుల మందనుమేపడానికి తీసుకొని వెళ్తే, అందులో ఆంబోతు ఉన్నది.ఆ ఆంబోతు మూపురం, దాని మీద కూర్చోవడానికిగాది ఆ గాదిమీద కంచు లోటా ఉన్నది. ముందు వరసలో మెడకంటే పెట్టుకున్న వాళ్ళు కూర్చున్నారు. ఆ వెనుకాల బంగారపు ముక్కుపోగు (భూరియా) పెట్టుకున్న వాళ్ళు కూర్చున్నారు. ప్రక్కన చేతికి దంతపు గాజులు పెట్టుకున్న వాళ్ళు కూర్చున్నారు. కాబట్టి ఓ పెద్దమ్మలు, అనుభవజ్ఞులు ఐదుగురు తినే ఆహారపు కంచాలను విడిచిపెట్టండి అని చెప్పి విప్పుతీస్తారు.

కడి కడియాలేర్ ఘాట్, టోకన్ సీజే సార్
మళావో బ్యాటో రాట్, కోడ్సో పాడో వాట్
పూలా వన్నె ధాన్, చంపా వన్నె దాళ్, మోతి వన్నె ఫీ
ఘూలేరియా పల్చు, కోడ్చికా దాదా బక్షిక్ కరలోర్
నాయేక్
(దానావత్ సామా : 90 లచియాతండా, త్రిపురారం మం.)

**భావం :**

వినండి పెద్దలారా పెద్ద పెద్ద గిన్నెలలో వండుతున్న వంటలు, పురుషుల గుంపు భారిగా కూర్చోని ఉండగా, గంటే దారి ఏర్పరచగా పూలలాంటి అన్నం చంపాలాంటి పప్పు, ముత్యాల వంటి నెయ్యి, చిక్కటి చారు తయారుగా ఉన్నది. అందరూ కడుపు నిండా తినండి.

ఖాగే పిగే మాటలా రడాగే
ఆచి భలి ఘరేవాళిన డోడోన పో పో రమాడగేరే
పరదేశిడా భూమడి మరాగేరే
(రమావత్ సీవి:55 ఎర్రచెరువుతండా,పెద్దవూర మం. నల్లగొండ జిల్లా)

**భావం :**

ఓ పరదేశం నుండి వచ్చిన బంధువులారా విందు భోజనాలు బాగా తిన్నారు, సారాయి తాగారు చివరకు ఆ ఇంటావిడను ఏమి పెట్టలేదని బదనాం చేసి వెళ్ళిపోయారు. ఈ గేయం లంబాడీ సమాజపు విందు అనంతర పరిస్థితులను తెలియజేస్తుంది.

**వరుడిని సాగదోలడం :**

నేటి సమాజంలో ఆధునిక వివాహ సంప్రదాయాలకు అలవాటుపడి ఆధునిక పద్ధతిలో వివాహాలు చేస్తున్నారు. అయినప్పటికి తమ ఆచార వ్యవహారాలను ఆచరిస్తూనే ఉన్నారని తెలిపే గేయమిది.

సూరియా ప్యాంటేతి సూరియా ప్యాంటేతి
సూయి మంగాయి యా రే
ఏ భోళో తావూ డా
ఏ హటిలో తావూ డా
తారి సరాపేరి కోతలి సరాపేరి కోతలి
సాయిరాత నింద గమాయి యా రే
ఏ భోళో తావూ డా
సాయి రాత నింద గమాయి యా రే
ఏ హటిలో తావూ డా
ఏ అమల కంతేతి అమల కంతేతి
ఛాంటియా మంగాయి యా రే
ఏ భోళో తావూ డా
తారి సరాపేరి కోతలి సరాపేరి కోతలి
సాయి రాత ఖిలణ్ దినియారే
లామి డోరేరో దాదా ఝురలేమా
ఏ లామి డోరేమా దాదా ఝురలేమా
తారి సరాపేరి కోతలి సరాపేరి కోతలి
సాయి రాత టేకో మరాయి యా రే
ఏ హటిలో తావూ డా
ఏ భోళో తావూ డా
(ఆంగోత్ దేవి:45 మన్‌బోత్ తండా, పెద్దవూర మం. నల్లగొండ జిల్లా)

**భావం :**

సూర్యాపేట నుండి సూదిని,అమలకంత్ నుండి గుడ్డను తెప్పించి, నీవు పెళ్ళికి వెళ్ళేటపుడు తీసుకొని పోయే సంచి (సరాపేరి కోతలి)ని, నీవు కప్పుకొనే క్వాళ్‌ను

రాత్రి మొత్తం కుట్టి వాటిపై డిజైన్లు వేశాము.ఓ ఏమి తెలియని అమాయక తావూ,రాత్రి మొత్తం మాకు నిద్ర లేకుండా నిన్ను సాగనంపే ఏర్పాట్లుచేశాం.

లంబాడీల పెళ్ళికొడుకును పెళ్ళికి ముందే అత్త వారింటికి చేరుకొని మూడు నెలలు ఉండేవాడు. అలా అత్తవారింటికి వెళ్ళే ముందు అతనికి అవసరమైన వస్తువులు పెట్టుకోవడానికి ఒక సంచి (సరాపేర్ కోతలి) మరియు కప్పుకోవడానికి ముప్పై అడుగులగుడ్డ (క్వాళ్)ను తండాలోని స్త్రీలందరూ కలిసి,వివిధ కుట్లు, అల్లికలు, రకరకాల డిజైన్లతో రాత్రి మొత్తం నిద్ర మేల్కొని తయారు చేసేవారు.కోడి కూయక ముందే పెళ్ళికొడుకును సాగ నంపాల్సి ఉంటుంది. ఎందుకంటే అందరూ నిద్రలేచిన తరువాత మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు ఎదురయితే అప శకునంగా భావిస్తారు. అలా అపశకునాలు ఏవి అడ్డు రావద్దని కోడి కూయక ముందే పెండ్లి కొడుకును పంపి స్తారు. కాబట్టి ఆ వస్తువులను తయారు చేయడానికి వివిధ పట్టణాల నుండి కావల్సిన వస్తువులను తెప్పించు కొని తయారు చేస్తున్నామని పాటలు పాడుకుంటూ కుడుతారు.

యాంగ హూబో తారే ససరేరో మళావో
హతజోడి రామి రామి కరలరే పాతేరో పంతియా
యాంగ హూబి తారి సాసూవూరో మళావో
హతజోడి రామి రామి కరలరే పాతేరో పంతియా
యాంగ హూబో తారో సాళేవూరో మళావో
హత జోడి రామి రామి కరలరే పాంతేరో పంతియా

(అంగోత్ కనికి : 50 మేగ్యాతండా, నిడ్మనూర్ మం, నల్లగొండ)

### భావం :

ఈ గేయంలో లంబాడి వరున్ని అత్త వారింటికి సాగనంపేటప్పుడు ఈ విధంగా సలహాలను పాటల రూపంలో ఇస్తారు. నీకు స్వాగతించేటప్పుడు మామలకు, అత్తలకు, బావమరుదులకు చేతులు జోడిస్తూ రాం రాం అని వినయంగా పలకరించుకో అని సలహాలు ఇచ్చి సాగనంపుతారు.

### ముగింపు :

ఆధునిక సమాజంలో లంబాడీలు తరతరాలుగా వస్తున్న తమ ఆచారాలను ఆచరిస్తున్నారు, భద్రపరుచు కుంటున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునికత తెచ్చిన మార్పులకు చిన్నా భిన్నం అవుతున్న లంబాడి సమాజం ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని తమ మూలా లను పదిల పరుచుకుంటూనే ఉంది. విద్యా, ఉపాధి ఉద్యోగాల కొరకు తండాల నుండి పట్టణాలు, నగరాలకు వలసలు వచ్చి స్థిరపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరిగి, ఒడిదుడుకులకు లోనవుతూ ఆధునికత వైపునకు మొగ్గు చూపిస్తుండడంతో లంబాడాల సమాజంలో భిన్న మైన మార్పులు వస్తున్నాయి. ఆధునిక సమాజంలో సంపా దనే ప్రధాన ధ్యేయంగా మారిపోయి, అందరూ తీరిక లేకుండా ఉండడంతో సులభమైన పద్ధతిలోనే వివాహాలు చేసేయాలనే ఉద్దేశ్యంతోను, తాము ఎవరికి తక్కువ కాదనే ఉద్దేశ్యంతోను పట్టణాలు, నగరాలలో లంబాడాల వివాహ పద్దతులను ఆచరించడం లేదు. పెళ్ళంటే విష్ యు మ్యారిడ్ లైప్ అని విందు భోజనం తిని వెళ్లిపోతు న్నారు. కాని పట్టణాలు, నగరాలకు దూరంగా ఉన్న మారు మూల తండాలలోతమ వివాహ పద్ధతులను పాటిస్తు న్నారు. ఇప్పటికే లంబాడాల వేషాన్ని కోల్పోయి, భాషను వదిలి వేసి, సంస్కృతిని మరచిపోతున్న ప్రస్తుత తరుణంలో మూలాలలోకి వెళ్ళి ఆ తండాలలో ఆచ రిస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు, భాషను రికార్డు చేసి భద్రపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### ఉపయుక్త గ్రంథ సూచిక :

1. కృష్ణకుమారి, నాయని(సం) 2000 "తెలుగు జానపద విజ్ఞానం సామాజం-సంస్కృతి-సాహిత్యం" హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

2. గోనానాయక్ ఎం.2002 ‘‘సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు’’ హైదరాబాదు:పద్మశ్రీ గ్రాఫిక్స్
3. చినియానాయక్ బి. 1998 ‘‘బంజారా చరిత్ర సంస్కృతి-ప్రగతి’’ అనంతపురం:హాథీరాం బావాజి పబ్లికేషన్స్
4. భగ్గు పి. 2014 ‘‘నల్లగొండ జిల్లా గిరిజన సాహిత్య, సాంస్కృతిక అధ్యయనం’’ హైదరాబాదు విశ్వవిద్యాలయం:పిహెచ్.డి అముద్రిత సిద్ధాంత గ్రంథం.
5. భంగ్యా భుక్యా 2012 ‘‘నిజాం పాలనలో లంబాడాలు’’ హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్టు
6. రామరాజు:బి. 1958 ‘‘తెలుగు జానపద గేయ సాహిత్యం’’ హైదరాబాదు: జానపద విజ్ఞాన ప్రచురణలు
7. మోహన్ జి.ఎస్ 2010 ‘‘జానపద విజ్ఞానాధ్యయనం’’ కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం
8. శంకరయ్య జె.2001 ‘‘తెలుగు లంబాడీల గేయ సాహిత్యం’’ ఆవునూరు: జనపాల వారి ప్రచురణలు
9. శివరామకృష్ణ, పి. 2007 ‘‘కొండకోనల్లో తెలుగు గిరిజనులు’’ హైదరాబాదు: శక్తి 305, జనప్రియ
10. సుందరం ఆర్వీఎస్. 1983 ‘‘ఆంధ్రుల జానపద విజ్ఞానం’’ హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఎనభై దశకం కథల్లో - విప్లవోద్యమ చిత్రణ

- బండి చంద్రమోహన్,
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

- ఆచార్య కె. శ్రీదేవి,
తెలుగుశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

88వ సంవత్సరపు కథలు 1104 రచయితలు 613 మంది రాశారు. ఈ కథలలో గ్రామాలు, భూమి సమస్య, సంఘం గొడుగు నీడన ప్రజల సమైక్య పోరాటాలు, పోలీసులు దాడులు, భయాలు, ప్రతివ్యూహాలు, ప్రజల చొరవ చైతన్యాలు, విప్లవదళ కార్యకలాపాలు, త్యాగాలు వస్తువుగా ఈ సంవత్సరం విప్లవోద్యమ కథలు వచ్చాయి. బియస్. రాములు అడవి భూమికగా సాయుధదళ జీవితాలను, అనుభవాలను కథలుగా రాయటంతోపాటు, వాళ్లకు వ్యతిరేకంగా దొరల పంచన చేరి వారి స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగపడుతూ నిత్య అభద్రతలో నిరంతర హింసకు గురవుతూ జీవిస్తూన్న రాజ్యంకోసం బలిపశువులవుతున్న వాళ్ల గురించి 'ఊబి' అనే కథ రాశాడు. ఇది విప్లవోద్యమ కథకు మరొక పార్శ్వం. పరోక్షంగా విప్లవోద్యమ శక్తిని నిరూపించటం - రాజ్యం సైతం దానికి భయపడుతున్నదని చెప్పటం - దాని ప్రయోజనం.

విప్లవోద్యమంలో వున్న ఒక చెల్లెలు పట్నంలో అక్కకు రాసిన ఉత్తరం రూపంలో వున్న కథ 'అక్కాచెల్లెలు' బియస్. రాములు రాసిందే. అక్కకు దోపిడీ స్వరూప స్వభావాలను ఎరుక పరుస్తున్నట్లుగా సాగిన ఈ ఉత్తరం సారా సమస్యను, దాని వెనక వున్న రాజకీయార్థిక తత్త్వాన్ని వివరించింది. సారా ధరల తగ్గింపు ఆందోళన విప్లవోద్యమం చేపట్టటంలోని అంతర్యాన్ని, అవసరాన్ని తెలిపే వివరణ ఇది. 1990లో సారావ్యతిరేక మహిళా ఉద్యమానికి వేగుచుక్కగా సారా ఉద్యమ ప్రారంభాన్ని నమోదు చేసిన కథ ఇది.

రఘోత్తమరెడ్డి రాసిన మూడు కథలు సింగరేణి గని కార్మిక జీవితానికి సంబంధించినవే అయినా అవి పని పరిస్థితులను, దోపిడి పీడనలను, చిత్రించినవి కావు. అవి కార్మికుల కుటుంబ జీవితాన్ని ఎట్లా ప్రభావితం చేస్తున్నాయో మూడు సందర్భాల నుండి చెప్పిన కథలవి. మనిషి పని చేసే వాడు మాత్రమే కాదు. మనిషి కౌటుంబిక సామాజిక సంబంధాలలో జీవించే మనిషి. కుటుంబ పోషణకే పని అవసరం. పని తనలో సృజనాత్మక శక్తులనే కాదు, శారీరక మానసిక శక్తులనన్నింటిని హరించి వేసేదిగా వున్నప్పుడు మనిషికి సుఖకరమైన కుటుంబ జీవితం లేదు. భార్యతో స్నేహాన్ని పంచుకొనే లైంగిక ఆసక్తులను సంతృప్తిపరచుకొనే సన్నిహిత సంబంధానికి పరాయికరించబడటం 'పని' పరిస్థితులవల్లనే. గని కార్మిక జీవితం భార్యాభర్తల సంబంధాలను శత్రుసంబంధాలలోకి నెడుతున్నదని చెప్పిన కథ 'శత్రువు'. గని కార్మికుడి ఇంట పెళ్లి ఆర్థిక పరిమితుల మధ్య, పని పరిస్థితులు సృష్టించిన క్రూరత్వం మధ్య సంతోషకరమైన సందర్భంగా కా దు:ఖకర సన్నివేశంగా కనిపించటం 'పెండ్లి' కథలో విషయం. అప్పగింతల దుఃఖంతో కలిపి ఈ దుఃఖాన్ని వ్యక్తీకరించటం ఈ కథలో విశేషం. నవశిశూదయం సంతోషకరమైంది. కాగా గని కార్మికుడి సంతానం మళ్లీ గని కార్మికులుగా తప్ప అభివృద్ధి చెందలేని వ్యతిరేక పరిస్థితులు ఒక చేదువాస్తవం అవుతున్నప్పుడు 'పురుడు' కూడా దుఃఖ సందర్భంగానే మారటం 'పురుడు' కథలో చూస్తాం.

వ్యవసాయ పారిశ్రామిక రంగాలలోనే కాదు యుద్ధం - అనేక ఆశలు, అభిప్రాయాలు, ఆకాంక్షలు కలిగిన మనుషుల మధ్య ఎట్లా ప్రారంభమై విధ్వంసం సృష్టిస్తున్నదో చూపించటం ద్వారా ఈ యేటి కథలు మానవ సంబంధాల పునర్నిర్మాణం కోసం జరగవలసిన ఉద్యమాన్ని కూడా సూచిస్తున్నాయి.

విప్లవోద్యమ సాహిత్య శిబిరం నుండి వచ్చిన మరొక మంచికథ 'నేరస్తులు'. ఈ కథ రచయిత కళ్యాణరావు నేరస్తురాలిగా న్యాయస్థానం ముందు నిల్చుండబెట్టబడిన

ఒక విప్లవకారిణి వాంగ్మూలం ఇది. ఏకకాలంలో ఇదొక ప్రేమ కావ్యం. ఒక యుద్ధగానం. విప్లవకారిణికి ఆమె భర్తకు సంబంధించిన ప్రేమ, ఆమెకు ఆమె తల్లి దండ్రులకు, ఆమెకు ఆమె అత్తమామలకు సంబంధించిన ప్రేమ, ఆమెకు కన్నకొడుకుకు సంబంధించిన ప్రేమ - మాత్రమే కాదు. ఆమెకు పీడిత ప్రజలకు, ఉద్యమకారులను కడుపున పెట్టుకొని కాపాడిన పల్లె ప్రజలకు మధ్య ప్రేమ కూడా. ఈ ప్రేమాలన్నిటికీ మూల సూత్రం జీవితాన్ని ప్రేమించటం. దాని ఉనికిని, విలువలను ధ్వంసం చేసే వ్యవస్థను ద్వేషించటం. ఇదే మనుషుల మధ్య రక్త సంబంధాలను మించిన, కుల సంబంధాలను మించిన మానవీయ ప్రజా సంబంధాల సృష్టికి, ఉనికికి మూలం. ప్రజల్ని ప్రేమించటం, దోపిడిని ద్వేషించటం నేరంగా చూపే ప్రధాన స్రవంతి వ్యవస్థ మీద యుద్ధం అనివార్యం అని చెప్పిన కథ ఇది.

విప్లవోద్యమంలో స్త్రీపురుషుల మధ్యసహచర సంబంధానికి ఆదర్శంలో ఐక్యతే కారణమవుతుంది. 'వెలుగు పంచే సూర్యుడు, వెన్నెలనిచ్చే చంద్రుడు, పంటలిచ్చే భూమి వెలుగుని, వెన్నెలని, పంటని కొందరి కోసం కాక అందరికోసం ఇస్తూ నేరం చేస్తున్నాయి. అంత గొప్పనేరం మేం చేస్తున్నాం. మా నేరంలో భాగం పంచుకుంటావా' అని అతనడగటమే పెళ్లి ప్రతిపాదన. ఆమె అంగీకారమే పెళ్లి. అతనిది బ్రాహ్మణ కులం. ఆమె క్రైస్తవి. పిల్లల పట్ల ప్రేమతో, పిల్లల ఆదర్శాలనూ ప్రేమించారు, పిల్లలు ఎన్నుకొన్న జీవిత సహచరులనూ ప్రేమించారు ఆ తల్లిదండ్రులు. ఆ తల్లిదండ్రులకు కోర్టుకు వెళ్లబోయే ముందు ఆమె ఇచ్చిన సందేశం "నాలేత బుగ్గలకి ఆముదం రాసిన నా తల్లీ! ఆ బుగ్గలనే ముద్దాడిన నా అత్తా, నన్ను కన్నతండ్రీ! కలుపుకున్న మామా! ఈ జనంలో మీ బిడ్డలునానరు. ఆ కళ్లలో మా కళ్లు చూడండి. ఆ నడకల్లో మా నడకలు చూడండి. ఆ నవ్వులో మా నవ్వులు పంచకోండి" - అని యుద్ధం కొనసాగింపును సూచించిన కథ - నేరస్తులు.

ప్రభుత్వ పాలనా వ్యవస్థ సామాన్య ప్రజల నిత్య జీవనాన్ని అవస్థల పాలు చేస్తున్న తీరును చిత్రిస్తూ మధురాంతకం నరేంద్ర 'కాకులు, గద్దలు' కథ వస్తువు రీత్యానే కాదు నిర్మాణ శిల్పం రీత్యా కూడా మంచి కథ. కూలి పనులు లేక పొట్టకూటి కోసం అడవికి పోయి కట్టెలు ఏరి తెచ్చి అమ్ముకొనే పనికి దిగిన మాల వాళ్ల వ్యథ ఇందులో వస్తువు. 1980లో వచ్చిన కొత్త అటవీ చట్టం ఎవరికి ఏమి ఒరగబెట్టిందో చూపిందీ కథ.

ఉన్న వూళ్లో వ్యవసాయం దిగనాసిల్లి పనులు లేక అవసరాల కోసం అడవికి వెళ్లి కట్టెలు తెచ్చుకొనటం మాలలు ఎంచుకొన్న ప్రత్యామ్నాయ ఉపాధి. ఆ ఉపాధిని గత్యంతరం లేకనే వాళ్లు ఎంచుకొన్నారు. అందువల్ల వాళ్లు ఎందరి చేతనో వేటాడబడ్డారు. అవమానించబడ్డారు. దోచుకోబడ్డారు. అలాంటి వాళ్లకు ప్రతినిధి పాత్ర మునెమ్మ. నాలుగు స్థలాలలో నాలుగు దృశ్యాల మధ్య మునెమ్మ. మొదటి దృశ్యం అడవి. ఫారెస్టు గార్డు 'కట్టెలోళ్ల' కోసం ఆరా తియ్యటం. కట్టెలోళ్లను అడవి దాటనీయకుండా చూడాలని మేకలు కాసుకొనే వాళ్లకు నిఘా పని పురమాయింపు. పొదల వెనుక కట్టె లేరుకొనే మునెమమ అతని కళ్లపడటం మొదటి దృశ్యం.

ఆ కట్టెలోళ్ల కోసమే ఊరి రైల్వేస్టేషన్లో సిద్దయ్యనాయుడి నిఘా రెండవ దృశ్యం. అక్కడ రైలెక్కి టౌనుకి పోయి అమ్ముకుంటారు అని అక్కడే మాటేసి ఉన్నాడతను. రైల్లో కాలేజీకి పోయే పిల్లలకు కూడా చెప్పి పెట్టాడాయన - మనస్టేషను నుంచి ఒక మోపు గూడా రైలెక్కగూడదు - కట్టెలమోపుతో రైల్లోకి ఎవరైనా ఎక్కితే మోపు కింద పారేయమని కూడా చెప్పి ఉంచాడు. అతని కంట మునెమ్మ పడనే పడింది.

రైలు ఉద్యోగులు గార్డు - టి.సి. అందరూ కట్టెలోళ్ల కోసం చూచేవాళ్లే. రైలులో మునెమ్మ వాళ్ల కంట పడటం మూడవ దృశ్యం.

టౌన్లో రైలు ఆగినప్పుడు ఈ కట్టెలోళ్లనే పట్టుకొనటానికి మాటువేసింది ఫారెస్టు ఉద్యోగి బృందం. మునెమ్మ వాళ్ల కళ్లబడటం నాలుగవ దృశ్యం. మొదటి దృశ్యం నుండి నాలుగో దృశ్యం వరకు మునెమ్మ కట్టెల మోపుతో రాగ

లిగిందంటే ఫారెస్టు గార్డుకు, ఊరిపెద్దకు, రైల్వే ఉద్యోగులకు ఎంతో కొంత లంచంగా ఇయ్యటం వల్లనే. ఊళ్లో రైతుల్ని బతిమాలుకోవటం వల్లనే. కూలిరేట్లు పెంచమని హామీ ఇయ్యటం వల్లనే. అందువల్లనే మునెమ్మ అంటుంది ఈ మోపు పేరికే రాలేదని. తన శ్రమ కాక ఈ మామూళ్లు కూడా దాని విలువలో భాగమేనని.

పొట్టకూటికోసం తెచ్చుకున్న కట్టెల మోపులను ప్రభుత్వోద్యోగ వ్యవస్థ స్వాధీనపరచుకొని తక్కువ రేటుకు వేలంలో హోటల్ వాళ్లకు అమ్ముతుందని, అందులో వాళ్ల వాటా ఒప్పందాలు కూడా ఉంటాయని మునెమ్మకు అనుభవమే చెప్పింది. అందువల్లనే ఫారెస్టు రేంజరుతో అదేదో మేమే ఇస్తాం కాకులను కొట్టి గద్దలకు వెయ్యవద్దని చెప్పగలిగింది.

ఫారెస్టుగార్డు నుండి రేంజర్ వరకు అందరూ రూలు తప్పి నడిచిన వాళ్లే. అటవీ చట్టం పేరుతో అంతులేని అధికారాలు చలాయిస్తున్న వాళ్లే. రూలు తప్పినవాళ్లు తప్పుచేస్తున్నవాళ్లు కట్టెలమోపు తేవటం తప్పని మునెమ్మకు చెప్పటంలోని వైరుధ్యాన్ని వ్యంగ్యంగా వ్యక్తీకరించింది ఈ కథ.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్యం 'మృగతృష్ణ' అని ఒక ఎన్నికల ఓట్ల పోలింగ్ సందర్భం నుండి నిరూపిస్తూ నరేంద్ర రాసిన మరొక కథ మృగతృష్ణ, ప్రజల అవసరాలను, ప్రజల ఇచ్ఛను పట్టించుకోని, ఓట్ల అమ్మకాల బేరం మీద ఆధారపడ్డ ఎన్నికల తంతులో ప్రజాస్వామ్యం ఊరించే ఆశే కానీ వాస్తవం కాదు. ఓట్ల రేట్ల ఒప్పందంలో వచ్చిన అభిప్రాయ భేదంతో ఓట్లు వెయ్యటానికి వీలులేదని శాసించిన పెత్తందారీ గ్రామ వ్యవస్థలో ఒకే ఒక్కడు వేసిన ఓటు ఏ ఒక అభ్యర్థికో కాదు, ఈ వ్యవస్థ మీద కోపాన్ని వెళ్లగక్కేందుకు బాలెట్ పేపరు మీద సందు లేకుండా ముద్రవేసి తీర్చుకొన్న కసి.

రెక్కల శ్రమపై బతికే ఒక లారీడ్రైవర్‌లో నిరంతరం దీపంలా వెలిగే ఒక మానవీయ సంస్పందన, ముఖ్యంగా పిల్లలపట్ల శ్రామిక వర్గాల పిల్లల పట్ల, అతను కనబరిచే ప్రేమ - వ్యక్తి గత జీవితంలోని లేమిని పూరించుకొనే క్రమంలో అతిసహజంగా అభివృద్ధి చేసుకొన్న విలువలు అని కొసమెరుపుతో తెలియ చెప్పిన కథ పి.యస్. నారాయణ రాసిన 'రెక్కల గూడు' చక్కగా చదివిస్తుంది.

సామూహిక అనుభవాన్ని భావాల రూపంలో, ప్రతి పాదనల రూపంలో, సిద్ధాంతాల రూపంలో సంఘటితం చేయాలనే సృజనాత్మక కర్తవ్య నిష్ఠ కలవాడిగా శివారెడ్డి అభినందలను అందుకొన్న కథకుడు ముప్పిడి ప్రభాకర రావు. 'ది ఫస్ట్ క్రిటిక్' ఆయన కథలలో ఒక మంచి కథ. సృజనాత్మకత శక్తులు విచ్చుకొనే పదిహేను పదహారేళ్ల వయసులో వేసవి సెలవుల మూలాన దొరికిన తీరిక, పల్లెటూరి జీవితం, కాలక్షేపం కోసం వెతుకులాటలు - వీటి మధ్య ఒక పిల్లవాడు చిత్రకారుడవుతాడు. పుస్తకాలలో బొమ్మలు గీసి వరుసగా అతను గీసిన మూడు చిత్రాలు అతనికి ఒక ఉత్సాహం ఆనందం ఇచ్చాయి. ఆ చిత్రాలను చూచి తల్లి, అక్క బాగున్నాయని మెచ్చుకొన్నారు. బాబాయ్ చేసిన వ్యాఖ్యలు ఈ కథలో కీలకమైనవి. అతను వేసిన మొదటి బొమ్మ స్టాలిన్ ది. అతను ఓ చెప్పులు కుట్టుకునే వాడి కొడుకు అని చెప్పి అంటే మన కులస్తుడు రా అని ధీమాగా అన్నాడు. నీలో కులాభిమానం ఉంది అందుకే స్టాలిన్ బొమ్మగీసావని మెచ్చుకొన్నాడు. రెండవబొమ్మ జీసస్‌ది. క్రీస్తులో నీ విశ్వాసాన్ని, మతాభిమానాన్ని చాటుతున్నది అని బాబాయ్ ఆ బొమ్మను మెచ్చు కున్నాడు ముచ్చటగా. కానీ ఆ పిల్లవాడు ఆ మూడు బొమ్మలు గీయటానికి మూలకారణం ఆ ముగ్గురికీ గడ్డాలు వుండటం. గడ్డం వున్న చిత్రం వేయటం సులభం కనుక వాళ్లను ఎంచుకొన్నానని ఆ పిల్లవాడే చెప్పటం ఈ కథలో కొసమెరుపు. స్వచ్ఛంగా ప్రారంభమవుతున్న సృజన వ్యాపారాన్ని కుల మత జాతీయ అభిమానాలను ఆపాదించి కలుషితం చేసే ఒక లౌకిక అల్పత్వం మీద చిరువిమర్శ ఈ కథ.

1989లో కథలు తొంబై మూడ (93) రచయితలు 56 మంది. బండకింద బతుకులు కథలు పదకొండు (11) ముద్ర కథలు 24 కలిపితే మొత్తం కథలు 128 అవుతాయి.

పల్లెటూళ్లు, భూసంబంధాలు, భిన్న వృత్తుల వర్గాల జీవన వేదనలు, పట్టణాలకు వలస, మధ్య తరగతి జీవితం - ఇవన్నీ ఈ యేటి కథావస్తువులు.

కాట్రగడ్డ దయానంద్ కథలు వల్లంపాటి వెంకట సుబ్బయ్య అన్నట్లుగా మట్టివాసనను ఆధారం చేసుకొన్న మానవ సంబంధాలను గురించిన కథలు. ఈ సంవత్సరం ఆయన రాసిన కథలు మూడూ కూడా వ్యవసాయ వర్గాలకు సంబంధించినవే. 'మబ్బుతునకా...! మట్టి ముద్దా!!' కథ అప్పుల వలయంలో చిక్కిన రైతును, భూమి మీద ఆశను, పాటు మీద నమ్మకాన్ని కోల్పోని రైతు ఆఖరి ఆర్తనాదాన్ని వినిపిస్తుంది. ఆరుగాలం శ్రమించే రైతు, పుట్లకొద్దీ ధాన్యం పండించే రైతు అప్పుల పాలెం దుకయ్యాడు, ఉత్పత్తితో సంబంధమే లేని షావుకారు సంపన్నుడెలా అయ్యాడు? అన్న ప్రశ్నలకున్న ఆంతర గతితర్కమే ఈ కథను నడిపింది. ఆ మూలాన్ని తెలుసు కొని అసలు చికిత్స ప్రారంభించలేనంత వరకు రైతుది ఒంటరి భయమే. ఒంటరియుద్ధమే. రామయ తాత ఆ యుద్ధంలో వున్నవాడే. పాతికెకరాల ఆ సామి తాను సగానికి పైగా అప్పుల కింద షావుకారికి జమ చేశాడు. తన కొడుకు వ్యవసాయంలోనే వున్నాడు. ఏమిలేని షావుకారు పొలాలు, దుకాణాలు, బంగళాలు సినిమా హాళ్లు సంపాదించాడు. అతని కొడుకులు పెద్దపెద్ద ఉద్యోగాలలో ఉన్నారు. ఇదిలా సాధ్యమైందని రామయ తాతకు ఆశ్చర్యమే. ఇంకా తాను షావుకారుకు చెల్లిం చాల్సిన అప్పులున్నాయి. వాటికింద తన మిగిలిన పొలం కాజెయ్యాలన్న దుర్బుద్ధి షావుకారుకు ఉంది. మరణ శయ్య మీద నుండి అతను కొడుక్కు ఇచ్చిన సందేశం - షావుకారు నుండి ఆ భూమిని కాపాడుకొనమని - భూమి అమ్ముకోవద్దని - తండ్రి వదిలిన ఒంటరి యుద్ధాన్ని ఇక కొనసాగించాల్సిన వాడు కొడుకు.

'మర్రి నీడ', నరసడు' కథలు రెండూ గ్రామాలలో భూకామందులు పెద్దవాళ్లు కావటానికి, భూములు పెంచు కొనటానికి చిన్న సన్నసారు రైతులు ఉన్న కస్తా నేలను పోగొట్టుకొనటానికి మధ్యవున్న సంబంధాన్ని, కుట్రను విప్పి చెప్పేవే.

భూములు కోల్పోవటం ఒక సమస్య అయితే వ్యవ సాయదారులకు మరొక పెద్ద సమస్య మార్కెట్. ఉత్పత్తి చేసిన పంటను మార్కెట్‌కు తీసుకొని వెళ్లి అమ్ము కొచ్చుకొనేవరకు వున్న ఒక దళారీ వ్యవస్థ రైతుశ్రమను అనుభవానికి అందిరాకుండా ఎలా చేస్తుందో శాంతి నారాయణ రాసిన 'దళారి' కథ చెప్తుంది.

సువర్ణముఖి రాసిన 'అన్నలొస్తున్నారు' కథ గిరిజన గూడెం జనం సమస్యలకు సంబంధించినది. షావుకార్ల అప్పులు, అటవీ ఉద్యోగుల, పోలీసుల అధికారం, దౌర్జన్యం వాళ్లనెప్పుడూ పీడించే సమస్య. అడవి జంతువుల దాడులు ఎలాగూ వుండనే వున్నాయి. ఈ పరిస్థితులలో సంఘర్షిస్తూ బతకటానికి వాళ్లు చేసే యుద్ధానికి మద్దతు నిచ్చే ఉద్యమం కోసం వాళ్ల ఎదురుచూపు ఈ కథలో సూచించబడింది. 1967 నాటి శ్రీకాకుళం గిరిజనోద్యమ ప్రభావం నుండి ఆదయ్య బిడ్డలకు పెట్టుకొన్న పేర్ల నిర్మల, సత్యం - ఆ పిల్లలు ఇద్దరూ రేపటి ఆశకు చిహ్నాలు.

గంటేడు గౌరునాయుడు రాసిన 'విముక్తి' కథ చాకలి వృత్తి వర్గపు మనిషి కథ. పుట్టుక నుంచి చావు వరకు చాకలివాళ్ల సేవలు లేకుండా జీవితం గడవని కామందులు జీతాలు సరిగా ఇయ్యక, వాళ్ల స్త్రీలను వేధింపులకు గురి చేస్తుంటే తిరుగుబాటు ఒక్కటే దానికి మందు అని చెప్పిన కథ ఇది.

వ్యవసాయానికి దూరమై చదువులతో ఉద్యోగాలతో పట్టణాలు చేరినవారికి భూమితోటి ఉత్పత్తి సాధనాల తోటి వుండేవి ఆస్తి సంబంధాలే. వాటిని అమ్ముకొని డబ్బు చేసుకొనటానికి గ్రామాలకు వెళ్లిన సందర్భాల నుండి అనేక కథలు రూపొందాయి. అక్కినేని కుటుంబరావు రాసిన 'బండి', ఎల్.ఆర్.స్వామి రాసిన 'గ్రహణం విడి చింది' ఆ కోవలోని కథలు.

'బండి' కథ తండ్రి చనిపోయాక తల్లిని తీసుకొని వెళ్తూ రాము ఇల్లు, పొలమూ, సామానూ అమ్మేశాక 'బండి'ని కూడా అమ్మాల్సి వచ్చినప్పుడు మొదలైంది. ఆ బండితో అతని బాల్యం ముడిపడి వుంది. ఆ బండితో ముడిపడి

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

చేసిన పెళ్లి ప్రయాణాల, సినామా ప్రయాణాల జ్ఞాపకాలు, ధాన్యం తూర్పార పట్టటానికి ఇంటికి చేరవేయటానికి సంబంధించిన జ్ఞాపకాలు - ఎన్నో వున్నాయి. వడ్రంగిని పిలిచి ఆ బండికి ముక్కలు చేసి పీటలో కుర్చీలో చేయించుకొనటానికి ఆ జ్ఞాపకాలు అడ్డుపడ్డాయి. కిరాయికి తిప్పుకొనటానికి ఆ బండిని తమ ఇంటి పాలేరుకే ఇచ్చేసే నిర్ణయం తీసుకొనటంతో ఈ కథ ముగుస్తుంది.

స్వామి రాసిన 'గ్రహణం విడిచింది' కథలో ఉత్తమ పురుషలో కథ చెప్పే సుబ్బారావు ఉద్యోగ విరమణ తరువాత ఢిల్లీలో ఇల్లు కట్టుకొనటానికి ఊళ్లో పొలం, ఇల్లు అమ్ముదామని వస్తాడు. ఆ ఇంట్లో అతని అక్క వుంటుంది. పొలం బావ సాగుచేయిస్తున్నాడు. వాటితో వాళ్లకు సహజసంబంధం వుంది. వాటి పేరు మీద తమ్ముడు అప్పుడప్పుడయినా వస్తాడన్న ఆశ వుంది. అతను వాటిని అమ్ముకొని పోతే ఇక అన్ని ఇబ్బందులు తెగిపోయినట్లే అని అక్కకు బాధ. ఆసాయంత్రం అతను ఊళ్లో తిరిగి రావటానికి వెళ్లినప్పుడు చిన్ననాటి స్నేహితురాలు తనస్థపడి మాట్లాడిన మాటలతో తనలాంటి వాళ్లు వచ్చి పల్లెల్లో స్థిరపడటం గురించిన ఆలోచన కలిగి పొలం అమ్మకం విరమించుకొనటం కథకు ముగింపు. అమ్మాలన్న ఆలోచనతో అతను ఊళ్లోకి వచ్చినప్పుడు చంద్రగ్రహణం ప్రస్తావన వస్తుంది. అమ్మకం గురించి పునరాలోచనలో పడి ఒక నిర్ణయానికి వచ్చే సరికి గ్రహణం విడిచి చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. అందుకే ఈ కథ పేరు 'గ్రహణం విడిచింది' అయింది.

ఈ యేటి కథలలో చెప్పుకోదగిన కథ స్వామి రాసిన 'సావుకూడు'. వానలు లేకపోవటం, పంటలు లేకపోవటం, కరువు పరిస్థితులు జీవితంలో సృష్టించే విషాద సందర్భాల చిత్రణ ఈ కథ. కనీసావసరం అయిన తిండి చుట్టూ తిరిగే కథ. పెద్దప్పయ్య కేంద్రంగా నడిచే కథ. పెళ్లానికి వుందో లేదో చూడకుండా వడ్డిస్తున్నకొద్దీ తినగల అతని ఆకలి కాపురానికే ఎసరుపెట్టిన చరిత్ర కలది. ఆ సందర్భంగా జరిగిన పంచాయితీలో పెద్దమనుషులు అతనికి చేసిన బోధ 'కరువులో పుట్టినోల్లమి. ఎంత తింటే నిండుతాయిరా మన కడుపులు? కడుపునిండా తినేదానికి మనం ఏమన్నా కుబేర్లమబ్బా? కడుపు ఎండగట్ట లేనోడివి - పెండ్లాన్ని ఎట్ల సాకుతావు? అని. కడుపు ఎండగట్టుకొని బతకటం నేర్చుకొనటం కన్నా పెద్ద విషాదం ఏముంది? చావు కాలానికి మాంసం తినాలన్న చివరి కోరిక తీరకుండానే అతను మరణించాడు.

ముగ్గురు కొడుకులకు కూడా వారసత్వంగా అతనిచ్చింది కూడా కడుపులు ఎండగట్టుకొని బతకటమే. మంచంలో వున్న తండ్రి కల్లు తాగటానికి నాలుగు రూపాయలు ఇమ్మని నోరు తెరిచి అడిగినప్పుడు నాలుగు రూపాయలుంటే ఒకరోజు తిండి గడిచిపోతుంది కదా, మూడు రోజులకు ఉప్పు మిరపకాయలు వస్తాయి కదా అని ఆలోచించే పరిస్థితే ఆ కొడుకుది. నాలుగు రూపాయలు తండ్రికి ఇచ్చాడని నా పిల్లోల్లకు ఇంత ముద్దుపెట్టి బతికించుకునే వీలేదని వెక్కివెక్కి అతని భార్య ఏడిచిందంటే - ఎంత దుర్భరజీవితమో వాళ్లది అర్థం చేసుకోవచ్చు.

తండ్రి చనిపోయాక దినంనాడు గొర్రెమాంసం కూరొండి వరి అన్నం వండి వడ్డిస్తే బంధువులంతా తిన్న తీరు, ఎవరి బిడ్డల్ని వాళ్లు దగ్గర కూర్చోబెట్టుకుని తినబెట్టిన తీరు ఆ ఆకలి చరిత్రకు దృష్టాంతాలే. మొగుడి దినం రోజున మూడునూర్లు పెట్టి గొర్రెను కోసి ఊరం దరికీ పెట్టినా తన ఇస్తరాకులోకి మాత్రం నాలుగు తునకలు కూడా వెయ్యలేదని కొడుకులను తిడుతూ ముసల్ది ఏడ్చిన ఏడుపు - పోయిన మొగుడికోసం కాక నోటికాడికి రాకుండా పోయిన గొర్రె మాంసం ముక్కల కోసం - ఏడ్చిన ఏడుపు ఆకలి బీభత్సాన్ని తారస్థాయిలో చూపింది.

బతుకుతెరువుకు పాములను ఆడిస్తూ పాటలు పాడుతూ జీవించే సంచారజాతులు బట్టలమూటలు తీసుకొని వేలంపాడి అమ్ముకొని బతికేవాళ్లు పట్నం వచ్చి మోసాలకు, దందాలకు, దౌర్జన్యాలకు గురయిపడే యాతనలు వస్తువుగా పుప్పాల కృష్ణమూర్తి 'పట్టణంలో బ్రతుకుదామని', 'చౌరస్తా' వంటి కథలు రాశాడు.

టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి పట్టణాలలో మధ్యతరగతి ఆశలను, ఆశలు తీరని వేళ పొందే నిస్పృహను, నిరుద్యోగితను, ఇంట్లో వాళ్ల అవసరాలకు అందిరాలేకపోయానన్న ఆత్మన్యూనతను, ఆత్మహత్యల నిర్ణయాలను వస్తువుగా చేసి కథలు రాశాడు. ఆ కోవలో కథే 'ట్రాన్స్‌ఫర్'. అవసరాలకు అప్పుల ఊబిలో దిగబడిన వాళ్లు ఆత్మహత్యల మార్గం ఎన్నుకొనటాన్ని ఈ కథ కూడా చూపించింది. కానీ అతని భార్య మిథ్యాపరువును గురించి భ్రమలు మానేసి ఇంట్లో వున్నవన్నీ అమ్మి అప్పులు తీర్చి చిన్న ఇంటికి మారి ఏమీ లేని స్థితి నుండి జీవితం ప్రారంభించినా మంచిదే నని చెప్పటం ఈ కథలోని విశేషం.

1986-87 సంవత్సరాలలో కోల్ బెల్ట్ పత్రికలో రాసిన 'బండకింద బతుకులు'. వరుస కథలను మళ్లీ 1989-90 సంవత్సరాలలో ఉదయం పత్రికలో కొనసాగించాడు రఘోత్తమరెడ్డి. ఇవి పదకొండు కథలు. వీటిలో ముఖ్యంగా ప్రస్తావించవలసినవి మూడు. అవి సారా రాజకీయాలను విప్పి చెప్పిన కథలు. కూలిరేట్లు, జీతాలు పెరగాలని గ్రామాలలో సంఘాలు ఏర్పడి పనిచేయటం మొదలు పెట్టాక, బంజరుభూములు చెరువుశిఖరం భూములు దున్నుకొనటానికి ముందు పడ్డాక ఊళ్లో నుండి బయటపడటమే మేలని భూములు అమ్ముకొని పట్నాలు చేరిన భూస్వాములు సారా కాంట్రాక్టరుగా మారటాన్ని 'మావదినె' కథ నమోదు చేసింది. అక్కడ నుండి రాజకీయాలకు ఎదగటాన్ని కూడా ఈ కథ చెప్పింది. అదే సమయంలో ఏ సంఘాన్నయితే తట్టుకోలేక వాళ్లు బయటకు వచ్చారో ఆ సంఘాల వెనుకవున్న ప్రజా రాజకీయ నిర్మాణం సారా ధరలు తగ్గించాలన్న

ఉద్యమంతో, ముందుకు వచ్చి ఢీకొనటం, తమ డిమాండ్లు సాధన కోసం మండలాధ్యక్షులను కిడ్నాప్ చేయటం వంటి కొత్త వ్యూహాలతో ముందుకు వస్తున్న వైనాన్ని కూడా ఈ కథ సూచించింది.

రెండు రూపాయలకు కిలో బియ్యం తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టబడిన సంక్షేమ పథకం. ప్రభుత్వ ఆదాయమంతా ఇందుకే ఖర్చయిపోతున్నదని స్వయంగా సారా వ్యాపారానికి దిగటం, సారా వేలం పాటల ద్వారా నికరమైన ఆదాయం పొందటానికి సిద్ధపడటం జరిగింది. మండలాధ్యక్షుల నుండి అందరూ ఈ సారా రాజకీయాలలో భాగస్వాములే, సారా ధరలు పెంచవద్దని, సారా వేలం పాటలలో పాల్గొనవద్దని పిలుపునిచ్చి విప్లవ పార్టీ ప్రభుత్వ సారా రాజకీయాలను తిప్పికొట్టే పనికి పూనుకుంటే ప్రభుత్వం పోలీసుల రక్షణలో ప్రజలందరికి తాగే వసతి కల్పిస్తామని హామీ ఇయ్యటం విదూషక విషాదం - వరంగల్లు ఆర్ట్స్ కాలేజీ దగ్గర జరుగుతున్న వేలం పాటలలో పాల్గొనటానికి వచ్చిన మండలాధ్యక్షుడి అవసరం పడి అక్కడకు వచ్చిన రైతులముఖంగా ఈ సారా చిత్రపటాన్ని ఆవిష్కరించిన కథ 'సారాహ(రా)జులు' ఇటువంటి ప్రభుత్వం ప్రజాస్వామ్య ప్రభుత్వం కాదు, 'సారా గవుర్మెంటూ' అని తేల్చి చెప్పిన కథ సారాగవుర్మెంటు.

రెండు రూపాయలకు కిలో బియ్యం ఇయ్యాలంటే, మరింకే సంక్షేమ పథకం అయినా అమలు చేయాలంటే ప్రభుత్వానికి ప్రజలే ఆదాయం సమకూర్చి పెట్టాలి. పన్నులు వసూలు చేయటం ఎప్పుడూ వున్నదే. సారా కొని తాగటం వలన ప్రజలు ప్రభుత్వ ఆదాయంలో లోటును పూడ్చాలి. అందుకే అందరికీ అందుబాటులోకి తేవటానికి సారా వేలం పాటలు, స్వంత ఆలోచనతోనో, అన్నలు చెప్పారనో సారా తాగకుండా వుండే వీలు లేకుండా పోలీసుల నిఘాలు. ప్రభుత్వాన్ని నడిపే అన్న గారికి, ప్రజల పక్షాన నిలబడ్డ అన్నలకు మధ్య జరుగుతున్న యుద్ధంలో సారా ఒక ప్రధాన ప్రమేయంగా ముందుకు రావటం వెనుక వున్న 'పొలిటికల్ ఎకానమీ' వైపు దృష్టి మళ్లించే కథలివి. మహిళల సారా వ్యతిరేక పోరాటానికి నేపథ్యంగా వున్న చరిత్రను చూపాయి. ఇదే సమయంలో వుప్పల నరసింహం ముద్ర కథ నాలు వచ్చాయి. సమకాలపు జీవన వైవిధ్యం, విలువలు, వెతలు వస్తువుగా జానపద కళారూపంతో చెప్పిన, రాసిన కథలు ఇవి. తెలంగాణలో కొంతగానంతో, కొన్ని వాయిద్యాలతో, మరింత హావభావాలతో ఊరూరూ తిరిగి కథలు చెప్పేవాళ్ల ఒరవడిని పట్టుకొని రాసిన కథలివి. ప్రవహించే కథలు. తెలుగు కథకు ఇదొక కొత్త చేర్పు.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# రాయలసీమ ఆధునిక కవిత్వం - రైతు జీవితం

– డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

రాయలసీమ ఆదునిక కవిత్వం కట్టమంచితో ప్రారంభ మైందని చెప్పాలి. మధ్యయుగాల్లో వేమన వంటి సంస్కర్తలు కూడా రైతు జీవితాన్ని వ్యాఖ్యానించడాన్ని గుర్తు చేసుకొని ముందుకు నడిస్తే, తెలుగు సాహిత్యంలో ఆధునిక కవిత్వం రూపం ధరించే నాటికే రైతు సమస్యలు కవిత్వాంశాలుగా స్వీకరించబడడాన్ని గుర్తించవచ్చు. రాయలసీమ వ్యథను చిత్రించి ప్రసిద్ధి చెందిన పెన్నేటి పాట "కోటి గొంతుల కిన్నె మీటుకొనుచు, కోటి గుండెల కంజెరి కొట్టుకొనుచు, వినిపింతునింక రాయలసీమ కన్నీటి పాట"గా మారడం, విద్వాన్ విశ్వంతో ఒక ఐడెంటిటీని సాధించుకుంది. విశ్వం కన్నా ముందు, వెనుక ఎంతో మంది ఆధునిక కవులు రాయలసీమ రైతు జీవితాన్ని అనేక కోణాలలో ఆవిష్కరించారు.

రాయలసీమకు నిత్యం జరుగుతున్న అన్యాయం, రైతులకు జరుగుతున్న ద్రోహం, అతివృష్టి, అనావృష్టిల సయ్యాట సీమను క్షోభ ఊబి నుండి బయటికి రానీ కుండా నెడుతూనే ఉన్నాయి. మేధావులు, నాయకులు సీమ గురించి నిత్యం మాటల్లో మధనపడుతూనే ఉన్నారు. ప్రభుత్వాల మొసలికన్నీరు ప్రవహిస్తూనే ఉంది. అయినా సీమలో, రైతు బతుకులో చెప్పుకోదగ్గ మార్పు రావడం లేదు.

అన్నదాతగా, సమాజానికి వెన్నెముకగా కీర్తింప బడుతూ, నిజ జీవితంలో నానా కష్టాలు పడుతూ, భూమి కేదో అప్పుబడట్టు, చెమటను, రక్తాన్ని, కన్నీళ్ళను చివరికి జీవితాన్ని కూడా మట్టికే ఇచ్చేస్తున్న రైతుల గురించి, రైతు జీవితం గురించి వింటుంటే, చదువుతుంటే మనసంతా డిస్టర్బ్ అయిపోతుంది. రైతు జీవితాన్ని కొనియాడేవారు, శ్రమ సౌందర్యాన్ని ఆలింగనం చేసుకునేవారు, రైతుల ఐకమత్యం కోరుతూ ఉద్యమాలే శరణ్యం అని పిలుపు నిచ్చేవారు, ప్రకృతి వికృతాలను ఎండగట్టినవారు ఇలా ఎంతోమంది కవులు రాయలసీమ రైతు జీవితాన్ని విభిన్న కోణాల నుండి దర్శింపజేశారు. రాయలసీమ ప్రాంతంలో ఉండి రాసిన ఆధునిక కవుల కవిత్వంలో కనిపించే సీమ రైతుల స్థితిగతులను ప్రస్తావించడం ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

## రైతు జీవితం ఉన్నతమైందిగా కొనియాడడం :

రైతే రాజు, రైతు లేకుంటే ప్రపంచానికి భోజనం లేదు, వంటి గొప్ప మాటలు నిత్యం వింటూ ఉంటాం. అలాంటి రైతు వ్యక్తిత్వాన్ని కవిత్వం కొనియాడింది. ఈ క్రమంలో, రైతు కష్టాన్ని, ఓర్పును గుర్తించడమే గాక, రైతు ఉప యోగించే పనిముట్ల గొప్పతనాన్ని పెంచుతూ 1934లో ఎ.వి. సుబ్బారెడ్డి రాసిన 'హాలికుడు' కవిత రైతులో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

"ఎండ వేడిమి కెంతయు అలసి సొలసి
గాత్ర మంతయు చెమటలు కారుచుండ
కష్టములకోర్చి ధీరతగాంచి మదిని
హర్ష మొనరించు హాలికా గలుగు సుఖము"

అనడంలో రైతు శ్రామిక తత్త్వం పనిపట్ల అంకితభావం ప్రస్ఫుటిస్తుంది. కష్టాలకు ఓర్చిన రైతులకు సుఖం లభి స్తుందని విశ్వాసాన్ని ప్రకటిస్తుంది.

హరుడెక్కి తిరుగాడునట్టి యాబోతు నీ
సేద్యంబునకు ముఖ్య జంతువయ్యె
బలభద్రు మూపున బరగు నాగేలు నీ
వ్యవసాయమునకు ముఖ్యంబు గాదె
వైదేహినవనికి వెలువరించిన కర్రు
తగనీకు ముఖ్య సాధనము గాదె
కాలుండు జీవుల గట్టెడు పాశంబు
నరమనీకొక పరికరము గాదె"

(హాలికుడు శ్రీసాధన, 8.9.1934)

రైతన్నకు ఆప్తుడుగా నిలిచిన ఎద్దు శివుడి వాహన మైందని, నాగలి బలరాముడి ఆయుధమైందని, కర్రు సీతాదేవిని వెలికి తెచ్చిందని, జాటి (పాశం) లేదా తాడు యముడిచేతి పరికరం అయ్యిందని చెప్పి, రైతు జీవితాన్ని పవిత్రమైందిగా, ఉన్నతమైందిగా వర్ణిస్తాడు సుబ్బారెడ్డి. రైతు వృత్తికి గౌరవం కల్పించాలనే సంకల్పం ఈ కవితలో కనిపిస్తుంది. పౌరాణిక ప్రాముఖ్యతను రైతు జీవితంలోకి తేవడాన్ని కూడా గమనించవచ్చు.

గొట్టిపాటి సుబ్బరాయ చౌదరి 1937లో రాసిన 'రైతు - గానలోలత' శ్రామిక సౌందర్యాన్ని కొనియాడుతుంది.

"మండుటెండల నడిరోజు కొండదడుల
నాగలు గొట్టుచు వడగాలి సెగకు బుట్టు
చెమట ముత్యాలు రష్ఠలి చెంగలించి
నాటకంబాడు నితగాడు పాటపాడు

కపిలదోలు తన నైజికైత శక్తి
మెల్లగా నల్లికొన యాబుల్లి పదము
అల్లనల్లన పల్లె రాగాల నెల్ల
బాడు చుండును తియ్యని భావములను"

(రైతు - గానలలోత; శ్రీసాధన 18.10.1937)

వ్యవసాయానికి ప్రధాన పనిముట్టు అయిన నాగలిని తయారు చేయడానికి అవసరమైన కొయ్యలను అడవి నుండి తెచ్చుకుంటాడు. రాగాలాపనతో కపిల తోలుతాడు. ఆ పనుల ద్వారా రైతు ఆనందాన్నే పొందుతున్నాడని తెలియజేస్తాడు. జానపద శ్రామిక గేయాల్లో సౌందర్యాన్ని వర్ణించినట్టు ఈయన కవిత చెమట ముత్యాలను చేతుల్లోకి ఒంపుకుంటుంది. శ్రమను సంతోషంగా మార్చు కోవడంలోనే రైతు గొప్పతనం దాగుందని గుర్తించవచ్చు.

"ఆకలి బాధలు లేని, అనారోగ్యంలేని సమాజం
కృషీవలురు, వైద్యులతోనే అది సాధ్యం"

(మానవ హృదయం, పుట 36)

అంటున్న ముస్తఫాగారి మాటలు ఈనాటి సమాజానికి డాక్టరు ఎంత ముఖ్యమో రైతు కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని తెల్పుతుంది. "ఒక్క వడ్ల గింజకు నమ్మకం పది కంకులు ఇచ్చే ఈ మట్టిని కాక, ఎప్పుడు చేతులెత్తే స్తుందో తెలియని కంప్యూటర్‌ను విశ్వసించడం పాదు గును కోసి ఆవును ఎద్దును చేయడం కాదా' అని ప్రశ్నిస్తాడు. వ్యవసాయాన్ని విస్మరించి యంత్రిక జీవితం లోకి జారిపోతే జరగబోయే పరిణామాలను మన ముందుంచుతాడు కవి.

## రైతు రాజ్యం కావాలని ఆకాంక్ష :

పాలకుల పీడనను భరించలేని రైతులు స్వాతం త్ర్యంతో పాటు రైతురాజ్యం రావాలని కలలు గన్నారు. కవులు సామ్యవాద జండా ధరించి ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. 1937లో కె.వి. కృష్ణారెడ్డి రాసిన 'రైతు జెండా' కవిత ఆనాటి రైతుల ఆకాంక్షకు నిదర్శనంగా నిలుస్తుంది.

"రైతుల జెండా ఎగురుచున్నది, రైతుల భాగ్యము
కోరగ రండీ
రైతుల క్షేమము కోరగరండీ, రాజ్యము
రైతులదనిపించండీ
రైతు ఋణంబును రైతు కష్టముల, బాపి సంపదల
సమృద్ధి జేసెడు
సామ్యవాదమును సమత్వ సిద్ధాంతంబును ప్రజలకు
ప్రసాదింపగల
ఎండకు వానకు వెఱువని వీరుడ, కష్టనష్టముల
కోర్చెడి ధీరుడ

డెబ్బైశాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉం దని లెక్కలు చెప్పే ప్రభుత్వం, వారి నుండి తీసుకోవడమే తప్ప, వారి శ్రమకు తగ్గ ఫలితాన్ని ఎప్పుడూ ఇవ్వలేదు. అందుకే రైతు రాజ్యం కావాలని, అందుకు సామ్యవాద సిద్ధాంతం అవసరమని శ్రీశ్రీ కన్నా ముందే నినదించిన సంగతిని గుర్తించవచ్చు.

శిస్తు భారముచే, ఋణ భారముచే, పేదరికముచే
కృంగిన యోధుడు
పన్ను భారముచె పస్తుండుటచే తాగుడు తనములో
దుర్నడతలతో
ఇల్లు వాకిలియు యిల్లాలును, కడు దైన్యస్థితిలో
నుండి రటంచును

రైతోద్యమముకు 'జయజయ' యటంచు రైతు
కష్టములు నశించునటంచు
జయగేయములతో హర్షధ్వనులతో దిక్కులదరగా
వచింపు - సోదరా"

(రైతుజెండా : శ్రీసాధన 9.10.1937)

అని పిలుపునివ్వడాన్ని రాయలసీమలో చూడవచ్చు. పేదరికం, పన్నుభారం, రుణభారం, తాగుడు మొదలైన వ్యసనాలు జీవితాలను దైన్యస్థితిలోకి నెట్టేస్తున్నాయని వాపోతాడు. అయితే, ఈ నాటికీ రైతులు సీమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఏనాడు సంఘటితం కాలేక పోయారు. రైతు రాజ్యాన్ని స్థాపించుకోలేకపోయారు.

**క్షామ పరిస్థితులు :**

రాయలసీమకు ప్రథమ శత్రువు కరువు. ఆ కరువుకు కారణం వర్షాభావం. రాయలసీమ ప్రాంతంలో ప్రవహించే జీవనదులు లేవు. చిత్తూరు జిల్లాలోని స్వర్ణముఖి నది రూపాన్ని కోల్పోయి దశాబ్దాలు గడిచింది. ఇక పూర్తిగా వర్షాధారమై ప్రవహించే నదులలో పెన్నా, తుంగభద్రలు చెప్పుకోదగ్గవి. కుందూ, చిత్రావతి, పాపాగ్ని, సగిలేరు వంటివి కడప ప్రాంతంలో ఉన్నాయి. రాయలసీమలోని అధిక భూభాగానికి వర్షాకాల నదులు కూడా లేవు. చెరువులు, బావులు, కాలువలు కూడా వర్షాధారంతో ఊపిరి పోసుకునేవే.

వానను నమ్ముకుని రైతు జీవితాలు ఎండిపోవడం, మునిగిపోవడం రాయలసీమకు కొత్తేమీ కాదు. రాయల సీమ మొత్తం ప్రాంతంలో ఏ ఒక్క సంవత్సరమూ సంపూర్ణంగా వర్షం కురిసినట్టు చెప్పుకోలేం. పడిన నాలుగు చినుకుల్ని నమ్మి విత్తనాలను భూమిలో పోసి, ఆకాశంవైపు మోరెత్తి చూస్తున్న రైతుల దైన్యం ఇంకా కొనసాగుతూనే ఉంది.

1936లో శేషశర్మ రాసిన 'మేఘమా' కవిత అలాంటి విపత్కర పరిస్థితులకు అద్దంపడుతుంది.

"ఇంటిలో నుండు గింజలు మంటిలోన
కొల్లబోసిరి పేదలు కోర్కె మీఱ
మేఘమిదెయంచు మెఱపులు మించెనంచు
నుఱిమెనంచును తుంపరలుం తెనంచు
నేడు తప్పక చెఱువులు నిండు నంచు
నాశ జూచిరి నవి యెల్ల మోసమయ్యె"

(మేఘమా : శ్రీసాధన: 12.12.1936)

అంటూ ఆవేదన ప్రకటిస్తాడు. వర్షాన్ని మిత్రుడుగా భావించి విత్తిన విత్తనాలు పురుగుల పాలై పోతున్నాయని, ఎర్రని ఎండలో కపిల ఈడ్చే ఎద్దులు, కపిలతోలే రైతుల రక్తాన్ని స్రవిస్తున్నారని రైతు బాధలను ఏకరువు పెడతాడు శేషశర్మ.

అతివృష్టి నుండి కాపాడాలని ప్రయత్నించిన ముసలమ్మ మరణత్యాగం ఒకప్పటి సీమచిత్రం. ఇది పెన్నేటి పాట కాలానికి రాయలసీమ దృశ్యాన్ని మార్చేసుకుంది. పీనుగుల పెన్నగా, వట్టి ఎడారిగా, నక్క బావలు, నాగు పాములు, బొంత గద్దలు సంచరించే ప్రాంతంగా, రేణి కంపలు, పల్లేరుగాయలు, తుమ్మతోపులు మొలిచి నిర్వీర్యమైపోయిన నేలగా పెన్నేటి ప్రాంతం పరిణమించడాన్ని కళ్ళకు కట్టించింది పెన్నేటి పాట.

"చెరువు కట్ట తెగకుండా
ప్రాణత్యాగం చేసిన ముసమలమ్మ నేల
తడారిపోయిన ఎడారై
జీవితాన్ని జూదం చేస్తుంది
మనిషిని మాంసం ముద్దను"

(స్వర్ణభారతి సాక్షిగా: పుట 23)

మనిషిని, మాంసం ముద్దను జూదంలో పావుగా చేయడాన్ని రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గుర్తిస్తారు.

'చినుకే బంగారమైన ఈ సీమలో మెతుకే వైభోగం. కరువు కొమ్మపై ఎప్పుడూ బ్రతుకు ప్రశ్నలే' కనిపిస్తున్నాయని విశదపరుస్తారు రాచపాళెం.

"కాస్తంత మబ్బు తునక
నింగిబొడ్డుకు వేలాడితే చాలు
వాన శిశువై నేలకు దూకుతుందని
చెరువు ఒడిని ఆకాశమంత పరుచుకొని"

(డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి; కన్నీటిసీమ: పుట 2)

ఎదురుచూసిన పల్లెలన్నీ మోసపోతున్నాయంటాడు ఈశ్వరరెడ్డి.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

'నాతల్లి ఆకాశమా, నీటి పొదుగేమి చేశావమ్మా, నీ కోసమే చూసి, నీళ్ళులేక ఏడ్చి, ఎండిపోతున్నాను, పైరుపాపను నేను, కరుణించి కాపాడుమా పాల మబ్బుల్ని కరిగించుమా' (మనసు పాట: డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి), అంటూ పైరు పాపలు ఆకాశాన్ని వేడుకోవడం కనిపిస్తుంది.

"నాతల్లి పుస్తెలు తాకట్టు పెట్టేసి
నా తండ్రి కండలు మట్టిలో పిండాడు
రైతు నాన్నను చూడు భూమినే నమ్మాడు
నెత్తుటి ధారల్ని నీరుగా పోశాడు"

రాయలసీమలో డొక్కలెండిన సగటు రైతు పరిస్థితి ఇలానే ఉంది. భూమిని నమ్ముకొని, సర్వం ధారబోస్తున్న రైతులు చివరికి ఆత్మార్పణకు పాల్పడితే, సమాజం భుక్తిలేక అలమటిస్తుంది. అందుకే

అప్పులపాలైన రైతుల్ని చంపేసి
పసిపాప కళ్ళల్లో దైన్యాన్ని నింపద్దు..."

(మనసుపాట : పుటలు 22, 23)

అంటూ పైరు బిడ్డల వేడుకోలును ఈశ్వర రెడ్డి వినిపిస్తారు. వానను నమ్మి మోసపోయిన వృత్తాంతాలను కవిత్వ వస్తువులుగా రాయలసీమ కవులందరూ స్వీకరించారు.

ప్రకృతిలో వస్తున్న మార్పులవల్ల, ఆకాశం నిండా పొగమబ్బులు తప్ప వాన మబ్బులు కనిపించడం లేదు. ఆకాశాన్ని తల్లిగా, మేఘాలను గర్భంగా, వర్షాన్ని శిశువులుగా భావిస్తూ లోసారి సుధాకర్ ఆకాశాన్ని ప్రశ్నిస్తాడు.

"ఆకాశం గొడ్రాలా? / మేఘాల గర్భం దాల్చదేమి?
మా సీమలో కడకు కన్నీరైనా చెమర్చదేమి?/ ఇన్ని మూగజీవుల్ని
కబేళాలు కబళిస్తుంటే... ఎన్ని బొడ్రాళ్ళని మొక్కినా
ఒక్క వానా కురవదు"....

(ఒక్క వాన, తడియారని స్వప్నం : పుట 44)

ఒక్క వానకూడా పడకపోవడం వల్ల జరుగుతున్న పరిణామాలను ఎత్తి చూపిస్తాడు కవి.

మాసాలు, కార్తెలు మారుతున్నా వాన చినుకులు రాలడంలేదని గుర్తుచేస్తారు జూపల్లి ప్రేమ్‌చంద్.

"జీవితమంతా ఎదురు తెన్నుల్లో ఆకాశం కేసి చూస్తూ
ఉత్తరభాద్ర ఉరుము లేకుండా వెళ్ళిపోతుంది
అశ్విని మెరుపు గుర్రాలెక్కి వెల్లిపోతుంది
భరణి గాలి దుమారాన్ని వెంట తెస్తుంది
కృత్తిక, రోహిణి, మృగశిర, పుష్యమి
మాఘ పుబ్బ ఒక్కొక్క కార్తెలో నాలుగంటే నాలుగు
చినుకులు కురుస్తాయని వళ్ళంతా కళ్ళు చేసుకుని
ఎదురుచూస్తే
ఎదురయ్యేవి చివరికి ఎండమావులే"

(ఆవేద : పదును (కవిత) పుట 32)

అంటాడు జూపల్లి ప్రేమ్‌చంద్. 'రాయలసీమకు రుతువులు లేవు. గ్రీష్మరుతువు తప్ప' అన్నట్టుగా రాయలసీమలో కాలచక్రం స్థంభించి పోయినట్టు, అది వేసవి సెగను ఎగజిమ్ముతున్నట్టు ఉండడాన్ని చూడవచ్చు.

## కరువు వెతలు :

రాయలసీమలో ప్రజా సమస్యలపై గళమెత్తిన ప్రతి కవీ కరువును ప్రస్తావించక తప్పని పరిస్థితి నెలకొంది. ఆధునిక కవులు దాదాపుగా కరువు కడగండ్లను అనేక కోణాల్లో పరిశీలించి చిత్రించారు.

రాయలసీమ అస్థిత్వాన్ని, సాంప్రదాయాలను, జీవితాన్ని, కరువును అద్భుతంగా చిత్రించిన పద్య కావ్యం "రాయలసీమ రైతు." బైరపురెడ్డి నారాయణరెడ్డి అనుభవించి రాసిన ఆయన కావ్యంలో

"కరువులోనబుట్టి కరువులోన పెరిగి
కరువులందె బ్రతుకు గాంచు జనుల
కర్కశులయి భీతిగనరని యీర్ష్యచే
కడిమి మెరసి కరువు కలచెననగ"

- కరువుకు చిరునామాగా, కరువే జీవితంగా మారిపోయిన సందర్భాన్ని ఆవిష్కరిస్తాడు కవి.

"చేయపనిలేదు కష్టముల్ చెప్పరాదు
వేచియుండరాదెటుబోవ వీలు లేదు
బహు కుటుంబములోనున్న బాధలెన్నో
హాలికోత్తముల్ బహుళార్తి కగ్గమైరి.'

(రాయలసీమ రైతు : బైరపురెడ్డి నారాయణరెడ్డి)

అంటూ కరువు గడ్డపై బతుకులీడ్చే వారి ధీన పరిస్థితులను కావ్యంగా మలిచాడు బైరపురెడ్డి నారాయణ రెడ్డి. ముదితలు శుభకరమని భావించే పూలు, గాజులు, కుంకుమ, నూనె వంటి వాటిని కూడా కొనివ్వలేక భర్తలు ఆవేదన చెందుతున్నారని, భర్తల అగచాట్లు చూసి భార్యలు ఏడుస్తున్నారని వాపోతాడు. కర్నూలు, అనంత పురం, కడప, చిత్తూరు జిల్లాలు సుభిక్షంగా ఉన్న రోజుల్లో పండిన పంటలను మనసారా వర్ణించిన కవి, కరువు రక్కసి చేసిన కరాళనృత్యం కింద నలిగిపోయిన రైతుల కన్నీటి జీవితాలను కళ్ళముందుంచాడు బైరపురెడ్డి.

"కాలం కానికాలం, కరువుకాలం / పల్లె సీమ కను పాపల్లో / చెరువులన్నీ ఆవిరైన కాలం / ఈ సీమ ఎడారి పైన వానజాడలేని కాలం / నీటి చుక్కకైనా జాలి లేని కాలం / క్షతగాత్రుల చావుకేకలతో / సీమ జీవితం బావు రుమంటున్న కాలం" (చావుల రుతువు) దాపురించిం దంటాడు రాధేయ.

"గొంతు లెండిన బావులూ / గాలి మిగిలిన బోరిం గులూ / నేల చమ్మ చిట్లిన చెరువులూ / పచ్చి బాల్యం రాని చెట్లు / మండే మట్టి రేణువులూ / ఎడారి పల్లెకు ఎప్పటిలా / మాయని కరువు గాయాలూ / నోరాడించే మేతలేక / మాంసంగా మారే మూగజీవాలు / మట్టిలో మెలకువ లేక / తూకమోత్తున్న పంటవిత్తనాలు/ ......... ఎడారి పల్లెకు ఎప్పటిలా మారని దృశ్యాలు." (బద్వేలి రమేష్ : కాకి రెక్కంత కరిమబ్బు కోసం కవిత) సీమ ప్రాంతంలో తిష్టవేశాయి.

"జీవితమిక్కడ కన్పించని యుద్ధక్షేత్రం, మాకు ఇద్దరే శత్రువులు ఒకటి కరువు, రెండోది రాజకీయ మృగం" అంటున్న జంధ్యాల రఘుబాబు మాటలు అక్షర సత్యా లుగా కనిపిస్తాయి.

కరువులు సాచికొడుతున్నా, రైతులు మెండిగా బ్రతికేస్తున్న స్థితిని చూపిస్తూ - "మట్టి చెమటలతో / దుక్కి అయిన దేహాలివి / ఎన్ని కరువుల కన్నీటినైనా నింపుకోగల / నేత్ర సముద్రాలివి / కబళం ముద్ద దొరకని కరువులో / గెదర ఆకులు ఈతగడ్డలతో / ప్రాణాలు నిలుపుకున్నాము / ఇంకేదో లేదని / ఏనాడైనా మారాము చేశామా?" (బి. సూర్యసాగర్ : కరువు కెరటం) అని కరువు కష్టాల గురించి ఎవ్వరినీ నిలదియ్యలేదని, హక్కుల కోసం పోరాటాలు చెయ్యలేదని, ఉన్నదాంతో ఊపిరి పోసు కుంటున్నామని చెప్తాడు.

రైతు సహనానికి, త్యాగానికి నిత్య పరీక్షలు పెట్టే కరువు జీవితాల్ని పిప్పి చేస్తోందనడంలో సందేహం లేదు.

"మాకళ్ళల్లో వుబికే అన్ని నీళ్ళు
మావూరి బావుల్లో ఊరితే
ఆశలొదిలేసిన ఎముకల గూళ్ళలో
మృత్యువు సాలెగూళ్ళు కట్టేది కాదు
(కన్నీటి సీమ పుట 3: ఈశ్వరరెడ్డి .ఎన్)

అంటున్న కవుల అంతర్మథనం వాస్తవ పరిస్థితిని కళ్ళముందుంచి కన్నీరు పెట్టిస్తుంది.

'ఇప్పుడు నీళ్ళింకిపోయి పగుళ్ళు పడ్డ ఊరిచెరువు, పగిలిపోయిన పల్లె గుండెకు సాక్ష్యం అయ్యింది. అనడం కూడా సీమ పరిస్థితికి నిదర్శనమే అవుతుంది. 'మృత కళేబరాల్లా బిగుసుకు పడుకున్న ఎండిన చెరువులు, కన్నీరింకిన కళేబరం కనుగుడ్లలా ఎండిన బావులు, చితికి పేర్చిన ఎండు పుల్లల్లా మొద్దుబారిన చెట్లు, అరణ్యాల్ని నిలువెల్లా దహిస్తున్న దావానలం సెగలూ, దావానలాన్ని వేగంగా విస్తృతం చేస్తున్న వేడి సెగలు" (ఆవేద, దాహరి కవిత : పుట 43) సీమ కరువు స్థితులకు పరాకాష్టగా నిలిచే చిత్రాలుగా జూపల్లి ప్రేమ్‌చంద్ చూపిస్తాడు.

'ఇప్పుడు రాయలసీమలో కరువు అంటే తిండి లేక పోవటం కాదు, పంటలు పండకపోవడం కాదు, గిట్టు బాటు ధర లేకపోవటం కాదు - కరువంటే నిత్యం కొద్ది కొద్దిగా రక్తం పీల్చే రక్తపింజారి. కరువంటే ఆత్మల్ని నడిరోడ్డు మీద తెగనమ్ముకోవడం, కరువంటే నిత్య ఆత్మ హననం, కరువుంటే అనునిత్యం ఆత్మహత్యించుకోవడం' అనే కొత్త నిర్వచనాన్ని ఇస్తాడు ప్రేమ్‌చంద్.

"కరువు ఇక్కడి ప్రజల చుట్టం కాదు
చుట్టుకున్న ఉరితాడు (కరువు దృశ్యం)

అని జూటూరి షరీఫ్ అంటే, "మట్టిలో విత్తనాలు విత్తితే

గుత్తులు గుత్తులుగా వేరుశనగ పండుతుందనుకున్నాం. కరువు కత్తులు మొరిచి కుత్తుకలు తెగిపడడం రోజూ చూస్తున్నాం. ప్రతిపూటా పస్తున్నాం, ప్రతి ఏటా చస్తున్నాం" (జలగండం) అంటారు యక్కలూరి శ్రీరాములు.

'మా సీమలో కరువు, బిడ్డలాంటి పశువును అడ్డంగా అమ్మిస్తుంది. గుట్టంత చెరువును నిట్టనిలువునా నరి కేస్తుంది... కరువు చెట్టుమీద ఎన్నో పథకాల కొమ్మలు సాగి సాగి, కోట్ల నిధుల కాయలు కాస్తున్నాయి. రాజకీయ క్రీనీడలో కాయలేమో మాయం. మా సీమకు కరువు మాత్రం పదిలం' (విషాదం) అంటున్న రాచపాళెం గారి మాటలు వ్యవస్థలోని మరో పార్శ్వాన్ని ఆవిష్కరిస్తాయి.

కారె జగదీష్ రాసిన 'మహాప్రయాణం', సిద్ధగిరి శ్రీని వాస్ రాసిన 'ఎదురుచూపులు', ఎ.ఎన్. నాగేశ్వరరావు రాసిన 'కరువు పిడికిళ్ళు' రాయలసీమను బహు విధాలుగా భ్రష్టు పట్టించిన కరువు రూపాలను హృద్యంగా చిత్రించాయి.

"ఎక్కడ బోర్లు వేసినా
నీళ్ళు పడేది మాత్రం రైతు కళ్ళల్లోనే'

అంటున్న 'స్వామి' మాటలు కరువు వల్ల భూగర్భంలో ఇంకిపోయిన నీటి జాడలకు సాక్ష్యాలు. 1947 నుండి ఇప్పటివరకు దాదాపు 24 సార్లు రాయలసీమను కరువు పీడించిందని అధికార గణాంకాలు చెప్తున్నాయి.

అనంతరైతు జీవితాన్ని పల్లె దుస్థితిని కళ్ళారా చూసి, అనుభవంలోంచి రాసిన లోసారి సుధాకర్ ఇలా అంటారు.

"మబ్బులు మాయమైన ఆకాశం / మా వూరి
బొర్రాయిలా ఉంది
నెర్రెలిచ్చుకున్న భూమి తల్లి / మండుతున్న కొలిమిలా
ఉంది
అక్షయ పాత్రలాంటి / మావూరి బావి గొంతెండి
కూర్చుంది
ఆకలిగొన్న కరువు / పంటపొలాల్తో పాటు
మాబిడ్డల నోటికాడి గంజి కూడా / తుడుచుకు
పోయింది."

(బొర్రాయి కవిత, మైనపుబొమ్మలు - పుట 52)

అంటూ గ్రామీణ జీవితాన్ని అతలాకుతలం చేసిన వైనాన్ని వివరిస్తారు. అంతేగాక ధాన్యం నిల్వచేసే దొంతులు దివాళాతీసిన బ్యాంకుల్లా మారాయంటాడు.

### శిస్తు భారం :

ఒకప్పుడు రైతులు భూమిశిస్తు తప్పనిసరిగా చెల్లిం చాల్సి వచ్చేది. మౌర్య, పల్లవ, శాతవాహన, చోళ తదితర వంశాల రాజుల నుండి నిన్న మొన్నటి ఆంగ్లేయుల పాలనాకాలం దాకా పంటలు పండకపోయినా, రైతులు పస్తులతో ఎండిపోతున్నా ప్రభుత్వాలు శిస్తు వసూలు పట్ల కఠినంగా వ్యవహరించాయి.

శిస్తును రద్దు చేయాలని రైతులు ఆదోళనల బాట పట్టినా లాభం లేకుండా పోయిందని 1937లో కె.వి. రామకృష్ణారెడ్డి రాసిన 'రైతు మేలుకొలుపు' గేయం ఆనాటి పరిస్థితులకు అద్దం పడుతుంది.

...."ఎండకెండియును, వానకు నానియు
చెమటగార్చి పండింతువు పంటలు
శిస్తు భారముచె ఋణ బాధలచే
పస్తుండుట నీ దౌర్భాగ్యంబగు....
(రైతు మేలుకొలుపు, శ్రీసాధన తేది : 31.07.1937)

అంటూ రైతులు తమ బాధల్ని పోగొట్టుకోవడానికి స్వాతంత్ర్య ఉద్యమమే శరణ్యమని హితవు పలుకుతాడు కవి.

"పాడియుంబంట సన్నగిలె, పల్లెలు పాడరె గో
వృషంబులన్
గోడులు జెందె; బెక్కురకు కూడులభించుట
కష్టమయ్యె నే
డేడు వివత్సరం పరలె; యాతి దొలంపరెయంచు
రాజులన్
వేడి నిరాశ జెందుట, వింటిమె? కంటిమె? వారి
సాయమున్"

(ప్రజాసంతాపం, శ్రీసాధన : 17.9.1927)

అంటూ సరసకవి కరణం కృష్ణారావు వాపోవడాన్ని చూడవచ్చు. ఏడు సంవత్సరాలు కరువు పీడించినా, పాలకులు రైతుల బాధలు ఆలకించలేదని తెలియ జేస్తాడు.

**వలసలు :**

వ్యవసాయం దాని అనుబంధ వృత్తులు కరువుతో దెబ్బతిని, ఉన్నచోట బువ్వదొరక్క రాయలసీమ ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. వలసల్తో అనంత పురం జిల్లా మొదటిస్థానంలో ఉండగా, కర్నూలు, చిత్తూరు, కడప జిల్లాల ప్రజలు తరువాత స్థానాల్లో ఉన్నారు. రాయలసీమ రైతు జీవితం ఛిద్రమై పోయిందన డానికి ఇదొక ఉదాహరణ.

"ప్రాణ రక్షణము కొరకై పాటుపడుచు
నిల్లు నిల్లాలి బిడ్డల నెలను విడిచి
పనులు గలచోట బ్రతుకగ జనిరి భీతి
చాలి చాలని కర్షకుల్ కూలి పనికి"

(రాయలసీమ రైతు)

అంటున్న బైరపురెడ్డి నారాయణరెడ్డి మాటలు 1960 ప్రాంతపు వలసలకు అద్దంపడతాయి.

"వలసపోయిన అనంతక్షులు
గూటికి తిరిగొచ్చేలోగా
గూళ్ళే చెదిరి పోయాయో
వాటి ఆనవాళ్ళే మాయమయ్యాయో
మా గ్రామాల్లో
కరువు విధించిన కర్ఫ్యూ మాత్రం చూద్దురు రండి"

(రెండు ప్రపంచాలు)

అంటున్న రాచపాళెం ఖాళీ అయిపోయిన పల్లెను ఖర్ఫ్యూ విధించినట్టు ఉందనడం, వలసకు పరాకాష్టగా కనిపిస్తుంది.

"కరువు కొండచిలువ సేద్యాన్ని మింగింది
కష్టాల కొలిమిని ఇంట రగిలించింది
కూలి గింజల కొరకు కన్నతల్లిని వదిలి
పిల్ల పాపలతోన కదిలిపోయెను పల్లె
ఏ పట్ల వాకిట్లో తమ్ముడా...
పల్లె బిచ్చగత్తయ్యెనో చెల్లెలా...."

(వలసపోయిన సీమ - ఫేస్‌బుక్ - డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి)

గేయం వలసకు కారణాలను, దాని పర్యవసానాలను ఏకరువు పెడుతుంది.

వానకోసం పరితపించిన జనం ఎలా మారిపోయారో కెంగార మోహన్ 'కవన సేద్యం'లో రాస్తూ

"మట్టి రేణువులెంత / తహతహ లాడినా
ప్రకృతి కోపం చల్లారడం లేదు / పచ్చటి పల్లెలన్నీ
ఎముకల గూళ్ళు సర్దుకొని / వలసెల్లి పోయాయి."

(కృషీవలుడు) అంటాడు.

చెప్పుకోలేని బాధ, గుండె మాటున రగిలే అసహనం, మండిస్తున్న ఆకలి, రైతు బతుకును నావనం చేసేశాయి.

"పల్లె పొమ్మంటోంది
పట్నం రమ్మంటోంది
పొట్టకోసం వలస"

(రైతే కూలి, ఆలోచనలు పుట 14)

తప్పడం లేదని ఆచార్య మాడభూషి సంపత్కుమార్ తెలియజేస్తాడు.

వలస వెళ్లిన పెద్దోడికి ఊరి గురించి రాసిన ఉత్తరం కంటతడి పెట్టిస్తుంది గోపిని కరుణాకర్ 'పొద్దున్నే వచ్చిన వాన' కవితలో.

'.... నువ్వేమో హెూటల్లో ఎంగిలి కంచమైపోతివి
దేశానికి పట్టెడన్నం పెట్టిన మీ తాత
తుంట బీడీలు అడుక్కుంటా
బస్టాండులో బిచ్చగాడై పాయ
అన్నింటినీ వొడ్డి
నేను జూదంలో ధర్మరాజునై పోతిని...

కనీస అవసరాలకు కూడా దూరమై పోయిన పల్లెల్లో పరిస్థితి ఎలా దిగజారిపోతోందో పైవాక్యాలు తెలియ జేస్తాయి.

మీ అమ్మ తాలిబొట్టు పసుపు కొమ్మయింది
నీ చెల్లెలి చెవుల్లోని కమ్మలు జొన్నబెండులైనాయి
నీతమ్ముడు బడి మాని బట్టీలో కాలే ఇటికై పాయె..."

(రైతు కవిత : పుటలు 73, 74)

అంటుంటే ఎలాంటివాడికైనా హృదయం ద్రవించక మానదు. 2016లో అనంతపురం నుండి కేరళ రాష్ట్రానికి కూలికోసం వెళ్ళిన రైతులు, అక్కడి పబ్లిక్ టాయ్‌లెట్స్‌లో నిద్రించిన దృశ్యాలు ఈనాడు పత్రికలో అచ్చయ్యాయి.

తిండి, నీళ్ళు, నిద్ర లేక పరాయి రాష్ట్రంలో మన రైతులు పడిన అవస్థలు కథనాలుగా వచ్చిన తర్వాత, ప్రభుత్వం ఆ రైతులను వెనక్కి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది.

**నీటి వాటా :**

రాయలసీమ ప్రాంతానికి బచావత్ అవార్డు ద్వారా లభించిన నీటి వాటా 16% (122.7 టి.ఎం.సీలు) అదే సమయంలో కోస్తాకు 49.2% (377.7 టి.ఎం.సీలు) తెలంగాణాకు 34.8% (266.83 టి.ఎం.సీలు). నీటి వాటాలు ఖరారయ్యాయి. రాయలసీమ మీద నిత్యం ప్రేమను కురిపిస్తూ కరువుపై ఉపన్యాసాలు చేసే నాయకులు, అధికారులు, మంత్రులు సీమకు జరిగిన అన్యాయాన్ని ఎప్పుడూ సరిదిద్దే ప్రయత్నం చేయలేదు. పైన చెప్పిన వాటాలు అఖిలపక్ష ఒప్పందంగా నిర్ణయించినట్టు 1981లో నీటి పారుదల శాఖ ప్రకటించింది. (రాయలసీమ కన్నీటిగాథ ఎం.వి. రమణారెడ్డి పుట : 20) ఇలాంటి పరిస్థితులను ఎండగడుతూ వచ్చిన కవిత్వం సీమ కంఠంతో నినదిస్తుంది.

ఆచార్య మాడభూషి సంపత్కుమార్ కోర్టులు, ప్రభుత్వాలు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా నీటి వాటాలు నిర్ణయించడాన్ని తప్పుబడతాడు.

"కళ్ళకు గంతలు కట్టుకొని / ఎవడోపోసిన ఇంకుతో / తీర్పులు రాస్తాడు / ఎవడినీళ్ళు ఎవడి పొలంలో / ఎవడో నిర్ణయిస్తాడు / ఏ నది ఏ మార్గంలో పయనించాలో / ఎక్కడో ఉన్నవాడు తీర్పు రాస్తాడు / ఇంకిన చెరువుల గురించి / ఎండిన పొలాల గురించి / పిడచగట్టిన నాలుకల గురించి / నాలుకల గురించి / వాడికేం తెలుసు? / కన్నభూమిని కన్నీళ్లతో నింపి / పరాయి భూమిని పావనం చెయ్యమంటాడు" (వాడుకవిత : చివరకు నువ్వే గెలుస్తావు : పుట : 51) అంటాడు. నిత్యం కరువుతో అల్లాడే ప్రాంతానికి నిర్ణయించిన నీటి వాటాను చూస్తే ఎవరికైనా కడుపు కాలుతుంది.

నీటి వాటాలపై జరుగుతున్న వివక్షను ఎదుర్కోవడానికి దండులా కదలాలని ఇరబోతు శ్రీనివాసులు పిలుపునిస్తాడు.

"కదలాలిరా కదనరంగమై
నిలవాలిరా నిండు గుండెలై
ఊరువాడలు కలిసి ఉప్పెనై జూచి
నిప్పులై మండాలిరా మాయన్న గుప్పుమని లేవాలిరా
దండు కదులుతుందిరా అరెజెండా కదులుతుందిరా...

అంటూ ఇప్పుడిప్పుడే ఉద్యమబాట పడుతున్న రైతులకు స్ఫూర్తిగా నిలుస్తాడు.

గాలేరు నగిరి గాండ్రించి నడిచిన
పోతిరెడ్డిపాడు పోరై మండెను
హంద్రినీవా జూడు అలిగెల్లిపోతాంది
వెలిగొండ ప్రాజెక్టుకు ఆకలి తీరదు
చేయిచేయి కలుపుకొని మాయన్న
చెంగుమంటూ దూకరా
నీళ్ళు పోరుచేసి నువ్వు
సీమ మట్టిని తడపాలిరా...

(కదలాలిరా, నిజమేకదా : పుట 116)

అంటూ సీమకోసం ఉధృత ఉద్యమం తప్పదంటాడు. రాష్ట్రకేంద్ర ప్రభుత్వాలు చూపుతున్న వివక్ష, రాయలసీమ నాయకుల ఉదాసీనత వల్ల నీళ్ళతోపాటు ఉక్కు ఫ్యాక్టరీ, ఉద్యోగాలు, ప్రత్యేక నిధి ఏపీ రావడం లేదని, ఇవన్నీ మరో ఉద్యమంతోనే సాధ్యమని తెలియజేస్తాడు.

కె. గాయత్రి ఆనంద్ అనంత రైతుల వెతలను చూసి, తుంగభద్ర జలాల కోసం సంఘటితం కమ్మంటారు.

"తల్లి లాంటి తుంగభద్ర ఒక్కటే దిక్కు మనకు
ప్రాంతీయ నేతలారా కాసుకెగబడకండి
కదలిరండి కలిసిరండి పోరి గెలవండి
తుంగ జలాలన్నీ పొలాలకు మరలించండి
అనంత రైతు కళ్ళల్లో ఆనందం పండించండి"

(పోరుపు : పుట 76)

అంటూ కర్తవ్యబోధ చేస్తారు. కరువు కోరల్లో చిక్కిన సీమను రక్షించాలన్నా, ఖాళీ అయిపోతున్న పల్లెల్ని ఆదుకోవాలన్నా, పొరుగు రాష్ట్రాలకు కూలి గింజల కోసం వలసపోతున్న రైతుల్ని తిరిగి నిలబెట్టాలన్నా సీమ నేలపైకి నదీ జలాలను తెప్పించవలసిందే.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

**సుభిక్ష కోరిక :**

వ్యవసాయ క్షేత్రం అక్షయ కర్మాగారంగా మారిందని చెప్తూ "నిద్రాణమైన రాత్రి / రైతు నాగలి మొన / మట్టి పెళ్ళల సవ్వడికి / మెల్లగా నిద్రలేస్తుంది / ఎద్దుల గిట్టల చేతుల్తో / బుద్ధిగా కళ్ళు పులుముకొని / చాళ్ళ రెప్పలను / కలువ పువ్వుల్లా తెరుస్తుంది / మాతృ హృదయం పొంగి / పాలపుంత అయినట్టు / ముత్యాలు పొదగడానికి / వేలాంగన ఆల్చిప్ప అయినట్లు నీటిధారలు తాపి / ముద్ద మొలకగదీర్చి / ఆకు ఆకూ పేర్చి / వెన్నెల వెన్నులు నేర్పి / ఆకలి పేగుల నోటికి / అన్నాన్ని అందించ / అక్షయ / కర్మాగార మవుతుంది" (అక్షయం : దృశ్య ప్రవాహం పుటలు 71, 72) అంటాడు సడ్లపల్లి చిదంబర రెడ్డి. వ్యవసాయంతో మమేకమైపోయి మట్టి మహిమను మనసుకు హత్తుకుంటే తప్ప ఇలాంటి ఆత్మీయత జాలువారదు.

వ్యవసాయ సౌందర్యాన్ని ఆచార్య రాచపాళెం గారు 'పొలి' పేరుతో దీర్ఘ కావ్యంగా రాశారు. వ్యవసాయ పోరులో తనువు చాలించిన వారి తండ్రి కేంద్ర బిందువుగా ఈ కావ్యం నడిచినా, వ్యవసాయ వర్ణనలు మళ్లీ మనల్ని పొలంలోకి లాక్కెళ్ళిపోతాయి.

"కర్రు స్పర్శ తగిలిందా / నేల / పరవశించి / సరికొత్త రవళితో / జలనాట్యం చేస్తుంది / కర్రుకు అటు ఇటు పడే కరుళ్ళ చేతులతో / నాగలికి స్వాగతం పలుకుతుంది / నవ జీవనానికి / అంకిత జండా ఎగురవేస్తుంది (పొలి : పుట 5) అంటుంటే, మడినాటడానికి తయారుచేస్తున్న అడుసులో దిగి ఆటాడుకున్నట్టే ఉంది. అడుసుదున్న కపు దృశ్యం కళ్ళముందు నిలుస్తుంది.

"మసక తొలిపొద్దున / ఎనుముల పొదుగుల నుంచి / కాడమార్చి కాడమార్చి / పాలు ధారలుగా పితుకుతూ / లయబద్ధ సంగీతం / నేర్చుకుంటున్న / మా పల్లె పడుచుల / కళాకౌశలం / నేను చూస్తున్నాను." "నేను చూసేది వరికంకుల్లో పాలుపోసుకోవడం కాదు, తడికళ్ళల్లో రైతులు కాంతి నింపుకోవడం" (పొద్దుపొడిచిన పల్లెలో; కాలాంతవేళ (సంపుటి), పుటలు 16, 17) అంటున్న శశిశ్రీ దృక్పథం రైతుకు ఇరువైపులా ఉండే 'పాడి-పంట' సౌందర్యాన్ని కళ్ళ ముందుంచుతుంది.

**ముగింపు :**

'ఓ ఉగాదీ! ఈ ఏడురాకు' అంటూ ఎస్జీడీ చంద్రశేఖర్ రాసిన ఉగాది కవిత సీమ దుస్థితిని వివరిస్తుంది. 'నిజంగా మాకు ఉగాదులు లేవు ఉషస్సులు లేవు' అంటున్న వై. శ్రీరాములు, 'జలఖడ్గం'తో కవాతు చేసిన మల్లెల అనంతమూర్తి, కరువు చిత్రాలను బహు ముఖాలుగా గీసిన నూకా రాంప్రసాద్ రెడ్డి, ప్రపంచీకరణ రైతును చావుదెబ్బ తీసిందని వాపోయిన మధురశ్రీ, ఇప్పుడు రైతు కాదు అన్నమే ఆత్మహత్య చేసుకుంటోంది' అని నిర్ధారించిన ఆచార్య పి.ఎల్. శ్రీనివాసరెడ్డి, 'ఇప్పుడు పొలాల్లో రెండు కారులు పండుతున్నాయ్, తొలికారు - కరువు, మలికారు - కక్షలూ కార్పణ్యాలు' అని సీమ చిత్రాన్ని గీచిన శశిశ్రీ, సమకాలీన రైతుజీవితాన్ని చిత్రించిన ఎస్. మునిసుందరం, అనంతకరువును ప్రపంచానికి చాటిన సర్వోత్తమ నాయుడు, నాగలిపట్టి శ్రమించే రైతు ఎలా నాశనమై పోతున్నాడో తెలియజెప్పిన బెళ్ళూరి శ్రీనివాసమూర్తి ఇలా ఎంతోమంది రాయలసీమ కవులు రైతును కేంద్రంగా చేసుకొని కవిత్వం రాశారు.

పశువులను కబేళాలకు అమ్ముకోవడం, గిట్టుబాటు ధర లేక నష్టపోవడం, దళారీలు మోసం చేయడం, నాయకుల ఉత్తుత్తి హామీలు మొదలైన అనేక సమస్యల్ని కవిత్వంలోకి తెచ్చారు కవులు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా నాయకులు రైతుల కడుపుకొట్టి భూమిని లాగేసుకుంటున్న విషయాలూ కవిత్వంలో ఉన్నాయి. రాయలసీమ రైతును చిత్రించిన కావ్యాలన్నీ కన్నీటి పుటలు గానే దర్శనమిస్తాయి. నేలను నమ్ముకున్న రైతు నేలకు బానిసగా మిగిలిపోవడమో, పురుగుల మందులను అమృతంగా సేవించడమో, వలస కూలీలుగా వెళ్ళి పోవడమో జరుగుతూ ఉన్న ఈ పరిణామాల నుండి రైతును కాపాడుకోకుంటే, సీమ పల్లెలు స్మశానాలుగా, పాడుబడ్డ కొంపలుగా మిగిలిపోక తప్పదనిపిస్తోంది.

## ఆధార గ్రంథాలు

1. మోహన్, కెంగార : కవనసేద్యం (2016) కె. హుస్సేనప్ప, భాషాపండితులు, ఇ.నెం. 4-12-2, పెద్దతుంబళం పోస్టు, ఆదోని మండలం, కర్నూలు జిల్లా.
2. పాపినేని శివశంకర్ : రైతు కవిత (2004), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ (2, సంపాదకులు), హైదరాబాదు.
3. ఈశ్వరరెడ్డి ఎన్. (డా॥) : 1. కన్నీటి సీమ 2003 (ప్ర.ము) 2. మనసుపాట 2009 సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప-3.
4. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం : 1. రెండుప్రపంచాలు (2012), 2. స్వర్ణభారతి సాక్షిగా (2001), 3. పాలి (2007), 4. వొరుపు (2003) శ్రీమతి లక్ష్మి, 28-3-169, తారకనాథ కాలనీ, అనంతపురం - 515001.
5. సుధాకర్, లోసారి : మైనపు బొమ్మలు (2012) తడియారని స్వప్నం (2016) కేర్ ఆఫ్ ఎన్. భాస్కర రెడ్డి ఇం.నెం. 39/449-17, రోడ్ నెం. 13, వివేకానందనగర్, కడప.
6. వేణు, సంకోజు : 1. నేల కల (2008) శ్రీమతి ఎస్. విజయలక్ష్మి, 2. ప్రాణప్రదమైన (2008 5, ఎల్.ఐ.జి.హెచ్., హెచ్.బి. కాలనీ, రాజీవ్ పార్క్ దగ్గర, నల్గొండ-508001.
7. రమణారెడ్డి .ఎం.వి. : రాయలసీమ కన్నీటి గాథ (కథనం)(2012) ఖాదరాబాద్, ప్రొద్దుటూరు - 516362, కడప జిల్లా.
8. సంపత్కుమార్, మాడభూషి ఆచార్య : 1. ఆలోచనలు (2015), 2. శత్రువుతో ప్రయాణం (2015) 3. చివరకు నువ్వే గెలుస్తావు (2016) పాలపిట్ట బుక్స్, 16-11-2016/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు.
9. శ్రీనివాసరెడ్డి పి.ఎల్. ఆచార్య : స్వేదాశ్రువులు (2004) పి. మనోజ్ఞ, ఎ-4, శ్రీ వేంకటేశ్వరపురం, అనంతపురం-515003.
10. శ్రీనివాసులు, ఇరుపోతు : నిజమే కదా (2015) ఇం.నెం. 6-2-377/1, సుమిత్రా నగర్, బద్వేలు - 516227, వై.ఎస్.ఆర్. జిల్లా.
11. శశిశ్రీ : 1. జేబులో సూర్యుడు (2008), 2. కాలాంతరవేళ 1-778 (2ఎ), ద్వారకానగర్, జర్నలిస్టు కాలని, కడప-516004.
12. ప్రేమ్‌చంద్, జూపల్లి : ఆవేద (1999) నిచ్చెనమెట్ల లొలకం (2009) అనంతకవిత (సంకలనం) (2012) పాలపిట్ట బుక్స్, 16-11-2016/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు.
13. జగదీష్, కెరె : సముద్రమంత గాయం (2011) తెరె & తెరె కంప్యూటర్స్
14. రాధేయ : అవిశ్రాంతం (2009) స్పందన, అనంతకవలు వేదిక, అనంతపురం.
15. శ్రీరాములు, యెక్కలూరి : జలగండం (2004)ఆనంద్ మల్టికలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, అనంతపురం.
16. సూర్యసాగర్ .బి :ధనస్సు (2005) జనసాహితీ ప్రచురణ, ఆంధ్రప్రదేశ్
17. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి : రాయలసీమలో ఆధునిక సాహిత్యం (2012)
18. రవికుమార్, మేడిపల్లి : వచన కవిత్వంలో వర్తమాన రైతు (వ్యాసం) సాహిత్య ప్రస్థానం ప్రత్యేక సంచిక (2008)
19. ఇబ్రహీం, షేక్ (డా॥) : రాయలసీమ కవిత్వం - దశ, దిశ (2018) పి.పి.ఎస్. ప్రింటర్స్, పాలకొల్లు-534260
20. చిదంబరరెడ్డి, సడ్లపల్లి : దృశ్యప్రహం (2013) చరిత ఇంప్రెషన్స్, అజామాబాద్,హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# ఆధునిక సాహిత్యంలో వైవిధ్య స్రవంతి వచన కవిత

- డా॥ మృణాళినిరాజ్ (కె.డి.డి. మృణాళిని), హైదరాబాద్, తెలంగాణ.

తెలుగు సాహిత్యంలో వచన కవిత ప్రధాన స్రవంతి. దాని మూలాలు ప్రాచీన సాహిత్యంలోనూ, ఆధునిక సాహిత్యంలోనూ ఉన్నాయి. వచన కవిత, ముక్తచ్ఛందం, వచన గేయం వంటి పేర్లతో మాత్రమే కాక మినీ కవిత, ప్రపంచపది, హైకూ, నానీ, వామీ వంటి వివిధ రూపాల్లో కూడ వికసించిన కవితాప్రక్రియ ఇది. ప్రపంచ సాహిత్యంలో తెలుగు పద్యానికుండేటంత, సువ్యవస్థితమైన ఛందస్సు సంస్కృతంతో తప్ప మరే భాషా సాహిత్యాల్లోనూ కనిపించదు. ఆ నేపథ్యంలో చూస్తే తెలుగు వచన కవిత కూడ అంతబలంగా, తక్కిన ప్రపంచ సాహిత్యాలకు దీటుగా వికసించిందని చెప్పవచ్చు. కేవలం సాహిత్య ప్రక్రియగా మాత్రమే కాక, వ్యక్తిని సాధికారికం చేయడానికీ, సమాజాన్ని చైతన్యవంతం చేయడానికీ వివిధ సమూహాలు తమ ఉనికిని చాటి చెప్పుకోడానికీ ఊత మిస్తూ, అత్యంత శక్తివంతమైన పాత్ర కూడా పోషిస్తూ వుంది. కృష్ణమాచార్యులు, తాళ్ళపాక వంశీయులు, శ్రీశ్రీ, చలం, శేషేంద్ర, మో నుండి సి.నా.రె. దాకా ఒక అవిచ్ఛిన్న వచన కవితా ప్రక్రియల్ని తెలుగులో కొనసాగడం నిజంగా చెప్పుకోదగ్గ విషయం.

వచన కవితా లక్షణాలు గురించి వివిధ-లక్షణకారుల అనేక విధాలుగా పేర్కొన్నా. ఉదాహరణకు. 'అపాదః పదసంగాతొ గద్యమ్'. అని ప్రతాపరుద్ర యశోభూషణకర్త విద్యానాథుడు నిర్దేశించినాడు. 'అనంతామాత్యుడు తన ఛందోదర్పణంలో "కనుగొన బాదరహితమై పనుపడి హరిగద్దె వోలె బహుముఖ రచనం -బున-మొరయు గద్యమది - దెనుగు కృతుల వచనమనగ దీపించుగడున్'. అంటే గద్యం పాదరహితంగా ఉండవలెను, బహుముఖ రచనగా ఉండవలెను, అనగా శైలీ వైవిధ్యం ఉండవలెను, అది సహస్రముఖాలుగా ఆదిశేషుని ఫణులవలె ఉండవలెనని అటువంటిదానిని గద్యమంటారని వివరించాడు. ఇక్కడ గద్యము, వచనము,ాతీశింవ అనే పదాలు సమానార్ధకవంత. సంస్కృతంలో గద్యమంటే మనం తెలుగులో దానినే 'వచనం' అంటున్నాము. దీనికే ఇంగ్లీషులో 'ఖీతీవవ జవతీంవ' అనిపేరు. మాటల్లో కవితా స్వభావమైన భావానుభూతిని కలిగించే ప్రయత్నం 'వచన కవిత్వం'. 'ఏ నియమమూ లేకుండా శుద్ధ వచనమును లయాత్మకంగా మార్చినచో అది వచన కవిత అని సి.నా.రె. అన్నారు. 'ఛందోరహితమైన కేవల వచనంలో భావలయ ప్రధానంగా పలికే కవిత్వానికి వచన కవిత్వమని చెప్పవచ్చు' అని డా॥అరిపిరాల విశ్వం అన్నారు. ఇక్కడ వచన కవితకు భావలయ జీవం అని తెలుస్తుంది. 'వచనం కవితామయంగా ఉంటే ఆ రచన 'వచన కవిత్వం' అని సర్దేశాయి తిరుమలరావు అన్నారు.

తెలుగులో గద్యం, వచనం అనే పదాలు సమానార్థకాలుగా వాడబడుతున్నాయి. అయితే సంస్కృతంలో "పలుకబడునది" వచనం. కాగా, కవి రచించిన ఛందోబద్ధం కాని వాక్య రచన 'గద్యం' అని పేర్కొన్నారు. గద్య పద్యాలతో కూడుకొన్నది చంపూ కావ్యం. కొందరి నిర్వచనం ప్రకారం హృద్యత గలది గద్యం. అది లేనిది వచనం. సంస్కృతంలో "గద్యం కవీనాం నికషం వదంతి"- కవులకి గద్య రచన గీటురాయి వంటిదన్న సూక్తి ఉన్నది. అందువలన గద్యానికి ప్రాముఖ్యం ఉందని తెలుస్తోంది. తిక్కన 'పద్యములు గద్యములన్ రచియించెద' అనటంలో గద్యమంటే వచనమని తెలుస్తుంది. నన్నయ భారతంలో కూడా వచనాలుగా 'వ' అనే సంకేతించబడింది. కాబట్టి తెలుగులో గద్య వచనాలు సమనార్థకాలుగా వాడబడుచున్నవి. అయితే తెలుగు కావ్యాల్లోని గద్య నిర్మాణానికి, ఆధునిక వచన నిర్మాణానికీ, భేదం కన్పిస్తుంది. ఈ భేదం వలన ఈనాడు వచనమనే మాటనే విరివిగా వాడుతున్నాం.

వీరశైవ యూగానంతరం మహాకవి, తిక్కన బారత రచనకు పూనుకున్నపుడు, తన రచనలో ఎక్కువ పాళ్ళు తెనుగుదనం కోసం ప్రయత్నించక తప్పలేదని కూడా గుర్తించాలి. నన్నయ చంపూ కవిత్వంలో గద్యమును తిక్క నాదులు కూడా అనుసరించి పద్యంతో పాడు వచనానికి ప్రాధాన్యతను ఇచ్చారు ఈ క్రమంలో వీరశైవులు ద్విపద ఛందస్సులో మరింత ప్రజాదరం ఇచ్చారు. ప్రతివాది ప్రయత్నాలకు ప్రత్యామ్నాయం కాగలిగిన ఉత్తమ రచనలకు, ఉత్తమాదర్శాలకు విజయం లభించదు. వ్యయ సంవత్సర పుష్యమానపు 'భారతి'లో శ్రీయుతులు మల్లవరపు విశ్వేశ్వరరావుగారు "కవిత్వంలో కొత్త రీతులు - వచనము లాంటి పద్యాలు'' అన్న శీర్షిక కింద శ్రీయుతులు వేంకట పార్వతీశ్వర కవులు మొదలైన వారి పద్యాలు వచనము లాగా నడిచినట్లు నిరూపించి వున్నారు. తిక్కనవంటి ప్రాచీనుల రచనలలో కూడా అట్టి రచనా విధానాలను గుర్తించవచ్చు. అయితే ఆ కవుల ధారాశుద్ధికి ఛందోవశిత్వానికి మాత్రమే అట్టి గుర్తింపు నిరూపకం కాగలదు. (నేటి వచన పద్యాలు స్వభావంలో వాటికి విపరీతమైనవని నేను భావిస్తున్నాను). అయితే ప్రాచీన కవిలోకంలో శైలి విషయంలో తిక్కనను ఆద ర్శంగా పెట్టుకొన్నవారు అతి స్వల్ప సంఖ్యాకులే అని మనం గ్రహించాలి.

పోతన పద్యాలకు వచ్చిన ప్రచార గౌరవం తిక్కన పద్యాలకు రాలేదు. అందుకు పోతన శబ్దాలంకార ప్రియత్వమో, అతని జీవిత విధానాలపై ప్రజలకున్న సానుభూతియో, భాషకు జీవగర్రలైన సామెతల వంటి వాటిలో విధిగా కనిపిస్తున్న అనుప్రాస విన్యాసం ఆంధ్ర ప్రజలకు ఎక్కువ ప్రీతికరం కావటమో కారణాలు కావచ్చును. ఈ కారణాలు వచనం వలె నడిచిన పద్యా లపై అభిరుచి లేకపోవడానికి హేతువేమిటో విమర్శించి, ప్రజలు తిరస్కరించిన కవిత్వంలోని లోపాలను గుర్తించి, సవరించుకోవటం, ప్రజా కవిత్వం చెప్పదలచిన అభ్యు దయ కాములకు ప్రధాన కర్తవ్యం కాకతప్పదు. పోతన కవిత్వంలో ఉన్నంత సంస్కృతాన్ని నిజంగా ప్రజలు అర్థం చేసుకొని అనుమోదించి వుంటే వ్యావహారిక భాషావాదుల మైన మనం ఈనాడు రచనలో సౌలభ్యం కోరుతున్నాము గనుక ప్రజాభాషలోనే రచింప దలపోస్తున్నాం. కాబట్టి 'అంత' సంస్కృతాన్నీ ఆమోదించడానికి అభ్యంతరం చెప్పనక్కర లేదు. గ్రాంథిక భాష 'కృతక భాష' అని నిరూపించగల్గిన మనం 'అంత' కృతక భాషను స్వీక రించటం కంటే మన వాదాన్ని వదులుకోవటం మంచిది. కాని, బుర్ర కథల వంటి సాహితీ ప్రక్రియల కున్నంత వ్యాప్తిగాని, సులభ బోధకత్వం గాని పోతన రచన కున్నదా అని ప్రశ్నించుకొందాం. దానికి సమాధానం 'లేదు' అన్న రెండు అక్షరాలు మాత్రమే. అట్టి సౌలభ్యంలేని రచన మతవిశ్వాస హేతువు ఒక్కదానివల్ల ఆకర్షణీయం కాలేదు. శబ్ద సంవిధానంలోని మార్దవం మాత్రమే పోతనకు పట్టాభిషేకం చేసిందని నేను భావిస్తున్నాను. లాక్షణిక మతానుసారంగా విమర్శించినా తిక్కనలోలేని కవితా శిల్పం పోతనలో లేదు. అయితే తిక్కన భాషకంటె పోతన భాష మృదువైనది, కర్ణపేయమైనది! ప్రతి సామెతలోనూ యతి కోసం దేవులాడే ఆంధ్రప్రజ సంస్కృత భూయిష్ట భాషకదా అని పోతన భాషను ఆదరించలేదని నేనను కుంటున్నాను. వేమన పద్యాలలో కనిపించే సులభభాష సంస్కృతమయం కాదు. అయినా దానికున్న ప్రజాభి మానం ఏ ఇతర రచనకూ లభించలేదు. అనగా చిన్న చిన్న తెలుగు పదాలలో ప్రాస చిత్రంతో రచించినప్పుడే ప్రజానీకం ఆ రచనల అభిమానించగలదని గుర్తించాలి. అందుచేత అభ్యుదయకాముకుడైన కవి ప్రాచీన ప్రబం ధాలలోని సంస్కృతానికి పదింతలు సంస్కృతాన్ని దిగు మతి చేసినందున తన ఉద్దేశాలకు తానుగా దూరమై పోతున్ననని గ్రహించవలసి వుంటుంది.

తిక్కనాదులు పద్యాలను వచనంవలె వ్రాయటానికి ప్రయత్నించినా, వారి దృష్టి సంప్రదాయ ప్రపంచపు సరిహద్దులు దాటనేలేదు. అనంతాదు లాతని అను సరించబోయినా అట్టివారి సంఖ్యను వేళ్ళపై లెక్కించ వచ్చు. ఇంత కాలానికి మళ్ళీ వచన పద్యరచన ఉద్య మమ రూపం ధరించింది. ఇప్పుడు వచన పద్యాలు

మంచివ్యాప్తిలో వున్నాయి. అందుచేతనే వచన పద్య రచనా ప్రయత్నాలను చరిత్ర నుండి గ్రహించి పూర్వ ప్రయత్నాలలోని లోటుపాట్లను పునర్విమర్శించి, భవిష్యత్తుకై పాఠం నేర్చుకోవాలని భావిస్తున్నాను. శ్రీ పాలగుమ్మి పద్మరాజు గారు 'సుప్తచ్ఛందాలు' అన్నా, శ్రీ విశ్వేశ్వర రావుగారు "నూతనచ్ఛందస్సుల కోసం జరిగే అజ్ఞాతాన్వేషణ" అన్నా, శ్రీ పఠాభిగారు 'వచనపద్య' మన్నా ఏక రూపమైన భావనలోనే వారున్నారని నమ్ముతున్నాను.

అభ్యుదయవాదు లింతగా నూతనచ్ఛందాలను అన్వేషించి ఉపయోగిస్తున్నామని చెప్పుకొంటున్నా, సంప్రదాయ ప్రియులు కొందరు ప్రతిసభలోనూ వీలు దొరికినపుడల్లా వీరి కవిత్వంలో 'ఛందస్సు' లేదనీ, ఆ ఛందస్సులకు 'పేర్లు' లేవనీ అధిక్షేపిస్తూనే వున్నారు! ప్రాచీనుల దృక్పథంలో ఛందశ్శాస్త్రం గణిత శాస్త్రంలోని ఒక భాగమా అనిపించ గలిగినంత విశాలంగా వున్నదని వీరు గుర్తించినట్లు లేదు. ఇరవైఆరు ఛందాలలోనూ పుట్టగలవని లాక్షణికులు భావించిన పదునాల్గుకోట్ల నలభై రెండు లక్షల పైచిల్లర పద్యాలలో ప్రతి వచన భాగం ఏదో ఒక పద్యభాగం కాకపోదనీ, అభ్యుదయకవు లింతకు మించిన నూతన చ్ఛందాలను వేటిని 'కనిపెట్ట' గలరనీ ఆక్షేపించి మరికొందరు సంతృప్తి పడుతున్నారు. వచన కవిత్వంలోని మరో లక్షణం - అస్పష్టత, అయోమయం ఉండక పోవటం. వచన కవిత్వంలో సామాజిక స్పృహ మరో ముఖ్య లక్షణం.

వచన కవిత్వానికి వస్తువైవిధ్యం ప్రాణం. శ్రీశ్రీ 'కాదేదీ కవితకనర్హం', 'కవితామయ మేనోయ్ అన్నీ' అన్న మాటలు వచన కవిత్వానికి అక్షరాక్షరం అన్వయిస్తాయి. దీనినే 'అపూర్వ వస్తునిర్దేశం' అంటున్నాం. పద్యకవిత్వంలో వస్తువుకి 'విధి, నిషేధాలు' ఉన్నాయి. ఎవరి గురించి కవిత్వం రాయాలో, ఎవరి గురించి రాయకూడదో కూడా చెప్పారు. వచన కవిత్వానికి ఆ నియమాలే లేవు. వర్డ్స్‌వర్త్ చెప్పిన "Poetry is the spontaneous overflow of powerful feelings" 'శక్తిమంతములైన భావాలు వాటంతటవే పెల్లుబికివచ్చుట' అనే నిర్వచనం వచన కవిత్వానికి బాగా నప్పుతుంది. ఇంతటి వస్తువైవిధ్యం, వస్తు వైశిష్ట్యం ప్రాచీన కవిత్వంలో చూడము. అందుకే ఈ 'వస్తుకవిత'కి వచన కవితారూపం సముచితమైన వాహిక అయింది. కవికి స్వేచ్ఛ లభించింది. కవితలో సారళ్యం. సూటిగా హృదయానికి తాకే విధంగా శబ్దాల కూర్పు, తెలుగు నుడికారపు సొంపులను, రసపోషణాలను తగినంతగా వినియోగించుకోవడం, సంభాషణ స్థాయికి దగ్గరగా రావటమే 'వచన కవిత'గా పేర్కొంటారు. పద్య ప్రక్రియకు వ్యతిరేకంగా వచన కవితా రూపం వెలువడిందని, ఆధునిక సమాజానికి, ఆధునిక భావధోరణికి వచనాకవితా రూపమే మిన్న అంటారు. అందుకే వచన కవితను ప్రజాస్వామ్యకవితగా పేర్కొంటారు.

ఆధునిక కవిత్వంలో వచన కవితలదే అగ్రస్థానం. ఒక శీర్షికను కలిగి పది పదిహేను పంక్తుల నుండి ఇరవై ముప్పై పంక్తులు లేదా రెండు మూడు పుటలకు విస్తరించిన వచన కవితల్ని 'వచన కవితలు' అని వ్యవహరిస్తారు. ఇందులో పాదాలు పొట్టి, పొడుగు పాదాలుగా ఉండవచ్చు. దీన్ని కవితా ఖండిక అని కూడా వ్యవహరిస్తారు. ఇలాంటి వచన కవితల్ని ఒక కవి తాను వ్రాసిన వాటిని ఒక పుస్తకంగా ప్రచురిస్తే దాన్ని వచన కవితా సంపుటి అని అంటారు. ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది వ్రాసినవి ఒకటిగా చేరిస్తే దాన్ని వచన కవితా సంకలనం అని పేర్కొంటారు.

వచన కవిత్వానికి వచన గేయం, వచన పద్యం, స్వేచ్ఛాకవిత్వం అనే పేర్లు కూడా ఉన్నాయి. శిష్ట్లా ఉమామహేశ్వరరావును వచన కవిత్వానికి ఆద్యుడిగా పేర్కొంటారు. కుందుర్తి వచన కవితను ఉద్యమంగా భావించాడు, శ్రీశ్రీ రచించిన 'మహాప్రస్థానం', 'కవితా ఓ కవితా'లోని పంక్తులు వచన కవితా వైభవానికి కేతనమెత్తిన పలుకులు.

ఆరుద్ర టెక్నిక్‌లేని కవిత్వాన్ని ఊహించలేనంటూ వచన కవిత్వంలో కొత్త ప్రయోగాలు చేశారు. త్వమేవాహంలో గాఢమైన ప్రతీకవాదాన్ని ప్రవేశపెట్టారు'. 'అగ్నిధార, రుద్రవీణలతో సంప్రదాయ మార్గాన సాగిన దాశరథి'

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


మస్తిష్కంలో లేబరేటరీ' వంటి మంచి వచన కవిత రచించారు. సోమసుందర్-వజ్రాయుధం, ఆలూరిబైరాగి - నూతిలో గొంతుకలు, వేగుంట మోహన ప్రసాద్ చితి-చింత. వీటితో పాటు నయగరా, తెలంగాణా, కుందుర్తి-స్వప్నలిపి, అజంతా-తిమిరంతో సమరం - దాశరథి, కె.శివారెడ్డి-మోహనా, ఓ మోహనా, అమృతం కురిసిన రాత్రి-దేవరకొండ బాలగంగాధర తిలక్ మొదలైనవి ముఖ్యమైన కవితా సంపుటాలు. వచన కవిత్వంలో అజంతా, శివారెడ్డి, ఎన్.గోపి కేంద్రసాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నారు. ఆధునికాంధ్ర కవిత్వంలో ఉద్యమాలుగా, వాదాలుగా వెలువడిన కవిత్వాలన్నీ, మినహాయిస్తే వచన కవిత్వంలోనే వెలువడ్డాయి. నన్నయ నుండి చిన్నయ వరకు గల సాహిత్యంలో ప్రాచీనాంధ్ర కవులు వృత్తగంధి గద్యరచన ఏ రకంగా చేశారో చాలా మంది ఇంతకుముందే నిరూపించి వున్నారు. లాక్షణిక పద్ధతినిబట్టి చూడగా 'ఉదాహరణకావ్యాల'లోని 'కళికోత్కళిక'లనే మాత్రాచ్ఛందస్సులూ, పాల్కురికి సోమనాథాదులు రచించిన 'గద్యము'లూ, రగడలుగా, వాటి భిన్నరూపాలు గానయోగ్యాలుగా వున్నప్పటికీ పద్యాలుగా పరిగణింపబడలేదని తెలుస్తున్నది. ఈ విధమైన రచనకు 'ఉత్కలికాప్రాయగద్య' అని పేరు. ఇట్లు గద్యభేదాలుగా చెప్పబడిన నాల్గింటిలో రెండు గానయోగ్యతలో పద్య కవితకు, లేక పదకవితకు సన్నిహితంగానే వున్నాయి. అయితే, గద్యరచన శబ్దాలను మనం పర్యాయ పదాలుగానే వుపయోగిస్తున్నాము. నేటి వచన పద్యాలలో కొన్ని సంగీత సంబంధం కలిగివున్నవని చెప్పటం విరుద్ధం కాబోదు.

'వచన వాగనుశాసను'డని చెప్పబడిన కృష్ణమాచార్యుని (క్రీ.శ.14వ శతాబ్దినాటి వాడు) 'వచనముల'కు, తరువాతి లాక్షణికులు 'విన్నపాలు' అని పేరు బెట్టారు. 'అల్ప సమాసకము' అని లాక్షణికులు నిర్వచించిన 'చూర్ణిక' అన్న గద్యభేదాన్ని 'సంకీర్తనాచార్యు'డైన అన్నమాచార్యుడు 'తాళగంధిచూర్ణక'మని వ్యవహరించాడు. అంటే గద్య భేదాలలో మూడవదైన చూర్ణిక కూడా తాళబద్ధమై గానయోగ్యమైనదే అని గుర్తించాలి. తాళ్ళపాక పెదతిరుమలయ్య రచించిన 'వేంకటేశ్వర వచనములు' 166 దాకా లభించాయి. 'వైరాగ్య వచన మాలికా గీతము'లను పేర 30 రాగాలలో పాడదగివున్నవని ప్రకటన కర్తలు విశదీకరించారు! వచనంలో 'శ్రావ్యత' లేదనేవారికీ ఉల్లేఖనం సమాధానప్రాయం కాగలదు. వీటినే 'వచన శతకాల'ని కూడా వ్యవహరించవచ్చు. ఛందస్సుతో నిమిత్తం లేక, పరిమితి ఇదమిత్థమని నిర్ణయింపబడక, రచింపబడిన ఆ వచనాలలో ఛందస్స్వేచ్ఛలేదని చెప్పలేము. కాగా 'ముక్తకము' అన్న గద్యభేద మొక్కటే గానయోగ్యం కానిదిగా వున్నది. ఈ విధంగా ప్రాచీన గద్య రచనలలో కవి ఛందస్స్వాతంత్ర్యం కోసం ప్రయత్నపడినట్లు తెలియ వస్తున్నది. కాని ఇట్టి రచనలను ప్రాచీన లాక్షణికులు 'గౌరవించి'నట్లు కనిపించదు. కవులలో నైనా చాలమందికి నూతనత్వం అన్వేషించాలన్న అభిప్రాయం లేశమైనా లేనట్లు గోచరిస్తూనే వున్నది. ఈ తీరు వల్ల వచన పద్యాలు ప్రాచీన సాహిత్యంలో ప్రతిష్ఠాకరమైన స్థానాన్ని సంపాదించుకోలేదు.

కారణం ఏమిటన్నదే ముఖ్యమయిన ప్రశ్న. అది యుగ ధర్మమో గద్య రచయితల అప్రయోజకత్వమో, కవితాశిల్పం వాటిలో కొరవడిందో, పద్యకవిత బల ప్రయోగం చేసిందో ఈనాడు చెప్పటం సులభసాధ్యం కాదు. సంస్కృత ప్రియులైన ప్రాచీనకవులు సంస్కృతంలో వలె, తెలుగులో కూడా వచన రచనలను ఆదరించలేదని నప్పటికీ కాదంబరి వంటి ఉద్గ్రంథాలకు ప్రతికల్పమైన రచనలు తెలుగులో రానేలేదు. ఆంధ్ర కవుల మనస్తత్వం దశకుమార చరిత్ర వంటి వచన గ్రంథాలను పద్య ప్రబంధాలుగా ఆంధ్రీకరించే వరకూ సంతృప్తిపడనే లేదు, విశ్రమించనూ లేదు. నాటకాలను ప్రబంధీకరించిన కళావేత్తలకు గద్య రచనల నామోదించటం కష్టంగానే వుంటుంది! సోమనాథాదులు విప్లవకారులుగానే భావింపబడ్డారు. మత విప్లవానికి సహాయకరంగా సాహితీ విప్లవాన్ని సాగింపదలచిన సోమనాథాదుల 'వాక్పారుష్యం'

చాలా వరకు వారి పతనానికి కారణమైనదేమో అని నేను అనుమానిస్తున్నాను. అయినా ద్విపద వాఙ్మయాది దేశీప్రక్రియలు నశించలేదు. గద్య ప్రక్రియలు మాత్రం కాలగర్భంలో కలిసిపోయినవి. కొందరు విద్వాంసులు రంగనాథ రామాయణంలోని రచనా సౌలభ్యం వీరశైవుల 'జానుతెనుగు' వాదాన్ని పడగొట్టగలిగిందనీ సోమ నాథాదులు చెప్పినంత సులభ భాషలో రచించలేక పోవటమే గాక, రంగనాథ రామాయణం 'బొమ్మలాట రామాయణం' కాగలిగినంత ప్రజాకర్షకం కావటం కూడా వీరశైవుల వాదాన్ని దుర్బలపరచగలిగిందనీ - అభిప్రాయ పడుతున్నారు. ఇది కొంతవరకు నిజమే. దేశంలో జీర్ణించిపోయిన మతాభినివేశం, అసహిష్ణుకత, మూఢ విశ్వాసం అన్నవి కూడా ఈ సందర్భంలో ప్రధాన పాత్ర వహించాయనటం అసమంజసంకాబోదు. మరి గద్య సాహిత్యం గంగలో కలియడానికి హేతువేమిటి? గద్య రచనలు కేవలం స్తోత్రపాఠాలు కావటమేనని నేను శంకిస్తున్నాను. చరిత్ర పునరావృతం కారాదంటే, ఈ గుణ పాఠాలను గ్రహించక తప్పదు. దూషణ ప్రధానంగానో, స్తుతి ప్రధానంగానో రచించినందున గ్రంథ జీవితకాలం తగ్గిపోతుందని మనం గ్రహించవలసి వున్నది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆధునిక తెలుగు కవిత్వం స్వరూప స్వభావాలు-డా॥జె.బాపురెడ్డి తెలుగు అకాడమీ, 2012.
2. ఆధునిక తెలుగు కవిత్వం స్వరూప స్వభావాలు, నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ-2012.
3. తెలుగు భారతి రజతోత్సవ సంచిక 1985-2010 పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
4. తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 2003.
5. ద్వానాశాస్త్రి, 1. తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2004.
6. నాగయ్య, జి., తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటి 1,2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.1996
7. ప్రా॥ వెలమల సిమ్మన్న తెలుగు సాహిత్య చరిత్ర, తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు దళిత సాహిత్యపీఠం, విశాఖపట్నం.
8. రాచమల్లు రామచంద్రారెడ్డి, సారస్వత వివేచన, విశాలాంధ్ర పబ్లిసింగ్ హౌస్, హైదరాబాదు, 1989.
10. సాహితీ వ్యాసాలు, బూదరాజు రాధాకృష్ణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆంధ్రప్రతిష్ఠ కావ్యంలో జాతీయతాంశాలు

- పసుపులేటి నాగమల్లిక, శాఖాధిపతి, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం.

## పరిచయం :

సర్వసాధారణంగా ప్రజలు తమ అస్తిత్వాలకు తీవ్రంగా భంగం కలుగుతుందని భావించినప్పుడల్లా ఐక్యతా భావాలు వెల్లివిరిసి ఉద్యమరూపంలో కనిపిస్తుంటాయి. ఇలాంటి స్థితే 19వ శతాబ్దంలో భారతదేశంలో సంభవించింది. నాటి బ్రిటిష్‌వారి పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం ఊపిరిపోసుకుంది. ఆ ఉద్యమం వెనక ఉన్న భావమే జాతీయతా భావం. ఇందులో తమంతా ఒకే జాతికి చెందిన వారమని, ఒకే ప్రాంతానికి చెందిన వారమనే తత్త్వం ధ్వనిస్తుంది. భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతదేశంలో ప్రజలంతా కలిసి జీవించేవారని చరిత్ర చెబుతుంది.

బిటిష్‌వారు వ్యాపారంకోసం వచ్చి క్రమేపీ రాజకీయంగా పాలనాధికారాన్ని చేజిక్కించుకోవడంతో వాళ్ళకు వ్యతిరేకంగా భారతీయుల్లో జాతీయతా భావ స్ఫూర్తి కలిగింది. అది వారి విద్యావిధానాల వల్ల మరింత విస్తరించి అనేక సాహిత్య ప్రక్రియల్లో వెదజల్లింది. ఆ విధంగానే తెలుగు సాహిత్యంలోనూ జాతీయోద్యమ ప్రభావం విభిన్న ప్రక్రియల్లో వెలువడింది. అందులో ముఖ్యంగా కావ్యాల్లో, చారిత్రక కావ్యాల ద్వారా గత జాతి చారిత్రక వైభవాన్ని వర్ణిస్తూ, నాటి జాతీయోద్యమ స్ఫూర్తిని ప్రజల్లో రగులుకొల్పేలా కవులు తమ కలాల్ని ఝుళిపించారు.

అందులో భాగంగానే ద్వివేది సత్యకవిగారు ఆంధ్ర ప్రతిష్ఠ కావ్యాన్ని రాసి ఆంధ్రుల వైభవాన్ని, కీర్తిప్రతిష్ఠల్ని తెలుపుతూ, నాటి జాతీయోద్యమానికి ప్రజల్లో సంసిద్ధతను కలిగించారు. ఈ కావ్యం ద్వారా పరాయి పాలన నుండి పోరాడేతత్వాన్ని ప్రబోధించారు. ఆంధ్ర ప్రతిష్ఠ కావ్యంలో అడుగడుగునా దేశీయాభిమానం, జాతీయతా ప్రభావం కనిపిస్తుంది.

## ఆంధ్రప్రతిష్ఠ - జాతీయత :

నాటి జాతీయోద్యమ కాలంలో జాతీయతను, దేశ భక్తిని రంగరించిన అమూల్యమైన చరిత్రాత్మక కావ్యంగా ఆంధ్రప్రతిష్ఠను కవి మలిచారు. ఇందులో కవిగారి ఆత్మీయతాంశాలైన దేశభక్తి, జాతీయతా భావాలు నాటి కాలంలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. కాబట్టి కవిగారి ఆత్మీయత పరోక్షంగా ఈ కావ్యంలో కనిపిస్తుంది. ఈ గ్రంథం వస్తునవ్యత్వం, భావుకత, జాతీయత, దేశభక్తి, ఆంధ్రత్వం అంశాలను కలిగి పాఠకుల్ని నాటి స్వరాజ్య ఉద్యమం వైపు అడుగులు వేసేలా తట్టిలేపును.

ఈ గ్రంథం చదివేకొద్దీ జాతి గతచారిత్రక వైభవం నిగూఢంగా అనేక పొరల్లో దాగి ఉంటుంది. సమకాలం నాటి జాతీయోద్యమ భావాన్ని, గత కాలంనాటి ఆంధ్రుల వైభవాలతో కీర్తించడం అనేక కోణాల్లో కనిపిస్తుంది. కవిలోని జాతీయత, ఆంధ్రాభిమానం వీటి ద్వారా అతిశయిస్తాయి.

మన పూర్వీకుల చరిత్రను, కీర్తిప్రతిష్ఠల్ని వివరిస్తూ ప్రస్తుత ఉద్యమం వైపు ప్రజల్ని ఉద్యమింపచేసే విధంగా ఆంధ్రప్రతిష్ఠ నిలుస్తుంది. ఈ కావ్యంలో యావత్ దక్షిణ భారత దేశాన్ని పరాయి పాలన నుండి రక్షించి, మన సంస్కృతి సంప్రదాయాల్ని, మతాన్ని కాపాడిన విజయ నగరాంధ్రుల చరిత్రను వివరించారు. అందుచేతనే ఈ ఇతివృత్తానికి తగ్గట్టుగా పేరులోకూడా మన జాతీయతను చాటుతూ ఆంధ్రుల యొక్క ప్రతిష్ఠను తెలిపే కావ్యంగా "ఆంధ్రప్రతిష్ఠ" అని నామకరణం చేశారు. అంటే ఈ కావ్యం నామపరంగా, ఇతివృత్తపరంగా కూడా మన జాతీయతా భావాన్ని తెలుపుతుంది.

ఈ కావ్యం ప్రారంభంలో మనదేశం పరాయి పాలనలో ఉండి ఎన్నో కష్టనష్టాలను అనుభవిస్తూ, హైందవ సంస్కృతీ సాంప్రదాయాలకు తీవ్ర నష్టం

వాటిల్లగా, విద్యారణ్యుని ప్రోద్బలంతో హరిహరరాయలు దాస్యవిముక్తికై పోరాడి, విజయనగర సామ్రాజ్యాన్ని స్వతంత్రంగా స్థాపించి రక్షించాడు. సరిగ్గా సత్యకవిగారి కాలంనాటి స్థితి కూడా ఇలాగే ఉంటుంది. అప్పటికి భారతదేశానికి స్వరాజ్యం సిద్ధించలేదు.

కాకతీయుల కాలంలో వెలిగిన తెలుగు ప్రభలు ముస్లిం దాడుల వలన క్షీణించగా, తిరిగి వాటిని వెలిగించిన వారు హరిహర, బుక్కరాయలు. వీరి ద్వారా విద్యారణ్య స్వామితో ఇలా పలికించారు.

శా॥ "ఆంధ్రం, బాంధ్రతయున్ సమస్తమును పాడైపోయె నాకాక తీ
యాంధ్రశ్రీ నశియించుటన్; ఋషివరేణ్యా! నేటి మీయాజ్ఞలో
ఆంధ్రత్వమ్ము పరిమళించెడిష దదీయారంభమున్, నేడె స
ర్వాంధ్రుల్ మెచ్చుషిగషిజేయుషిగావలయు విద్యారణ్య! క్షేమాప్తికిన్."

ఈ పద్యం ద్వారా కవిగారు తిరిగి ఆంధ్రజాతి, రాజ్యాన్ని ఆంధ్రులంతా మెచ్చేరీతిగా నిలుపుతామని స్వామితో హరిహరరాయల ద్వారా చెప్పించారు.ఒకనాడు అఖండంగా వెలిగిన ఆంధ్రజాతికెట్టి దుస్థితి కలిగిందో నేడు అని ఋషి అంటూ, తిరిగి తెలుగుజాతి పతాకాన్ని ఎగరవేయాలని ప్రోత్సహిస్తాడు.

ఈ సందర్భంలో కవి ఆ స్వామిచేత ఇలా పలికించారు.

సీ॥ "తమ యశశ్చంద్రికాతపవియద్వీధుల
ఆంధ్రులు క్రీడించినట్టి దశలు
ఆత్మదోర్బలమున కరులు భీతింగుందషి
దెన్నగ్వారవని దిద్దిన దినాలు
స్వప్రభావంపు సౌభాగ్య వీచికలలో
మనకత్తులెగసియాడిన యుగాలు
స్వీయ విక్రమము ప్రాచీప్రతీచులనిండి
యెనయషిగాషి బూర్వులేలిన శకాలు
గీ॥ హృదయదృక్కుల, నాదృతి గదియషిబట్టి
ప్రకృతదివసాలతో జతపరచిచూచి
తెలుగుజెండా ప్రభలు, వియద్వీధినెగయషి
దిరిగిప్రయత్నింపవోయి! పృథ్వీతలేంద్ర!"

ఈ పద్యంలో మన పూర్వీకుల వీరత్వాన్ని, గొప్పతనాన్ని, తెలుగు జెండా ఖ్యాతిని వివరిస్తూ, భారత ప్రజలకు దిక్కుచూపి తిరిగి ఆంధ్ర ప్రభుత్వాన్ని నిలబెట్టమని ప్రోత్సహిస్తాడు. ఇదే సందర్భంలో నాటి దేశదుస్థితిని కవి తెలిపారు. ఢిల్లీని ఏలే తుగ్లక్ ఉత్తరభారతాన్ని ఏలుతూ దక్షిణ భారతంపై పట్టు సాధించే రోజులవి.దేశం దాస్యవిముక్తిలో ఉంటే మునులైనా ఎదురొడ్డి ఆలోచిస్తారని, వారు మాత్రం ఒక మూలన ఎలా ఉండగలరని, అన్నీ త్యజించిన వారిలోనే అంతటి దేశభక్తి, పోరాట పటిమ, స్వరాజ్య కాంక్ష ఉంటే ఇక సామాన్యులకు ఎంత ఉండాలనే ఆలోచనల్ని ఈ ఘట్టంలో అంతర్లీనంగా దర్శనమిచ్చి, సమస్త ప్రజల్ని స్వరాజ్యం వైపుకు మళ్లించే ప్రబోధం కనిపిస్తుంది.

రాచ దుర్గాన్ని, ఆంధ్ర పతాకాన్ని వర్ణించే సందర్భంలో కవి తెలుగు జాతిని పొగుడుతూ, ఆంధ్ర పతాకానికి దేశదేశాలు తలవంచి తీరుతాయని గొప్పగా తన దేశభక్తిని తెలిపారు. జాతీయోద్యమ కాలం నాటి జాతీయజెండా ప్రభావం పరోక్షంగా కనిపిస్తుంది.

గీ॥ "ఆంధ్రజాతీయమౌ, వైజయంతి యది, తె
లుంగు స్వాతంత్ర్యశోభ, చెలంగునచట
దేశదేశాలు, తలవంచి తిరుగునెపుడుషి
దత్సమక్షాన అది, తెన్గుషిదనము నాడు."

మన ప్రాంతాన్ని శత్రువులనుండి రక్షించడానికి యుద్ధానికి సైతం వెనుకాడరాదు అనే తత్వం కనిపిస్తుంది. ఆంధ్ర ఉద్యమంలోకి నైజాంకు వ్యతిరేకంగాను, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగాను ఆంధ్రులను ఉద్యమంలోకి రమ్మని మేల్కొల్పుతూ పిలుస్తున్నట్లు ఉంది. ఇలాంటిదే రాయచూరు ముట్టడి సందర్భంలో రాయలచేత ఈ గేయాన్ని పాడించారు కవి. ఈ గేయంలో ఆంధ్రుల వీరత్వాన్ని, పౌరుషాన్ని, దేశభక్తిని తెలుపుతారు.

**గేయం :**

"ఆంధ్ర ఖడ్గధారలో
మహాంధ్ర పౌరుషమ్ము మెరయ
విక్రమించి రాయచూరి
విపుల యుద్ధరంగమందు
అరులబీల్చి పిప్పిచేసి
అలరి విజయలక్ష్మి జెంది
ఆంధ్రదేశ కీర్తి నిలుపరా!
సహోదరా! నడువరా!
కటకపురిని గాల్చి
ఓఢ్రకాంతువశుని జేయునప్డు
కొండవీటి రిపుల దునిమి
కొరలి విజయమందు వేళ
దాక్షిణాత్యపతుల వెంటఃషి
దరిమి తరిమి గెలుచునాడు
కదనభూమి బెగ్గడిల్లి
కంపమొంద జూపినట్టి
ఆత్మ దేశభక్తిఃజూపరా!
సహోదరా! నడువరా!"(1)

ఈ గేయం రాజుచేత సహోదరా! నడవరా! అంటూ ఆంధ్రుల యుద్ధ నిరతిని, పౌరుషాన్ని, వీరత్వాన్ని చాటి చెప్తూ ప్రజల్ని మేల్కొలుపుతూ పాడే గేయంగా నిలుస్తుంది.

సోదరభావంతో అన్నదమ్ములవలె కలిసికట్టుగా, దేశ భక్తితో శత్రువుని జయించి స్వదేశ కీర్తిపతాకాన్ని ఎగుర వేయాలని కవి భావించారు. ఈ గేయంలోనూ పరోక్షంగా నాటి జాతీయోద్యమ ప్రభావం కనిపిస్తుంది.

**ముగింపు :**

నాటి జాతీయోద్యమ కాలంలో చాలామంది కవులు తమ కలాన్ని ఉద్యమస్ఫూర్తితో నడిపించారు. గతకాలపు చారిత్రక వైభవాన్ని వివరిస్తూ, నాటి ఉద్యమంలోకి ప్రజల్ని చేరేలా ప్రోత్సహించారు. ఆంధ్రజాతి గొప్పతనాన్ని, వీర త్వాన్ని, శౌర్య పరాక్రమాల్ని, స్వజాతి అభిమానాన్ని వివ రిస్తూ కావ్యాలు రాశారు. అయితే నాటి కాలంలో అతి కొద్దిగా వచ్చిన చరిత్రాత్మక కావ్యాల్లో ఆంధ్రప్రతిష్ఠ ఒకటిగా నిలుస్తుంది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. చంద్రశేఖర్, డా॥ ఎస్. జి. బి. - ఆధునికాంధ్ర కవిత్వంలో ఆత్మాశ్రయత్వం
2. వీరభద్రయ్య, డా॥ ముదిగొండ - తెలుగు కవిత సాంఘిక సిద్ధాంతాలు
3. సత్యకవి, ద్వివేది - ఆంధ్రప్రతిష్ఠ
4. హనుమంతరావు, డా॥ బి.ఎస్.ఎల్. - సమాజం - చరిత్ర

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# దేవాంగుల వరప్రదాయని - చౌడేశ్వరీ దేవి

- డా॥ గోపవరం పద్మప్రియ, శాఖాధిపతి, తెలుగు విభాగం, డి.కె.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నెల్లూరు.

"ఆర్యావర్త : పుణ్యభూమిర్మధ్యం విన్ధహిమగయో: నీ వృజ్జన పదౌ దేశ విషయౌ తూపవర్తనమ్" అని అమరం. జనపద సంబంధమైనది జానపదం. జానపదమంటే పల్లెటూరు. పల్లె, దేశం, రాజ్యం, చోటు అనేవి నైఘంటి కార్థాలు. జానపదాల్లో ఉండేవారు జానపదులు. కొన్ని సమాన లక్షణాలు గల జన సముదాయమూ జానపదమే. ఆధునిక జానపద విజ్ఞాన శాస్త్రవేత్తలు జానపదానికి నూతన దృక్పథాన్ని ప్రతిపాదించారు. నివాస స్థలాలు అప్రధానమై సంస్కృతి ప్రధాన భూమిక వహించింది. ప్రపంచమంతా 'సంస్కృతి' మూలాంశంగా జానపద విజ్ఞానం బయలుదేరింది. సాహిత్యం, సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, కళలు, చేతివృత్తులు మొదలయినవి ఇందులో భాగమయ్యాయి.

ఈ విశాలమయిన జానపద వివజ్ఞానంలో చేనేతవృత్తికి ప్రాచీనమైన, ప్రధానమైన భాగస్వామ్యం కలదు. భారత దేశంలో వ్యవసాయం తరువాత అతిపెద్ద వృత్తి చేనేత. దీని ఔన్నత్యాన్ని తెలిపే సామెతలూ జనవ్యవహారంలో కలవు.

"కదురు, కవ్వంబులు గలయాడునింట కరువు కాట
కములు కలికాన లేవు"
"అందచందములేని ఆడకూతురుకు అందమేరు
పరచు ఆ పత్తిచెట్టు"

ఇలా చేనేత ప్రాధాన్యత విస్తారమైనది. దీనిని ఆశ్ర యించి దాదాపు 29 తెగలవాళ్ళు జీవిస్తున్నారు వారిలో ప్రముఖమైన కులం దేవాంగ పద్మశాలి.

దేవాంగ పురాణంలో చేనేతకుల ఆవిర్భావం, వారు కొలిచే చౌడేశ్వరి దేవి మహాత్మ్యము వర్ణించబడింది. ఈ సృష్టి ఏర్పడిన ప్రారంభ దినాల్లో దేవతలు, మానవాది సమస్తదేవతలు తమ మానములకు ఎలాంటి ఆచ్ఛాదన లేకపోవుటచే సిగ్గుచెంది ఆకులు, చెట్టుబెరడులు, జంతు చర్మాలతో కప్పుకొనుచుండిరి. వీటితో విసుగు చెందిన వారు బ్రహ్మదగ్గరకు వెళ్లి తమ దీనావస్థను విన్నవించు కున్నారు. తమ మానములను కాపాడుకొనుటకు వస్త్రకారుని సృష్టించమని బ్రహ్మదేవుడిని వేడుకున్నారు. అప్పుడు బ్రహ్మదేవుడు వీరితో కైలాసానికి వెళ్ళి ఓ సదా శివా! నీ ఆజ్ఞ ప్రకారము నాకు ఇచ్చిన శక్తి సామర్థ్యముల మేర జగత్సృష్టిని గావించాను. కాని వస్త్రము సృష్టిచేయు శక్తి సామర్థ్యాలు తమరు నాకు ఇవ్వలేదు. పూర్వ కల్పమందు వస్త్ర నిర్మాత నీయందు సాయుజ్యమై వున్నాడు, అతడిని తిరిగి సృష్టించమని ప్రార్థించగా, అప్పుడు సదాశివుడు కొద్దిసేపు ధ్యాననిమగ్నుడైనాడు. అప్పుడు ఆ సదాశివుని సద్యోజాత ముఖమునందలి ఫాల నేత్రము నుండి ఒక దివ్యతేజస్సు వెలుపలికి వచ్చి ఒక పురుషాకారముగా ఆవిర్భవించింది. ఆ దేవతల సమక్షంలో వారికి 'దేవల' అని నామకరణం చేశాడు. అనగా దేవతలచే లాలింపబడినవడా! అని ; దేవాంగ: అంటే దేవతల యొక్క అంగవస్త్రములు చేసినవాడు అగుట వలన దేవాంగుడుగా, నా మానసపుత్రుడుగా ప్రసిద్ధి చెందుతాడు అని ఆశీర్వదించాడు.

## పరమేశ్వరుడు వస్త్రములు నిర్మించి అందరికి ప్రదానము చేయమని దేవల మను బ్రహ్మను ఆజ్ఞాపించుట :

శివుడు దేవల మునితో క్షీరసాగరమునకు వెళ్ళి అచ్చటవున్న శ్రీమన్నారాయణుడిని దర్శించి తంతువులను గ్రహించి శీఘ్రముగా ఆమోద పట్టణానికి వెళ్ళి ఆ పట్టణానికి పాలకుడిగా వుంటూ వస్త్రాలు నిర్మించి సకల దేవతలకు, సకల జాతుల వారికి వస్త్రములు ఇచ్చి పది దిక్కుల యందు నీ కీర్తిని వ్యాపింపచేయి. నీకు జన్మించిన నీ వంశమువారు ఉత్తములు, సంస్కారవంతులు, దైవ బ్రాహ్మణ భక్తిగలవారు, యుక్తాయుక్త విచక్షణ జ్ఞానము

కలవారుగా ప్రసిద్ధికెక్కుతారని దీవించాడు. దేవలుడు అదేవిధంగా ఆమోద పట్టణానికి బయలుదేరాడు.

**పంచరాక్షసులు దేవలుడిని మోసగించి చంప బూనుట :**

తంతువులను తీసుకొని ఆమోద పట్టణానికి బయలు దేరగా ఈ విషయం తెలుసుకున్న కొందరు రాక్షసులు ఆ తంతువులను దొంగలించి వస్త్ర నిర్మాణం ఆపుటకు తంతువులను దొంగలించుటకు మాయా మునీశ్వరుడి వేషం ధరించి మాయా ఆశ్రమాన్ని సృష్టించి దేవలుడిని ఆకర్షించేటట్లు చేశారు. ఆ మాయా ఆశ్రమాన్ని చూసి ముగ్ధుడై లోపలికి ప్రవేశించాడు. అక్కడ కపటమంత్రాలు జపిస్తున్న ఒక వృద్ధ మునీశ్వరుడు కనిపించాడు. దేవలుడి పట్ల వినయ విధేయతలు చూపిస్తూ అతిథిగా ఆనాటి రాత్రి అక్కడే బస చేయమని వేడుకున్నారు. వారి మాటలు నమ్మి అక్కడే నిద్రించాడు. హఠాత్తుగా అర్థరాత్రి వారి వేషాలు తొలగించి వజ్రముష్టి, ధూమవ్యక్తులు, ధూమ్రా స్యుడు, చిత్రసేనుడు, పంచసేనుడు అను వీరు తమ నిజరూపాలలో దేవలుడిని చంపడానికి ప్రయత్నిస్తారు. దేవలుడు విష్ణువు నుండి పొందిన సుదర్శన చక్రాన్ని ప్రయోగిస్తాడు. అది ఆ అయిదుగురిని తప్ప మిగతా వారిని చంపుతుంది. ఆ రాక్షసులలో పెనుగులాడి ఏమీ చేయలేక మహాదేవిని స్మరించాడు.

**మహాదేవి ఆవిర్భావము :**



అప్పుడు శివుని పత్ని అర్థనారీశ్వరి యగు దుర్గా దేవిని - జగజ్జనని, త్రిలోక మాతవు, దుర్గవు, చండివి, ... ఇలా స్తుతిస్తూ కాపాడమని ప్రార్థించాడు. ఆయన ప్రార్థనను మన్నించి నాయనా దేవలా! భయపడకుము ఒక ముహూర్తము (24 ని॥కాలం) లోపల నా బలము నీవు తెలుసుకోగలము నా శూలంచే వారిని సంహరిస్తాను, వారి రక్తం త్రాగుతాను అని అభయ మిచ్చింది. ఆషాడమాస అమావాస్య అర్థరాత్రి అంత్య సమయంలో ఆవిర్భ వించింది.

**మహాదేవి పంచ రాక్షసులలో యుద్ధం చేయుట:**

నాలుగు భుజములు కలిగి అతిపెద్దదైన నాలుకను చాచి కన్నులు అగ్నిగుండం వలె ఎరుపెక్కినవై మహాబలం గల ఆ మహాదేవి అట్టహాసం చేస్తూ శూలమును, చక్ర మును, కత్తిని, గదను చేతబట్టి భయంకరమైన ఆయుధాలు కల్గి, కాటుకవలె నల్లగా మెరిసిపోవుచు కోటి సూర్య వెలుగులు గల ఒక శక్తివంతమైన కిరీటాన్ని శిరస్సుపై ధరించి మిక్కిలి బలవంతురాలై శూలాన్ని త్రిప్పుచూ వారితో పోరుకు సిద్ధమైనది. రాక్షసులు ఆయుధాలు సమకూర్చుకున్నారు. కాని ఆ తల్లి హూంకారానికి రాక్షసులంతా మూర్ఛిల్లినారు. ఆమె శూలాన్ని గిరగిరా త్రిప్పుతూ గదా, ఖడ్గ, చక్రములనే నాలుగాయుధాలలో పెక్కుమంది రాక్షసులను చంపింది. తనచేతి శూలముతో పంచరాక్షసులను చంపింది.

ఆ పంచ రాక్షసుల రక్తం ఎరుపు, తెలుపు, నలుపు, పసుపు పచ్చరంగుల్లో ప్రవహించింది. వెంటనే దేవలుడు తన వద్దనున్న ఒక్కొక్క తంతువులను ఒక్కొక్క రంగు రక్తంలో తడిపి తన వద్దనున్న తంతువులు పంచ వర్ణాలయ్యేటట్లు చేసుకున్నాడు.

**పంచరాక్షసుల రక్తము ఐదురంగుల్లో ప్రవహించు టకు కారణం :**

ఒకానొకప్పుడు 5గురు రాక్షసులు శుక్రాచార్యుని వద్దకు విద్యనిమిత్తమై వచ్చారు. వారు దేవయాని అందానికి ముగ్ధులై ఆమె వద్దకు వెళ్లి మా ఐదుగురి వివాహ మాడమని కోరారు. ఆమె మిక్కిలి వ్యధ చెంది గురుపుత్రి సోదరితో సమానం ఆడదంటే మీ దృష్టిలో అంతచులకనా? మీరు ఏదో ఒక సందర్భంలో ఆడదానిచేతిలో మరణి స్తారని శపించి అక్కడనుంచి వెళ్ళిపోయింది. వారు ఈ శాప నివృత్తి కొరకు బలపరాక్రమాల కొరకు శివునిపై తపస్సు

చేశారు. పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరు కోమనగా మా రక్తాన్ని ప్రజలు ధరించాలని పరమేశ్వరుడు కోరారు. తథాస్తు అని వరమిచ్చాడు. అందువల్లనే వారి రక్తాలు వివిధ రంగుల్లో ప్రవహించాయి. వాటిల్లో దేవ లుడు తంతువులు ముంచి ఆ దారాలతో నేసిన వస్త్రాలు ప్రజలు ధరిస్తున్నారు.





## మహాదేవికి చౌడేశ్వరి అనునామం ఏర్పడడం :

పంచరాక్షసులలో యుద్ధం చేయడానికి వచ్చిన ఆ మహాదేవి కిరీటం కోటిసూర్యుల ప్రకాశంతో వెదజల్లినది. ఆ కిరీట కాంతులకు వెలుగులకు రాక్షసరాజులు స్తంభించిపోయారు. అటువంటి శక్తివంతమైన చూడ మును ధరించుట వలన చూడేశ్వరి, చూడాంబా అని పిలువబడింది కాలక్రమంలో అది చౌడేశ్వరి అయింది. దేవలుడు అతని సంతతి వారైన దేవాంగ వంశీయులందరు తమ కులదేవతగా చౌడేశ్వరీదేవిని కొలుస్తూ వస్తున్నారు.

## చౌడేశ్వరీ పూజావిధానం :

చౌడేశ్వరీ దేవికి దేవాంగులు దసరా పండుగ దినాల్లో ఆమెను ఒక శక్తి స్వరూపిణిగా భావించి పూజిస్తారు. ఆ దేవతా ప్రతిమను చేసి రోజుకో అలంకారంతో అలంకరించి ప్రతిపూట నైవేద్యం సమర్పిస్తారు. దసరా రోజున కత్తి వేయడం కూడా ఈ కులములో ఆచారంగా కన్పిస్తుంది. పులివాహనం బొమ్మగీసి దానిపై అన్నపురాసి పోసి రక్త తర్పణ గావించి కత్తిపట్టుకొని ఆమెను దండకాలతో స్తుతిస్తారు. ఆ తరువాత కత్తివేసుకొని ఆ ప్రతిమను ఊరంతా ఊరేగిస్తారు. ప్రతినిత్యం ఆ పండుగదినాల్లో కత్తిపట్టుకొని, దండకంతో స్తుతిస్తూ నైవేద్యం సమర్పిస్తారు. దాన్నే 'తళియ' అంటారు. ఆ నైవేద్యాన్ని ప్రతి దేవాంగుల ఇంటికి పంచుతారు. ఇలా చౌడేశ్వరీ దేవి దేవాంగుకుల రక్షకురాలిగా, వరాలమూటగా ప్రసిద్ధికెక్కినది.



## ఉపయుక్త గ్రంథసూచి :

1. క్షేత్ర పర్యటన
2. దేవాంగ పురాణం - పింజల సోమశేఖర శర్మ
3. వస్త్ర నిర్మాత దేవాంగ - డా॥ దంతం వెంకట సుబ్బారావు, సంపాదకులు, అర్ధవార్షిక సంచిక - సెప్టెంబర్ 2015.
4. వివిధ దినపత్రికలు

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC Approved Journal No. 42500

# జానపద హాస్య గేయాలు - నేటి సమాజం

– డి. రమేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

**ఉపోద్ఘాతం :**

తరతరాలుగా, యుగయుగాలుగా ఎటువంటి గ్రంథస్థ మూలాలు లేకుండా కేవలం మౌఖిక ప్రసరణ ద్వారా, సంప్రదాయ రీతులలో ఒక తరం నుండి మరొక తరానికి వ్యాప్తి చెందుతూ, తమ ఉనికిని, తమ ఔన్నత్యాన్ని కాపాడుకుంటుంది జానపద సాహిత్యం. శిష్ట సాహిత్యంతో పోల్చుకుంటే జానపద సాహిత్యం భిన్నమైనది. ప్రపంచంలో ఏ భాషా సాహిత్యంలోనయినా, ఏ ప్రాంతంలోనైనా సరే ముందుగా ఆవిర్భవించేది జానపద సాహిత్యమే. దాని పునాదుల మీద శిష్ట సాహిత్యం మొలకెత్తుతుంది.

జానపదుడికి తనలోని భావాలకు ప్రేరణనిచ్చేది ప్రకృతి. ప్రకృతిలో అందమైన దృశ్యాలను, వస్తువులను చూసి, పులకరించిపోయి తనలో కలిగిన ఆ భావావేశాలను ఏదో ఒక కూనిరాగం ద్వారానో, పాట రూపంలోనో, కథ రూపంలోనో వ్యక్తం చేస్తుంటాడు. సంస్కృతీ, సాంప్రదాయాలకు ఆలవాలమైన మన రాష్ట్రంలో ఈ జానపద సాహిత్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంది. అలనాటి నుండి పెద్దవారికి తమ విరామ సమయాలలో ఇంట్లో పిల్లాజెల్లను దగ్గర కూర్చోబెట్టుకుని రసవత్తరంగా పాటలు పాడటం ద్వారానో, కథలు చెప్పడం ద్వారానో, కాలక్షేపంతోపాటుగా చిన్న పిల్లల్లో ఆలోచనా ధోరణిని పెంచే విధంగా సాగుతుంది. ఈనాటి కాలంలో ఈ విధానంలో కొంత మార్పు వచ్చినా అక్కడ కూడా జానపద కథలు, పాటలు వినవస్తూనే ఉన్నాయి. వాటిలో అందరినీ అలరించేవి జానపద పాటలే. ఆ పాటల్లో కూడా ఎన్నో రకాలున్నాయి. బాగా నవ్వు తెప్పించే హాస్యరస పాటలంటే అందరికీ మక్కువే.

**జానపద హాస్య గేయాలు :**

జానపదులలో వినోదం కోసం, ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించేందుకు బాగా నవ్వు కలిగించే పాటలు పాడుతుంటారు. మనిషి వ్యక్తీకరించే భావోద్వేగాల్లో నవ్వు ఒకటి. మనం మనస్ఫూర్తిగా హాయిగా నవ్వుకోవాలంటే, నవ్వుని కలిగించే ప్రేరణ జరగాలి. జానపదులు పాడే పాటలకు అలాంటి కొన్ని సందర్భాలను ప్రేరణగా స్వీకరించి, రసవత్తరంగా పాటను రూపొందించి, ఆలపిస్తారు. ఇది ఒకరే చేయవచ్చు లేదా ఇద్దరు ముగ్గురు కలిసి సన్నివేశానికి తగినట్లుగా, సంభాషణలాగా పాటను పాడుకోవచ్చు. అలాంటి ఎన్నో అద్భుతమైన జానపదుల హాస్య గేయాలలో కొన్నింటిని పరిశీలిద్దాం.

**పెళ్ళింటి వారిని గూర్చి పాట :**

పెళ్ళి జరుగుతున్న ఇల్లంటే ఊరందరికీ ఒక సందడిగా ఉంటుంది. ఇంటికొచ్చిన బంధువులతో, పిల్లల ఆటపాటలతో, వియ్యాల వారి ముచ్చటలతో, రకరకాల హడావిడి పనులతో సందడి చేస్తుంది. ఈ వేడుకలో ఇరుగు పొరుగు వారు కూడా సంతోషంగా పాలుపంచుకుంటారు. అయితే ఒక్కోసారి వివాహం జరిగే ఇళ్ళల్లో చిన్న చిన్న సమస్యల వల్ల గొడవలు జరుగుతుంటాయి. అవి ఇరుగు పొరుగు వారికి కొంత వింతగా తోస్తుంది. దానికి తోడు మరి కొందరు పక్కింట్లో వాళ్ళు గొడవాడుకుంటున్నారంటే ఎక్కడా లేని ఉత్సాహం వచ్చేస్తుంది. దానికి సంబంధించిన సకల వివరాలు ఆరా తీస్తారు. నలుగురికి పంచుతారు. అలాంటి వ్యక్తుల మధ్య పాట ఇది.

"ఏమి వింతమ్మ - మరేమి సంతమ్మ
ఈ జిత్తుల మారి విప్పర్లోళ్ళ వారి ఇంటిలోన
కొత్త యుద్ధం జరిగిందంట ॥ ఏమి ॥

మాకు బేండు మేళం కావాలని
పిలిచి పిలిచి అడుగుతుంటే
బ్యాండు మేళానికి డబ్బులు లేక
వాళ్ళ అన్నదమ్ములు లేచిరంట ॥ ఏమి ॥

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

డ్యాన్సు పిల్లలు కావాలని
పిలిచి పిలిచి అడుగుతుంటే
డ్యాన్సు పిల్లకి డబ్బులు చాలక
వాళ్ళ అప్పుల చెళ్ళెలు లేచిరంట ॥ ఏమి ॥

ఈ పాటలో విప్పర్ల వారి ఇంటి పేరును వాడిన సంద ర్భాన్ని బట్టి ఆయా పెళ్ళివారి ఇంటి పేరును వాడవచ్చు. పెళ్ళంటే సరదాలు, సంతోషాలతో కూడుకున్నది. కొందరు ఈ విషయంలో తాహతకు మించిపోయి అప్పులు చేసి మరీ ఆడంబరాలు చేయిస్తున్నారు. అలాం టివే బ్యాండు మేళం, డ్యాన్సు పిల్లలు. అలాంటి వాటిని ఏర్పాటు చేసి, తీరా డబ్బులు చాలక తంటాలు పడు తుంటే ఈ తంతు పొరిగింటి వారికి వింతగానూ, వినోదం గానూ తోస్తుంది.

## నేటి యువతీ యువకుల జీవన చిత్రణ :

కాలం మారుతున్న కొద్దీ మనుషుల ఆహార, వ్యవహా రాలు, వస్త్రధారణ, భాషోచ్ఛారణ వంటి వాటిలో విపరీత మైన మార్పులు వస్తున్నాయి. ఆ క్రమంలో నాగరికత ప్రభావం వల్లనో, ప్రపంచీకరణ నేపథ్యం వల్లనో వస్త్రం అలంకరణ వంటి విషయాల్లో విపరీతంగా మార్పులు, వేగవంతంగా వచ్చేస్తున్నాయి. అలాంటి స్థితిలో నేటి యువతీ యువకులు ఎలా ఉన్నారన్నదే ఈ పాటలో హాస్య రసాత్మకంగా, వ్యగ్యంగా వాడిన విధానం కని పిస్తుంది.

ప॥ మారిందయా యుగము మారిందయా
నాటికీ నేటికీ యుగమెంతో మారిందయా

చ॥ ఆనాటి ఆడోళ్ళు అందమును బట్టియు
బారెడు కురులను వేసింద్రయా
ఈ నాటి ఆడోళ్ళు ఈకెలీకలు పెంచి
తోకలకు లబ్బర్లు పెట్టింద్రయా ॥ మారిందయ ॥

చ॥ ఆనాటి మగవారు అంచు దోవతులు కట్టి
అందరిలో గౌరవము నిలిపింద్రయా
ఈనాటి మగవారు ఇరుగు లాగులు తొడిగి
ఇబ్బందిపడు కాల మొచ్చిందయా॥ మారిందయ ॥

చ॥ ఆనాటి కోడళ్ళు అత్తమామల జూచి
అభిమానముగనే తిరిగింద్రయా
ఈనాటి కోడళ్ళు ఇంట చిచ్చులు పెట్టి
ఇల్లు గుల్ల జేసి వెళ్ళారయా ॥ మారిందయ ॥

చ॥ ఆనాటి ఆడోళ్ళు పసుపు కుంకుమలతో
పతిపాదసేవలు చేసింద్రయా
ఈనాటి ఆడోళ్ళు మొగుడొక్క మాటంటే
కదనానికే కాలు దువ్వేరయా ॥ మారిందయ ॥

ఇలా మరిన్ని చరణాలతో సాగే ఈ పాట నాటికి, మనుషులలో, వారి వ్యవహారాలలో వస్తున్న మార్పులను వినోదభరితంగా, హాస్యరసాత్మకంగా పాడిన తీరు కని పిస్తుంది. నేటికీ ఇలాంటి ఎన్నో హాస్యభరితమైన పాటలు జానపద సాహిత్యంలో కోకొల్లలుగా కనిపిస్తాయి.

❀❀❀

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 భావవీణ
UGC Approved Journal No. 42500

# నిలువెత్తు సాధికారిత నీలవేణి

- డా॥ పి.ఎ.సత్యనారాయణ, లెక్చరర్, తెలుగు శాఖ, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

## నేపథ్యం :

కులం పునాదుల మీద ఒక జాతిని గాని, నీతిని గాని నిర్మించలేం అంటాడు నవ భారత రాజ్యాంగ నిర్మాత డా..బాబా సాహెబ్ అంబేద్కర్.

ఈ నేపథ్యంలో భూత, వర్తమాన కాలాల్లో జరిగిన, జరుగుతున్న పీడనను, దోపిడీని, మానవ హక్కుల దృక్కోణంలోంచి అర్థం చేసుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయి.

బలవంతులు బలహీనుల్ని దోపిడి చేయడం అనే మత్స్య న్యాయం, ప్రకృతి ధర్మంగా చలామణి అవుతున్నది. అంటే చిన్న చేపను పెద్ద చేప తిని మనుగడ సాగించడం దగ్గర నుంచి చిన్న రాజ్యాల్ని పెద్ద రాజ్యాలు కొల్లగొట్టడం దాకా దీన్ని మనం చూడవచ్చు.

అయితే పీడనను,దోపిడిని తప్పించుకుని మన గలగడం ఎలా. అన్నది ప్రశ్న తప్పించుకోవడం అంటే పారిపోవడమా. లేదా స్వేచ్ఛగా, స్వతంత్రంగా నిర్భయంగా బతకడమా. ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాదులు మనకు రాజ్యాంగం ద్వారా బహుకరించబడ్డాయి.

అయినా మనం వాటిని సరిగా పొందలేకపోతున్నాం. అంటే వాటి అమలులో లోపం ఉంది.ఈ లోపాన్ని ఎలా సరి చేయాలి. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరగకుండా ఉండటం ఎలా అనేది మనముందున్న అతి పెద్ద సవాలు.

న్యూటన్ మూడవ గమన నియమ సూత్రం ప్రకారం చర్యకు ప్రతి చర్య ప్రకృతి ధర్మం. అంటే మనం ఏం విత్తితే అదే కోస్తాం అన్న మాట.

వర్గ శత్రువును, అధిక్షేపించడం, భయపెట్టడం, శత్రువు మీద తిరుగుబాటును ప్రోత్సహించడం పీడుతులందరిని సమీకరించుకుని వర్గశత్రువును ఎదురించడమే దోపిడీ నిర్మూలనకు పరిష్కారమా.. అన్న దాన్ని పునస్సమీక్షించాలి.

శత్రువు మీద తిరుగుబాటు బావుటా ఎగరేస్తే శత్రువు కూడా తిరుగుబాటు ప్రారంభిస్తాడు.ఇది ఒక రకంగా శత్రువు తిరుగుబాటు చేయడానికి, తన బలాన్ని మరింత పెంచుకోవడానికి ఉపకరిస్తుందని చెప్పవచ్చు.

మరి ఎలా.. పీడితుల హక్కుల ఉల్లంఘున జరగకుండా ఉండటం ఎలా.. శత్రువుకు అనువైన వాతావరణంలో నేరుగా శత్రువును అధిక్షేపిస్తే లాభం ఉండదు సరి కదా నష్టం కూడా. ఎందుకంటే శత్రువు తనకనువైన వాతావరణంలో మరింత బలపడటం, ఆ బలాన్ని పీడితుల మీద ప్రయోగించడం చేస్తాడు.

శత్రువుని కాకుండా శత్రుత్వాన్ని మాత్రమే అధిక్షేపించడం, లేదా శత్రువుని, శత్రుత్వాన్ని కూడా ఉపేక్షించడం. రెండోది ఎక్కువ లాభాన్ని కలిగిస్తుంది.

శత్రువుకు అనుకూలమైన వాతావరణంలో శత్రువుతో తలపడటం ఓటమికి ఎదురెళ్ళడమే అవుతుంది కాబట్టి శత్రుత్వాన్ని మాత్రమే అధిక్షేపిస్తే ఏమవుతుంది వేర్పాటు ధోరణి రావణకాష్టంలా ఎన్నటికీ కొనసాగుతూనే ఉంటుంది.

శత్రువును, శత్రుత్వాన్ని ఉపేక్షించడం వల్ల ఏం ఒనగూడుతుంది. శత్రువును తలచుకోవడం, శత్రువును ఎదుర్కొనే వ్యూహరచనకు అవసరమయ్యే సమయం, శక్తి ఆదా కావడం, అంతే కాకుండా ఆ మిగులు సమయాన్ని ఉపయోగించుకుని చాప కింద నీరులా శత్రువు కంటే ఎక్కువ బలపడటం అనేది జరుగుతుంది.

ఆధునిక యుద్ధ నీతి ఏంటంటే శత్రువు కంటే అస్త్ర శస్త్రాలను సమకూర్చుకోవడం. అలా అయితేనే శత్రువు భయపడతాడు. ఫలితంగా శాంతి నెలకొంటుంది.ప్రస్తుతం మన శత్రువు భయపడటం ఎలాగంటే పీడితులు ఎదగడంలో తలమునకలవ్వాలి. ఎదిగే అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఎదగటానికి అనువైన ప్రభుత్వాలు రావడానికి కృషి చేయాలి.

ఎదగటానికి ప్రధాన భూమిక విద్య. విద్యావంతులు అయితే ఎదగడం ఎలాగో తెలుస్తుంది. విద్య ద్వారా ఆర్థికంగా ఎదగొచ్చు. ఆర్థికంగా ఎదిగితే చాలు సాంస్కృతికంగా, రాజకీయంగా కూడా ఎదగవచ్చు. అభివద్ధి ఒక్కటే తారకమంత్రం. బ్రహ్మాస్త్రం. వజ్రాయుధం.

కావలసిందల్లా ఎదగడం. ఎదగటానికి ప్రతికూల పరిస్థితులే ఎదురవుతాయి.అయినా వాటిని అహింసా మార్గంలో అధిగమించడం ముందున్న కర్తవ్యం.

## రచయిత దృక్కోణం :

అయితే దళితులు సమస్యలు గురించే రాయాలా. జీవితంలో తారసపడే ఆయా అనుభవాలను, అనుభూతుల్ని సాహిత్యీకరించకూడదా. పలానావే రాయాలి, పలానా విధంగానే రాయాలి అన్న గీటురాళ్ళు ఏమి లేకపోయినప్పటికీ చాలా వరకు దళిత, స్త్రీ వాద రచయితలు సమస్యలమీదనే దృష్టి సారిస్తున్నారు కాని ఆయా అనుభూతుల్ని ఆవిష్కరించడం అరదుగా కనిపిస్తుంది.

ఇక్కడ దళితులు వారి సమస్యల్నే కాదు, వారి ఆనందాన్నే కాదు. తమదైన ప్రాపంచిక దృక్పథంతో దేని గురించయినా రాయవచ్చు అనటానికి సునీల్ కుమార్ రాసిన నీలవేణి, దయ్యం కథానికలు మచ్చుతునకలుగా నిలుస్తాయి.

నీలవేణి దళిత మహిళగా ఆమె నేపథ్యాన్ని వివరించేటప్పుడు రచయిత చెప్పలేదు. అంటే రచయితకు తన లేదా తన వాళ్ళ సమస్యల్నే కాకుండా దళితేతర సమస్యల్ని కూడా పట్టించుకునే విశాల దృక్పథం ఉందని తెలుస్తుంది. తనకు తెలిసిన కథన వ్యూహాలు పాత్ర గతంగా చెప్పి స్తాడు. ఇక్కడ ప్రధానంగా ఈ కింది ఔచిత్యాలు మనం గమనించవచ్చు.

కథన వ్యూహాల మీద రచయితకు కావలసినంత ప్రావిణ్యం ఉందని పాఠకుడు గుర్తించడాన్ని పాత్ర ద్వారా తెలిసేలా చేయడం.( స్వోత్కర్ష లేకుండా).

కథలో కథానాయకుడు కూడా రచయితే కాబట్టి నాయిక నాయకుడికి సముఉజ్జీ అని చెప్పకనే చెప్పడం. తద్దారా నాయికా నాయకులిద్దరూ వయస్సు బ్యాచలర్లు కావడం వల్ల ఈడూ, జోడు కుదిరింది, వాళ్ళు పెళ్ళి చేసుకుంటారని సూచ్యం చెయ్యడం,

సినిమాలోని పాత్రలు, అదే సినిమాలో మరో సినిమా చూచినట్టుగా, కథలోనే కథను పాత్ర గతంగా చెప్పించడం లాంటి అంశాలు రచయిత వస్తు పరంగానే కాకుండా అభివ్యక్తి పరంగా కూడా చేయి తిరిగిన వాడిగా కనిపిస్తాడు.

పనికి మాలిన సంప్రదాయం మీద (పనికొచ్చే సంప్రదాయాలు ఉంటాయి) తిరుగుబాటు బావుటా ఎగరేస్తుందిక్కడ నీలవేణి.

విద్యావంతులైన మహిళలు తమ భవిష్యత్తును తెలివి, బాధ్యత లేని తల్లిదండ్రుల మీద పెట్టి జీవితాన్ని నాశనం చేసుకోకూడదని కథ ద్వారా చెబుతాడు. మరీ ముఖ్యంగా పాత్ర ద్వారా నొక్కి వక్కానిస్తాడు.

యండమూరి, విశ్వనాథలు కథను పాత్రలచేత నడిపించకుండా వాళ్ళ వ్యాఖ్యానాలతో చొరబడి మాటి మాటికి కథకు అడ్డు వచ్చేస్తారు ఇది కథన లోపంగా వల్లంపాటి అంటారు. ఇలాంటి పొరపాట్లు చెయ్యకుండా రచయిత కాంతా సమ్మితంగా కథను నడిపించడం ముదావహం.

## ఆధారగ్రంథాలు :

నీలవేణి కథలు - పి.వి.సునీల్ కుమార్
ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం - కె. ఇనాక్
తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ప్రొ..వెలమల సిమ్మన్న
కథా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
నవలా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
విమర్శా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
తెలుగు సాహిత్య చరిత్ర - డా..ద్వా.నా.శాస్త్రి

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# బోయి భీమన్న 'అసూయ' నాటకం ఇతివృత్త పరిశీలన

- సిహెచ్. రేవతి, పరిశోధక విద్యార్థిని, తెలుగశాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నన్నయ ప్రాంగణం, రాజమండ్రి.

ఆధునిక సాహిత్యంలో బోయి భీమన్నగారికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈయన 1911 సెప్టెంబర్ 19 న తూర్పుగోదావరిజిల్లా కోనసీమకు చెందిన రాజోలు తాలూకా మామిడికుదురు గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు శ్రీమతి నాగరత్నమ్మ, పల్లయ్య. 1935లో బి.ఎ. 1937 బి.ఇడి. పూర్తిచేశారు. విద్యాభ్యాసం పూర్తిచేసిన తర్వాత రాజోలులోని బోర్డుహైస్కూల్లో చరిత్రను బోధించే ఉపాధ్యాయుడిగా పనిచేశారు. తర్వాత అనువాద విభాగం డైరెక్టర్ గా, రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్ 1964 వరకు పనిచేశారు.

భీమన్నగారు తెలుగుసాహిత్యంలో కవిత్వం, నాటకం, పద్యం, గేయం, వచనం, లేఖారచన మొదలైన అన్ని ప్రక్రియలలో రచనలు చేశారు. పాలేరు, కూలిరాజు, అసూయ, ప్రగతి, రాగవాశిష్టం, పడిపోతున్న అడ్డుగోడలు, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు, బాలయోగి మొదలైనవి ఆయన నాటకాలు. రాగోదయం, రాఖీలు, అనాది కొస నుంచి అనంతత్వంలో మధుబాల, మధుగీత, దీపసభ, గుడిసెలు కాలిపోతున్నాయి. మొదలైనవి ఆయన కవితలు. ఏకపద్యోపాఖ్యానం, జన్మాంతర వైనం. ధర్మం కోసం పోరాటం, అంబేద్కరిజం, జానపదు నిజాబులు, పురాణాలలో హరిగిరిజన మనీషులు మొదలైనవి ఆయన వచన రచనలు. ఆనాటి సాంఘిక వ్యవస్థను కుల వ్యవస్థను ప్రధాన కథావస్తువుగా చేసుకొని కావ్యరచన సాగించారు. సమకాలీన అంశాలతోపాటు ఆనాటి స్త్రీల సాంఘిక స్థితిగతులు, వారు పడుతున్న బాధలు గురించి ఈయన కావ్యాలలో ఉన్నాయి. అభ్యుదయ సాహిత్య ప్రభావానికి కొంతలోనైనా స్త్రీలను చాలా ఉన్నతంగా తీర్చిదిద్దారు. అటువంటి కోవకు చెందిందే 'అసూయ' నాటకం. ఇది 1946-1948లో ప్రచురించబడింది. దీనికి "విద్యార్థి కాంగ్రెసోద్యమ నాటకం" అని మరొకపేరు కలదు. యువత సరైనతోవలో నడిచినప్పుడె , గ్రామాలలో జరిగే చైతన్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడె దేశం ముందుకు పయనిస్తుంది" అని తెలియజేయడం ఈ నాటకం ప్రధానోద్దేశం.

రాజకీయాలలో విద్యార్థులు పాల్గొనటం వలన ఉప యోగం ఉంది. అలాగే నష్టాలు కూడ ఉన్నాయి అని కవి ఈ కావ్యం ద్వారా తెలియజేస్తాడు. భీమన్నగారి రచనలలో ఒక ప్రత్యేకత ఉంది. సాధారణంగా కవులు తమ కావ్యాలకి పీఠికలు వేరే రచయితల చేత రాయిస్తారు. కాని భీమన్న తన కావ్యాలకి తానే పీఠికలు రాసుకున్నారు. ఆ పీఠికలలోనే ఆ కావ్య ఇతివృత్తం, కావ్యంలోని విశేషాం శాలు, కావ్యరచనా కాలం నాటి సమకాలీనాంశాలు మొద లైన ఎన్నో విషయాలతో పాటు భాషాసంబంధమైన అంశాలు కూడ అందులో పేర్కొన్నారు. ఆయా కావ్యాలకి అర్థవంతమైన వ్యాఖ్యానంగా ఆ కావ్యాల పీఠికలు కని పిస్తాయి. భూతాలు, తాతాలు, విశ్వం, రాజా, రేరాణి, రాత్రి, చండభాస్కరరావు, దినం, పల్లెటూరిపెద్దలు ఈ నాటకంలోని పాత్రలు. వీరి పేర్లను చూస్తే ఆ నాటకం యొక్క కథ కొంత తెలుస్తుంది. ఈ నాటకం రాసే సమయానికి ఇంకా స్వాతంత్ర్యం రాలేదు. స్వాతం త్రోద్యమ ప్రయత్నాలు జరుగుతున్నాయి. విద్యార్థులలో చైతన్యం తీసుకురావటానికి కాంగ్రెంపార్టీ ప్రయత్నిస్తుంది. విద్యార్థి నాయకులను నియమించటం, వారి ద్వారా కాలేజిలలో సమావేశాలు నిర్వహించి, విద్యార్థులలో చైతన్యం కలిగించటం వంటి కార్యక్రమాలు చేపడు తున్నారు. అటువంటి ఇతివ ృత్తమే ప్రధానంగా వచ్చిన నాటకం.

**ఇతివృత్తం:**

విశ్వం, రాత్రి, రాజా ముగ్గురు స్నేహితులు. వీరు ఒకే కాలేజీలో చదువుకుంటుంటారు. వీరు విద్యార్థి కాంగ్రెస్ ప్రసంగాలకు ప్రభావితమై దగ్గరలో ఉన్న

సర్పవరం గ్రామానికి వెళ్ళి అక్కడ ప్రజలకు పరిశుభ్రత నేర్పించటముతో పాటు రాత్రిపూట చదువు చెబుతుంటారు. విద్యార్థులు తలా కొంచెం డబ్బులు వేసుకొని ఆ గ్రామంలో బావులు తవ్వించి పాఠశాలలు ప్రారంభించటమేకాక ఇంకా ఎన్నో మంచి పనులు చేస్తుంటారు. దీనితో ఆ గ్రామప్రజలకు వీరంటే అభిమానం పెరుగుతుంది. సర్పవరం కూలీపేట పెద్దలు తాతాలు, భూతాలు. రేరాణిభూతాలు కూతురు. వీరు పగలంతా కూలిపని చేసుకొని రాత్రిపూట రాత్రిబడిలో చదువుకుంటుంటారు. ఈ చదువువల్ల వీరిలో అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం వస్తుంది. భూస్వామి కూలిపేట ప్రజల మీద దాడి చేయించినప్పుడు తమకు అన్యాయం జరిగింది అని ఎదిరించి రేరాణి మాట్లాడుతుంది.

కాలేజిలోని కాంగ్రెస్ విద్యార్థిసంఘానికి నాయకుడు రాజా. చండ భాస్కర్రావు, దినంతో కలిసి రాజాను ఆ పదవినుంచి తప్పించడానికి ప్రయత్నిస్తాడు. రాజా, రాత్రి స్నేహంగా ఉండటం చూసి చండ భాస్కర్రావు ఓర్చుకోలేక వారిద్దరి గురించి కాలేజి గోడల మీద లేనిపోనివి రాస్తూ దుస్ప్రచారం చేస్తాడు. దానితో రాజా, రాత్రి కాలేజిలో తల ఎత్తుకోలేకపోతారు. చండ భాస్కర్రావు గ్రామంలో రేరాణిని బలాత్కరించటానికి ప్రయత్నిస్తాడు. ఆ క్రమంమంలో రేరాణి మూర్ఛపోవడంతో ఆ పని చేసింది రాజా అని అందరికి చెబుతాడు. ఈ వార్తపత్రికలో వచ్చేలాగా చేస్తాడు. చండ భాస్కర్రావు చేసిన పని వలన అటు కాలేజీలో ఇటు గ్రామంలో తలఎత్తుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ వార్తలన్ని రాత్రి, విశ్వంల హృదయాల్ని కలచివేస్తాయి. రాజాను, భూతాలు తప్పుగా అర్థం చేసుకుంటాడు. చండ భాస్కర్రావు ప్రోద్బలంతో రాజా తలపై బలంగా కొడతాడు. అది చూసి దినం భయపడిపోతాడు. డబ్బుకు ఆశపడి తనతోటివారికి అన్యాయం చేస్తున్నానని భావించి దినం జరిగినదంతా రాత్రికి తెలియజేస్తాడు. అందరు నిజం తెలుసుకొని రాజాను క్షమాపణలు కోరతారు. రేరాణి జ్వరంతో బాధపడుతుంటుంది. ఆమెను విశ్వం ఆస్పత్రిలో చేరుస్తాడు. రాజా, రాత్రి ఒకటవటంతో కథ ముగుస్తుంది. భీమన్నగారి రచనలో ఒక ప్రత్యేకత ఉంది. ఆయన కావ్యాలకి పెట్టేపేరులోనే కావ్య వస్తువు ఏమిటో తెలిసిపోతుంది. అంతేకాక కావ్యంలోని పాత్రల పేర్లు చూస్తే వాటి యొక్క ప్రాముఖ్యం, స్వరూప స్వభావాలు మనకు అర్థమవుతాయి. భూతాలు, తాతాలు ఇవి పాతకాలం వారు పెట్టుకొనే పేర్లు. సాధారణంగా పూర్వకాలంలో పిల్లలు చాలామంది పుట్టి చనిపోతుంటే ఇటువంటి పేర్లు పెడతారు. ఉదా: బట్టెమ్మ, పెంటయ్య, జీతయ్య మొదలైనవి. రాజా విద్యార్థి కాంగ్రెస్ నాయకుడు. నాయకుడు ఏ మాట చెబితే ఆ మాట ప్రజలు అందరు వినాలి. ఆయన అడుగుజాడలలో ప్రజలు నడవాలి. రాజా విద్యార్థి నాయకుడు అవటం వలన ఆయన అడుగుజాడలలో అందరు నడుస్తారు. రాత్రి అంటే పూర్తి చీకటికాదు. అమావాస్య, పౌర్ణమి రెండు ఉంటాయి. రాత్రి సర్పవరం గ్రామంలో రాత్రిబడిలో ఆ ఊరి ప్రజలకు చదువు చెబుతూ వారి జీవితాల్లో అమావాస్య చీకట్లను తొలగించి పౌర్ణమి వెలుగులను నింపుతుంది. ఈ కావ్యంలో ప్రధాన స్త్రీ పాత్ర రాత్రి. ఎంతటి పౌర్ణమి చంద్రునికైనా గ్రహణ బాధ తప్పదు. తన గురించి వచ్చిన చెడువార్తలు ఆమెను గ్రహణం వలె కప్పేశాయి. ఆ వార్తలు అన్ని కల్పితాలే అని తెలియటం వలన గ్రహణం వీడిపోతుంది. రేరాణి, విశ్వం ప్రేమించిన అమ్మాయి. రేరాణి అంటే రాత్రి, చీకటి అనే రెండు అర్థాలున్నాయి. చీకటిలోనే చదువుకొని పౌర్ణమి వెలుగు వలె జ్ఞానాన్ని సంపాదించుకొంది. తను సంపాదించిన జ్ఞానంవల్ల తమకు జరుగుతున్న అన్యాయాలపై తిరుగుబాటు చేసింది. చండ భాస్కరరావు స్నేహితుడు దినం. దినం అంటే రోజు. పగలు, రాత్రి రెంటికలయికే రోజు. మంచిచెడుల కలయికే రోజు. కవి మంచిని వెలుగుతో, చెడును చీకటితో పోలుస్తున్నాడు. దినం కూడ మొదట్లో చండ భాస్కరరావుతో కలిసి చెడ్డపనులు చేస్తాడు. తరువాత తాను తప్పుచేశానని తెలుసుకొని జరిగినదంతా విశ్వం, రాత్రికి చెబుతాడు. మంచి, చెడుల కలయిక ఈ పాత్రలో ఉండటం వలన ఇతనికి దినం అని పేరు పెట్టాడు కవి.

భీమన్న మీద గాంధీ ప్రభావం, అంబేద్కర్ ప్రభావం ఆయన కావ్యాలలో కనిపిస్తుంది.

"సర్వసమ్మతసర్వసమ్మతాసామ్యభారతభారతీ!
సస్యపుష్కలశ్యామమందారస్వర్ణగర్భాభారతీ!
సకలసుకళాసారసారస్వతసరస్వతీభారతీ!
శాంతిసౌఖ్యవసంతభూమీజన్మభూమీభారతీ!"

అని భీమన్న ఈ కావ్య ప్రారంభ పద్యంగా చెప్పారు. భారతదేశంలోని ప్రజలందరు కలిసి ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని, సామ్యవాదాన్ని ఆమోదిస్తేనే భారతజాతి భవిష్యత్తు బాగుంటుందని కవి తెలియ జేస్తాడు. రాత్రి తాను చదువుకోవటమే కాక తనకు చేతనైన సహాయం ఇతరులకు చేయాలి అని భావిస్తుంది. రాత్రి పూట దినసరికూలీలకు చదువు చెప్పి వారిలో చైతన్యం తీసుకురావటానికి ప్రయత్నిస్తుంది. తను అంతటి చైతన్య భావాలు కలిగిఉన్నా తనమీద పేపర్లో వచ్చిన వార్తలు చూసి అందరూ తనని తప్పుగా అనుకుంటారని అందరి లోకి రావటానికి భయపడుతుంది. భీమన్నగారు స్త్రీ పాత్ర లను చాలా సుకుమారంగా చూపిస్తారు. వారు ఎవరు పడని బాధలు పడ్డారు. ఎవరివల్ల అన్యాయం జరిగిందో వారికి తెలుసుకాని ఎవరిమీదపగ, ప్రతీకారం తీర్చుకోవ టానికి ప్రయత్నించలేదు. అహింస ద్వారానే తమ సమస్యను పరిష్కరించుకుంటారు. శాంతమూర్తులుగా సహనం కలిగినవారుగా భీమన్న తన కావ్యాలలోని స్త్రీ పాత్రలను తీర్చిదిద్దుతారు. కూలీ జనులకు ఏదైనా విషయం నేర్చుకోవటానికి అవకాశాలు చాలా అరుదుగా లభిస్తాయి. అవకాశాలు లభించినా వాటిని సద్వినియోగం చేసుకొనేవారు చాలా తక్కువమంది ఉంటారు. తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది రేరాణి. పగలంతా కష్టపడి వచ్చి రాత్రి చదవు నేర్చుకుంటుంది. తనకు చేతనైన సహాయం ఇతరులకు చేస్తుంది రేరాణి. తోటివారిని విద్యావంతులని చేయటం ద్వారా సమాజం ఇంకా అభివృద్ధి చెందుతుందని అసూయ నాటకం ద్వారా తెలియచేశారు కవి. వీరిరచనల ద్వారా కులవ్యవస్థ నిర్మూ లనపై ప్రజలలో అవగాహన కలిగించారు. 2001లో భీమన్న గారిని భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 2005 డిసెంబర్ 16న హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు భీమన్న.

**ఆధారగ్రంధాలు :**

1. అసూయ (నాటకం) - బోయిభీమన్న
2. బోయి భీమన్నసాహితీ షష్ఠిపూర్తి సంచిక - సంపాదకుడు గనుముల జ్ఞానేశ్వర్
3. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - బోయి హైమవతి

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# గిరిజన కళారూపాల వైవిధ్యం

**- జె. విజేందర్,** తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

**ఉపోద్ఘాతం :**

నాటకరంగానికి మాతృకయై యుగయుగాలుగా, తరతరాల వైభవాన్ని సంతరించుకున్న జానపద కళారూపం ఎన్నటికీ తరగని వైభవం. జానపద కళారూపాలంటే ఈనాటికి చాలా మందికి అర్థంకావు. జనపదమనగా పల్లెటూరు. జనపదంలో నివసించేవారే జానపదులు. జానపదులు పాడుకునే పాటలు, ఆటలు, నృత్యాలనే జానపద కళారూపాలు అంటారు. నేటికి తెలుగు రాష్ట్రాలలో అనేకులకు గిరిజన కళారూపాలైనటువంటి గోండుల గుస్సాడి నృత్యం, ఖోండుల థింసా నృత్యం గురించి తెలియదు.

**పరిచయం :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో ఉన్న ఆదివాసుల గిరిజన నృత్యాలు, రాష్ట్ర ప్రజలకు నేటికీ తెలియవు. గిరిజనులు రాష్ట్రంలో ఉన్నవారు వారివారి ప్రాంతాలకే పరిమితమైపోయి వారికి తప్పా ఇతరులకు తెలియకుండా పోయారు. అందుకు గల ముఖ్యకారణం వారి బ్రతుకంతా అడవులకే పరిమితమై ఉండి, ఇతరులతో ఏవిధమైనటువంటి సంబంధాలు కూడా లేకపోవడం. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో గోండులు, కొలాములు, మధురాలు, ప్రధానులు అనే గిరిజన తెగలు కలవు. కరీంనగర్ జిల్లాలో నాయక్‌పోడ్‌లు ఎక్కువగా కనిపిస్తారు. వరంగల్, ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో కోయలు, కొండరెడ్లు అధికం.

కళింగాంధ్ర ప్రాంతాలైన శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల కొండల్లో బగతలు, వాల్మీకులు, గదబలు, కోటియా, కమ్మరలు, సామంతలు ఎక్కువగా కన్పిస్తారు. రాయలసీమ ప్రాంతమైన కర్నూలు జిల్లా మరియు దాని పరివాహక ప్రాంతాలలోని నల్లమల అడవులలోనూ, మహబూబ్‌నగర్ జిల్లాలోని అంబ్రాబాద్ పీఠభూమి ప్రాంతంలో చెంచులు ఎక్కువగా నివసిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువగా కన్పించేటువంటి జాతి బంజారాలు వీరిని ఆంధ్రప్రదేశ్‌లో సుగాలీలు అనీ తెలంగాణ రాష్ట్రంలోని వారిని లంబాడీలు, లబానీలు అని కూడా పిలుస్తారు.

గిరిజనులు సంవత్సరం పొడవునా వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగిస్తారు. వీరిలో ప్రధానంగా బంజారాలు, కోయలు, గోండులు, బగతలు, వాల్మీకులు స్థిరనివాసాలు ఏర్పరుచుకొని భూములను సేద్యం చేసుకుంటారు. కొలామ్, నాయక్‌పోడ్, కోటియా నిలకడగా ఉండక వేర్వేరు ప్రాంతాలకు వలసవెళ్తూ తమకు తోచిన ప్రదేశాలలో సంచరిస్తూ పోడు వ్యవసాయం చేస్తూ జీవనాధారం సాగిస్తారు. ఈ విధంగా వీరు జీవనాధారం సాగించే క్రమంలో శారీరక, మానసిక అలసటకు గురవ్వకుండా ఆనందంకోసం సంగీతాన్ని, నృత్యాన్ని, వాయిద్యాన్ని జోడించి, ఎన్నో కళారూపాలను సృష్టించుకున్నారు. వాటిలో ముఖ్యమైనటువంటి గోండుల గుస్సాడి నృత్యం, విశాఖజిల్లాలోని అరకు లోయలో గిరిజనులు చేసేటటువంటి థింసా నృత్యాలు.

**గోండుల గుస్సాడి నృత్యం :**

దీపావళి నెలలో సాంప్రదాయకంగా ఆదిలాబాద్ జిల్లాలోని రాజగోండులు జరుపుకునే నృత్యం గుస్సాడి నృత్యం. పౌర్ణమినాడు ప్రారంభించి చతుర్దశి వరకు ఈ నృత్య ఉత్సవాలను జరుపుకుంటారు. తాము పండించినటువంటి పంటలన్నీ తమ చేతికి అంది, చేసిన కష్టానికి ఫలితంగా ధాన్యలక్ష్మి ఇంటికి చేరిన శుభసందర్భంగా ఈ నృత్యాన్ని ఉత్సవంగా జరుపుకుంటారు. గోండు యువజనులు రకరకాల వస్త్రాభరణాలను ధరించి కొమ్ము లూదుతూ, తప్పెట్లు వాయిస్తూ సంగీతవాయిద్యాలతో, యాత్రలు సాగిస్తూ అతిథులుగా పొరుగు గ్రామాలకు

తరలి వెళతారు. గోండుల పురాణ గాథలలోని "దండా రియా రౌడ్, సిసిసెర్మారౌడ్" అనే కథానాయకులను అనుసరిస్తూ ప్రతి సంవత్సరం నృత్యాలు చేస్తారు.

గోండు యువకులు 20-40 మంది వరకు చేరి చేసే నృత్యమే దండారీ నృత్యం. దండారీ నృత్యం గుస్సాడి నృత్యంలో ఒక భాగం. గుస్సాడి నృత్యంలో అనేకమంది పాల్గొనవచ్చు. గుస్సాడి నర్తకునికి కావలసిన సామాగ్రిలో ముఖ్యమైంది నెమలిఫించంతో తయారుచేసిన తలపాగా. దీనిలో గొర్రె పొటేలు (పోతు) కొమ్ములను అమరుస్తారు. కృత్రిమగడ్డాలు, మీసాలతో వేషం కట్టి, మేకతోలు కప్పు కొంటారు.

## దండారి కోలాట నృత్యం :

గోండు భాషలో గుస్సాడి అంటే అల్లరి అని అర్థం. వలయాకారంగా చేరే దండారి బృందం లోపలివైపుకు తిరిగి నిలుచుంటారు. ఎడమవైపుకు నెమ్మదిగా అడుగులు వేస్తూ, అడుగులు వేసినప్పుడల్లా కుడి పాదాన్ని ఎడమ కాలుమీదికి ఊగిస్తుండడంతో నృత్యం ప్రారంభమౌతుంది. ప్రతి నర్తకుని చేతిలో రెండు కోలాటం కర్రలు ఉండి, వాటిని ఒకదానితో మరొకదానిని తాకిస్తూ తమ ప్రక్కన కుడివైపున ఉన్న నర్తకుని కర్రను కొడతారు. ఇలా అడుగులువేస్తూ కోలాటమాడుతూ నర్తకులందరూ వంగి, కర్రలను నేలను తాకించి దేవతలందరికీ ప్రణమిల్లడానికి నాలుగు దిక్కులకు అడుగులు వేస్తారు. దేవతలను నమస్కరించిన పిమ్మట వలయాన్ని సరిచేసుకుని కర్రలను పాదాల వద్ద ఉంచి, పాటకు అనుగుణంగా చేతులతో చప్పట్లు కొడతారు. ఈ నృత్యంలోని ఒక బృందం చరణాన్ని ముగించగానే మరో బృందం రెండవ చరణాన్ని అందుకుంటూ బృందగానం చేస్తారు.

## దండారీ నృత్యంలో గుస్సాడీల ప్రవేశం :

ఈ విధంగా దండారీల నృత్యం కొనసాగుతుండగా నలుగురైదుగురు గుస్సాడీలు తలకు నెమలి పింఛాలను ధరించి, కృత్రిమ గడ్డాలు, మీసాలు, శరీరంపై మేక చర్మం, మెడలో గవ్వల హారాలు, తుంగకాయల హారాలు ధరించి, నడుముకు మణికట్టుకు చిరుగజ్జెలను కట్టుకొని కంటి చుట్టూ తెల్లరంగు పూసుకొని, మొలకునారింజరంగు లంగోటీలు మాత్రమే ధరించి అర్ధనగ్నంగా చేతుల్లో కర్రలు పట్టుకొని, శరీరంపై నలుపుచారల చుక్కలతో వింతగా అలంకరణలు చేసుకొని హఠాత్తుగా దండారీల వలయంలోకి గుస్సాడీలు ప్రవేశించగానే దండారీలు చెల్లాచెదరౌతారు. ఈ సన్నివేశం ప్రేక్షకపాత్ర వహించేవారికి అమితమైన ఆనందాన్ని కల్గిస్తుంది. ఈ విధంగా ఆదిలాబాద్‌లోని రాజగోండులు తమ యొక్క కళారూపాన్ని గుస్సాడి నృత్య రూపంలో ప్రదర్శిస్తారు.

## థింసా నృత్యం :

కళింగాంధ్ర ప్రాంతమైనటువంటి విశాఖ జిల్లాలోని అరుకు లోయలో వాల్మీకులు, బుగతలు, కోటియా, ఖోండులు చేసే కళారూపవే థింసానృత్యం. ఈ నృత్యంలో వృద్ధులు-యువకులు, పేదలు-ధనికులు, స్త్రీ-పురుషులు అని తేడా లేకుండా అన్ని వర్గాలవారు థింసానృత్య కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటారు. నిరంతరం శ్రమిస్తూ జీవనాధారం గడిపే గిరిజనులకు ఈ కార్యక్రమాలు అంతులేని అనుభూతిని, ఆనందాన్ని కల్గిస్తాయి. థింసా నృత్యం అందరినీ అలరించడమే గాకుండా, గ్రామ ప్రజల మధ్య సఖ్యతనూ, సహృద్భావాన్ని పెంపొందిస్తుంది. థింసా నృత్యాన్ని చైత్ర పర్వంలోనూ, వివాహ సమయంలోనూ, పండుగ పర్వ దినాల్లోనూ ప్రదర్శిస్తారు.

థింసానృత్యం 'తుండి', 'కిరిడి', 'తుడుము', 'మోరి', 'డప్పు' లాంటి విలక్షణ సంగీత వాయిద్యాలతో సాంప్రదాయ బద్ధంగా లయ కొనసాగుతుంది. ఈ నృత్యంలో కళాకారుల్ని ఉత్తేజపరచుటకు మధ్య మధ్యలో జోడ కొమ్ము బూరలను ఊదుతారు. స్త్రీ పురుషులందరూ సాంప్రదాయకమైన ఆభరణాలు ధరించి, రంగు రంగుల దుస్తులను అలంకరించుకొని, నృత్యానికి హాజరవుతారు. ఈ పండుగ పర్వదినాలలో ఒక గ్రామానికి చెందినవారు మరో గ్రామ నృత్యంలో పాల్గొంటారు. ఒక గ్రామంవారు మరోగ్రామం వారిని ఆహ్వానిస్తారు. అలా ఆహ్వానించగా వచ్చినవారికి విందు భోజనాలను ఏర్పాటు చేస్తారు. ఈ

విధంగా అందరు కలసి నృత్యవినోదాన్ని జరుపుకోవడాన్ని "సంకిడి కెల్చార్" లేక "కిందిరి కెల్చార్" అంటారు. ఈ విధంగా జరుపుకొనే థింస్సా నృత్యంలో వివిధ రకాలున్నాయి.

### బోడె దింసా :

బోడె అంటె ఘనమైనదని అర్థం. గ్రామదేవత అయిన "నిసాని దేవత" పూజ సమయంలో ఈ నృత్యం చేస్తారు. కావున దీనిని "బోడె దింసా" అంటారు. అన్ని వాయి ద్యాలు ఉదృతంగా వాయిస్తూ ఉండగా ఈ నృత్యం ప్రారంభమవుతుంది. స్త్రీ, పురుషులు వర్తులాకారంగా తిరుగుతూ మధ్య మధ్యలో ఘషారుగా హేయ్... హేయ్... హోయ్... హోయ్... అంటూ కేరింతలు కొడుతూ చివరకు బారుగా నిలుచున్న స్థితికి చేరుకుంటారు.

### గుండేరి థింసా :

గుండేరి ఒక స్త్రీ పేరు. ఈ నృత్యంలో పాల్గొనే పురుషుడు తనతో కలిసి అడుగులు వేయవలసిందిగా ఒక పాట రూపంలో మహిళా బృందాన్ని ఆహ్వానిస్తాడు. అందువల్లనే ఈ నృత్యాన్ని "గుండేరి నృత్యం" అంటారు. ఈ నృత్యంలో వెనకకు, ముందుకు ధృడంగా అడుగులు వేస్తూ కదం త్రొక్కుతూ గుండ్రంగా తిరుగుతారు. ఈ విధంగా ఉత్సాహ, ఉద్వేగాలతో చేసే నృత్యమే గుండేరి థింసా.

### బాగ్ థింసా :

బాగ్ అంటే ఒరియాలో "బెబ్బులి" అని అర్థం. అడవిలో భయంకరమైన జంతువైన పెద్ద పులి భారి నుండి చిన్నా పెద్దా ఎలా తప్పించుకోవాలో తెలియజేసే నృత్యమే బాగ్ థింసా. ఈ నృత్యంలో సగంమంది ఒకరి చేతులు మరొకరు పట్టుకొని గుండ్రంగా తిరుగుతారు, తలను పైకెత్తుతూ మునివేళ్ళమీద నిలిచి ఉంటారు, మిగతా సగం మంది చకచకా చుట్టూ తిరుగుతూ లోపల ప్రవేశించి, పాముచుట్ట ఆకారంలో అంతా నిలచుంటారు. ఇలా అనేకసార్లు చేయడమే బాగ్ థింసా నృత్య విశేషం.

### పాతార్‌తోలా :

పాతార్‌తోలా అనే నృత్యం గిరిజన మహిళలు తాము చెట్ల ఆకులను సేకరించే విధానాన్ని తెలియజేస్తుంది.

### నాటకారి :

నాటకారి నృత్యం ఒక్కొక్కరే చేసే నృత్యం. ముఖ్యంగా వాల్మీకి జాతివారు దీపావళి పండుగరోజు ఈ నృత్యం చేస్తారు. మిగతా పండుగల సమయంలో ఇతర జాతులు కూడా ఈ నృత్యంలో పాల్గొంటారు.

### కుందా థింసా :

కుందా అనగా ఒకరికొకరు భుజాలతో తోసుకోవడం అని భావం. ఈ నృత్యం లయబద్ధంగా ఊగుతూ ఒకరినొకరు భుజాలతో తోసుకుంటా అమితమైన ఆనందాన్ని పొందుతారు.

### బాయా థింసా :

బాయా అనగా పూనకం. నిసాని దేవత పూనినపుడు చేసే నృత్యమిది. గణాచారిని ఒరియా భాషలో గురుమయి అంటారు. ఎవరైనా పూనినపుడు గ్రామస్తులందరు ఈ వ్యక్తి చుట్టూ చేరి, తలలువంచి తమ కోరికలు నెరవేర్చాలని కోరుకుంటారు.

### ముగింపు :

నాటకం, సినిమా, రేడియో, టెలివిజన్ లాంటి ఆధునిక సాంకేతిక ప్రక్రియలు రావడం మూలాన నేడు జానపద కళారూపాలకు ఆదరణ దగ్గింది. పల్లెటూరి వాతావారణం నుండి ప్రజలు పట్టణ ప్రాంతాలకు అవసరాల కోసం తరలివెళ్ళి అక్కడే స్థిరనివాసాలను ఏర్పరచుకొని పట్టణ సంస్కృతి, సంప్రదాయాలను అవలంభిస్తు న్నారు. కావున ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి తెలుగు రాష్ట్రాలలోని పట్టణ, పల్లె ప్రజలకు ప్రతి ఒక్కరికి జానపద కళారూపాల విషయ, విశిష్ఠతలను తెలియపరుస్తూ కళారూపాలు కనుమరుగు కాకుండా చొరవ తీసుకోవాలని కోరుతూ, అంతరించిపోవుటకు చేరువలో ఉన్నటువంటి గిరిజన కళారూపాలను కాపాడుకుందాం.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# భిన్న కోణాలకు ప్రతీక "శిరంశెట్టి కాంతారావు కథలు"

- ధర్మారపు నాగయ్య పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

తెలుగు కథా నవలన రచయితలలో తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకొని ఒక సామాజిక నిబద్ధతతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పల్లె, పట్టణ జీవితాన్ని ముఖ్యంగా అట్టడుగు శ్రామిక వర్గ సంస్కృతిని, రైతు,రైతు కూలీల జీవితాలను వాస్తవిక దృక్పథంతో తన రచనలో నిక్షిప్తం చేసిన రచయిత శిరంశెట్టి కాంతారావు.

వారి కథలు మనకు భిన్న కోణాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు కోసం సంగీతరావు అనే ఎం.ఎల్.ఎ. తన స్వార్థం కోసం భల్పూర్, కొత్తపల్లి, కొల్లూరు, అబ్బపల్లి మొదలగు గ్రామాల సర్పంచ్‌లను మరికొందరు పార్టీ ముఖ్య నాయకులను పిలిపించి తన బత్తాయి తోట ఫామ్ హౌజ్‌లో బిర్యాని, మధ్యంతో పార్టీ ఇచ్చి ఎం.ఎల్.ఎ. థర్మల్ ప్రాజెక్టు కోసం ఆయా గ్రామాల భూములు కొనుగోలు చేయాలని చెప్పదలుచుకున్న విషయాన్ని చెప్పి అందరికి వంట పట్టిస్తాడు.

ఆయా గ్రామాల సర్పంచ్‌లకు మరియు పార్టీ నాయకులకు ఇంటికో ఉద్యోగం, ప్రాజెక్టులో ఏదో ఒక కాంట్రాక్టు కూడా ఇప్పిస్తా అంటూ వారి అందరిని తన గుప్పిట్లో ఉంచుకున్నాడు. కాని అబ్బపల్లి ప్రాజెక్టు ప్రజలు అందుకు నిరాకరించారు. వారిపై కక్షకట్టి థర్మల్ ప్రాజెక్టు డిజైన్‌లో కావాలని మార్పు చేయించాడు. దాంతో "పేరొంచ" అనే వాగు కాస్తా (అబ్బపల్లి గ్రామంకు పాడి పంటకు అదే జీవనాధారం) ఆనవాలు లేకుండా పోవడంతో థర్మల్ ప్రాజెక్టు దిగువనున్న అబ్బపల్లి గ్రామస్థులకు మొట్టమొదటిసారిగా నీటి ఎద్దడి ఎలా ఉంటుందో తెలిసింది.

అక్షయపాత్ర లాంటి "పేరొంచ" వాగు ఎందుకు ఎండి పోయిందో అర్థమైన గ్రామ ప్రజల గుండెలు బాంబులు పేల్చిన గ్రానైట్ క్వారీల్లా దడ దడలాడిపోయాయి. ఇలా ప్రాజెక్టు నుండి వెలువడే బూడిత వలన ఆ గ్రామములో పాడి, పంట, మనుష్యులు అనారోగ్యం పాలైనారు. చాలా మంది ప్రజలు ఊరు, వాడ వదిలి వలస వెళ్ళారు. ప్రాజెక్టుల కోసం పచ్చని పంట పొలాల్ని సెజ్‌లుగా పారి శ్రామిక వాడలుగా మారుస్తున్న నేటి కుటిల స్వార్థ రాజకీయాలకు బలై పోయిన గ్రామములో అబ్బపల్లి గ్రామం ఒక్కటి. ఈ ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేక "మా ఊరు అమ్ముతాం కొనుక్కోండి" అంటూ థర్మల్ ప్రాజెక్టు ముందు టెంట్ క్రింద కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం చుట్టుప్రక్కల గ్రామాలకు అబ్బపల్లి గ్రామ ప్రజల పట్టుదల చివరికి అలా ముగిసిపోవడం పెను విషాదం.

కోరిక మనిషి చేత ఎంత పని అయినా చేయిస్తుంది. అది విచక్షణా జ్ఞానాన్ని చంపేస్తుంది. అహంకారం అభిజాత్యం వలన మనిషి పరువే కాదు ప్రాణం కూడా పోవచ్చు. ఎక్కడో రాజస్థాన్ నుంచి బ్రతుకుదెరువు కోసం ముసాఫిర్లుగా వచ్చిన బుందేల్ సింగ్ కూతురు అయిన "నేనాబాయి"చెరబట్టబోయిన ఇంద్రారెడ్డికి గ్రామస్తులందరూ కలిసి దేహశుద్ధి చేస్తారు. తండ్రి పెద్దరికంతో వదిలినా! ఈ విషయం పోలీసు స్టేషన్‌కి వెళ్తుంది. వాళ్ళు మీరే సెటిల్ చేసుకోండి అంటారు. చివరికి బుందేల్ సింగ్ వాళ్ళ ఆచారం ప్రకారం పిల్ల చేయి పట్టిన వాడే మనువాడాలి అంటారు. అందరి ముందు ఇంద్రారెడ్డి కుటుంబ పరువుపోతుంది. ఆ అవమానం తట్టుకోలేక తల్లి కొడుకుని చంపేస్తుంది.భవిష్యత్తులో ఇలాంటి ఘోరాలు జరుగుతాయని ఊహించి మనిషికి 'అభిజాత్యం' అహంకారం ఉండకూడదు. అలా ఉంటే ఇలాంటి ఘోరాలు జరుగుతాయని చెప్పడానికి ఈ అభిజాత్యం అనే కథను రచయిత మనకు ప్రతీకగా తార్కానించారు.

ఇల్లు అన్నాక సవాలక్ష గొడవలు ఉంటాయి. ఉమ్మడి కుటుంబంలోని అనైక్యత, స్వార్థం, మనిషి రోజు రోజుకి దిగజార్చుతాయి. ముగ్గురు కొడుకులు, ఒక ఆడ కూతురు ఉన్న ఇంట్లో ఆ ఇంటి యజమానురాలు పోతే దహన

కాండకి ఎవరికి వారే తప్పించుకుంటే, నడిపోడు అన్నా కూడా, తగ్గకుండా రెండో కొడుకు ఖర్చుకు భయపడక దగ్గరుండి దహన కార్యం జరిపిస్తాడు. కర్మకాండలకి కూడా వంతులు వేసుకుంటుంటే రోతపుట్టి ఖర్చుని నెత్తిన వేసుకుంటాడు రెండోవాడు. డబ్బు ఒకరిది. పెత్తనం మరొకరిది. వాళ్ళ ఇంట్లో వాళే కాండిశుకులు అయినా తీరు కలిచివేస్తుంది. చివరికి నాన్న కూడా తానూ చనిపోతే నడిపోడిని కర్మకాండలు చేయమనడం ఉమ్మడి కుటుం బాల్లోని డొల్లతనాన్ని స్వార్థానికి నిదర్శణంగా చెప్పాడు. ఇంటింటి కథలో రచయిత.

దర్జీ పని చేసి పొట్ట బోసుకునే రాజేష్‌కు పాపికొండల్లో అనుకోకుండా పనిదొరుకుతుంది. తన మనవడితో సహా మిషన్‌ను తీసుకొని పాపికొండల్లోకి వెళ్తాడు. అక్కడ పది రోజుల్లో పని చేస్తూ కొల్లేరు ఇసుక నేతల మీద సత్తిరెడ్డి అనే కాంట్రాక్టరు చేస్తున్న అక్రమాల్ని "పొద్దన్న రెడ్డి" ద్వారా విని రాజేష్ చాలా బాధపడతాడు. ప్రపంచీకరణ పేరుతో పాశ్చాత్య సంస్కృతి, సాంప్రదాయాలు చేరి గిరిజన యువతులు తమ మాన, ప్రాణాలను కోల్పోతున్నారు. కాంట్రాక్టర్లు, వ్యాపారస్తుల స్వార్థ ప్రయోజనాల కోసం అమాయక గిరిజన యువతి, యువకుల మాయ రోగాలకు బలి అవుతున్నారు. అలా బలి అయిన వారిలో ఈ ముసలి "పొద్దన్న రెడ్డి" కూతురు బంత్తెమ్మ కూడా ఓ కాంట్రాక్టు చేతిలో బలిపశువు అవుతుంది. ఈలాంటి అఘాయిత్యాలను చూడలేక ఆ పెద్దమనిషి గోదావరిలో దూకడం పెనువిషాదం.

శిరంశెట్టి కాంతారావు కథలు విభిన్న కోణాలలో వాస్తవిక జీవితానాకి అద్దం పడుతున్నాయి. ప్రపంచీకరణ దుష్ఫలితాలు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో వచ్చే మార్పులు, వలస బ్రతుకులకు లేని భరోసాలు, ఫ్యాక్టరీల,సెజ్‌ల పేర్లతో గ్రామీణ వ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తున్న ప్రభుత్వ విధానం మనకు వీరి కథల్లో వర్తమాన సమాజ పోకడలను చిత్రిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1) చొరబాటు - కథల సంపుటి
2) ఉపాధ్యాయ మాసపత్రిక - ఫిబ్రవరి 2013
3) నవ్య వారపత్రిక - అక్టోబర్,2013
4) పాటపిట్ట మాసపత్రిక - 2013

❀❀❀

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# శ్రీకృష్ణతులాభారం - పద్యనిర్మాణ సౌందర్యం

- ధర్మకారి అశోక్ బాబు, జూ॥ లెక్చరర్, ప్రభుత్వ జూ॥ కళాశాల (టౌన్), కర్నూలు.

పద్యానికి గణాలు, యతిప్రాసలు అని కొన్ని నియమ నిబంధనలున్నాయి. ఇవి గద్యానికి ఉండవు. పద్యం ద్వారా సహృదయుడిని రంజింపచేయవచ్చు. అయితే గద్యం ద్వారా సహృదయుడిని రంజింపచేయలేమా అంటే గద్యం ద్వారా కూడా చెయ్యవచ్చు. పద్యంద్వారా అయితే మరింతగా ఆకట్టుకోవడానికి ఆస్కారమెక్కువగా ఉంటుంది. గణాలు, యతులు, ప్రాసలు ఉన్నందువల్ల చెప్పవలసిన విషయాన్ని నొక్కి చెప్పడానికిగానీ, తేల్చి పలకడానికి గాని అవకాశముంటుంది. ఆయా సందర్భాలకు అనుగుణంగా ఆయా వృత్తాలను లేదా ఆయా దేశీయ ఛందస్సులను ఉపయోగించవచ్చు. ముఖ్యంగా నాటకంలోని పద్యాలను రాగయుక్తంగా చదవడానికి ఆయా వృత్తాలు బాగా ఉపయోగపడతాయి. పద్యగతి చక్కగా ఉండడంవల్లనూ ఒక విధమైన తూగు, లయ ఉండడం వల్లనూ ఆయా సన్నివేశాలకు తగ్గట్టుగా వివిధ రాగాలు కూర్చుకోవడంవల్లనూ ప్రేక్షకులను రంజింపజేస్తాయి. పాత్రలు ఒకదానితో ఒకటి తర్కించేటప్పుడు భీమప్లాస్ రాగంతోనూ ఆనందసమయంలో మోహన రాగంతోనూ విషయాన్ని వివరించే సమయంలో కల్యాణి వంటి రాగాలతోనూ రౌద్ర సన్నివేశాలలో శ్రీరాగంతోనూ దుఃఖ సన్నివేశాలలో అంటే కరుణరసం ఉట్టిపడే సన్నివేశాలలో మాలకోసు లేదా తోడి రాగంతోనూ ఇతర సన్నివేశాలలో అఠాణావంటి రాగాలతోనూ పద్యాలు పాడడం పరిపాటి. అందువల్ల పద్యాలు సుందరంగా ఉంటాయి. కవి వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకునే తన పద్యాన్ని నిర్మించి ఉంటాడు.

ఒక్కొక్క పద్యంలో ఒక ఎత్తుగడ, వాక్యంతీరు, మాటతీరు, అర్థగాంభీర్యం, పదాల కూర్పు, అలంకార ప్రయోగం భావానుగుణం, వ్యంగ్యవైభవం, విరుపులు, ఆరోహణం అవరోహణం, చమత్కారం, అవహేళన మొదలైన అంశాలు ఎన్నో ఉంటాయి. నుడికారాలు కూడా చొప్పించి ప్రజావ్యవహారానికి సన్నిహితంగా, సరళంగా పద్యం ఒక్కసారి వింటేనే అర్థమయ్యేటట్లుగా రచియించడం నాటకకవులకు వెన్నతో పెట్టిన విద్య. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని రచియించడంవల్ల పద్యానికి ఒక సౌందర్యం ఏర్పడుతుంది. ఇలా రచియించడం 'శిల్పం'. అదే కళ అవుతుంది. నన్నయాదులు దీన్ని 'పద్యవిద్య' అన్నారు. నన్నయ వాల్మీకిని 'గురుపద్యవిద్య'కు ఆద్యుడని స్తుతించాడు. అందరి నాటక కవులలాగే ముత్తరాజు సుబ్బారావు కవి కూడా ఈ నాటకంలో పద్యాలను ఆయా విధాలుగా (పైన చెప్పినట్లుగా) రచియించాడన్న సంగతి పద్య నిర్మాణ శిల్పాన్ని పరిశీలిస్తే విశదమవుతుంది.

నారదునికి శ్రీకృష్ణుడు 'భార్యావిధేయుడు' గాక 'భక్త విధేయు'డని నిరూపించాలని ఉంది. అంతేకాకుండా సత్యభామ తన ప్రాణేశ్వరుని సంపూర్ణానురాగం తనపట్ల మాత్రమే ఉందని చీటికీ మాటికీ తన సవతులతో తగవులాడుతూ ఉంటుందని ఆమెకుగల ఆ గర్వాన్ని అణచి ప్రేమకూ భక్తికీ తేడాను తెలియజెప్పాలని ఆమెను కూడా భక్తురాలిగా చెయ్యాలని తద్వారా శచీదేవికి ఆనందం చేకూర్చాలని నారదుడు సంకల్పిస్తున్నాడు. దానికి ఏదో విధంగా కలహాన్ని కల్పించి తర్వాత సత్యాదేవికి 'పుణ్యక వ్రతం' ఉపదేశించి పారిజాతవృక్షాన్ని, వాసుదేవుని దానంగా పరిగ్రహించి సత్యభామను రుక్మిణిలాగా భక్తురాలిగా చేస్తానని నారదుడు పూనుకున్నాడు. తన మనోభీష్టం నెరవేరాలంటే దైవ సహాయం కావాలని, అందుకు 'నిన్ను నమ్మినవారి కేమి కొరత' అని పూర్వం దైవాన్ని నమ్మినవారు ఎలా గట్టెక్కినదీ కొన్ని ఉదాహరణలు నారదుడు ఇలా ఉటంకిస్తున్నాడు.

సీ॥ దుర్వాసు నస్త్రంబు ద్రుంపగా నిను వేడు
నంబరీషున కెట్టి ఆర్తి గలిగె?
జనకు బాధలనుండి మనుపగా నినుగొల్చు
ప్రహ్లాదునకు నెట్టి బాధగలిగె?

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC Approved Journal No. 42500

దుశ్శాసనునిబారి తొలిగింప నిన్నెన్ను
ద్రుపదపుత్రిక కెట్టి దొసగు గలిగె?
మొసలి మోమునుండి ప్రోవగా నిన్నెంచు
నిభరాజునకు నెట్టి యెగ్గు గలిగె?
తే॥ వారు వీరననేల నీ భక్తతతికి
నార్తరక్షణ నీ వుండ నార్తిగలదె?
శిష్ట పోషణ! నీ వుండ చింతగలదె?
భక్తవత్సల! నీ వుండ భయముగలదె?
(ద్వి.అం.ప్ర.రం.1)

ద్వాదశీ వ్రతాన్ని చేసిన అంబరీషునిపై కోపించి దుర్వాసుడు అతనిని చంపాలని జటను పీకగా అది కృత్యగా మారి ప్రళయాగ్ని జ్వాలలు కక్కుతూ అంబరీషుని పైకి వచ్చింది. ఎక్కడనుంచో సుదర్శనచక్రం వచ్చి కృత్యను భస్మంచేసి, అంతటితో ఆగకుండా దుర్వాసుని వెంట పడింది. చక్రానల జ్వాలల రక్షణపొందలేక శివుని మాట ప్రకారం అంబరీషునే శరణువేడి ఆ చక్రానల జ్వాలలనుంచి తనను కాపాడుకున్నాడు. ఆ విధంగా హరి భక్తునిపై కోపగించిన దుర్వాసుడు మళ్ళీ ఆ భక్తుని శరణే పొందాల్సివచ్చింది. ప్రహ్లాదుడు తన శత్రువైన హరినామ స్మరణం చేస్తున్నాడని, కొడుకని కూడా చూడకుండా హిరణ్యకశిపుడు ఏనుగులచేత చంపించాలని ప్రయత్నించినా, పర్వతాలపైనుంచి కిందికి విసరినా, మరెన్నో హింసలు పెట్టినా నిన్ను కొలిచిన ఆ ప్రహ్లాదునికి ఏమీ బాధ కలుగలేదు. పాండవులు మాయాద్యూతంలో ఓడి పోయిన తర్వాత ద్రౌపదిని వస్త్రాపహరణం చెయ్యాలని దుశ్శాసనుడు దుర్యోధనుని ఆజ్ఞప్రకారం ప్రయత్నించగా నిన్ను కొలిచిన ఆమెకేమీ దోషం కలుగలేదు. కొలనులో తన నోటితో పట్టుకున్న మొసలి బారినుంచి కాపాడమని నిన్ను కోరిన ఆ గజరాజుకు ఏ కీడూ కల్గలేదు. వాళ్ళు వీళ్ళని చెప్పడం దేనికి! నీ భక్త సమూహానికి నీవు ఉండగా ఆర్తి ఉండదు నీవు ఉండగా చింత ఉండదు, భయమూ ఉండదని నారదుడు హరిని కొనియాడాడు. అలాగే తాను తలపెట్టిన కార్యం కూడా నెరవేరుతుందని ఆ ముని నమ్మకం. నాలుగు పాదాలలో నలుగురి మహా భక్తుల కథలు వర్ణితమయ్యాయి. శ్రీహరిని నమ్ముకున్న ఆ భక్తులందరికి ఏ ఆపదా కలగనట్టే, తనకు కూడా ఏ ఆటంకం లేకుండా కార్యం జరగాలని నారదుని కోరిక, నమ్మకం కూడా.

ఈ సీస పద్యంలోని నాలుగుపాదాలలో అర్ధపాదం చివర 'ఎట్టి ఆర్తికలిగె, ఎట్టి బాధ కలిగె, ఎట్టి దొసగు కలిగె, ఎట్టి యెగ్గు కలిగె' అని అంత్యాను ప్రాసలున్నాయి. నమ్ముకున్న భక్తులకు ఎట్టి ఆపదా కల్గదని గట్టిగా చెప్పినట్లయింది. పద్యమంతా ఇలా ఒకే నిర్మాణంతో నడపడం పద్యవిద్య. అదేవిధంగా గీత పద్యంలో 'నీ వుండ ఆర్తి గలదే?. నీ వుండ చింతగలదె? నీ వుండ భయముగలదె?' అని ఒకే విధమైన నిర్మాణ ముండ డంతో పద్యం మరింత సౌందర్యవంతమయింది.

కృష్ణుడు రుక్మిణి, జాంబవతి, మిత్రవిందల వేడుకోలు విని సత్యభామను ఈ స్వల్ప విషయానికి ఇంత పట్టుదల దేనికి అంటూ ఈ విధంగా తర్కిస్తున్నాడు.

ఉ॥ ఎన్నడు వేడరాని వనజేక్షణ రుక్మిణి వచ్చి నిన్నునున్
నన్నును నేడు పుట్టిన దినంబని యెంతయు ప్రేమతోడ, మృ
ష్టాన్నము లారగింప స్వగృహంబునకున్ దయసేయ వేడుచో
కన్నడ సేయబూనెదవు కంజదళాక్షి! యిదేటి న్యాయమే ? (ద్వి.అం.ద్వి.రం.15)

ఏ నాడు కోరని, రాని రుక్మిణి వచ్చి నిన్నూ, నన్నూ నేడు తన పుట్టిన దినమని ఎంతో ప్రేమతో మృష్టాన్నము లారగించడానికి తన ఇంటికి రమ్మని వేడుకుంటే ఎందుకు నీవు అలుగుతున్నావు సత్యా! నీకు ఇదేమి న్యాయమే అని కృష్ణుడు సత్యతో అన్నాడు.

ఇక్కడ సన్నివేశానికి తగ్గట్టుగా ద్విత్వ న కార ప్రాసను (న్న) కవి ప్రయోజనంగా వాడుకున్నాడు. ఎన్నడూ వేడని రుక్మిణి వచ్చింది. 'ఎన్నడు' అన్నప్పుడు ఆ ద్విత్వ నకార (న్న) ప్రాస నొక్కి చెప్పడానికి ఉపయోగపడింది. 'నిన్ను నన్నును' అన్నప్పుడు కూడా ద్విత్వ నకార ప్రాసలు ఉం డడంతో నొక్కి చెప్పినట్లయింది. 'కన్నడ సేయబూనెదవు'

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


అన్నప్పుడు కూడా ద్విత్వ నకార ప్రాస ఉండడంతో ఇంతగా కోపగించుకుంటావు ఎందుకు అని నొక్కి చెప్పినట్లయింది. 'స్వగృహంబునకున్ దయసేయ వేడుచో...' అన్న వాక్యపు తీరులో రుక్మిణి ఎంతగా బ్రతిమలాడుకుంటున్నదో మనకు అర్థం అవుతుంది. ఈ విధంగా ఈ పద్యంలో ప్రతి వాక్యపు తీరు, ప్రతి పదమూ, ప్రతి ఊనిక భావాభివ్యక్తీకరణకు ఉపయోగపడుతోంది. వ్యర్థపదాలే లేవు. 'ఇదేటి న్యాయమే!' అన్నప్పుడు ఇది నీకు న్యాయమేనా అని నిలదీసినట్లుగా ఉంది.

తన్నిన కాలునే ముద్దు పెట్టుకుంటారు ప్రియులు, అదే నయమూ భయమూ ప్రీతితో ఉపచారాలు చేసే స్త్రీలను పురుషులు పట్టించుకోరు అని జాంబవతి అంటే సత్యభామ దానికి స్పందిస్తూ రసికవర్యుల చర్యలు భల్లూకపుత్రికి (జాంబవతికి) ఎరుకపడునా! అంటూ ఇలా అన్నది.

తే॥ తాను వలవని సతి మహాదరముకంటె
తాను వలచిన సతి కాలి తన్నె మేలు
తాను వలవని సతి ఘనస్తనము కంటె
తాను వలచిన సతి ప్రల్లదమ్మె ప్రియము
(ద్వి.అం.ద్వి.రం.17)

భర్త తాను వలవని (ఇష్టపడని) సతి మహాదరం కంటే తాను వలచిన (ఇష్టపడిన) కాలి తన్నే రుచిగా ఉంటుంది. తాను ఇష్టపడు సతి కఠిన స్తనం కంటే తాను వలచిన సతి కఠిన వాక్యమే ఇష్టంగా ఉంటుంది. వలచిన సతికి వలవని సతికి భేదాలు చూపిస్తోంది సత్యభామ. సత్య భామ కోపంతో చెప్పినా లోక నైజం చెప్పింది.

**వలచిన సతి :**

1. మహాదరం - నయమూ భయమూ ప్రీతితో ఎంతో ఉపచారాలు చేస్తుంది. అయినా భర్తకు ఆమెపై ఇష్టం ఉండదు.
2. ఘనస్తనం కలిగి ఉన్నా ఆమెపై ఇష్టం ఉండదు.
3. వలచిన సతి మహాదరము కంటె తాను వలచిన సతి కాలి తన్నె మేలు

**వలవని సతి :**

1. ప్రీతితో భర్తకు ఉపచారాలు చేయకపోయినా ఆమె కాలి తన్నే - ఇంపుగా ఉంటుంది భర్తకు.
2. కఠిన వాక్యాలను పలుకుతుంది - అయినా భర్తకు ఆ కఠినోక్తులే ఇష్టమౌతాయి.
3. తాను వలవని సతి ఘన స్తనము కంటె తాను వలచిన సతి ప్రల్లదమ్మె ప్రియము.

కవి ఈ తేటగీతి చిన్న పద్యంలో 2 వాక్యాలలో నాలుగు ఉపవాక్యాలలో చాలా చక్కగా వలచిన సతికి వలవని సతికి తేడాలు చెబుతూ వలచిన సతి ఎంత కఠినంగా ఉన్నా, ఏ ఉపచారమూ భర్తకు చేయకపోయినా ఆమెను ఎంతగా ఇష్టపడతాడో భర్త అన్న విషయాన్ని సవివరంగా చెప్పాడు కవి.

శ్రీకృష్ణుడు నారదుణ్ణి తాను రుక్మిణి ఇంటికి పోవాలా లేక సత్యభామ ఇంటికి పోవాలా అని చెప్పుమని అడిగి నప్పుడు నారదుడు "భక్తజనావసక్తుండవై అవతారంబు దాల్చిన మీకు నీ తరుణమున కరణీయమును నేను దెలుపవలయునా?" అన్నాడు. దానితో కృష్ణుడు రుక్మిణి ఇంటికే వెళ్ళిపోయాడు. నారదుడు భక్తవత్సలుడవయిన నీకు చెప్పగలిగినంత వాడినా అన్నప్పుడు కృష్ణుడు భక్త పక్షపాతి కాబట్టి భక్తురాలైన రుక్మిణి ఇంటికే వెళ్ళాడు కదా! అని సత్యభామ నారదుడిపై కోపంగా ఉంది. నారదుడు సత్య ఇంటికి వచ్చినప్పుడు అదే మాట అన్నది. స్వల్పంగా పరాభవ మెదురయినప్పటికీ నీకు పరమా నందం కలిగించటం కోసమే అలా చేసితినని భావించమని నారదుడు అన్నాడు. అయినా నీ వది గుర్తించకపోతే పోదువు గానీ ఇప్పుడు కావలిస్తే నీకు ఉపకారం చేస్తాను అడుగుమని నారదుడన్నాడు. అప్పుడు నళిని (చెలికత్తె) ఇందాకా నీవు కాంక్షించిన భర్త వశీకరణం మంత్రమేదైనా అడగడానికి ఇదే సమయమని చెవిలో చెబుతుంది. అప్పుడు సత్యభామ "మునీశ్వరా! నిజంగా నా కోరిక తీరుస్తారా! నీవు అలా తీర్చినట్లయితే నా దుఃఖమంతా మాయమైపోతుం"దని అంటుంది. నాచేతనైతే నీకు తప్పకుండా సహాయం చేస్తాను. అయినా నీ బోంట్లవారికి

దుఃఖం కూడా ఉంటుందా!'' అంటూ సత్యభామ గొప్ప తనాన్ని, వైభవాన్ని నారదుడు ఇలా వర్ణించాడు.

సీ॥ సూర్యాన్వయాంబోధి శుభ్రాంసుడైన స
త్రాజిత్తు నింట నుద్భవము గాంచి
సౌందర్య సౌశీల్య సౌభాగ్యవతులలో
రూపురేఖాదుల నేపు మీరి
జపతపోనుష్ఠాన సంధానమున నైన
చిక్కని శ్రీకృష్ణు చెట్టబట్టి
సేవలందుటె కాని సేవించు టెఱుగని
సీమంతినుల చేత సేవలంది
తే॥ ధన్యురాంౘ్రను నెల్లర ధన్యవయ్యు
నెప్పు డానందవారాశి దొప్పదోగ
అన్యకాంతల కైవడి హాయి వీడి
బేల నీకేల యీ లీల జాలిదూల
(ద్వి.అం.తృ.రం.22)

సూర్యవంశ సముద్రంలో శుభ్రమైన కిరణాలు గల సత్రాజిత్తు నింట పుట్టి; సుందరమైన మంచి శీలవంతుల సౌభాగ్యవతులలో నెల్ల రూపు రేఖాదులలో ఏపు మీరి; జపతపోనుష్ఠానములచేత కాని చిక్కని (దొరకని) శ్రీకృష్ణణ్ణి చెట్టబట్టి (పెండ్లాడి); సేవలందుకోవడమే గాని సేవచేయడ మెరుగని సీమంతినుల చేత సేవలు పొంది; ధన్యురాండ్రలో కెల్లా ధన్యురాలవయ్యి; ఎప్పుడూ ఆనంద సముద్రంలో తేలియాడుతుండగా అన్యకాంతల మాదిరిగా సంతోషాన్ని విడిచిపెట్టి బేలా నీకేల ఈ విధంగా చింతజేయడం? ఎందుకు నీవు ఇంతగా చింత చెయ్యాలి - అని నారదుడు సత్యభామను ఓదార్చాడు.

సూర్యవంశమంతటి శుభ్రమైన వంశంలో పుట్టింది సత్యభామ అని గుర్తు చేశాడు నారదుడు. సుందరీ మణులు, సుశీలవంతులు, సౌభాగ్యవంతులలో కెల్లా మంచి రూపంతో సత్యభామ ఉంది. సత్యభామ అందరి కంటే రూపవతి అని నారదుడు స్తుతించాడు. శ్రీకృష్ణణ్ణి పొందాలంటే జపతాపాదులు చేసిన కాని దొరకడు. అటువంటి కృష్ణణ్ణి నీవు సులభంగా చేపట్టావని నారదుడు సత్యను మెచ్చుకున్నాడు.

అటువంటి సత్యభామకు ఇంతటి చింత ఎందుకు అని నారదుడన్నాడు. "బేల నీకేల యీ లీల జాలి దూల" ఇన్ని లకారాను ప్రాసలతో చెప్పాడంటే ఇంత చింత ఏల నీ పాసుగూలా! అన్నట్టుగా ఉంది నారదుడి మాటల్లో. సూర్యవంశము - శుభ్రాంశుడు 'శు'పై యతిమైత్రి ఉంది కాబట్టి ఎంతటి శుభ్రమైన వంశమో, ఎంతటి స్వచ్ఛమైన వంశమో, ఎంత గొప్ప వంశమో ఆ యతిమైత్రి స్థానమే తెలియజేస్తుంది. 'శు' అక్షరాన్ని నొక్కి చదవాలి. రెండవ పాదంలో 'సౌందర్య - సౌభాగ్య' పదాల్లో 'సౌ' యతి స్థానంలో ఉంది. మిక్కిలి సౌభాగ్యవతి సత్యభామ అని నొక్కి చెప్పడానికి ఈ యతిమైత్రి తెలియజేస్తుంది. 'జపతపోనుష్ఠాన - సంధానము' 'సంధానం'లోని 'సం' పై యతిస్థానాన్ని కూడా నొక్కి చదవాలి. జపతపాదుల సంధానం చేత కాని దొరకని కృష్ణుడు నీ కత్యంత సులభంగా దొరికాడంటే నీవెంత అదృష్టవంతురాలవో అని మెచ్చుకున్నాడు నారదుడు. 'సేవలందుటె కాని - సేవించు టెఱుగని' అన్నప్పుడు యతిమైత్రి స్థానమైన 'సే' ని నొక్కి చదవాలి. సేవించుటే ఎఱుగని సీమంతినుల చేత సేవలు పొందడమంటే - సేవలు చేయించుకోవడమంటే సామాన్యమైన విషయం కాదని భావం. 'ధన్యురాండ్రు - ధన్యవు' పదాల్లో 'ధ' యతిస్థానంలో ఉంది. 'ఎప్పుడు - దొప్పదోగ' లో ప్రాసయతి మైత్రి ఉంది. 'అన్య కాంతలు - హాయి వీడి' పదాలలో 'అ-హ'లకు సరసయతిమైత్రి ఉంది. అదే విధంగా 'బేల- జాలి దూల'లో 'బేల -జాలి' అని ప్రాసయతిమైత్రి ఉంది. ఈ సీసపద్యంలోని ప్రతి అర్ధపాదంలోని యతిమైత్రిని తేటగీతిలోని పాదంలోని యతిమైత్రిని నాటక కళాకారులు నొక్కి చదువుతారు. దీనికి ఒక విధమైన లయ-తూగు వస్తుంది. 'శ్రీకృష్ణ తులాభారం' చలన చిత్రంలో కూడా ఘంటసాలగారు ఈ పద్యాన్ని అలాంటి లయతోనూ, తూగుతోనూ, ఊనిక తోనూ, యతిమైత్రి స్థానాల్లోని అక్షరాలను నొక్కుతూ అద్భుతంగా పద్యాన్ని చదివారు. ఈ పద్యానికున్న గొప్ప తనం అది. యతిమైత్రి స్థానాలు, ప్రాసయతిమైత్రి స్థానాలు ఈ పద్యంలో చక్కగా కూర్చబడి పద్యగాయ

కులతో పాటు శ్రోతలకు కూడా హాయిని చేకూరుస్తుంది. శ్రోతలందరూ ఆనంద సముద్రంలో తేలిపోతారు.

సత్యభామ శ్రీకృష్ణుణ్ని తులతూచలేకపోయేటప్పటికి ఆయనను ఎవ్వరూ కొనేవారు లేకపోయేటప్పటికి నారద కృష్ణుల సలహా మేరకు సత్యభామ రుక్మిణిని కృష్ణుణ్ణి తులతూచడానికి పిలుచుకు రావడానికి వెళుతుంది. మొదట మానవమాత్రురాలిగా సంశయించినప్పటికీ పతి ఆజ్ఞ తెలుసుకొని రుక్మిణి బయలుదేరుతుంది. అప్పుడు సత్యభామ రుక్మిణితో అక్కా! దేనితో కృష్ణుని తుల తూచెదవని అడుగగా, రుక్మిణి భక్తి ఒకటి ఉండాలే కాని దేనితోనైనా ఈ కార్యాన్ని సాధించవచ్చు. అయినా హరి సమారాధనకు ప్రధానం తులసీదళమని పెద్దలంటారు. తులసీమాహాత్మ్యం వర్ణనాతీతమంటూనే తులసీ మాహాత్మ్యాన్ని ఇలా చెబుతుంది రుక్మిణి.

సీ॥ తులసీమహీజంబు విలసిల్లు స్థలమున
సిరియును వాణియు వరలుచుండ్రు
తులసిచెట్టున కొక కలశంబు జలమిడ
పాపౌఘములు పటాపంచలగును
తులసీదళంబు నౌదల ధరియించిన
కరతలామలకమౌ పరమపదము
తులసివృక్షమును పూజలచేత దన్పిన
పుణ్యంబు లెల్లను ప్రోదిగాంచు
తే॥ హరిసమారాధనకు వసుంధరను తులసి
కంటె మించిన వస్తు వొక్కటియు లేద
టంచు బుధులాడుచుందు రో అతివలార!
తులసియే తగు మాధవు తులనుతూప.
(తృ.అం. చ.రం.34)

తులసిచెట్టు ఉండే చోట లక్ష్మీ సరస్వతులిద్దరూ నివసిస్తూ ఉంటారు తులసిచెట్టుకు ఒక చెంబునీళ్ళు పోస్తే పాపసమూహాలన్నీ పటాపంచలౌతాయి. తులసీ దళాన్ని తలపై ధరించినా, తులసీమాలను మెడలో దాల్చినా పరమపదం ప్రాప్తిస్తుంది. తులసిచెట్టును పూజిస్తే పుణ్యాలన్నీ ఒక చోట చేరి ఫలితాన్ని ఇస్తాయి. హరి సమారాధనకు ఈ భూలోకంలో తులసికంటే మించిన వస్తువు ఇంకొక్కటి లేదని బుధులు చెబుతూ ఉంటారు ఓ అంగనలారా! కాబట్టి కృష్ణుణ్ణి తులతూచడానికి తులసియే తగువైనది అని రుక్మిణి తోటి భార్యలతో చెప్పింది.

తులసిచెట్టు ప్రకృతిపరంగా మహిమగలదే కాకుండా ఔషధగుణం కల్గినది కూడా అవుతుంది. దగ్గు, జలుబు చేసినప్పుడు నీటిలో వేసుకొని ఉడకబెట్టుకొని మిరియా లతో కలిపి త్రాగితే జలుబుకు ఉపశమనం కల్గడమే కాకుండా, రోజుకు రెండుపూటలు ప్రకారం రెండు రోజులు త్రాగినంత మాత్రానే బొంగురు పోయిన గొంతు కాని, మూగబోయిన గొంతు కాని స్పష్టంగా పలుకుతుంది. తులసీదళాన్ని పచ్చిదే అలాగే తీసుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. దానితో సరస్వతి వశమైనట్లే కదా! ప్రతిదినమూ నాలుగు తులసి అకులు తింటే ఆరోగ్యానికి మంచిది. దానికి తోడు తులసిచెట్టు ఉండే చోట లక్ష్మి కూడా నివసిస్తుంది. కాబట్టి అటు ధనానికీ, ఇటు చదు వుకూ తక్కువ ఉండదు. తులసిని పూజిస్తే పుణ్యాలు ఒనగూడతాయి. తులసిచెట్టుకు ఉదయం పూటే ఒక నిండు కడవలోని చెంబునీళ్ళు పోస్తే పాపాలన్నీ పటా పంచలైపోతాయి. 'పాపౌఘములు పటాపంచలగు' నని పాపాలు నాశనమౌతాయని దాని యతి మైత్రి నొక్కి చెబు తుంది. పాపాలు పోవడమే కాదు, పుణ్యాలు ఒనగూడు తాయని నాల్గవపాదం చెబుతుంది. 'పుణ్యంబు లెల్లను ప్రోదిగాంచు'నన్న అర్ధపాదంలో పుణ్యాలు ప్రోదిగడ తాయని యతిస్థానంలో ఉండడంవల్ల గట్టిగా నొక్కి చెప్పినట్లయింది.నమ్మకపు గాఢతను తెలియజేస్తుంది. ఈ పద్యం మోహనరాగానికి, అఠాణారాగానికి, కల్యాణిరాగానికి అనువుగా ఉంటుంది. తులసీమహిమను చెప్పే ఈ పద్యం చాలా ప్రసిద్ధమైనది. ఆంధ్రదేశంలో కాకుండా భారత దేశంలోనే తులసిచెట్టును తులసీమాతగా కొలుస్తారు. తులసిపండుగను కూడా చేస్తారు. తులసీ వృక్షం ఉన్న బృందావనానికి చీరకట్టి గాజులు, పసుపు, కుంకుమ పెట్టి పూలు, పళ్ళు, తాంబూలాలను (రవికె గుడ్డలు కూడా కొన్ని సమయాల్లో వారివారి అవకాశాన్ని బట్టి, శక్తిని బట్టి) ముత్తయిదువలకు పంచిపెడతారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

అందుకే నాటకంలో కూడా ఈ పద్యం పాడేటప్పటికి ప్రేక్షకుల మనస్సంతా భక్తితో నిండిపోతుంది.

శ్రీకృష్ణుణ్ణి తూచడానికి రుక్మిణి తులసీదళం చేతబట్టుకొని -

ఆ॥ ఫలమొ ఘనరసంబొ పత్రమో పుష్పమో
కొనుచు భక్తి నిన్ను గొలుచువారి
కీవు వశుడ వగుటయే సత్యమేని యీ
తులసీదళము నిన్ను తూచుగాత.

(తృ.అం.పం.రం. 38)

ఫలమో, పత్రమో, పుష్పమో, తోయమో (నీరో) తీసుకొని భక్తితో నిన్ను గొలిచేవారికి నీవు వశం కావడమే నిజమయితే ఈ తులసీదళం నిన్ను తూచుగాక! అని రుక్మిణి తులసీదళాన్ని త్రాసులో వెయ్యగా కృష్ణుడు కూర్చున్న వైపు పైకి పోతుంది. తులసీదళం వేసినవైపు కిందికి పోతుంది. శ్రీకృష్ణుడు త్రాసునుంచి దిగుతాడు. నారదుడు ఆ తులసీదళాన్ని నెత్తిపై పెట్టుకొని నృత్యం చేస్తాడు.

తర్వాత కృష్ణుడు సత్యా! నీకేమైనా కోరిక ఉంటే తెల్పుము, ప్రసాదిస్తానంటాడు. దేవా! ఇంకా నాకు కోరిక ఏముంటుంది! అయినా రుక్మిణీదేవిలాగా మీ భక్తురాలిని చెయ్యండి. అదియే నా కోరిక అంటూ ఇలా ప్రార్థిస్తోంది సత్యభామ.

శా॥ నీ కైంకర్య మొనర్చునట్టి కరముల్ నిన్గాంచు నేత్రంబులున్
నీ కత్రాంతము మొక్కునట్టి శిరము న్నీ సేవపై బుద్ధులన్
నీ కావ్యంబుల నాలకించు చెవుల న్ని న్నెంచు జిహ్వాగ్రమున్
సాకల్యంబుగ నా కొసంగు హృదయేశా! భక్త చింతా మణీ!

(తృ.అం.పం.రం.41)

నీకు సేవ జేసే చేతులను, నిన్ను చూసే నేత్రాలను (కళ్ళను), నిన్నెల్లప్పుడూ మ్రొక్కే శిరస్సును (తలను), నీ సేవపై - నీ ప్రవచనాలపై నిలిపే బుద్ధులను, నీ కావ్యాలను ఆలపించే (వినే) చెవులను, నీ గురించి పలికే నాలుకను (నోరును), సాకల్యంగా - సార్థకమయ్యేటట్లుగా నాకు ఇవ్వు హృదయేశా! భక్త చింతామణీ! అని వేడుకొన్నది సత్యభామ.

ఇక్కడ మనిషి సకలావయవాలు పరమాత్ముని సేవలో పాల్గొనేటట్లు చేయమని ప్రార్థించింది సత్యభామ. భగవంతుని సేవలో తరించే చేతులు, భగవంతుని దర్శించే కళ్ళు, పరమాత్మణ్ణి మ్రొక్కే తల, దైవంపై మాత్రమే నిలిపే బుద్ధులు, సర్వవ్యాపకుడికి చెందిన కావ్యాలు వినే చెవులు, సంశుద్ధాత్మణ్ణి సంస్తుతించే జిహ్వ (నాలుక) నాకు ప్రసాదించు అని సత్యభామ మనసారా వేడుకొన్నది. అద్భుతమైన పద్యమిది. భక్త చింతామణీ! అని సంబోధించిందంటే పరమాత్ముడికి భక్తుల కోరికలను నెరవేర్చే స్వభావం ఉంటుంది కాబట్టి చింతామణితో పోల్చింది.

చింతామణికి కోరిన కోరికలు నెరవేర్చే గుణం ఉంటుంది. అందుకే పరమాత్ముడు 'భక్త చింతామణి' అయ్యాడు. 4వ పాదంలో 'సాకల్యంబుగ నా కొసంగు హృదయేశా! భక్త చింతామణీ' అని 'సా-శా'లపై కాకు స్వరయతిమైత్రి. కాకుస్వరం అంటే ఎంత దీర్ఘమైనా తీయవచ్చు. 'హృదయేశా' అని సుదీర్ఘంగా సత్యభామ పాత్రధారిణి రాగాలాపన చేస్తుంది. నా సకలావయవాలూ భగవత్సేవలో పాల్గొనేటట్లుగానే ప్రసాదించమని నొక్కి ప్రార్థించడానికి ఈ కాకుస్వరయతిమైత్రి సార్థకంగా ఉంది.

కృష్ణుడు నారదా! సురకార్యం నెరవేరిందా! ఇంకేమి కావాలి? అంటాడు. జాంబవతీ, మిత్రవిందలిద్దరూ మమ్మల్నికూడా భక్తురాండ్రుగా చెయ్యమని కోరతారు. నా మాటకూడా మరువవద్దంటాడు వసంతకుడు. అట్లే చేస్తానంటాడు కృష్ణుడు. నారదుడు కృష్ణా! నీ భక్త వాత్సల్యం లోకవిదితమయింది. ఇంద్రాణి ప్రభృతులు పారిజాతలాభంతో ప్రమోదం పొందారు. రుక్మిణీదేవి భక్తి తేటతెల్లమయింది. సత్యభామాదేవి ప్రేమ భక్తిగా పరిణమించింది అంటాడు. నాటకమూ సఫలమయింది. జగన్నాటకమూ సఫల మయింది. నారదుని కలహక్షుత్తు (కలహమనే ఆకలి) శాంతి చెందింది.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ప్రశ్నను ప్రగతికి సంకేతం చేసిన కాళోజీ మార్గం

**- డా॥ జి.కిషన్ ప్రసాద్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

సెప్టెంబర్ 9, 1914లో జన్మించిన కాళోజీ అహరహం శ్రమజీవుల కోసం, పౌరహక్కుల సాధన కోసం, సామాన్యుని కోసం తపించి, శ్రమించి, దోపిడీ వ్యవస్థను ధిక్కరించిన కవి యోధుడు. కుల, మత, వర్ణ, వర్గ రాహిత్య సంస్కృతీ ప్రియుడు. నిష్కళంక ప్రజాకవి. ఆ హెూదాలో కాళోజీది పాల్ రాబ్సన్, సీగర్, మయకోవాస్కీ గద్దర్ వ్యక్తిత్వాలు మూటగట్టుకున్న మూర్తిత్వం. గ్రామాలకు పల్లెవాసులకు శాంతిని సదా కోరుకున్న కాళోజీ హింసను నిరసించిన నాడు, రాజ్యహింసను ఖండించిన వాడూ, ప్రజల ఆత్మ రక్షణార్థం ప్రతిహింసను సమర్థించిన వాడూ, కవనానికి, జీవనానికి మధ్య వైరుధ్యాన్ని దరిచేర నివ్వనివాడూ, నరులను పీక్కొతినే నరహంతకులున్నచోట నరసింహుల అవతారాలను ఆవాహనం చేసి ఆహ్వానించిన వాడు ఈ ప్రజాతత్వం జీర్ణించుకున్నందుననే కాళోజీ "హింస పాపమని యెంచు దేశమున/హిట్లరత్వ మింకెన్నాళ్ళు? అని ప్రశ్నించగలిగాడు.

'నాగోడవ' అని చెప్పింది ఆయన స్వంత గొడవ కాదు. అది ఈ రాష్ట్ర ప్రజల, ఈ దేశ ప్రజల, ఈ ప్రపంచ ప్రజల గొడవ. ఎవరు చదువు కుంటే వారి గొడవ. ఎవరు తాము పౌరులమనుకుంటారో, ఎవరు తమకు తాము సమాజంలో తల ఎత్తుకొని ఒక గౌరవంతో, హక్కులతో, హుందాగా బ్రతుకుకాలనుకుంటారో, వారు ఏమి చేస్తే అలా బ్రతుకుతారో, ఎలా ఉంటే అలా బ్రతుకుతారో చెప్పేదే కాళోజీ 'నాగోడవ' తనకు ఊహ తెలిసినప్పటి నుండి, పౌరుడిగా నిటారుగా నిలబడ్డ నాటి నుండి చివరి శ్వాస వదిలేదాకే కాళోజీ సంధించిన ప్రశ్నల పరంపరే నా గొడవ. ఆ ప్రశ్నలు సంధించాల్సిన అవసరం వచ్చిన చరిత్ర సందర్భాల మాలికే 'నా గొడవ'.

'నా గొడవ'లోని ప్రతిపంక్తి అప్పటి చరిత్రలో జరిగిన అవకతవకలను నిలదీసే ఓ అక్షర కరవాలమే. కాళోజీ ఒక ఏక వ్యక్తి సైన్యం. ఈ ప్రపంచంలోని అందరు ప్రజలు తనలాగే ఏకవ్యక్తి సైన్యాలుగా మారాలనేదే ఆయన ఆశయం. ఎందుకంటే ప్రజాస్వామ్యవ్యవస్థలో ప్రజలే ప్రభువులు. ప్రజలే రక్షకులు.

ప్రతి పౌరుడు తనను తాను రక్షించుకునేందుకు తనకు తాను ఒక ప్రభువులా బ్రతికేందుకు అడ్డుపడే ఏ సందర్భాన్నైనా ముందు తాను ఒక ప్రశ్నై ప్రశ్నించాలి. జవాబు రాకుంటే నిలువెత్తు నిరసనై నిలబడాలి. అదీ కాకుంటే, గొడవ పడైనా వ్యవస్థను గొడుకుపట్టి కాపాడాలని చెప్పేదే కాళోజీ. "నా గొడవ" గొడవ అనగానే ఒక నేరం అనే ఆలోచన అన్ని వేళల సరికాదు. అని చెప్పేందుకే కాళోజీ అంటాడు. హింసతప్పు కాని, ప్రతి హింస తప్పుకాదని. పౌరుడు స్వేచ్ఛగా రాజ్యాంగం ఇచ్చిన అన్ని హక్కులతో హుందాగా బ్రతకడం ముఖ్యం దాని కోసం కొంత గొడవపడినా సమంజసమే ప్రశ్న ప్రజాస్వామ్యానికి ప్రాణం. ప్రశ్నించడమే ప్రజాస్వామ్యాన్ని బ్రతికించుకోవడం. అందుకే "ప్రశ్నను ప్రగతికి సంకేతం చేసిన కాళోజీ మార్గం" మీద ఈ వ్యాసాన్ని రాస్తున్నాను.

ప్రజలు ప్రజలు మేటి ప్రజలు!
ప్రజాస్వామ్యమందు ప్రజలు!
మౌనంగా ఉన్నారేం! మరణాంతర స్థితి మాదిరి
ప్రజాస్వామ్య జీవనది పట్టు తప్పలేదు కదా?
అనవరతము జాగరణము అని వార్యము ప్రజలకను
ప్రజాస్వామ్య మూల మంత్ర పౌరమేల మరచెను
ప్రజ!

కాళోజీ రాసిన వందలాది కవితలు అన్యాయాలను అక్రమాలను ఎదిరించేవి. ప్రశ్నించేవి. మనం చాలా జాగ్రత్తగా గమనిస్తే చాలా కవితల్లో సమస్యను ప్రశ్న రూపంలో కాళోజీ ప్రస్తావించడం గమనించవచ్చు. చివరిలో ఉత్ప్రేరకమైన ఉద్వేగభరితమైన, సందేశాత్మకమైన ముగింపునిస్తారు.

"ప్రజాసామ్య భావన అనేది ఆత్మీయ మానవీయ సంబంధాల వ్యవస్థగా ఉండాలంటాడు కాళోజీ. ఇటు వంటి వ్యవస్థా నిర్మాణంలో ప్రజల పాత్ర గురించి వాళ్ళ భాగస్వామ్యం గురించి చాలా వివరంగా చెప్తాడు. "ప్రజా కీయాలు" అనే కవితలో ప్రజలు సంసిద్ధపడి పూను కుంటేనే రాజకీయాలు ప్రజాకీయాలుగా పరిణామం చెందుతాయంటాడు.

ప్రజస్వామ్య పరిరక్షణలో ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా వుండాలని అదే ప్రజాస్వామ్య మూల సూత్రమన్న ప్రబోధాన్ని కూడా ప్రశ్నరూపంలోనే అందిం చటం కాళోజీ కవిత్వ విశిష్టత.

"పరిస్థితులెట్లా వున్నాయని కాదు
పరిస్థితుల్లో మనమెట్లా వున్నామని" అంటూ
. . . . . . . . . . . . . .
. . . . . . . . . . . . . .

"ప్రశ్నలు" అనే కవితలో కాళోజీ కుబేరులు వారు, పంటలు వారి బేరాలు సాగనీయవు, వారు అసా మాన్యులు, సామాన్యులంటే వారి కసహ్యం. సామాన్యుల సంఖ్య పెరిగితే వారికి భయం. తమ ఆటకట్టకుండా చూసూకుంటారాని ఎప్పుడూ సరికొత్త ఎత్తులు వేస్తూ, ఉన్నవారికి బ్రతుకు లేకుండా చేస్తారని, ముందు వారిని పుట్టకుండా చూస్తారని, ఇదంతా మనకోసమేనని అంటారని తెలిపి, ధనవంతుల గారడీలను ఆవిష్కరించిన కాళోజీ, మనం దీన్ని నమ్మడం ఎందుకని ప్రశ్నిస్తారు.

కాళోజీ ఎంతగా సామాన్యుని పక్షపాతో తెలియజేసే కవిత ఇది. బతుకును వెతల పాలు చేస్తున్నదెవరో తెలిసీ, వాని చేతుల్లో సామాన్యుడు తన తల పెడుతున్నాడని వ్యంగ్యంగా చెప్పారు.

గాంధీని సంబోధిస్తూ వ్రాసిన కవితలో గాంధీ స్వయంగా తన రాజకీయ వారసుడుగా పేర్కొన్న నెహ్రూ పాలనలో నీతి, నిజాయితీ, న్యాయం, సత్యం, అహింస మొదలైన గాంధేయ విలువలు నిర్వీర్యమై పోతుంటే విలవిలలాడిన కాళోజీ " నీ వారసురాజ్యంలో నీతికి తావేది బాపు?/ నీ మాటలు విని ప్రాణం నిలుపుకునే దెట్లు బాపు? అని ప్రశ్నిస్తాడు. /గాంధీ బొమ్మకు పట్టం గట్టి వేలాడదీసి గాంధీ టోపీని కాంగ్రేసు రాజకీయాలకు గుర్తును చేసి, గాంధీ బోధించిన విలువలను మరచి పోయిన జాతి ఆత్మ న్యూనతను ఆధిక్యంగా మార్చుకొని అధికారం చెలాయిస్తూ కాలం గడుపుతున్న తీరును "ఇంకేమి కావలె? ఇంకేమి చేయాలే? బ్రతికినన్నాళ్ళు నిను బాపు అని పిలిచితిమి. చచ్చిపోయిన నిన్ను జాతిపిత జేసితిమి" అన్న మాటలలో వ్యక్తం చేశాడు. పెక్కు భంగుల నిన్ను చెక్కి నిలువేసితిమి. అన్న మాటల ద్వారా గాంధీ జీవిత తత్త్వాన్ని జాతి మంత్రంగా మార్చుకొనే కార్యక్రమమేదీ లేక విగ్రహ ప్రతిష్టాపనలకు పరిమితమైన జాతి ఆత్మ వంచనా లక్షణాన్ని ఎత్తి చూపాడు " నీ పేరుతో టోపి నిత్యమే పోయినది" అన్న ఒక్క మాటలో ఎదుట వారిని ముంచివేసే దుర్మార్గవైఖరే రాజకీయమై కొనసాగుతున్న వైనాన్ని సూచించాడు.

A Single drop of Ink that makes the millions think (ఒకే ఒక సిరాచుక్క/లక్ష మెదళ్ళకు కదలిక అన్న లార్డ్ బెరన్ వాక్యాన్ని అనుకరిస్తూ జనాన్ని చైతన్య వంతులను చేయుటకు ప్రయత్నించే కవి మొదట తాను చైతన్యవంతుడై వుండాలి అంటాడు కాళోజీ.

"సిరా చుక్క " అన్న కవితలో
ఒకే ఒక్క సిరా చుక్క
లక్ష మెదళ్ళకు కదళిక
అన్నాడు బైరన్
నిజమేనా? అది?
మరి నేను ఒలక బోసిన
సిరా సీసాల కొద్ది గాదు
పీపాల కొద్ది
ఏ ఒక్క మెదడు కదలినట్టు లేదు
మొదట నా మెదడులో వుంటేగా కదలిక మరొడ్ని
కదలించ"

తాను కదలనిది మరేదానిని కదలించ లేడన్న సత్యాన్ని చెప్పాడు కాళోజీ ఈ కవితలో.

"నీవు కోరేది సర్వమంగళమైనపుడు
నీ ముడుపు దేవుడైతే మా కెందుకు?
నీవు రాసి పారేసిన కవితలు గుభాలిస్తున్నపుడు
నీవు త్రాగి పారేసిన సీసాలకంపు మాకెందుకు?

సర్వమానవ కళ్యాణం కోసమే కవిత్వాన్ని సృజించిన శ్రీశ్రీ యొక్క వ్యక్తిగత జీవితముతో మనకు సంబంధం లేదని కాళోజీ భావన.

1971లో లోకసభకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ప్రధానమంత్రికి, తెలంగాణ నాయకులకు జరిగిన చర్చలు విఫలం కావడం వల్ల తెలంగాణ ప్రాంతంలో "తెలంగాణ ప్రజా సమితి" అభ్యర్థులు ప్రత్యేక తెలంగాణ నినాదంతో ఎన్నికల్లో పాల్గొన్నారు. అధికారం చేతిలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఓటర్లపై తూటావర్షం కురిపిస్తూ బెదిరించింది. అధికార దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఓటర్లు తూటాలకు భయపడక ప్రత్యేక తెలంగాణాను సాధిస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ప్రజలను భయ పడవద్దని "ఓట్లు -షాట్లు" అనే కవిత ద్వారా చైతన్య పరిచాడు.

"షాట్లు అన్ని ప్రేలితుదకు
ఎన్ని ఓట్లు చంపేస్తై?
షాట్లు అన్ని ఓడిసినాక
మిగిలిన ఓట్లెన్నుంటై?

అని ప్రశ్నిస్తూనే ఓటర్లు ప్రత్యేక రాష్ట్రం కోరు కుంటున్నారని. "ఓట్లన్ని ఒకవైపు" అనే కవితలో స్పష్టం చేశాడు.

కాళోజీ ఒక కవి. ఒక రచయిత. ఒక ఉద్యమకారుడు. ఒక న్యాయవాది, ఒక మేధావి. ఒక తెగింపు, ఒక నిరసన, ఒక ధిక్కారం, ఒక ఉద్యమ సారధి ఒక ఉద్యమ సైని కుడు. ఒక రాజీపడని ఖలేజా, ఒక ప్రశ్న. ఒక కట్టుబాటు.

నైజాం ముష్కర పాలనలో బతుకు భయంతో అయిష్టంగానైనా, ఇతర భాషలలోనే వ్యవహరించే తెలుగు వారిని కాళోజీ

"అన్న భాషలు నేర్చి ఆంధ్రంబురాదంచు
సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా! అని

ప్రశ్నించడమంటే, తెలుగు ప్రజలలో తమ భాష పట్ల, తమ సంస్కృతి పట్ల ఆత్మ విశ్వాసాన్ని తెలియజేయటమే. నిజాం పాలనలో సొంత వేషభాషలకు ఆదరణ లేకపోవుట అనే భాషా సాంస్కృతిక దాస్యాన్ని కాళోజీ నిరసించాడు. మాతృభాషాభిమానం వదిలి పెట్టి హిందువులు ఉర్దూ పత్రికలు చేతితో పట్టుకొని తిరిగేవారని తెలిపి ఆ భావ దాస్యాన్ని నిరసిస్తూ

"నీ వేషభాషలను నిర్లక్ష్యముగ చూచు
భావ దాస్యం బెపుడో బాసిపోవునురా
నీ భాషయందును నీ వేషమందును
స్వాభిమానముడిగిన చవట నీవేరా" అని

నిజాం కాలం నాటి దిక్కార స్వరాన్నే కాళోజి 1969 నాటి తెలంగాణ ఉద్యమ కాలంలోనూ వినిపించాడు. మనిషి బ్రతుకు అవకతవకలకు గురైనపుడు కాళోజీ హృదయం ఆవేదన చెందింది "అవని పై జరిగేటి అవక తవకల జూచి ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు" అని ప్రశ్నించుకున్నాడు.

నైజాం రాజ్యంలో నిజాం రాజు అనుసరించే ద్వంద్వ నీతిని, దమనవైఖరిని, అరాచకపాలనను, ఆనాటి దేశ్ ముఖ్‌లు, పటేండ్లు, పట్వారీలు, రజాకార్లు ప్రజలపై చేసే దౌర్జన్యాలను తీవ్రంగా ప్రతిఘటించాడు. ప్రశ్నించాడు.

ప్రశ్నాత్మక రూపంలో ప్రజాచైతన్యం కలిగించటం కాళోజీ కవిత్వ ప్రత్యేకత. ప్రశ్నించే శైలి కాళోజీ కవిత్వానికి అదనపు ఆకర్షణను చేకూర్చింది. కవిత్వంలో ఆయన కథనాత్మక ఉపన్యాసకుడుగా కనబడుతాడు. నిజాం రాజ్య కాలంలో జరిగిన తెలంగాణ విముక్తి పోరాటంలో నిజాం వ్యతిరేకత అంటే ఫ్యూడల్ పెత్తందారీ రాజ్య వ్యతిరేకతే గాని, ముస్లిం వ్యతిరేకత కాదు. ఫాసిస్టు స్వభావం కలిగిన రాజాకార్లను ద్వేషించడం, మొత్తంగా ముస్లింలను ద్వేషించడం ఒకటికాదు. ఉర్దూభాషా పెత్తనాన్ని వ్యతిరేకించడం అంటే ఉర్దూభాషను వ్యతి రేకించడం గాదు. దాని ద్వారా రుద్దబడుతున్న అప్రజా స్వామిక విలువలు, బానిస భావం పెంచి పోషింపబడిన చోట బానిసలున్న చోట ఓ స్పార్టకస్ ఉంటాడు. తెలం

గాణ 'స్పార్టకస్' కాళోజీ. శ్రీశ్రీ అన్నట్లు తాయీ అరగాన్ కాళోజీ.

జీవితం కవిత్వం వేరుకాని వ్యక్తి కావడం వల్ల కాళోజీ జీవితంలోని ప్రతి సంఘటనను ఆయన కవిత్వంలో చూడవచ్చు. అసలు కాళోజీ జీవితమే సామాజిక జీవితం అయినప్పుడు సామాజిక సంఘటనలన్నీ ఆయన కవిత్వంలో రికార్డు అయినై, అట్లా రికార్డ్ చేసిన సందర్భాలలో కాళోజీ సమాజం తీరుపట్ల పాలకుల పరిపాలన పట్ల చేసిన విశ్లేషణలు, చేసిన ప్రశ్నలు. ఇచ్చిన తీర్పులు సమాజ చరిత్రను అక్షర బద్ధం చేసిన రన్నింగ్ కామెంట్రీ లాగా కాళోజీ కవిత్వం కొనసాగింది.

ప్రశ్నించడమంటేనే తిరుగుబాటుకు సంకేతం. నేనంటే తిరుగుబాటుదారు. "నా గొడవ మన తిరుగుబాటు" అని స్పష్టంగా చెప్పాడు కాళోజీ.

ప్రజా గొడవే తన గొడవగా చెసుకున్న కాళోజీ నేను నీతో ఏకీభవించక పోయినా, నాతో విభేదించే నీ హక్కును నేను సమర్థిస్తాను అన్నీ అచ్చమయిన ప్రజాస్వామ్యవాది కాళోజీ.

"అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి,
అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినోడు నాకు అరాధ్యుడంటాడు కాళోజీ.

ప్రజలకోసం ఇంత వ్రాసిన, ఎంతో చేసిన కాళోజీ నేనింకా "నా" నుండి "మా" వరకే రాలేదు. "మనం" అన్నప్పుడు కదా అభ్యదయం అనడం కాళోజీకే సాధ్యమైంది.

"లూయీ అరగన్ కాళోజీ" కవితా జీవిత శిఖరాన్ని తలెత్తి చూడకండి - వెనక్కు విరుచుకు పడిపోతారు.

"మతము యిజమూ ఏదైనను
ఏకీభవించనోని పీక నొక్కు సిద్ధాంతము
పూని మిడిసిపడినప్పుడు
ఎదిరినిలుచు మనిషి బ్రతుకు
తిరుగుబాటు. . .

మొత్తం మీద ప్రశ్నను ప్రగతికి మార్గంగా భావించి, సదా ప్రజల తరపున సంధించే ప్రశ్నలకు, కవితారూపం తొడగి, పాలకులను హెచ్చరిస్తూ, ప్రజాచైతన్యాన్ని, రగిలించే కళను, ఆయుధంగా మార్చుకున్న కవి, కాళోజీ. జై కాళోజీ, జై తెలంగాణ.

## ఉపయుక్త గ్రంథాలు :

1. కాళోజీ కవిత్వంలో ప్రజాస్వామిక ఆకాంక్ష (వ్యాసం) ఎస్. జీవన్ కుమార్ - పాలపిట్ట, సెప్టెంబర్-2013 మాస పత్రిక
2. ప్రశ్న, ప్రజాస్వామ్యానికి ప్రాణం-(వ్యాసం)-టి.జితేందర్‌రావు పాలపిట్ట - సె. 2013 మాసపత్రిక
3. అచ్చమైన ప్రజాస్వామ్యవాది-డా॥ తూర్పుమల్లారెడ్డి పాలపిట్ట-సెప్టెంబర్ 2013
4. కాళోజీ కవిత్వ పరామర్శ-(వ్యాసం)-కాత్యాయనీ విద్మహే పాలపిట్ట-సెప్టెంబర్ 2013
5. కాళోజీ యాదిలో - కాళోజీ ఫౌండేషన్, హైదరబాద్ - వరంగల్లు
6. కాళోజీ కవిత్వం-వ్యక్తిత్వం-తూర్పు మల్లారెడ్డి. యం.ఫిల్. సిద్ధాంత వ్యాసం తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం 1986.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ‘వికారి’ కవిత్వం - కవితా వైభవం

- డాక్టర్ కె.లక్ష్మణ, అతిథి ఉపన్యాసకులు, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, తమిళనాడు.

ప్రస్తావన :

వర్తమాన తెలుగు కవులలో ఒక ప్రముఖమైన స్థానాన్ని సంపాదించుకొన్న వారు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్. మొట్టమొదట భారతదేశంలో మూడు విశ్వ విద్యాలయాల్ని స్థాపించారు. కలకత్తా, బొంబాయి, మద్రాసు. మాడభూషి సంపత్‌కుమార్‌గారు మూడో విశ్వవిద్యాలయమైన మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో 1983-1985వ సంవత్సరంలో ఎం.ఎ.పట్టాను పొందారు. 1986వ సంవత్సరంలో ఎం.ఫిల్. పరిశోధన చేశారు. 1990వ సంవత్సరంలో మధురై కామరాజు విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో పిహెచ్.డి.పట్టాను పొందారు. 2015వ సంవత్సరంలో మద్రాసు విశ్వ విద్యాలయం నుండి డి.లిట్.పట్టాను పొందారు. మాడ భూషి గారి విద్యారంగం అలా ప్రారంభమైంది. పిహెచ్.డి. పరిశోధన ముగించిన తరువాత కొంతకాలం పాటు హైదరాబాద్‌లో వివిధ పత్రికల్లో సబ్ ఎడిటర్ స్థాయి నుండి ఎడిటర్ స్థాయి వరకు పాత్రికేయులుగా తమ వృత్తిని కొనసాగించారు. 2000వ సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకులుగా నియమితులైయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ పదవుల్లో బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆయన తెలుగు శాఖ అధ్యక్షులుగానూ, ప్రాచ్యపరిశోధన సంస్థ (ఒఆర్‌వి) సంచాలకులుగాను పదవీ బాధ్యతలను చేప్పటి తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నటువంటి ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారి కలం నుండి ఎన్నో రచనలు వెలువడ్డాయి. అంటే ఆయన పత్రికల్లో పనిచేసే కాలంలోనే వివిధ అంశాలకు సంబంధించిన రచనలు వెలువరించారు. సాహిత్య, సామాజిక, రాజకీయ రంగాలకు సంబంధించిన అంశాలనే కాకుండా వివిధ కోణాలలో వారి రచనలు వెలువడ్డాయి. ఈయన అనువాదకర్త, భాషావేత్త కాకుండా ఎన్నో సామాజానికి ఉపయోకరమైన రచనలు వెలువరించారంటే అతిశయోక్తికాదు. ఈయన వెలువరించిన కవితా సంపుటాలు 1.జీవితం-కవిత్వం, 2.శత్రువుతో ప్రయాణం 3.ఆలోచనలు 4.చివరకు నువ్వే గెలుస్తావు 5.మూడో మనిషి 6.వికారి. ఇప్పుడు నేను ‘వికారి’ కవితా సంపుటిలోని కవితా వైభవాన్ని గురించి పరిశీలించడమే నా వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఈ ‘వికారి’ కవితా సంపుటిలో మొత్తం ఇరవై తొమ్మిది కవితలున్నాయి.

### హత్య-ఆత్మహత్య

నేటి సమాజంలో హత్యలు-ఆత్మహత్యలు ఎక్కువై పోతున్నాయి. అందుకోసం మాడభూషి సంపత్ కుమార్ గారు కవితా శీర్షికను ‘హత్య-ఆత్మహత్య’ అని నామా కరణం చేశారు. అంటే సమాజంలో అత్యలు, ఆత్మ హత్యలు ఎందుకు చేసుకొంటున్నారనేటువంటి విషయాన్ని పసిగట్టారు.

“హత్యకూ / ఆత్మహత్యకూ / ఒకటే తేడా- / ఇతరులు / మనమీద / కోపంతో చేసేది హత్య!

ఇతరుల మీద / కోపంతో మనం చేసుకొనేది ఆత్మ హత్య!” (వికారి, పుట.21) అన్నారు. మాడభూషి సంపత్ కుమార్ గారు ఇతరులు మనమీద కోపంతో చేసేది హత్య అని వెలిబుచ్చారు. అదే ఇతరుల మీద కోపంతో మనం చేసుకొనేది ఆత్మహత్యని తెలియజేశారు. అంటే ఈ రెండు అలతి అలతి పదాలలో అనంతమైన అర్థాన్ని తెలియ జేసినటువంటి మాడభూషి కవితా వైభవానికి నిదర్శనంగా పై రెండు పదాలను చెప్పుకోవచ్చు. మాడభూషి సంపత్ కుమార్ గారి కవిత్వంలో వైరుధ్యం, వైవిధ్యమైనటువంటి భావాలు కలిగి ఉన్నాయి. అలా మాడభూషిగారి కవిత్వంలోని పాదాలన్నీ కూడా సమాజంలో ఉన్నటువంటి వ్యక్తులకు ఒక నూతమైనటువంటి మార్గానికి దారితీస్తుంది. అందుకనే కవిత్వాన్ని వెలువరించాడానికి ముందు

సమాజాన్ని అవలోకనం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క రచయితకి ఉండాలని హితబోధ చేశారు.

**శబ్దం :**

'శబ్దం' లేకపోతే ఏదీ ఏవరికీ తెలియదు. అలాంటిది శబ్దాన్ని గురించి కవిత్వీకరించారు. కింది పదాల్లో-

"శబ్దం / నిశ్శబ్దంగా / కవిత్వంలోకి దూరి / మనసును కలవరపెడుతుంది!

తిమిరంతో సమరం సలిపి / మనిషిలో వెలుగును రేపుతుంది!" (వికారి, పుట.32)

కవికి శబ్దంతోనే కవిత్వానికి నాంది. ఎందుకంటే ఆ శబ్దం ఎంతటి నిశ్శబ్దంగా కవిత్వీకరించగలదనే విషయాన్ని మాడభూషి సంపత్‌కుమార్ పై కవితా పదాల్లో విపులీ కరించారు. అంటే 'తిమిరంతో సమరం' శీర్షికతో దాశరథి కృష్ణమాచార్యులు కవిత్వాన్ని కూడా వెలువరించారు. అంటే శబ్దంగా నిశ్శబ్దంగానే కాకుండా మనిషి చీకటిలో నుండి వెలుగులోకి రావడానికి దారి చూపుతుందనే విషయాన్ని గురించి ప్రస్తావించారు.

"మనిషికి / అక్షర జ్ఞానం కలిగించి / స్థిరమైన భావజాలం ముద్రిస్తుంది!

శబ్దం నిశ్శబ్దంగా / దంతాలకు జ్ఞానం కలిగించి / ఏది తినాలో తెలియజేస్తుంది!" (వికారి, పుట.32)

మనిషి 'ఓం' అనే వేదం దగ్గర నుండి అక్షర జ్ఞానం వరకు కలిగే శబ్దంలో ఉన్నటువంటి స్థిరమైన భావాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కటి శబ్దంతో కూడుకొన్నదే. ఎందుకంటే మనం తినేటువంటి తినుబండారాల ద్వారా కూడా శబ్దం వస్తుంది. అంటే మనం ఏది తింటున్నామో కూడా శబ్దం తెలియజేస్తుందనే వాదనను మాడభూషి సంపత్‌కుమార్ స్పష్టం చేశారు.

"శబ్దం / తన సౌందర్యంతో నాలుకమీద నర్తించి / కీర్తికిరీటాన్ని అలంకరిస్తుంది! / పుస్తకంగా / ప్రవహించి / మానవ మనుగడకు శాశ్వత రూపమిస్తుంది! / శబ్దంపై / నిశ్శబ్దంగా జరిగేదాడిని / శబ్దం సహించదు!"(వికారి, పుటలు.32-33)

శబ్దంతోనే సౌందర్యంగాని, కీర్తికిరీటం గాని, పుస్తకం గాని, మానవ మనుగడకు శాశ్వత రూపం అనే ప్రతి ఒక్కటి కూడా శబ్దంతోనే ఒక రూపాన్నిస్తుందన్నారు. అంటే శబ్దం ఒక సౌందర్యంగా నాలుకమీద నర్తింస్తుందన్నారు. అంటే ఆ నాలుక ద్వారా వచ్చినటువంటి పాట ఒక కీర్తిని పొందడానికి ఆస్కారం ఉంటుంది. అందువల్లే ఈ శబ్దమే పుస్తకంగా వెలువడ్డానికి కారణమని తెలియజేశారు. పుస్తక రూపమే కాకుండా ఆ పుస్తకం ప్రవహించి జీవకోటిలోని మానవలందరికీ కూడా ఒక నూత్నమైనటువంటి రూపాన్ని ఇవ్వడానికి ఉపయోగపడుతుంది. అదే శబ్దం గానీ నిశ్శబ్దంగా జరిగేదాడిని గురించి నేను సహించననేటు వంటి అంశాన్ని ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు పై కవితా పాదాల్లో కవిత్వీకరించారు.

**సిద్ధాంతాలు - రాద్ధాంతాలు :**

'రెండంచుల కత్తి'లోని కవితా పాదాల్ని చదువుతుంటే అన్ని పాదాలు కూడా ఒక దానికి ఒకటి అవినాభావ సంబంధం ఉంది. ఎందుకంటే సామాజంలోని వ్యక్తులు ఎన్ని కష్టాల్ని అనుభవిస్తున్నప్పటికీ, అధికారులు పదవీ బాధ్యతలు పొందక ముందు ఒక మాట, పదవీ బాధ్యతలు చెప్పటిన తరువాత మరొకమాట మాట్లాడు తున్నారనే విషయాలు కింది కవితా పాదాల్లో రచయిత వెలిబుచ్చారు. కవిత ప్రారంభంలోనే-

"ఈ కత్తికి / రెండంచుల పదును / ఎటైనా కోస్తుంది! / అటొకడు / ఇటొకడు / నిలబడి / నా వైపే పదనంటాడు అవతలివైపు మొద్దంటాడు / రెండూ నిజాలుగానే ఉంటాయి" (వికారి, పుట.43)

కత్తికి ఒకవైపే పదును ఉంటుంది. రెండు వైపులా కాదు. కానీ ఒక్కొక్క కత్తికి రెండు వైపులా పదును ఉం టుంది. ఒక్కో విధంగా ఆయా కత్తులను రూపకల్పన చేస్తారు. కానీ రచయిత రెండంచుల పదను అంటున్నారు. ఇది ఎటైనా కోస్తుందన్నారు. అంటే కవిత్వాన్ని రచించి డానికి దేనినైనా వస్తువుగా స్వీకరించవచ్చు. అంటే శ్రీరంగం శ్రీనివాసరావు కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుపిల్ల ఇలా వివిధ అంశాలను కవిత్వానికి వస్తువుగా తీసుకొన్నారు. దీనిని బట్టి చూస్తే మాడభూషి సంపత్ కుమార్ గారి మీద శ్రీశ్రీ ప్రభావం ఉందనడంలో సందేహం లేదు.

"మనసు / కొంతసేపు అటూ / కొంతసేపు ఇటూ / మారుతూ ఉంటుంది / త్రాసులోని బరువు తూగినట్టు ఈ రోజు ఇదన్నవాడు / రేపు అదిగా మారిపోతాడు" (వికారి, పుట.43)

మానవుని మెదడకు ఒక్క నిమిషంలోనే కొన్ని వేల ఆలోచనలు కలుగుతుంది. అలాంటిది రచయిత ఒక వ్యక్తి యొక్క మనస్సు కొంతసేపు అటూగానూ మరికొంత సేపు ఇటూ గాను మారుతూ ఉంటుందని హితబోధ చేశారు. అంటే కిలో బరువును తెలియజేసే త్రాసులాగా ఉంటుందన్నారు. ఒక్కొక్కసారి ఒక్కో విధంగా మారుతూ ఉంటుందనే విషయాన్ని గురించి పై కవితా పాదాల్లో మాడభూషి సంపత్‌కుమార్ గారు వెలిబుచ్చారు. "ఎందుకంటే- / ఈ కత్తికి రెండంచులా పదును రెండూ నిజాలుగానే ఉంటాయి / ఈ రోజు ఈ పార్టీ మంచిదని / దీనికి ఓటువేస్తాడు / అయిదేళ్ళు గడవక ముందే మానసిక పరివర్తన జరిగి / ఆ పార్టీవైపు జరుగుతాడు / అప్పుడది / ఇప్పుడిది / సరైందిగా / అనిపిస్తుంది / కనిపిస్తుంది ఇదేమీ శాశ్వతంకాదు"(వికారి, పుటలు. 43-44)

రాజకీయ నాయకులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వైపు మొగ్గుచూపుతుంటారు. అలాంటి రాజకీయ నాయకులు గురించి పై కవితా పాదాల్లో తెలియజేశారు. కత్తికి రెండంచులా పదును లాగా ఒక రోజు ఈ పార్టీ, మరోకరోజు ఆ పార్టీకి ఓటువేస్తుంటారు. అయిదు సంవత్సరాలు గడిచిన తరువాత ఏ పార్టీ వైపు వెళ్ళాలో గందరగోళం పరిస్థితుల్లో రాజకీయ నాయకులున్నారు. పార్టీ నాయకులు అప్పుడు ఆ పార్టీలో ఉన్నాం. ఇప్పుడు ఈ పార్టీలో ఉన్నామనే భావన కూడా లేకుండా ఆ రోజుకు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో లీనమవ్వడం సర్వసాధారణమైన అంశంగా తయారైంది. అందువల్లే రాజకీయ నాయకుల మనస్తత్వాలను అవలోకం చేయడమంటే కత్తి మీద సామే అనేటువంటి విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మాడభూషి సంపత్ కుమార్ గారు అంతటితో ఆపకుండా కింది పాదాల్లో- "రేపు మళ్ళీ పరివర్తన కలగవచ్చు / కొందరికి అయిదేళ్ళకే కలగవచ్చు కొందరికి ఇరవై అయిదేళ్ళకు కలగవచ్చు / సిద్ధాంతాలతో రాద్ధాంతాలు చేసిన వాళ్ళ గతికూడా ఇంతే!

కత్తిమొనమీద ఉన్నవాళ్ళు సంగతేకాదు / కత్తికి అటూ ఇటూ ఉన్నవాళ్ళు కూడా అంతే ఎప్పుడో తమకు తెలియకుండానే / పరివర్తన పొందుతూ ఉంటారు కాలంలో కొట్టుకుపోతూ ఉంటారు"(వికారి, పుట.44)

పై కవితా పాదాల్ని చూస్తుంటే నగ్నముని గారి 'రచయిత రాయని నాటకం' లోని కవితా పాదాలు గుర్తు కొస్తున్నాయి. "ఎప్పుడో గాని రంగం మారదు / ఎప్పుడో గాని ప్రవేశించిన పాత్ర / నిష్క్రమించదు / ఈ రాజకీయంలో / రాద్ధాంతమే సిద్ధాంతం" అన్నటువంటి నగ్నముని కవితా పాదాలు అక్షర సత్యాలు. అందువల్లే మాడభూషి సంపత్ కుమార్ గారి కవితా పాదాలు నగ్నముని వెలువరించినటువంటి కవితా పాదాలకు సమతుల్యంగా ఉన్నదంటే అతిశయోక్తి కాదు. రాజకీయ నాయకుల రాద్ధాంతాన్ని గురించి మాట్లాడానికి అనుభవంతో కూడిన ఆలోచన ధోరణి కూడా కలిగి ఉండాలన్నది అక్షర సత్యం. కానీ నేటి నాయకులు వాళ్ళకు తోచిన విధంగా రాజకీయాలను సృష్టించడంలో పైచెయ్యిలో ఉన్నారడనంలో సందేహం లేదు.

**సేవ :**

మాడభూషి సంపత్ కుమార్ గారి కవిత్వంలో సామాజిక దృక్పథమే కాకుండా సేవా దృక్పథానికి సంబంధించిన అంశాలు కోకొల్లలు. ఎందుకంటే సూర్యుడు, చంద్రుడు మనకు చాలా అవసరం. సూర్యుడు లేకపోయిన బ్రతకలేం. చంద్రుడు లేకపోయిన బ్రతకలేం. ఈ రెండు విషయాలు గురించి 'సేవ' కవితలోని కింది పాదాల్లో-

"రాత్రంతా / వెలిగిన చంద్రుడు / ఉదయాన్నే లేచి / ఇంకోచోట / వెలగడానికి / వెళుతున్నాడు తప్ప సేదతీరడానికి కాదు!" (వికారి, పుట.51)

మనుషులు కొన్ని గంటలు మాత్రమే పని చేయగలరు. ఇరవైనాలుగు గంటల పనిచేయగల వ్యక్తులు దేశంలో

అతి కొద్ది మంది మాత్రమే. కానీ రాత్రంతా వెలుగులో ఉన్న చంద్రుడు, ఉదయించే లోపల మరొక చోట వెలగడానికి వెళుతున్నాడు గానీ విశ్రాంతి తీసుకోవడానికి కాదనే విషయాన్ని గురించి పై కవితా పాదాల్లో ప్రస్తావించారు. అంటే చంద్రుడు, సూర్యుడులకు విశ్రాంతి లేదనే విషయాన్ని మనకు గుర్తు చేశారు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు.

"పగలంతా / నడిచిన సూర్యుడు / రాత్రి అయిందని / పడుకోవడానికి పోవడంలేదు / ఇంకో తీరానికి నడకసాగిస్తాడు / అక్కడా వెలుగు చూపడానికి! ఇతరులకు సేవచేసే వాళ్ళకు / నిద్ర ఉండదు / 'నిలకడ' ఉండదు" (వికారి, పుట.51)

సూర్యుడు పగలంతా వెలుగును ఇచ్చే విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. కానీ పగలంతా వెలుగును ఇచ్చినటువంటి సూర్యుడే రాత్రి అయ్యే లోపల సేద తీరడానికి వెళ్ళలేదు. మరొక చోట వెలుగును ఇవ్వడానికి వెళుతున్నాడని తెలియజేశారు. సమాజానికి సేవ చేయాలనే దృక్పథం కలిగినటువంటి వ్యక్తులకు నిద్ర ఉండదు, నిలకడ ఉండదని వెలిబుచ్చారు. అంటే సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్నటువంటి వ్యక్తులకు విశ్రాంతి ఉండదనే విషయాన్ని మరొక సారి మనకు హితబోధ చేశారు. అందువల్లే ఎంతమంది కవులు కవిత్వాన్ని కవిత్వీకరించిన గానీ సమాజ శ్రేయస్సుకోసం కవిత్వం పుట్టుకు రావలన్నదే అక్షర సత్యంగా భావించి నటువంటి వారు మాడభూషి సంపత్‌కుమార్‌గారు.

## రైతు ఆత్మకథ :

రైతు జీవన విధానమంతా మట్టిలోనే. కానీ రచయిత 'రైతు ఆత్మకథ' అనే శీర్షికతో కవిత్వాన్ని కవిత్వీకరించారు. రైతు పడుతున్నటువంటి కష్టాలను గురించి, వారు పండించిన పంటలకు సరైనటువంటి గిట్టుబాటుధర లభించకపోవడంతో వాళ్ళు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వెలిబుచ్చారు. కవిత ప్రారంభంలోనే-

'రైతు ఆత్మకథ / వాడి స్వేదంనుంచి జాలువారుతుంది / మట్టేవాడికి వస్తువు / ఒళ్ళంతా మట్టిపూసుకొని ఆత్మీయంగా, ఆప్యాయంగా / చూసుకున్నప్పుడు / కలిగే ఆనందం / ఎందులో ఉంటుంది!" (వికారి, పుట.60)

సేద్యంలో రైతు మట్టిని పూసుకొని పంట పండిస్తుంటాడు. ఆ సమయంలో ఆ రైతుకు కలిగే ఆనందమే ఆనందం. కానీ ఎక్కువ ధన సంపాదన కలిగినటువంటి కోటీశ్వరుడు నోట్ల కట్టల మీద పవ్వళించికొని ఆనందిస్తుంటాడు. అయితే రైతు మాత్రం మట్టి మీద పడుకొని మురిసిపోతుంటాడని మాడభూషి సంపత్‌కుమార్ గారు వెలిబుచ్చారు. రైతుకు పొలమే కాయితంగానూ, తాను పడుతున్నటువంటి కష్టమే జీవితంగానూ, కవి కలాన్ని పట్టుకొని కవిత్వీరిస్తే, రైతు నాగలిని పట్టి నలుగురికి అన్నం పెడుతున్నారని తెలియజేశారు. కవి లేని జీవితాన్ని పసిగట్టవచ్చు. కానీ రైతు లేని జీవితాన్ని చూడలేమనేటువంటి అంశాన్ని కూడా ఒక్కసారి మననం చేసుకోవాల్సిన బాధ్యత పాఠకులకు ఉందని గుర్తుచేస్తున్నారు. అంటే రచయితలో ఎంతటి లోతైన భావన కలిగి ఉందనడానికి 'రైతు ఆత్మకథ' కవితే నిదర్శంగా చెప్పుకోవాలి.

"కవులకు కావ్యం కన్యక అయితే / రైతుకు కావ్యం తల్లి రైతు ఆత్మకథలో / అప్పులుంటాయి, ఆత్మహత్యలుంటాయి అవమానాలుంటాయి, అవరోధాలుంటాయి / ఆనందాలుంటాయి" (వికారి, పుటలు. 60-61)

ధనవంతుడికి తన ధనమే ఆనందాన్నిస్తుంది. కవికి తాను వెలువరించినటువంటి కావ్యాలే కన్యక అవుతుంటే, రైతుకు మాత్రం కావ్యం తల్లి అని స్పష్టంచేశారు. అంటే రైతు ఆత్మకథలో అప్పులు చేస్తుంటారు, ఆత్మహత్యలు చేసుకొంటున్నారు, అవమానాలు కూడా పడుతున్నారు, కొందరు అవరోధాలు కూడా చేస్తున్నారు, కొన్ని విషయాల్లో ఆనందంగా కూడా ఉన్నారు. పై అంశాలన్నీ కూడా ఒక 'రైతు ఆత్మకథ'లో మాత్రమే ఉంటుందనే విషయాన్ని మాడభూషి సంపత్‌కుమార్ గారు ప్రస్తావించారు.

## అంధకారం :

ఆధునిక సాహిత్య ప్రక్రియలు నవల, కథానిక, నాటకం, కవిత్వం, మినీ కవిత్వం, హైకూ, నానీలు ఇలా

వివిధ రకాలైనటువంటి పక్రియలు వెలిశాయి. మాడ భూషి సంపత్ కుమార్ గారు మినీ కవిత్వాన్ని కవిత్వీ కరించారు. అలాంటి కొన్ని కవిత్వాలు కూడా 'వికారి' కవితా సంపుటిలో వెలువరించారు. 'చీకటి' కవితలో-

"ప్రతి మనిషికి / నీడ ఉంటుంది / అంటే / ప్రతిమనిషి చుట్టూ / వెలుగు ఉంటుంది వెలుగును వెతికేవారు / వెలుగుతారు / చీకటిని / చూసే కళ్ళకు / చిమ్మచీకట్లు కనిపిస్తాయి!" (వికారి, పుట.54)

మాడభూషి సంపత్‌కుమార్ గారి కవితా వైభవానికి పై కవితా పాదాల్ని కూడా నిదర్శంగా చెప్పుకోవచ్చు. ప్రతి మనిషిలో నీడ ఉంటుందన్నారు. అంటే ప్రతి మనిషి చుట్టూ కూడా వెలుగు ఉంటుందని హితబోధ చేశారు. వెలుగు కోసం వెతికే వారు వెలుగుతూనే ఉంటారని వెలి బుచ్చారు. మనిషి మనస్సులో కలిగే భావనలోనే ఆయన వ్యక్తిత్వం ఉంటుందని చెప్పవచ్చు. అంటే చీకటి కోసం చూసే కళ్ళకు చీకటే కనిపిస్తుంటాయని వ్యక్తపరిచారు. అందువల్లే మానవుల మనస్సులోని కలిగే భావనంతా కూడా మానవ మనుగడకు నాంది పలుకుతుంది. ఇలా మాడభూషి గారి 'చీకటి' కవితలోని కవితా పాదాల్ని చీకటి నుండి ఏ విధంగా వెలుగులోకి రావాలనేటువంటి విషయాలను కవిత్వీకరించారు.

## గుణపాఠం :

ప్రకృతే మనిషికి గుణపాఠం నేర్పుతుందనే విషయాన్ని 'గుణపాఠం' కవితలో- "వానకాలం వస్తుంది / తడిసి ముద్దచేస్తుంది / ఎండకాలం వస్తుంది / కాల్చి బూడిద చేస్తుంది చలికాలం వస్తుంది / గజగజ వణికిస్తుంది / వసంతకాలం వస్తుంది / సంతోషాన్ని వెదజల్లుతుంది" (వికారి, పుట.55)

ఎన్ని కాలాలు వచ్చిన ప్రయోజనం లేని మత స్థిమితంలో ఉన్నది మన దేశం. ఎందుకంటే రచయిత వానకాలం వచ్చినప్పుడు మనషుల్ని తడిసి ముద్దు చేస్తుందన్నారు. అదే విధంగా ఎండకాలంలో కూడా కాల్చి బూడిద చేస్తుందనే వాదనను తెలియజేశారు. ఇక చలికాలం గురించి చెప్పవలసిన పనిలేదు. ఎందుకంటే చలితో గజగజ వణికిచేస్తుందన్నారు. కానీ వసంతకాలం మాత్రం సంతోషాన్నిస్తుందని వెలిబుచ్చారు. ఇలా కాలాలే మనుషులకు పాఠాలు నేర్పుతుందనే కవితా వైభవాన్ని వ్యక్తపరిచారు."సంవత్సరం పొడవునా / ఇన్ని పాఠాలు నేర్పిస్తూ ఉంటే అన్ని తరగతులూ ఎగ్గొట్టి / నువ్వు జీవితంలో ఏం పాఠాలు నేర్చుకొంటావు. ప్రకృతి నేర్పించ డానికి తప్ప / శిక్షించడానికిలేదు నువ్వు మరీ మొండికేస్తే తప్ప / బెత్తం పట్టుకొని / గుణపాఠాలు నేర్పదు!" (వికారి, పుట.55)

ఎన్ని సంవత్సరాలు అయినా గానీ ప్రకృతి మనకు నేర్పించడం తప్ప శిక్షించడం లేదని విషయాన్ని ప్రబోధిం చారు. అందుకే ఎంత మంది ఎన్ని రకాలుగా ఉన్నా గానీ మంచి విషయాలను బోధించే వ్యక్తులు కొంతమందే అనే విషయాన్ని ఈ సందర్భంగా ప్రతి ఒక్క పాఠకుడు గుర్తించుకోవలసిందే. కానీ 'గుణపాఠం' కవితా శీర్షికలోని కవితా పాదాల్ని కూడా మనిషికి గుణపాఠంగానూ, అతనికి ఒక బాధ్యత తీసుకొచ్చే విధంగా ఉన్నాయనడంలో సందేహం లేదు. అందువల్లే మాడభూషి సంపత్‌కుమార్ గారి కవితా వైభవమంతా కూడా సామాజిక దృక్పథంతో ముడిపడి ఉంటుంది.

## గొప్ప :

మానవత్వంతో జీవించాలి. మానవత్వం లేని మనుషు లకు సమాజంలో గౌరవం లభిస్తుందా అంటే ప్రశ్నార్థకమే. అందువల్లే మనిషి జీవించి ఉన్నంత కాలం మాన వత్వంతో మెలగాలన్నదే మాడభూషి సంపత్‌కుమార్ గారి ఆకాంక్ష. మరణం కన్నా మానవత్వమే మిన్న అంటున్నారు కింది కవితా పాదాల్లో-

"మరణం లేని / సమాజం కన్నా / మానవత్వం లేని / సమాజం గొప్పదికాదు!" (వికారి, పుట.40)

కొంతమంది వారి వారి గొప్పతనంతో మాటలు మాట్లాడి జీవిస్తుంటారు. కానీ దానివల్ల ప్రయోజనం లేదు. సమాజంలో మరణం లేకపోయినా ఫర్వాలేదు. కానీ మానవత్వం లేని సమాజం అంత గొప్పదేమీ కాదం టున్నారు రచయిత. అంటే రచయిత కవితా పాదాలన్నీ

కూడా ఒక పక్క మరణానికి సంబంధించిన విషయాలను ప్రస్తావించారు. అంటే వ్యక్తి మరణించడమంటే బాధకరమైన విషయం. కానీ మానవత్వంతో జీవించి మరణించాలనే దృక్పథం ఉండాలన్నదే కవి భావన.

**నవ్వు :**

మనుషులకు ఉన్న రోగాలన్నీ పోవాలంటే నవ్వాలి. అంటే కొంతమంది నవ్వరు. మరికొంతమంది నవ్వుతూ ఉంటారు.“కొందరికి నవ్వేరాదు / నవ్వితే / సంతోషంగా ఉన్నామని / అవతలివాడు సమస్యలు సృష్టిస్తాడని భయం!” (వికారి, పుట.31)

మానవులకి జీవించి ఉన్నంత కాలం ఏదో ఒక విధంగా భయపడుతూనే ఉంటారు. కొంతమంది అప్పులు చేసి భయపడుతుంటారు. కొంతమంది ఏమీ చేయకపోయినా భయపడుతూనే ఉంటారు మరికొంత మంది మనం నవ్వితే సంతోషంగా ఉన్నామనే విషయాన్ని పక్కవాడు తెలుసుకొని మనకు సమస్యలు సృష్టిస్తాడేమో నన్న విషయాన్ని తలచుకొని భయపడుతుంటారు. అందువల్లే ఎన్నో రకాలుగా భయం మనల్ని భయపెట్టుతూ ఉంటుంది. వాటినన్నిటినీ ఎదుర్కొని మనం ముందుకు పోవాలనే విషయాన్ని వెలిబుచ్చారు.

“కొందరికి నవ్వేపోదు / నవ్వకుంటే / మనం దు:ఖంలో ఉన్నామని / అవతలివాడు / సంతోషిస్తాడని బాధ!” (వికారి, పుట.31)

నవ్వినా బాధే. నవ్వకపోయినా బాధే. ఇంతకముందు పాదాల్లో నవ్వితే సంతోషం ఉన్నామని స్పష్టం చేశారు. పై పాదాల్లో నవ్వకుంటే మనం దు:ఖంలో ఉన్నామనే విషయాన్ని వెలిబుచ్చారు. అంటే మానవులు ఈ రెండు విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని హితబోధచేశారు. రచయిత నవ్వితే అవతలివాడు సమస్యలు సృష్టిస్తాడని, నవ్వకుంటే అవతలివాడు సంతోషిస్తాడని విషయాన్ని పదేపదే గుర్తు చేశారు. ‘నవ్వు’ కవితా పాదాలన్నీ కూడా ఒక నూతనమైన కవితా పాదాలుగా ఈ కవితా సంపుటిని చదివే పాఠకుల మనస్సును దోచుకుంటుందనడంలో సందేహం లేదు.

**ముగింపు :**

మాడభూషి సంపత్‌కుమార్ గారి ‘వికారి’ కవితా సంపుటిలోని కవితలన్నీ కూడా ఒక వినూత్నమైన కవితా వైభవాన్ని కలిగి ఉన్నాయనడంలో అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఒక్కొక్క కవిత కూడా ఒక్కో దృక్కోణానికి సంబంధించింది. అందువల్లే మాడభూషి కవిత్వాన్ని అవలోకనం చేసుకోవాలంటే కత్తి మీద సామే. అలాంటి కవితల్నీ నా తోచిన విధంగా కొన్ని కవితలను తీసుకొన్ని వాటిలో ఉన్న కవితా వైభవాన్ని పరిశీలించాను. ఇరవై తొమ్మిది కవితలున్న ఈ కవితా సంపుటిలోని అన్ని కవితలు కూడా సామాజిక, రాజకీయ, సాంఘిక, ఆర్థిక రంగాలకు సంబంధించినటువంటివే. అందువల్ల కవిత్వాన్ని కవిత్వీకరించినటువంటి ప్రతి కవీ కూడా సమాజాన్ని అవలోకనం చేసుకోవాల్సిన బాధ్యత ఉంది. నేటి వర్తమాన తెలుగు కవులు కోకొల్లలుగా, పుట్ట గొడుగులు లాగా పుట్టుకొచ్చారు. అయినప్పటికీ కొంతమంది కవుల నుండి జాలువారుతున్న కవితా పాదాలు అక్షర సత్యాలు. ఈ కవితా పాదాలు నాటి నుండి నేటి వరకు ఉన్నటువంటి సామాజిక స్థితిగతులను అద్దం పట్టుతున్నాయంటే అతిశయోక్తికాదు. అలాగే మాడభూషి సంపత్‌కుమార్‌గారి కవితా వైభవంలోని కవితా పాదాలన్నీ కూడా ఒక నిగూఢమైనటువంటి కవితా వైభవాన్ని దాగి ఉన్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు :**

వికారి, మాడభూషి సంపత్‌కుమార్, పాలపిట్టబుక్స్, హైదరాబాద్, మొదటి ముద్రణ : ఏప్రిల్ 2019.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# "తెలుగు సాహిత్యంలో సామ్యవాద ఆణిముత్యం మహీధర రామమోహనరావు"

– కచ్ఛళ్ళ బలరామ్, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

**ఉపోద్ఘాతం :**

ఛాందస బ్రాహ్మణ అగ్రహారంలో మహీధర వారు గొప్ప సాంఘీక విప్లవమే తీసుకొచ్చారు. వీధులలో నడవ నివ్వకపోవడం, చెరువుల్లోని నీళ్లు తెచ్చుకోవడం, యిళ్ళల్లోకి రానివ్వకపోవడం ఇలా ఒకనాటి పరమ ఛాందస్యాన్ని ఎదిరించి సంస్కరణలు తీసుకొచ్చారు. మహీధర్ తండ్రి సూర్యనారాయణగారు బ్రహ్మ సామాజికులు. కందుకూరి విరేశలింగం గారిశిష్యులు. సంఘ సంస్కరణ తమ ఇంట నుండే ప్రారంభించారు. ఆడపిల్లలను చదివించడం, రజస్వలానంతర వివాహాలు, ఆ తరువాత వర్ణాంతర వివాహాలు.... ఇలా బ్రాహ్మణ అగ్రహారం రూపరేఖలే మార్చివేశారు. జాతీయోద్యమంలో పాల్గొనడం, ఆ తరువాత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో ప్రవేశించడంతో, మహీధర్ సోదరులు ఈ సాంఘీక సంస్కరణోద్యమానికి అగ్రభాగానే నిలబడ్డారు.

రామమోహనరావు గారు 1941-42లో అరెస్టయి, 1944వరకు జైల్లో ఉన్నారు. యుద్ధ కాలంలో ముంగండలోని వారి అవంతి ప్రెస్‌ను బ్రిటీష్ ప్రభుత్వం జప్తు చేసింది. 1946 లో తిరిగి కాంగ్రేస్ మంత్రి వర్గాలు వచ్చినప్పుడో లేక అంతకు కొంచెం ముందో అవంతీ ప్రెస్‌ను తిరిగి ప్రభుత్వం యిచ్చివేసింది. విశ్వ సాహిత్య మాల రాజమండ్రి నుండి తిరిగి ప్రారంభమైంది.

1942లో కమ్యూనిస్టు పార్టీ, భాహ్య ప్రపంచంలోకి వచ్చినప్పుడు, విజయవాడ నుండి ప్రారంభమైన 'ప్రజాశక్తి' వారపత్రిక. 1946 నుండి 'ప్రజాశక్తి' దినపత్రికగా ప్రచురించబడినపుడు, మహీధర రామమోహనరావు గారు ఆ పత్రికలోకి వచ్చారు.

1947-48 నుండి మళ్ళీ కమ్యూనిస్టు పార్టీ తీవ్ర నిర్బంధనకు గురైనపుడు రామమోహనరావుగారు కొన్నాళ్ళు సెమీ లీగల్‌గా ఉన్నారు.ఆ సమయంలోనే తెనాలి నుండి బొల్లిముంత శివరామకృష్ణ గారు నడిపిన "నగారా" పత్రికలో కొన్నాళ్ళు పనిచేశారు.తరువాత అనంత పురంలో ఒక హైస్కూల్‌లో ఎమ్.ఆర్ మోహన్ పేరుతో తెలుగు విద్వన్‌గా పనిచేశారు.

1952 లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగి బహిరంగంగాపని చేయడం ప్రారంభించిన తరువాత విజయ వాడలో 1952 జూన్ 22 నుండి 'విశాలాంధ్ర'దినపత్రిక ప్రారంభమైనప్పుడు, రామమోహన్‌గారు అందులో పని చేశారు. అంతకు ముందు కొన్నాళ్ళు' ప్రజాశక్తి' వారపత్రికగా ద్వైవారపత్రికగా పని చేసింది. అందులో కూడా పనిచేశారు.

రామమోహన్‌గారు 'విశాలాంధ్ర' దినపత్రికలో ఉప సాంపదకులుగా పని చేశారు. పత్రికలోపని చేసే వారిలో ఎక్కువ మంది పార్టీలోనూ, ప్రజారంగాల్లోనూ పనిచేసిన వారే. అందుచేత వివిధ వర్గాల ప్రజల మధ్య రైతు, వ్యవసాయ కార్మిక, యూవజన, విద్యార్థి, మహిళలకు, తదితర వర్గాల ప్రజల జీవిత సమస్యలపై వారికి ఉన్న అనుభవం కమ్యూనిస్టు జర్నలిజానికి ఎంతగానో - ఉప యోగపడింది.రామమోహనరావు గారు 1930 దశకం నుండి జిల్లాలోని వ్యవసాయ కార్మికోద్యమాలలో పని చేసిన అనుభవం కలవారు.నిర్బంధకాలం, అజ్ఞాతవాస కాలం ఇవన్నీ గడిచి దినపత్రికలో సంపాదకుడిగా ఒక స్థిరమైన జీవితం, నిర్ణీత పని గంటలు లభించిన తర్వాత అటు జాతియోధ్యమంలోనూ,ఇటు కమ్యూనిస్టు ఉద్య మాలలోనూ ప్రత్యక్ష కార్యక్రమాల అనుభవాల్ని అక్షర బద్ధం చేయడానికి రామమోహనరావుగారు పూను కున్నారు. ఆయన"రధచక్రాలు" తొలి నవల. ఆంధ్ర దేశంలో మార్క్సిస్టు ధృక్పథంతో వ్రాసిన తొలిరాజకీయ నవలగా భావించవచ్చు. జాతీయోద్యమాన్ని, కమ్యూనిస్టు

ఉద్యమాన్నిసమన్వయం చేస్తూ జాతియోద్యమంలో వామపక్ష భావాలప్రభావాన్ని, కార్మిక కరషకోద్యమాల ప్రభావాన్ని ఈనవల చిత్రించింది. ముంగండ అగ్రహారమే ఈ నవలకు పూర్వరంగం.

ఆ తరువాత వారి " కొల్లాయి గట్టతేనేమి" ప్రఖ్యాతి పొందిన నవల. జాతీయోద్యమాన్ని , సాంఘిక సంస్కర ణోద్యమాన్ని గొప్పగా చిత్రించిన నవల."నువ్వు కమ్యూ నిస్టువైపోయవు, నవల వ్రాసినందుకు ఆంధ్రప్రజలు నీకు బ్రహ్మరథం పడుదురోయ్" అని నోరినరసింహశాస్త్రి గారు అన్నప్పుడు, "నేను కమ్యూనిస్టును కాకపోతే ఈ నవల రాయగలిగి ఉండేవాణ్ణే కాదు" అనిరామమోహనరావుగారి సమాధానం యిచ్చారు. గతి తార్కిక భౌతిక వాద దృష్టి యిచ్చిన వస్తుగత దృష్టి ,ఆనాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకొనడంలో ఆయనకు ఎంతగా తోడ్పడినవో దీనిని బట్టి గ్రహించవచ్చు.

అలాగే తెలంగాణ సాయుధ పోరాటం - అది అక్కడి ప్రజానీకంలో ముఖ్యంగా స్త్రీలలో తీసుకుని వచ్చిన చైతన్యం మరికొన్ని నవలలు చిత్రింబడ్డాయి. "కత్తుల వంతెన", "ఈ దారి ఎక్కడికి? " మొదలైన నవలలు స్వాతంత్ర్యనంతరం, కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం కొంత వెనుకంజ వేసినపుడు ఆంధ్రదేశ సామాజిక పురో గమనంలో వచ్చిన ఆటుపోటులను చిత్రిస్తాయి.

కమ్యూనిస్టు కార్యదర్శిగా ప్రజల మధ్యలో ఉండటం వలన, మూడు దశాబ్ధాల పాటు అట్టడుగు స్థాయి ప్రజ లలో ఉండటం వలన వారి జీవనసరళిని రామమోహన్ గారు అంత ప్రతిభావంతంగా చిత్రించగల్గారు. రాజకీయ నవలను, అంతగా తీర్చిదిద్దిన వారు తెలుగు సాహిత్య రంగంలో మరొకరు లేరంటే అతియోశక్తి కాదు.

మార్క్సిస్టు సిద్ధాంతాలను భోదించడమే కాకా, ఆంధ్రదేశంలో ఈ సిద్ధాంతాలను వ్యాప్తి చేయడమే కాకా, ఈ సిద్ధాంతాలను తెలుగు సామాజిక జీవితానికి, తెలుగు సాహిత్యానికి అన్వయించడంలో రామమోహన్ గారు చేసిన కృషి, చూపిన దురంధరత్వం, ప్రతిభ సాటిలేనివి.

అయితే మార్క్సిజాన్ని భారతదేశ విశిష్ట పరిస్థితులకు అన్వయంచడంలో కమ్యూనిస్టు ఉద్యమం కృతకృత్యం కాలేదని, పరిక్వత,అతివాద పెడధోరణి భారతకమ్యూనిస్టు ఉద్యమాన్ని అభివృద్ధి కానీయలేదని, అవాస్తవికతలో పడిపోయిందని రామోహనరావు గారు నిర్మొహమాటం గానే విమర్శిస్తూ వచ్చారు. 1947లోవచ్చిన స్వాతంత్ర్యాన్ని గుర్తించలేకపోవడం, తెలంగాణా సాయుధ పోరాటాన్ని సకాలంలో విరమించు లేకపోవడం, 1948-51 మధ్య కాలంలో నెహ్రూ ప్రభుత్వంపై సాయుధ పోరాటాన్ని ప్రకటించడం, సోవియట్, తదితర సోషలిస్టు దేశాలు భారతేశం వంటినూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు వలస ఆర్థికవిధానం నుండి బైటపడటానికి యిచ్చిన ఆర్థిక సహకారాన్ని పంచవర్ష ప్రణాళికాభివృద్ధి విధానాన్ని సరిగా అర్థం చేసుకోలేక పోవడం, అన్నింటిని మించి భారతదేశ విప్లవదశను నిర్ధారిచుకోవడంలో అందుకు సరియైన వ్యూహం, ఎత్తుగడలు అవలంభిం చడంలో భారత కమ్యూనిస్టు ఉద్యమం విఫలం గావడం, కామ్రేడ్ మహీధర్‌లో తీరని అసంతృప్తిని ఆశాభంగాన్ని కల్గించాయి. ఈ విషయాలను మహీధరగారు దాపరికం లేకుండా నిర్మొహమాటంగా చెబుతూనే ఉండేవారు.

"తెలుగు నాట సామాజిక జీవితం మీద మార్క్సిజం ప్రభావం"అన్న వ్యాసంలో ఆయన చెప్పిన విషాయలు చాలా రాజకీయ - సిద్ధాంత ప్రాధ్యానాన్ని కల్గి ఉన్నాయి. 1990 డిశెంబరు 11, 12 తేదిలలో ఆచర్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన "శాస్త్రీయ సోషలిజం" అధ్యయన కేంద్రం వారు నిర్వహించిన సదస్సులో రామ మోహనరావుగారు ఈ అధ్యయన పత్రం సమర్పించారు. అందులో ఆయన పేర్కొన్న విషయం.

"1920లో లెనిన్ కలోనియల్ థీసెస్‌ను కామిం టరన్‌లో ప్రవేశ పెట్టారు. వలస దేశాలలో బూర్జువా వర్గం అభ్యుదయ పంథాలోనే వ్యవహరిస్తుందని అందులో అన్నారు. దానిని యం.ఎన్ రాయ్ వ్యతిరేఖించాడు. సామ్రాజ్యవాద దేశాలు తమ స్వప్రయోజనం దృష్టితో వలసలో పరిశ్రమలకు ప్రోత్సహిస్తాయి. ఆ విధంగా

ఏర్పడిన బూర్జువా వర్గం అంతిమంగా సామ్రాజ్య వాదులతోనే చేరుతుందనేది ఎం.ఎన్‌రాయ్ వాదం. వర్ధమాన భారత జాతీయ బూర్జువా వర్గం, తాను బల పడటానికై జాతీయ కాగ్రెస్ ద్వారా బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాటం జరుపుతుంది.

పర్యవసానంగా సామ్రాజ్యవాదంతో కాంగ్రెస్ ఒంటరి దవుతుందన్నది రాయ్‌వాదం. కావున కార్మిక వర్గానికి ప్రధాన శత్రువు కాంగ్రెస్ అవుతుందన్నాడు రాయ్.

లెనిన్ మీద భక్తితో భారత కమ్యూనిస్టులు ఎం.ఎన్ రాయ్‌ని ప్రత్యర్థిగా ఎంచినప్పటికీ, లెనిన్ అభిప్రాయాల కంటే (కలోనియల్ థీసిస్ కంటే) ఎం.ఎన్.రాయ్ వాదానికి విలువయిచ్చారు".

## "తెలుగు సంస్కృతి - మార్క్సిజం ప్రభావం" :

భారత కమ్యూనిస్టుల లెనిన్ కలోనియల్ సూత్రీకరణ లను అమలు జరిపి ఉంటే భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర వేరుగా ఉండేది అన్నది రామమోహన్ గారి అభిప్రాయం. రామమోహన్ గారు పత్రికా రంగానికి, సాహిత్యరంగానికి పరిమితమైనా, రాజకీయ సిద్ధాంత రంగంలో కూడా నిశితంగాను, నిరంతరంగాను ఆలోచన చేస్తూనే వచ్చారని దీనిని బట్టి స్పష్టమౌతుంది.[1]

## కమ్యూనిస్టు నవలకు శ్రీకారం :

కమ్యూనిస్టు ఉద్యమం తెలుగు ప్రజల జీవితంలో విడదీయ వీలులేని తీరును ఓ మేధావి రచయిత కోణం నుండి పాక్షిక ధోరణి లేకుండా చిత్రించిన తొలి తెలుగు నవల రథచక్రాలు.

"రథచక్రాలకు" కొంచెం అంటూ ఇటుగా తెలంగాణ పోరాట నేపథ్యంలో లక్ష్మీకాంత మోహన్‌నవల "సింహ గర్జన" వచ్చింది. కానీ, "రథచక్రాలు" మొదటి ఆధుని కాంధ్ర చారిత్రక రాజకీయ నవలగా చెప్పవచ్చు. కారణం దాని ప్రాముఖ్యం అలాంటిది.రచయిత ఆ నవలాంశాన్ని సృష్టించిన తీరూ, సృజించిన నేర్పూ దానికి ఊతమిస్తాయి.

ఆ తర్వాత మరో రెండేళ్ళకు మహీధర వారి "ఓన మాలు" నవల అచ్చయి వచ్చింది. ఇది "రథచక్రాలు" తరువాత భాగం లాంటిది. ఆ తరువాత తెలంగాణ నేపథ్యం నవల "మృత్యువు నీడల్లో" ప్రచురించ బడింది.

నవలా రచనకు కావలసిన వివరాలకోసం ఆయన తెలంగాణ - లోను, ఆంధ్రదేశంలోనూ విస్తృతంగా పర్యటించారు. పాత పత్రికలనుండి ఒపిగ్గా ఎంతో అధి కారిక సమాచారాన్ని పరిణామ గతులను సేకరిం చారాయన. ఆ తర్వాత వరుసగా ఆయన నవలలు రావటం ఆరంభించాయి. మహీధర్ వారిది"పార్టీజన్" మనస్తత్వం. ఏదో ఒక మార్క్సిస్టు పార్టీని అంటిపెట్టుకుని ఉండాలనుకునే నియమానికాయాన బుద్ధుడు. సి.పి.యం. రాజకీయ ధోరణి, సిద్ధాంతం నచ్చక సి.పి.ఐ లోనే ఉండి పోయారు. కమ్యూనిస్టు ఉద్యమ వైఫల్యం ఆయనకు పెద్ద షాక్. అయితే అంత మాత్రన నిర్వేదంతో కృంగిపోలేదు. ఒక మేధావిగా, నవలా రచయితగా తన నిరంతర కృషిలో ఆ బాధను తట్టుకోవడానికి ప్రయత్నించే వాడు.

"సామాజిక, సాంస్కృతిక రంగాలలో కొనసాగించిన కృషితో కేవలం పదేళ్ళ కాలంలో తెలుగునాడును గుర్తించ లేనంతగా మార్చివేయగలిగిన సి.పి.ఐ, రాజకీయ రంగంలో తల తిప్పుకోలేనంతగా దెబ్బతినేసంది" అని 1922లో చాలసాని ప్రసాదరావు గారికి రాసిన ఒక లేఖలో బాధపడ్డా రాయన.

ప్రసాదరావుకి- ఎలా ఉన్నావు? చాలాకాలం అయింది. నిన్ను చూసీ, మాట్లాడే, ఈ మధ్యలో హైదరాబాద్ రాకపోలేదు. కాని, వెనకటల్లే తిరిగే ధైర్యం శక్తి అసలు లేదు. మరో మనిషిపక్కనుండాలి. వయస్సు చెల్లిం పోయింది కదా 83 నడుస్తాంది. కాని, మనస్సు దృఢంగానే వుంది. చెయ్యి దృఢంగాలేదు. కనుక ఏమీ రాయడం లేదనే చెప్పాలి. అలాగని రాయడం మానలేదు సుమా. ఇటీవల రాసినవ్యాసాలు రెండు నీకువేరే పోస్టు చేస్తున్నా.

మొన్ననే నీ "ఇలా మిగిలేం" చదివేను. నీ సిన్సియార్టీని నేను ఎరుగుదును. కనుక బాధ అనిపించింది. ఆ పుస్తకం లోని విషయానికి కాదు. అది రాయడంతో నీవనుభ వించిన మనోవైకల్యానికి చాలా బాధ అనిపించింది.

తెలుగు నాట నీలాగ తపన పడ్డవాళ్ళు లక్షల సంఖ్యలో ఉన్నారు ఆశ్చర్యం లేదు, ప్రపంచ ప్రజల మనసుల్ని కట్టుకుని, దారి చూపుతుందనుకున్న ఒక మహత్తర ప్రయోగం, ఒక రోజులో అదృశ్యమైపోయింది. సామాజిక, సాంస్కృతిక రంగాలలోసాగించిన కృషితో, పదేళ్ళ కాలంలో తెలుగు నాడును గుర్తించలేనంతగా మార్చివేయగలిగిన సి.పి.ఐ, రాజకీయ రంగంలో తల తిప్పుకోలేనంతగా దెబ్బ తినేసింది.

10-12 ఏళ్ల వయస్సు నుంచి ఈ రెండిటితో జీవితాన్ని పెనవేసుకున్న నీ, నా తోటివాళ్ళకిది పెద్ద షాకే. కానీ, మనం ఎప్పుడూ షాక్ తోనే ఉండకూడదు. నిర్వేదం, దిగ్భ్రమను పక్కకు పెట్టి "ఎందుకయింది ఇలాగా?"అనే ఆలోచనకు అవకాశం ఇవ్వాలి."ఇలా మిగిలేం" అనే నిర్వేదం కనబరిచేవు. నా ఆలోచనలు పుస్తక రూపం తీసుకోలేదు.చూడు వ్యాసాలనే నీకుపంపుతున్నా, జవాబు రాయి.

మహీధర్ రామమోహనరావు
7-7-1992
విజయవాడ-10

మహీధర్‌వారి తొలి నవల చదువుతుంటే "హోవార్డు ఫాస్ట్" గుర్తొస్తారు. చరిత్రను నవలీకరించి చదివించటంలో ఒకకాలంలో సాటిలేని వాడాయన.

మహీధన వానేకూడా అంతే! అనిఅంటారు రచయిత చలసాని ప్రసాదరావు గారు. స్వాతంత్రోద్యమానికి అక్షరరూపం :

వేల సంవత్సరాల చరిత్ర గలిగిన భారత ఫ్యూడల్ సామాజిక వ్యవస్థలో బ్రిటిష్ వలసపాలన అపూర్వమైన సంచలనాన్ని తెచ్చింది. హేయమైన వర్ణ,కుల వ్యవస్థ, నిరంకుశ రాచరిక పాలన, ఫ్యూడల్ దోపిడీ, వెనుకబడిన వ్యవసాయిక ఉత్పత్తి విధానము, బలీయమైన పిత్రు స్వామ్య వ్యవస్థ; దురాచారాలు మూఢ సంప్రదాయాల కట్టుబాట్లతో సాపేక్షంగా నిలకడనీటిస్థిలో వుండిన భారత సమాజంలోకి విసరిన బండరాయిలా అది తీవ్ర ప్రకంప నాలను సృష్టించింది. అంతకుముందు విభిన్న విదేశీ జాతులు, మతాలు, పాలకులు ప్రవేశించినా, వారందరూ భారత ఫ్యూడల్ వ్యవస్థలో ఇమడగల కుదురుల నుంచి వచ్చినవారే. కావున, పైపై మార్పులు ఎన్ని జరిగినా మౌలిక పరివర్తనకుతావులేకుండా పోయింది. అయితే బ్రిటిష్ వలసపాలన మూలంగా భారతసమాజం పూర్వంలగ కొనసాగటానికి వలు లేని పరిస్థితులు రాజకీయ ,ఆర్థిక, సాంఘీకరంగాలన్నిటా కల్పించబడినాయి.

భారత సామాజిక స్థితిని, వలసపాలన ఫలితాన్ని కారల్ మార్క్స్ అద్భుతంగా అంచనావేశాడు. బ్రిటిష్ వలసపాలన వల్ల ఉత్పన్నమైన కల్లోల పరిస్థితులు క్రమంగా దేశవ్యాప్త ఐక్యతను, వలసవాద వ్యతిరేక జాగృతినీ, స్వాతంత్ర కాంక్షనూ ప్రేరేపించాయి. సంఘ సంస్కరణోద్యమాలు, స్వాతంత్రపోరాటము 1920 తరవాత పుంజుకున్న కార్మిక రైతాంగా పోరాటాలుభారత సామాజిక గతిని అత్యంత చలనశీలమే, ప్రగతిశీలమూ గావించాయి.

జాతి, కుల మత, వర్ణ, ప్రాంత, భాషాంతరాలను అధిగమించి సాగిన స్వాతంత్ర పోరాటం అందులో ప్రతి భింబించిన ప్రజల సామాజిక ఆకాంక్షలు భారత చరిత్రలో ఒక అపూర్వ సందర్భం. అందులో 1920-45 కాల వ్యవధిలోని ప్రధానఘట్టాల్ని మహీధర రామ మోహనరావు గారు చారిత్రక నవలా రూపాలుగా కళాసృజనచేశారు.

**ముగింపు :**

వీరి జీవితం, సాహిత్యం పరిశీలిస్తే వారి సామాజిక దృక్కోణం స్పష్టమవుతుంది. బడుగు, బలహీన వర్గాల వారికి తన మేధాశక్తితో చైతన్యం తీసుకురావాలని, తుది శ్వాస వరకు ప్రయత్నించిన అలుపెరగని సంస్కర్త మహీధర. సంఘంలో మార్పు సాహిత్యంతో సాధించవచ్చు అని మహీధర నమ్మారు. అందుకే సాహితీ కృషీవనంలో విలువ కట్టలేని ఎన్నో అద్భుత గ్రంథరాజాలను పూయించి, దిగువస్థాయి వారికి కూడా అర్థమయ్యేరీతిలో సమర్పించి, ఎన్నటికీ మరువలేని వనమాలిగా మహీధర రామమోహనరావు నిలిచారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# మన్నుబువ్వ కథలు - స్త్రీ అస్తిత్వం

**- డా. శాంతిలక్ష్మి వి,** అతిథి ఉపన్యాసకురాలు, తెలుగు విభాగం, బెంగళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు, కర్నాటక.

స్త్రీల అస్తిత్వ పోరాటం అనాదిగా సాగుతున్న నిరంతర!! అంతర్గత!! బాహిర్గత !! అంతులేని...!! అంతమే లేని పోరాటం!. నిజానికి స్త్రీల అస్తిత్వ పోరాట పరిధి చాలా విస్తృతమైంది. ఎందుకంటే కులం, మతం ఏదైనా స్త్రీలపై వివక్ష మాత్రం ఒక్కటే. అయితే ఇక్కడ దళిత కోణం ఆవిష్కరిస్తున్న సందర్భం కనుక, జాజుల గౌరీ రచించిన "మన్నుబువ్వ" కథల సంకలనం నుండి స్త్రీ అస్తిత్వం తెలుపుతున్న ఐదు కథలను తీసుకుని ఈ పత్రం రాశాను. దళిత కులంలో పుట్టి, పెరిగిన జాజుల గౌరి కథల్లో ఆర్ద్రత స్పష్టంగా కనిపిస్తుంది.

### నీళ్ళబాయి :

ఒక పల్లెటూరి జీవితాన్ని, తద్వారా స్త్రీ అస్తిత్వాన్ని స్పృశించిన కథ నీళ్ళబాయి. పంటపొలాల్లో పంటకు కావాల్సిన నీటికోసం పడే పాట్లు కళ్ళకు కట్టించారు రచయిత్రి. ఆ జీవన విధానాల్లోని కష్ట-నష్టాలను, సుఖ-దుఃఖాలను ఒకతరం వెనక్కు వెళ్ళి పాఠకులు అనుభవిస్తారు. ఒక చిన్న అమ్మాయి చెప్తూ ఉన్నట్లు, ఆ అమ్మాయి గతాన్ని గుర్తు చేసుకుంటున్నట్లుగా సాగే నీళ్ళబాయి కథ స్త్రీ అస్తిత్వాన్ని చాలా చక్కగా ఆవిష్కరించింది. ఎక్కడా, ఎవరినీ నొప్పించకుండా చాపకింద నీరులా చడీ చప్పుడు లేకుండా, స్త్రీ జీవన శైలిని పాఠకుడికి అందించారు రచయిత్రి. ఆడుతూ పాడుతూ సాగే జీవితంలో, అకస్మాత్తుగా ఇక చాలు, వయసుకొచ్చావు అంటూ ఆటలకు ఆనకట్ట ఎందుకు ఎదురవుతుందో ఎనిమిది సంవత్సరాల అమ్మాయికి అర్థం కాని, జవాబు దొరకని ప్రశ్న. ఎనిమిది సంవత్సరాలకే బాల్యం ఛాయలు వదులుకోవలసి రావటం అన్న ఊహే కష్టంగా ఉంటుంది, అటువంటి జీవన విధానం అమలులో ఉన్న పరిస్థితులు ఇప్పటికీ కొల్లలుగా కనిపిస్తాయి. మగపిల్లలతో కలిసి ఆడుకోవడం నేరం, తలెత్తుకుని నడవడం తప్పు, నలుగురిలో గట్టిగా నవ్వడం తప్పు.... ఒకటేమిటి ఇటువంటి ఆంక్షలు లెక్కకు మించి. ఇవన్నీ ఆడపిల్లలకే ఎందుకు అన్నదే కథలోని అమ్మాయి ఆవేదన.

"నాయిన నీసు మంచిగ తింతడని వారి కోతలైనంక ఎంట్రికాయలను పట్కరమ్మని అన్నతోటి అనంగనే సుదన్న నరేందరుగాడితోటి కల్సి వరాల పొంటి ఎంట్ర కాయలు పట్కరానికి పోతుంటే మేము గూడ వస్తమని నేను సెల్లె రడీ అయ్యేతాల్లకు అన్నకు తిక్కరేగి పెండతోటి నిండివున్న తమిలేర్లు (ఇన్పడబ్బాలు) నాకొకటి సెల్లెకొకటి ఇచ్చి సుదన్న, నరేందరుగాడు దొరలలెక్క ముందు నడుస్తుంటే పనోల్లలెక్క మేము యెన్కెన్క పోతుంటిమి"

ఆడపిల్లలకు, మగపిల్లలకు మధ్య తేడా అనేక సందర్భంలో పై విధంగా వ్యక్తమౌతూనే ఉండడం మనం కథలో చూస్తాం. అమ్మాయి తల్లి కూతుర్ల విషయంలో ఎటువంటి వ్యత్యాసం చూపించకపోవడం కనిపిస్తుంది, అయితే సమాజానికి భయపడక తప్పదన్న విషయాన్ని మాత్రం తన కూతుర్లతో చెప్పడంద్వారా, స్త్రీలపై సమాజంలో ఉన్న వివక్ష అర్థం అవుతుంది.

### కంచె :

ఆడపిల్లగా పుట్టడం ఎంత భయానకమైంది అన్న స్పృహను కలిగించిన కథ కంచె. ఒకానొక అమానుష చర్యకు గురికాబడి, దాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక, బతుకు బరువనుకున్న ఒక అమాయకపు ఆడపిల్ల కన్నీటిగాథ ఈ కంచె కథ. వయసుతో నిమిత్తం లేకుండా ఆడదైతే చాలు ఆంబోతుల్లా మీద పడి కామం చల్లార్చుకునే కోవకు చెందిన కామాంధుల ఘాతకాన్ని ఆవిష్కరించింది. సమాజంలో ఇటువంటి దారుణాలకు గురికాబడి, కామాంధుల చేతిల్లో బలి అయిన ఎందరో అమాయకపు ఆడపిల్లలను గుర్తుకు తెప్పించే సందర్భం ఈ కథ. ఊహించని కష్టానికి, జరిగిన నష్టానికి శరీరమంతా

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

కంపించినా, నెమ్మదిగా తేరుకుని, సాటి స్త్రీగా, సమాజపు కుల్లును బాగా ఎరిగినదిగా, బిడ్డ మంచి భవిష్యత్తును కోరుకుని గుండె నిబ్బరంతో ముందడుగు వేయగలిగిన నిర్ణయం తీసుకోగలిగిన ఒక తల్లి కథ కంచె.

చిన్నవయసులోనే రజస్వల అయిన అమ్మాయి సుగుణ. ఆడుకునే వయసే అయినా, రజస్వల అయిన కారణంగా అన్ని స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలను కోల్పోవలసి వస్తుంది. అలవాటు లేని పెద్దరికాన్ని తన ఒంటికి పులుముకోవలసి వస్తుంది. ఎండాకాలపు సెలవుల్లో ఒక రోజు వయసులో తనకన్న చిన్న పిల్లలైన తన స్నేహితులు కట్టెలు కొట్టుకురావడానికి వెళ్తూ తనను కూడా రమ్మని బతిమాలడంతో సుగుణ కాదనలేక పొలానికెల్లిన తన తల్లితో విషయం చెప్పమని పక్క ఇంటివాళ్ళకు చెప్పి, ఇంటి తాళాలు ఇచ్చి స్నేహితులతో అడవికి వెళుతుంది. కావలసినన్ని కట్టెలు దొరక్క వెతుక్కుంటూ వెతుక్కుంటూ దట్టమైన అడవిలోకి వెళతారు ముగ్గురు స్నేహితులు. ఎక్కడా చిన్నవిగా, విరవడానికి తేలికగా ఉన్నవి దొరక్క దిక్కులు చూస్తున్న వారికి ఒక ప్రాంతంలో కొల్లలుగా ఉన్న కట్టెముక్కలు కనిపిస్తాయి. అయితే ఆప్రాంతం మొత్తం కంచె వేసి ఉండటాన్ని గమనించి సుగుణ వారిస్తుంది. ఇంత అడవిలో ఎవరు వస్తారక్కా, ఇలా వెళ్ళి అలా పని ముగించుకు వచ్చేద్దాము, అని బల వంతంగా పిల్లలిద్దరూ కంచె లోపలికి సుగుణను తీసు కెల్తారు. పని ముగిసేలోపే ఇద్దరు కాపలాదారులు వచ్చి పిల్లలను తిడుతూ అడ్డుకుంటారు. తప్పైపోయిందని, ఇంకెపుడూ ఇలా జరగదని, క్షమించమని ఎంతగా ప్రాధేయపడ్డా కాపలాదారులిద్దరు కనుకరించక, చిన్న పిల్లలిద్దరినీ కంచె బయటికి తోసి, సుగుణను బంధించి తొప్పల్లోకి లాక్కెళ్ళి, మానభంగం చేస్తారు.సుగుణక్కను లాక్కెళ్ళిపోయి చాలా సేపయింది, ఏం చేశారో, ఎలా ఉందో తెలియక భయంతోనే కంచె దాటి వెతుక్కుంటూ వచ్చిన ఇద్దరమ్మాయిలకు సుగుణ మూలుగులు వినిపిస్తాయి. ఆ దిశగా మెల్లగా అడుగులేస్తూ వెళ్ళి, దీన స్తితిలో నగ్నంగా పడి ఉన్న సుగుణను చూసి అవాక్కయి, ఏం జరిగివుంటుందో కూడా తెలియని అమాయకత్వం లోనే సుగుణను మెల్లగా లేపి, బట్టలు వేసి, అలానే మెల్లగా నడిపించుకుంటూ కంచెను దాటించి నీటి చెరువు దగ్గరికి తీసుకెళ్ళి మొఖం కడిగించి కాస్త నీళ్ళు తాపి ఏమ యిందక్కా అని అడగ్గానే సుగుణ ఏమీ అర్థం కాక గట్టిగా గుక్క పెడుతూ ఏడుస్తూ....ఇక్కడ జరిగిందేదీ ఎవరితోనూ చెప్పద్దని మాట తీసుకుంటుంది.

కాస్త కుదుట పడిన తరువాత, కట్టె మోపులను స్నేహితులు మోసుకుని ముందు నడుస్తూవుంటే, అతి కష్టం మీద అడుగులు వేసుకుంటూ సుగుణ వారిద్దరితో కలిసి ఇంటికి చేరుకుంటుంది. ఆ రోజునుండి సుగుణ చాలా ఉదాసీనంగా మారిపోతుంది. తల్లి ఏమయింది బిడ్డా అని ఎన్ని సార్లు అడిగినా తనకెదురైన ఘాతకం చెప్పుకోలేక పోతుంది. మనసులోనే క్రుంగిపోతుంది. ఎప్పుడూ ఆనందగా, సరదాగా ఉండే బిడ్డ ఇలా ఎందు కుంటోందో తల్లికి అర్థం కాదు. ఇలానే మూడు నెలలు గడిచే సరికి సుగుణలో మానసికంగానే కాక శారీరకంగా మార్పులు కనిపిస్తాయి, తినకపోవడం, వాంతులు చేసు కోటం, ఇక భయపడి సుగుణను డాక్టరు దెగ్గరికి తీసుకెళ్లిన సుగుణ తల్లి పోచమ్మకు గుండెపోటు తెప్పించే విషయం చెప్తుంది డాక్టరు. సంఘటన జరిగిన వెంటనే ఇంట్లో చెప్పి ఉంటే ఇంతవరకు వచ్చివుండేది కాదు, పరీక్షల ద్వారా, తగిన సాక్ష్యాధారాల ద్వారా వాళ్లిద్దరినీ అరెస్ట్ చేయించి, శిక్ష పడేలా చేయించిండొచ్చు, తప్పు నీది కాదు, కానీ ఆ రోజే చెప్పక తప్పు చేశావు అంటూ సుగుణను మంద లిస్తున్న డాక్టరుతో, నా భర్త ఊర్లో లేడు, రాగానే మల్లీ వస్తాను అని చెప్పి సుగుణను ఇంటికి తీసుకువచ్చి బాగా కొడుతుంది పోచమ్మ. ఆత్మహత్యకు పాల్పడిన సుగుణను అడ్డుకుని, నీ మీద ప్రేమే కానీ ద్వేషం లేదని, నువ్వు చస్తే ఇక మాకు బతుకెక్కడిదనీ, సుగుణను అక్కున చేర్చుకుంటుంది. తప్పేమీ లేని తన బిడ్డను రక్షించుకునే దిశగా నిర్ణయం తీసుకుని, అబార్షన్ చేయించదలుస్తుంది.

## నేన్-నేన్లెక్కనే :

కులం పేరుతో దళితులను నీచంగా, హీనంగా చూసే కోవకు చెందిన పెద్దమనుషులకు బుద్ధి చెప్పే దిశను నిర్ణయించుకుని, బుద్ధి చెప్పే ఆయుధం ఏంటో తెలుసుకుని, ముందడుగు వేసిన, ఏడెనిమిది సంవత్సరాల గౌరి ఆత్మస్థైర్యాన్ని పరిచయం చేసి, విస్మయానికి గురి చేసే కథ నేన్ నేన్లెక్కనే. పసిపిల్లలైన గౌరి, గంగ అక్కా-చెల్లెల్లు. పొలం పనులు, ఇంటి పనులు చేసుకుంటూ పిల్లలను కనిపెట్టుకునుండటం కష్టంగా అనిపించి బడికి చేర్పుతుంది వీళ్ళ అమ్మ. కొన్ని రోజుల్లోనే బడికి వెళ్లిరావడానికి పిల్లలిద్దరూ బాగా అలవాటు పడతారు. ఇలా చూస్తుండగానే మూడు సంవత్సరాలు దాటుతాయు. గౌరి మూడవ తరగతికి వస్తుంది, బాగా చదువుతుందన్న పేరు సంపాదించుకుంటుంది. దాహమేసి ఒకరోజు స్నేహితురాలింట్లో నీళ్ళు తాగటానికి వెళ్ళిన గౌరి, గంగలకు కొత్త అనుభవం ఎదురవుతుంది. మీరెవరు, ఏ కులం, ఎక్కడుంటారు అన్న ప్రశ్నలు తమపై సంధింపబడతాయి. తమ జీవితంలో మొట్ట మొదటిసారిగా ఎదురైన అటువంటి ప్రశ్నలకు సమాధానాలు వారి దగ్గర ఉండవు. ఎక్కడినుండి వస్తున్నారో మాత్రం చెప్తారు, అంతటికే అర్థం అయిపోయినట్లు పిల్లలకిద్దరికీ మంచి నీళ్ళ చెంబు చేతికివ్వడం ఆపేసి పై నుండి పోస్తాను, తాగండి అని నీళ్ళను పై నుండి పోస్తారు. ఈ పరిణామానికి విస్తుపోయిన గౌరి చిన్ని బుర్రలో నీళ్ళనిలా పైకెత్తి ఎందుకు పోస్తున్నారు. అసలు కులం అంటే ఏమిటి అన్న ప్రశ్న ఉదయిస్తుంది. కులమంటే ఏంటో తెలియటం లేదుకానీ, ఆ రోజు నుండి, కలిసి తిరిగిన, ఆడిన, తనతో కలిసి చదువుతున్న తన స్నేహితులొక్కక్కరే తనకు దూరం అవుతుండడంతో, దూరం పెడ్తుండటంతో కులమంటే ఏంటో తెలుసుకోవాలన్న కుతూహలం బాగా పెరుగుతుంది. గౌరి బుర్రలో ఒకే ఆలోచన...అసలు కులమంటే ఏంటని? 'అంతకుముందు కూడా ఎపుడో రేడియోలో పాటలో కులం పేరు విన్నాను.' ఏమైనా సరే తెలుసుకోవాలని టీచర్ దెగ్గరకు వెళ్తుంది. తనను బాగా ఇష్టపడే అన్నమ్మ టీచర్ దెగ్గరికి వెళ్ళి అసలు కులమంటే ఏంటి టీచర్ అని అడుగుతుంది గౌరి.

'చిన్నపిల్లవు నీకిప్పుడు కులంతో పనేంటీ, అసలెవరన్నారు నీతో, ఎక్కడ విన్నావు' అన్న టీచర్ ప్రశ్నకు, కాసేపు ఆలోచిస్తూ మళ్ళీ, అసలు కులమంటే ఏంటో చెప్పమని అడుగుతుంది. 'మన పూర్వీకులు వృత్తులను బట్టి కులాలను ఏర్పరచి, సమాజాన్ని విడగొట్టారు, అయినా మనుషులంతా ఒక్కటే, అందరిలోనూ ఒకటే రక్తం, అందరం దేవుడి బిడ్డలమే, మనమే ఈ కులాలను సృష్టించుకున్నాం, అసలు కులాల పేరుతో మనుష్యులను వేరు చేసే వారిని నేను క్షమించను' అని వివరిస్తూ.... నిన్నెవరైనా ఏమైనా అన్నారా చెప్పు అని అడుగుతుందు టీచర్ కోపంగా. అదికాదు టీచర్ "ఒకే కులం..ఒకే మతం...అందరం ఒక్కటే....అందర్నీ కాపాడే దేవుడొక్కడే..." అని రేడియోలో పాటొచ్చిందిగా అది విని అడుగుతున్నా అంటుంది గౌరి. ఆ మాటకు కాస్త తేలిక పడి, చిన్న బుర్రకు అంత పెద్ద ఆలోచనలొద్దు.... పోయి ఆడుకొమ్మని పంపిస్తుంది టీచర్.

అంతే ఇక అంతా అర్థం అయిపోయినట్లు, ఈ కులం పిచ్చి ఉన్నవాళ్ళతో తానెలా గెలవాలో ఎరిగిన దానిలా, ఒక నిర్ణయానికి వచ్చి పట్టుదలతో చదువులో నిమగ్నమవుతుంది గౌరి. ఎప్పుడూ చదువులో మునిగివుండే కూతుర్ని చూసి, నా కూతురు బాపనోల్ల లెక్కనే చదువుతుందని తన తల్లితో అంటున్న తన తండ్రి దగ్గెరికెల్లి...." నేను ఎవల్ల లెక్క సద్వుతలే నేన్ నేన్లెక్కనే సద్వతున్నా" అంటూ ఎంతో ఆత్మ విశ్వాసంతో చెప్తుంది. చదువులో తానే ఎప్పుడూ ముందుంటూ, పెద్దకులాల పేరు చెప్పుకుంటూ, తనను తక్కువగా చూసిన వారిని చదువుతో దెబ్బ తీస్తుది గౌరి. మొత్తం జీవితంలో తాను ఎలా ముందుకెెదగాలో కూడా నిర్ణయించుకుంటుంది. దళిత కులంలో పుట్టి, పెరిగిన ఒక ఆడపిల్ల ఆత్మ విశ్వాసమే ఈ కథ. ఆత్మస్థైర్యమే ఆయుధంగా మరెందరికో ఆదర్శంగా నిలిచిన గౌరి కథ.

## దస్తకత్ :

కులం అన్న పేరు సమాజంలో చీడ పురుగు వంటి దన్న స్పృహను కలిగించే కథ దస్తకత్. నిరుపేదలకు, పేదలకు ధన సహాయం అందచేయడం వల్ల, వారి జీవనానికి, భవిష్యత్తుకు ఒక మంచి ఆసరా కలుగు తుందన్న ఉద్దేశ్యం గొప్పదే అయినా, ఆ సహాయం అంద చేయడానికి ఎన్నుకున్న పద్ధతుల విషయంలో, సమాజం ఇంకా వెనుకబడి ఉందనిపిస్తుంది.

స్వచ్ఛశీలంగా, కల్మషం లేకుండా, అందరూ ఒక్కటిగా కలిసి-మెలిసి, ఆడుతూ-పాడుతూ సాగే పసి వయ సులో......!! నువ్వు ఫలానా అని 'కులం' పేరుతో కలవరం రేపి, దానిగురించి తెలుసుకోటం కోసం కొంత, తెలుసు కున్న తరువాత మరికొంత, మదనపడేలా చేసే సంస్కృతి సమాజానికి అవసరమా అన్న ప్రశ్న పాఠకుడిని కలవర పరిచేలా చేస్తుంది దస్తకత్. వెనుక బడిన కులాల కోసం అందచేస్తున్న సహాయ నిధులు, నిజంగా వారి శ్రేయస్సు కోసమా, లేక సమాజంలో వారి స్థాయిని మొదటినుంచీ పరిచయం చేసి, వారిని ముందుకు రాకుండా చేయటం కోసమా అన్న అనుమానం కూడా ఈ కథ వ్యక్తపరుస్తుంది.

కొడుకు సంతోషం కోసం! స్కూల్లో ఇచ్చే నలభై రూపాయలకోసం! దస్తకత్ కోసం! తల్లీ-కొడుకులు పడే తపన! ఆలోచింపచేసే విషయం. నలభై రూపాయల రోజు కూలీని వదులుకుని, మూడు రోజుల పాటు పని మాను కుని, ఒక్క దస్తకత్ కోసం ఒక తల్లి పడిన మానసిక వేదన ఈ కథలో వర్ణించబడింది. మూడురోజుల కూలీ నష్టపోవడమే కాక, సంతకం కోసం ఇరవై రూపాయల లంచం కూడా చెల్లించవలసి రావడం మరో నష్టం. ఈ కష్టానికి, నష్టానికి వారికి దక్కబోయే ప్రతిఫలం నలభై రూపాయల స్కాలర్షిప్. ఎక్కడ ఉన్నాం మనం.....?! ఇంకెప్పటికి ముందడుగు వేస్తుంది మన సమాజం...?! ఎప్పటికి తీరతాయి బడుగు వర్గాల కష్టాలు......!!!???? ఇలా బదులు దొరకని ప్రశ్నలనెన్నింటినో పాఠకుడి ముందుకు తెచ్చింది దస్తకత్ కథ.

## మన్నుబువ్వ :

మన్ను తిని ఆకలిని శాశ్వతంగా ఎలా తీర్చుకోవచ్చో తెలియచెప్పిన ఒక చిన్నపాప కథ మన్నుబువ్వ. ఆకలి చాలా చెడ్డది, మనిషిని ఏమి చెయ్యడానికైనా ఉసి కొల్పుతుంది, అందుకే అమాయకపు పసిపిల్లతో! మన్ను తిని ఆకలిని చంపుకునే ప్రయత్నం చేసేలా చేసింది, చివరకు పాప ప్రాణాలను బలి తీసుకుంది. పేదరికంలో పుట్టడం నేరం కాకపోయినా, పేదరికం వల్ల కుటుంబం మొత్తం ఆకలితో అలమటించడం, దారుణ దృశ్యం. అటువంటి ఒక దృశ్యాన్ని పాఠకుడిముందుంచింది 'మన్నుబువ్వ' కథ.

ముగ్గురు పసిబిడ్డలతో, చాలీ చాలని కూలీ డబ్బులతో బ్రతుకీడుస్తున్న ఒక నిరుపేద కుటుంబం. ఒక్కరి సంపా దనతోనే ఇల్లు సాగాలి. పైగా రాత్రికి కల్లు దుకాణానికి దారిపట్టే ఇంటి యజమాని. ఇలా ఉండగా ఒకానొక రోజు, ఉదయం నుండి ఇంట్లో తినడానికి ఏమీ లేక ఆకలితో ఇంటిల్లిపాది అలమటిస్తున్న సందర్భంలో, ముగ్గురు బిడ్డల్లో ఒక పాప చాలా సార్లు అమ్మదెగ్గరికి ఆకలేస్తోందే ఏమైనా పెట్టు అని అడిగీ...అడిగీ....అలిసి, అలా ఆరుబయట మన్నులో ఆడుకుంటూ... ఆడు కుంటూ... కాస్త మన్ను తీసుకుని తింటుంది. ఆకలి తీరుతున్నట్లు అనిపించడంతో ఇంకాస్త....ఇంకాస్త మన్ను తిని, ఇంట్లోకెల్లి, అమ్మ అన్నం వండటాన్ని....అన్న, చెల్లెలు అమ్మ దగ్గరే అన్నం కోసం ఎదురుచూస్తూ కూచొని ఉం డటాన్ని చూస్తూ.... నీళ్ళ కుండలోనుండి చెంబుడు నీళ్ళు ముంచుకుని తాగి అమ్మవైపుగా వచ్చి, అలా పడు కుని, ఇంతసేపూ అన్నం...అన్నం అని అడిగి, అలా పడు కున్న తనవైపు వింతగా చూస్తున్న తన అమ్మ, అన్న, చెల్లి వైపు చూస్తూ...చూస్తూ నిద్ర కాని నిద్ర...దీర్ఘ నిద్ర...ఇక తిరిగి మెళుకువ రాని నిద్రలోకి అలా జారిపోతుంది.

పాఠకుడి కంట కన్నీరు పెట్టించే కథ......ఆకలి మంటల కథ.......'మన్నుబువ్వ'

**ముగింపు :**

ఇక్కడ పరిచయం చేసిన ఐదు కథలు దళిత కుటుం బాల్లోని స్త్రీ కోణాన్ని పరిచయం చేస్తున్నాయి. తల్లి కావొచ్చు, చెల్లి కావొచ్చు, స్నేహితురాలు కావొచ్చు...... స్త్రీ ఎక్కడైనా స్త్రీనే.....!! ఆమె ప్రేమ....వాత్సల్యాలు అమితమైనవి.....!! వాటికి కులంతో, మతంతో పని లేదు....!! 'ఆ ప్రేమను కొలవటానికి ఏవిధమైన కొలమానాలు భూమ్మీదనే ఎక్కడా లేవు' అంటే అతిశయోక్తి కాదు!! మరి సమాజానికి ఈ కుల వ్యామోహం ఎందుకని.....?! వంటి సమాధానం దొరకని అనేక ప్రశ్నలు పాఠకుడిని ఆలోచింప చేసేవిగా ఉన్నాయి. దళిత కులంలో పుట్టి, అనేక విధాల కుల వివక్షను ఎదుర్కొని, దళిత స్త్రీ అస్తిత్వానికి కథల రూపం కల్పించి, పాఠకుడిని ఆలోచింపచేశారు మన్నుబువ్వ కథాసంకలన రచయిత్రి జాజుల గౌరి.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# కాళ్లకూరి నారాయణరావు 'చింతామణి' విశిష్టత

– డా. వెంకటరామయ్య గంపా, అసిస్టెంట్ ప్రొఫెసర్, భారతీయ భాషల విభాగం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ.

**వ్యాస సంక్షిప్త పరిచయం :**

తెలుగు నాటక సాహిత్యంలో కాళ్లకూరి నారాయణ రావు గారి చింతామణి నాటకానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. కన్యాశుల్కంలో మధురవాణి పాత్ర తరువాత ఆ స్థాయిలో పాఠకులు గుర్తుంచుకున్న పాత్ర చింతామణి. నాటక ప్రారంభంలో ఉన్న చింతామణి పాత్రకు ముగింపులో ఉన్న చింతామణి పాత్రకు కొంత వ్యత్యాసం ఉన్నప్పటికీ.. పాఠకులు మాత్రం నాటక ప్రారంభంలో ఉన్న చింతామణినే గుర్తుపెట్టుకుంటారు.

**ముఖ్యాంశాలు :**

కాళ్లకూరి నారాయణరావు, చింతామణి, తెలుగు నాటకం.

తెలుగు సాహితీ అభిమానులకు సుపరిచితమైన పేరు చింతామణి. అక్షరాస్యులతో పాటు నిరక్షరాస్యులకు కూడా సుపరిచితమైన రచన చింతామణి. తెలుగులో దాదాపు నాలుగైదు చింతామణి నాటకాలు కనిపిస్తున్నాయి. అందులో బెంగాలీ నుంచి అనువాదమైన నాటకం, మరాఠి నుంచి అనువాదమైన నాటకం, తెలుగులో కొన్ని నాటకాలున్నాయి. వడ్డాది సుబ్బరాయుడు *భక్త చింతమణి* గ్రంథాన్ని పద్య రూపంలో 1921 లో రచించినట్లు కనిపిస్తుంది. 1922లో రామనారాయణ కవులు చింతామణి లేక లీలాశుక అనే పేరుతో ఏడు అంకాల నాటకాన్ని రచించారు. *బిల్వమంగళ* అనే పేరుతో గిరీశ్ చంద్రఘోష్ బెంగాలీ భాషలో రాసిన నాటకాన్ని శ్రీపాద కామేశ్వరరావు తెలుగులోకి 1926లో అనువాదం చేశారు. ఈ రచనలన్నిటిలోనూ కాళ్లకూరి నారాయణరావు రచించిన *చింతామణి* నాటకం చాలా ప్రసిద్ధి చెందింది.

కాళ్లకూరి నారాయణరావు సుప్రసిద్ధ రచయిత, సంఘ సంస్కర్త, జాతీయవాది, 'మహాకవి' బిరుదాంకితుడు. వారు తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ మత్స్యపురి గ్రామంలో 1871, ఏప్రిల్ 28న జన్మించాడు. తండ్రి బంగారురాజు, తల్లి అన్నపూర్ణమ్మ. సంఘంలో వేలూడిన పలు దురాచారాలను ఎలుగెత్తి ఖండిచారు. వీరి రచించిన నాటకాలలో చింతామణి (1921), వర విక్రయం (1923) మరియు మధుసేవ (1926) బాగా ప్రసిద్ధి చెందిన రచనలు. వీటిని చాలా మంది నాటకాలుగా ప్రదర్శించారు. తెలుగు సినిమాలుగా కూడా నిర్మించబడి మంచి విజయం సాధించాయి.

ఇందులోని పద్యాలు చాలా ప్రసిద్ధి చెందాయి. ఇక ఈ రచన లీలాశుకుని శ్రీకర్ణామృతము ఆధారంగా రచన చేసినట్లు రచయిత పేర్కొన్నారు. ఈ రచన చేసిన లీలాశుక ఎవరనేదానిపై భిన్నాభిప్రాయాలున్నాయి. ఇతడు ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా శ్రీకాకుళం ప్రాంతంలో నివసించాడని కొందరి పరిశోధకుల అభిప్రాయం. మరి కొందరి అభిప్రాయం ప్రకారం ఇతడు కేరళ ప్రాంతానికి చెందిన వాడని, దామోదరం పుత్రుడని, బిల్వమంగళం అనేది ఇంటి పేరని, లీలాశుక అనేది నామధేయం అని, మహావిద్వాంసుడు, కవి అని పేర్కొంటారు. ఇంకొందరు పరిశోధకుల అభిప్రాయం ప్రకారం ఇతడు బెంగాల్ వైష్ణవ సంప్రదాయానికి చెందిన చైతన్య స్వామి చెబుతారు. వీరి అభిప్రాయం ప్రకారం చైతన్య స్వామి దక్షణ భారతదేశం పర్యటించాడు. అక్కడ ఒక దేవాలయంలో శ్రీకృష్ణ కర్ణామృతం శ్లోకాలను విని అవి అందరు వినదగినవని తలంచి, ఆ ప్రతిని తీసుకొని జగన్నాథ ఆలయంలో ఇచ్చినట్లు ఒక ఐతిహ్యాం ఉంది.

**చింతామణి ఇతివృత్తం :**

చింతామణి వేశ్య. ఆమె తల్లి శ్రీ హరి, చెల్లి చిత్ర. భవాని శంకరుడనే నియోగ బ్రాహ్మణుడు, సుబ్బిశెట్టి అనే వ్యాపారి ఆమె విటులు. ఆమె వారి ఆస్తినంతా అపహరిం

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

చింది. భవాని శంకరం ద్వారా అతని స్నేహితుడు, ధనవంతుడు, గుణవంతుడు, విద్యావంతుడైన బిల్వ మంగళుని ఆకర్షిస్తుంది. బిల్వమంగళుడు ఆమె వలలో పడి భార్యను, వార్ధక్యంతో అనారోగ్యం పాలైన తండ్రిని కూడా నిర్లక్ష్యం చేస్తాడు. ఒక రోజు బాగా వర్షం పడుతున్న వేళ బిల్వమంగళుడు అర్ధరాత్రి నీటిలో తేలివచ్చిన ఒక దుంగ ఆధారంతో వాగు దాటి చింతామణి ఇల్లు చేరుకొని తలుపులు వేసి ఉంటే గోడమీద వ్రేలాడుతున్న తాడు సాయంతో ఇంట్లోకి ప్రవేశిస్తాడు. అయితే గోడ మీద తాడులాంటిది ఏదీ లేదని చింతామణి బిల్వమంగళు నితో చెబుతుంది. దీనితో దీపం తెచ్చి చూస్తే అది తాడు కాదు పాము అని, అదే విధంగా వాగు దాటడానికి సహకరిచింది దుంగ కాదు బిల్వమంగళుని భార్య రాధ శవం అని తెలుస్తుంది. భర్త వాగు దాటడానికి పడవని పిలిచే ప్రయత్నంలో వాగులో పడి మరణిస్తుంది రాధ. బిల్వమంగళునికి తనపై ఉన్న వ్యామోహానికి విస్తు పోతుంది చింతామణి. ఆ రాత్రి చింతామణికి శ్రీకృష్ణుడు కలలో కనబడతాడు. దానితో ఆమెలో వైరాగ్యం కలిగి సన్యాసం తీసుకుంటుంది. జరిగిన సంఘటనల వలన బిల్వమంగళునిలో పరివర్తన వస్తుంది. అతడు సోమదేవ మహర్షి బోధనలవల్ల ప్రభావితుడై ఆశ్రమ స్వీకారం చేసి అనంతర కాలంలో లీలాశుక యోగీంద్రుడుగా మారి 'శ్రీకృష్ణ కర్ణామృతం' అనే సంస్కృత గ్రంధాన్ని రాశాడు.

**చారిత్రకంగా చింతామణి :**

"చింతామణి పెద్ద కళ్లేపల్లి వాస్తవ్యురాలు. ఇది ఆంధ్ర ప్రాంతంలో ఒక పవిత్ర యాత్రా స్థలం. ఇక్కడ కేదా రేశ్వరుని రూపంలో శివుడు వెలశాడు. ఒకానొకప్పుడు ఇది బౌద్ధుల యాత్రాస్థలంగా శోభిల్లింది. శ్రీకాకుళం, ఘంట సాల, మొవ్వ, కూచిపూడి మొదలైన కళాకేంద్రాలకు చేరువలో దివిసీమలో నున్న గ్రామమిది. చింతామణి తల్లి శ్రీహరి ఒక నర్తకి, ఆమె తండ్రి ఆయూరిలో వెలసిన కేదారేశ్వరుడు" (రామకృష్ణ, నటరాజ. రుద్రగణిక. 95.)

**చింతామణి పాత్ర :**

చింతామణి నాటకంలో చింతామణి ప్రధాన పాత్ర. వేశ్య. కథానాయకురాలు. విద్వాంసురాలు. అందగత్తె. చింతామణి పాత్రలో రెండు విరుద్ధమైన స్వభావాలు కనిపిస్తాయి. ఒకటి వేశ్యా వృత్తిపట్ల అనాసక్తిని చూపుతు న్నట్లు నాటకంలోని ఆమె సంభాషణల ద్వారా తెలియ జేయడం. కాని ఆమె తల్లి శ్రీహరి మాత్రం తమ వృత్తిపట్ల శ్రద్ధ చూపించాలని, ఆ వృత్తే తమకు జీవనాధారం అని చింతామణినికి చెప్పడం, అందుకు అనుగుణంగా చింతా మణి తన జీవనాన్ని వేశ్యావృత్తిలో కొనసాగిస్తున్నట్లుగా రచనలో కనిపిస్తుంది. రెండవది ధనవంతులైన వారిని ఆకర్షించి వారి ధనాన్ని హరించిన తరువాత వారిని వెళ్ళగొట్టే ప్రయత్నం చేయటం.

సీ. "వగలును వలపులు వర్షించి తొలినాడె తిరుగనిపిచ్చి
యెత్తించినాను
వచ్చిన నెలలోనె మచ్చిక మీఱ లాలించి
మాన్యమ్ములమ్మించినాను
బన్నసరాలకై పట్టుపుట్టములకై యిల్లు విక్రయము
చేయించినాను
దినవెచ్చములకని తినుబండములకని పెండ్లాము
నగలు మార్పించినాను
అన్ని వగలు చూపి యిన్ని రీతులు మాపి
యెట్టు లింతలోనె యేగుమందు
ఆతడుస్సురన్న నాతని కడ గొన్న
ద్రవ్యమెట్లు మనకు దక్కునమ్మ!" (పైదే. 11).

అని భవాని శంకరం దగ్గర నుంచి తీసుకున్న ధనం, నగలు గురించి తల్లి శ్రీహరికి వివరిస్తుంది చింతామణి. ఆమె మాయలో పడి ఆమెకు యావద్ ఆస్తిని సమర్పించు కుని రోడ్డున పడ్డవారు చాలా మందే ఉన్నారు.

"తనకు గల్గినదెల్ల - ధారపోసినయట్టి సీతాపతికి స్వస్తి
- చెప్పినాను
మెచ్చి ముచ్చట తీరు - మేడ కట్టించిన పోలిశెట్టిని
బార - ద్రోలినాను
నిముసంబులోన మా - న్యము వ్రాసి యిచ్చిన
యాదిరెడ్డిని - సాగనంపినాను
కోరిన బంగారుకొండ - నేనియుదెచ్చు పెద్ది సెట్టికి

సొడ్డు - పెట్టినాను
క్రొత్తసరసులు చెలరేగి - చిత్త కార్తి
కుక్కలంబలె నిలుచుట్టు - గ్రుమ్మరిలుట
కాంచి మాయమ్మ నన్నెంత - కసురుచున్న
నీకె లోబడి యున్నాను - నిజముగా" (పైదే)

అని భవాని శంకరంతో చెబుతుంది చింతామణి. దాదాపు తన దగ్గరకు వచ్చినవారందరి సంపదలను హరించివేసింది. చివరికి వారిని కట్టుబట్టలతో వీధిలో నిలబెట్టింది. చివరికి తండ్రి కొడుకులను (పెద్దిశెట్టి, అతని కుమారుడు సుబ్బిశెట్టి) కూడా తన చేష్టలతో తన ఇంటికి రప్పించింది.

కానీ అంతలోనే తన వృత్తిపట్ల ఏహ్యభావాన్ని తెలియ చేస్తుంది.

"ఛీ! పాడువృత్తి యేమి వృత్తి ఇది!
ఆ. ఎఱుగ వలయు విటుని యడద సొంతముగ స
హింపవలయువాని యేహ్యమెల్ల
మసలవలయు నతని మదికెక్కునట్లాడి
పడునె యపుడు గాక పైక మురక!" (పైదే.18)

కానీ ఈ మాటలు ఎంత వరకు నిజం అనే సందేహం కలుగుతుంది. చింతామణి సుబ్బిశెట్టిని అమాయకుడని చెబుతుంది. కానీ అతడిని కూడా తన వలలో వేసు కోవడానికి ప్రయత్నిస్తుంది. చివరికి సఫలమవుతుంది. చింతామణి పురుషులతో మాట్లాడిన ప్రతిసారి కూడా అబద్ధాలే చెబుతుంది. కానీ పైకి మాత్రం తను సత్యం మాత్రమే చెబుతానని పురుషులతో చెబుతుంది.

"మీతోడనే కాదు- ఎవ్వరతోడను నేనబద్ధమాడను. చింతామణి యీ కులములో బుట్టవలసినది కాదని చిన్నలు బెద్దలు నన్ను శ్లాఘించుటకిదియే కారణము." (పైదే.27) పైకి చెప్పేమాటకు లోపలి మనసులోని మాటకు పొంతన కనిపించదు. అసలు ఒక వేశ్యకు ఉం డవలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. కానీ పైకి మాత్రం ఆ వృత్తి అంటే ఇష్టం లేనట్లు చెబుతుంది.

వేశ్యలను మూడు రకాలుగా వాత్స్యాయనుడు పేర్కొ న్నారు. వారిలో - ఏక పరిగ్రహ. 2. అనేక పరిగ్రహ. 3. అపరిగ్రహ. ఏక పరిగ్రహ ఒక్కనాయకుని మాత్రమే పరిగ్రహించి ఉంటుంది. అనేక పరిగ్రహ అనేకులను పరి గ్రహించి ఉంటుంది. అపరిగ్రహ ఎవ్వరిని స్వీకరించనిది.

ఇందులో చింతామణి అనేక పరిగ్రహ విభాగానికి చెందిన వేశ్యగా పేర్కొనవచ్చు. పలువురి పట్ల ఆసక్తిని కనబరుస్తుంది. మొదట భవాని శంకరుని, తరువాత సుబ్బిశెట్టిని, అనంతరం బిల్వమంగళుని ఆకర్షించి వారి ఆస్తిని కాజేయడానికి ప్రయత్నిస్తుంది. విటులను ప్రతి క్షణం డబ్బుకోసం పీడిస్తుంది.

"ఇక్కడ, కిరువది దినములనుండి వినివిని ప్రాణము విసిగినది- ఇంకను నేమి వినను! ప్రతి దినము మాయమ్మచేత నేను పడలేక చచ్చిపోవుచున్నాను! మధ్యాహ్నము మీరు వెళ్ళినది మొదలు మాయమ్మ నన్ను కోసినకోతకు నేను గనుక భరించితిని గాని మఱొకతె యైనచో మందో మాకో మ్రింగి చావవలసినదే! ఇక పడలేను! ఇంతటితో మీదారి మీది! నాదారి నాది!" (పైదే. 29)

అప్పటికే భవాని శంకరం తాతల నాటి క్షేత్రాలను, తండ్రి ఇచ్చిన ఇంటిని, అత్తగారు ఇచ్చిన అంటుమామిడి తోటను అమ్మి, ఆ ధనాన్ని చింతామణికి ఇచ్చాడు. చివరికి భార్య ఆభరణాలను కూడా చింతామణికి కట్టబెట్టాడు. భవాని శంకరం చివరకు అప్పుల కోసం వెంపర్లాడే పరిస్థితిని చింతామణి కల్పించింది. అసలు చింతామణి ఎంత కఠినంగా విటుల దగ్గర డబ్బు తీసు కున్నదో ఆమె ఒక పద్యం ద్వారా చెబుతుంది.

సీ. తనకు గల్గినదెల్ల ధారపోసినయట్టి సీతాపతికి స్వస్తి చెప్పినాను
మెచ్చి ముచ్చట తీఱ మేడ కట్టించిన పోలిసెట్టిని బాఱ ద్రోలినాను
నిమునంబులోన మాన్యము వ్రాసియిచ్చిన యాదిరెడ్డిని సాగనంపినాను
కోరిన బంగారు కొండనేనియు దెచ్చు పెద్దిసెట్టికి సొడ్డు పెట్టినాను

గీ. క్రొత్త సరసులు చెలరేగి చిత్తకార్తి
కుక్కలంబలె నిలుచుట్టు- గ్రుమ్మరిలుట
కాంచి మాయమ్మ నన్నెంత కసరుచున్న
నీకే లోబడియున్నాను నిజముగాను" (పైదే. 30)

అని చెప్పిన చింతామణి వెంటనే బిల్వమంగళుని గురించి ఆరా తీస్తుంది.

కం. "వలపెఱుగని నా హృదయము
కళవళపడె నతని మోముగనినంత నెవు
ల్లలు జనియించెను జెక్కుల
నిలువెల్ల వడంకె నొక్క నిముసము దనుకన్"
(పైదే. 31)

అని బిల్వమంగళుని మీద ఉన్న ఇష్టాన్ని భవాని శంకరానికి తెలియచేస్తుంది చింతామణి. ఎలాగైనా ఒక సారి తన ఇంటికి తీసుకురమ్మని అతనికి చెబుతుంది. బిల్వమంగళుడు తన ఇంటికి వస్తే నేను (చింతామణి) నువ్వు (భవాని శంకరం) బాగుపడతామని సూటిగానే చెబుతుంది. బిల్వమంగళుడు తన దగ్గరకు వస్తే అతని నలభై లక్షల ఆస్తిలో సగం భవాని శంకరానికి ఇస్తానని చెబుతుంది చింతామణి. ఆమెకు బిల్వమంగళుని మీద ఉన్న వ్యామోహం కంటే అతని ఆస్తి మీద ఆసక్తి ఎక్కువ. అందుకు తగిన ఉపాయం ఆలోచించి అతన్ని తన వలలో వేసుకుంది.

ఇక్కడ రెండు రకాలైన అభిప్రాయాలున్నాయి. సుబ్బిశెట్టి దృష్టిలో చమురుజిడ్డు ముఖం కలిగినది. పుసికన్నులు. దొంగముండ, రంగు మెరగు కలిగినది. అది ఒక చక్కదనెమేనా అని సుబ్బిశెట్టి ఈసడించు కొంటాడు. మనస్తత్వం లో తేనె పూసిన కత్తి. ఎదుటి వారికళ్ళల్లో కారం చల్లగలిగిన నేర్పు. కపట శాంతము.

తగిన సాహిత్య జ్ఞానం ఉంది అలాగనీ పండితురాలు అని చెప్పలేం. పాండిత్యం ఉన్నట్లు నటిస్తుంది. అంతే తప్ప పూర్తిగా పండితురాలు కాదు. నాలుగు పద్యాలు చదివిన ప్రతివాడు పండితుడైతే చింతామణి కూడా పండితురాలే.

**జానతనం :**

పెద్దిశెట్టి రవ్వల గాజులు తెచ్చియిస్తూనే ఉన్నాడు. భవాని శంకరునితో వాడికి సొడ్డుపెట్టానని చెబుతుంది. ఆ విటులను చేరదీసి వారి యావద్ ఐశ్వర్యాన్ని ధ్వంస పరచగలిగిన నేర్పు ఉంది. భవాని శంకరం 40 లక్షలు విలువగల సంపదను మొత్తం హరించింది. చివరికి భార్య కాళ్లమీద పడి నీళ్లకావడి మోసే స్థితికి తీసుకువచ్చింది. శెట్టి అండతోనే అతని కొడుకైన సుబ్బిశెట్టిని చేరదీసింది. అతడి సంబంధించి అనేక విషయాలలో భవాని శంకరంతో అబద్ధమాడుతుంది. బిల్వమంగళుని రప్పించ డానికి చింతామణి కపట పాండిత్యం ప్రకటిస్తుంది. తను చెప్పినట్లు చేయమని భవానిశంకరుని ఒత్తిడి చేస్తుంది. చివరకు తన ఇంటికి వచ్చేలా చేస్తుంది. అందుకు కపట పాండిత్య నాటకం ఆడుతుంది.

నాటకం చివరిలో చింతామణి పాత్ర మానసిక పరి వర్తన వచ్చి భగవంతుని పట్ల భక్తి భావంతో ఉంటూ సమాజంలో మార్పు తీసుకురావాలని కృషి చేసినట్లు కనిపిస్తుంది. కానీ ఆనాటి సమాజంలో వాస్తవంగా ఉన్న పరిస్థితులు గమనించినట్లయితే మరో కోణం కనిపిస్తుంది. చింతామణి వంటి వారు చెలామణి కావడానికి కారణం సమాజం. పండితుడిగా, ఉత్తమ గుణ సంపన్నునిగా ఉన్నట్లు పైకి కనిపించినప్పటికీ అతి సులభంగా స్త్రీ వ్యామోహంలో పడిపోగల బిల్వమంగళుని వంటివారు సమాజంలో చాలా మంది ఉన్నారు. సుందరమైన వేశ్యల పట్లగల వ్యామోహం, భోగిని కౌగిలి యందు ఆసక్తి కలిగి ఉండటం, సాని యెడల అనురాగం, అన్నిటి కంటే ముఖ్య మైనది సానిదాని పాద స్పర్శ, ఓర చూపు కోసం పాకు లాడటం అనేది ఆనాడు సమాజంలో సహజ లక్షణంగా కనిపిస్తుంది. ఈమె వలలో పడిన సుబ్బిశెట్టి, భవాని శంకరం తన ఆస్తిని మొత్తం పోగొట్టుకున్నారు. బిల్వ మంగళుడు 90శాతం ఆస్తిని మొత్తం చింతామణికే ధార పోశాడు. చివరకు తండ్రి మరణాన్ని కూడా పట్టించు కోకుండా చనిపోయిన తండ్రి కంటే చింతామణే ముఖ్య మని చింతామణి దగ్గరకు వెళ్ళిపోయాడు. బిల్వ మంగళుడి భార్యమరణాన్ని చూసిన చింతామణి తన మనసు మార్చుకుంటుంది. తనను మరచిపొమ్మని, తను

ఈ వేశ్యావృత్తిని మానివేస్తున్నట్లు బిల్వమంగళుడితో చెప్పి సన్యాసం తీసుకొని కృష్ణుడి భక్తురాలిగా మారిపోతుంది. బిల్వమంగళుడు కూడా పశ్చాత్తాపంతో కృష్ణభక్తుడిగా మారిపోతారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. నారాయణరావు, కాళ్లకూరి.1923. *చింతామణి*: విజయవాడ: సరస్వతి బుక్ డిపో.
2. రామకృష్ణ, నటరాజ. 2000. *రుద్రగణిక.* హైదరాబాద్: పేరిణి ఇంటర్నేషనల్.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# బంజారాలు - జీవనోపాధి వృత్తులు

- డా॥. కె.హెచ్. కిషన్, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, బి.జే.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నారాయణగూడ, హైదరాబాద్, తెలంగాణ.

## ఉపోద్ఘాతం :

తెలంగాణ శబ్దం దేశవాది. ఈ దేశంలో భిన్నభిన్న సంస్కృతులు, సభ్యతలు కల వివిధ భాషల వారికి ఆదరణ ఉంది. తెలంగాణ, అన్ని వర్గాల వారినీ అక్కున చేర్చుకున్న అమ్మవంటిది. ఈ తల్లి ఒడిలో సేదతీరిన వివిధ రాష్ట్రాల వారిలో అనేక వలస వర్గాల వారున్నారు. దేశ విదేశీయులున్నారు. మన దేశంలోని 29 రాష్ట్రాల సంస్కృతులలో తెలంగాణ స్వరూపం ప్రత్యేకమైనది. ఆదరణలో అతిథి సత్కారాలలో ఈ రాష్ట్రానికి సాటి మరొటి లేదు. శతాబ్దాల చరిత్రకల సుందర తెలంగాణ తన చరిత్రను పునర్లిఖించుకుంటున్న శుభతరుణంలో, తరాల నుండి ఈ రాష్ట్ర చారిత్రిక పుటల మధ్య చోటు సరిగా దొరకని ఎన్నో వర్గాల, వృత్తి కళాకారుల గురించిన అన్వేషణకై, కొత్త కోణాల ఆవిష్కరణకై తగిన తరుణం ఏతెంచింది. భౌగోళిక, చారిత్రక, ఆర్థిక, రాజకీయ, భాషారపరమైన అంశాలలో తెలంగాణ సాంస్కృతిక సారస్వతంలో తమను ఒక భాగంగా మలచుకొంటూ, మళ్లీ తమ ప్రత్యేకతను నిరంతరం కాపాడుకుంటున్న వారు బంజారాలు, రాజస్థాన్‌లో పుట్టి 29 రాష్ట్రాలలో వ్యాపించిన బంజారాలు తెలంగాణాలో మట్టుకు మరింత ప్రత్యేకంగా తమ ఉనికిని నేటికీ చాటుకుంటున్నారు. తమ జీవనాధార వృత్తులను కొనసాగిస్తున్నారు.

మేదర, దర్జీ, కల్లుగీత, నేత, కుండల తయారీ ఇలా ఎన్నో వృత్తులు, కాల గర్భాన కొన్ని కలిసి పోతుండగా, మరికొన్ని కొత్తరూపు ధరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బంజారాల సంస్కృతి, వారి జీవనాధారావృత్తులు, వారిని గురించిన సాంస్కృతిక అధ్యయనం చేసే ప్రయత్నంలో పలు ఆసక్తికరమైన విషయాలు చోటుచేసుకున్నాయి. కాల నియతికి లోబడి కొత్త వృత్తులు కూడా ఆవిష్కృత మవుతున్నాయి. వృత్తులు మారిపోతున్నాయి. ప్రవృత్తులు చెదిరిపోతున్నాయి.

## బంజారాల ఉనికి :

బంజారాలు అడవికి దగ్గరగా చిన్న చిన్న గుడిసెలు కట్టుకొని ఉండేవారు. రాను రాను అడవికి దూరంగా నగరానికి దగ్గరగా వచ్చి బ్రతకడం మొదలుపెట్టారు. అయినా వీరికి నియమ నిబంధనలు ఉండవు. ఎలాంటి పరిస్థితిలోనైన తమ ఉనికిని మాత్రము కాపాడుకొంటారు.

## బంజారాల భాష :

బంజారాల మాట్లాడే భాషకు లిపిలేదు. ఇది రాజస్థానీ గుజరాతీ భాషల సంయోగ రూపంగా కన్పిస్తుందని అభిజ్ఞులు అంటున్నారు. ఇది ఒక ప్రత్యేక పద్ధతిలో కొనసాగుతుంది. వీరు మారుమూల అడవి ప్రాంతంలో నివాసముంటూ జీవిస్తారు. వీరు ఎక్కువగా తెలుగు భాష మాట్లాడే వాళ్ళతో తిరుగుతారు. ఒకరికి ఒకరి అవసర ముంటుంది. వివిధ రకాల పనులకు కూడా వెళ్తారు. అందుకు భాష ప్రభావం వీరిపై పడుతుంది. కాబట్టి తెలుగు భాష మాట్లాడే వాళ్ళతో తెలుగు మాట్లాడతారు. తమ తెగ వ్యక్తులతో బంజారా భాషను మాట్లాడుతారు.

## బంజారాల సాంస్కృతిక నేపథ్యం :

బంజారాలకు తమకంటూ ఒక ప్రత్యేకమైన ఆచారాలు, పద్ధతులు, సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయి. ఆ సంస్కృతి, సంప్రదాయాల భాగంగా వీరు తమ పరిధి దాటకుండా ప్రతి అంశాన్ని తప్పని సరిగా ఆచరించి తీరవల్సిందే. ఎంత కష్టమైనా ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా చేయవల్సిందే.

## ఆధునిక బంజారాలు :

కాలం తెచ్చిన మార్పులవల్ల బంజారాల్లో కూడా మార్పు వచ్చింది. అడవికి మైదాన ప్రాంతంలో నివసించే బంజారాలు నగరానికి వలస వచ్చి స్థిరపడిపోతున్నారు. అందరు చదువుకుంటున్నారు. అన్ని విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఆర్థికంగా సామాజి

కంగా, రాజకీయంగా వివిధ రంగాలలో కూడా ఎదుగుతున్నారు. వీరు ధరించే దుస్తుల్లో, ఆభరణాల్లో, వీరి ఆలోచన విధానంలో అనేక రకాలుగా మార్పు వచ్చినప్పటికీ ఇంకా మార్పు రావాల్సి ఉందని చెప్పవచ్చు.

**బంజారాలను ఆశ్రయించే వృత్తి కళాకారులు :**

**1. డాఢి బంజార :**

డాఢి బంజారా అనే పేరు గల వారు వృత్తి గాయక వర్గానికి చెందినవారు. బంజారాలు వీరిని గౌరవ మర్యాదలతో చూసుకుంటారు. అంతేకాకుండా రాజపుత్రులకు భాట్‌లకిచ్చే (భట్రాజులకు) మర్యాదలు వీరికి ఇస్తారు. వీరు ఒక తండా నుండి మరొక తండాకు పోయి ఏదైనా ముఖ్యమైన సమాచారం ఉంటే మరొకరికి అందించేవారు. పెండ్లికి యోగ్యులైన అమ్మాయిల, అబ్బాయిల సమాచారాలను సేకరించి, వారి గోత్ర నామాలను తెలిపి పెండ్లి సంబంధాలు కుదర్చడం మొదలుకొని పెండ్లి చేయించే వరకు అన్ని పూర్తి బాధ్యతలు వీరే వహించేవారు. వీరు బంజారాల చరిత్రను (సారంగి) రభాప్ అనే వాయిద్యంతో పాడి వినిపిస్తారు. తండాలల్లో శుభ అశుభ కార్యాలలో పాల్గొంటారు. వారు ఇదే వృత్తిని స్వీకరించి జీవిస్తున్నారు.

**2. భాట్ బంజార :**

భాట్ అనగా భట్రాజు అని అర్థం. ఒకప్పుడు మంత్రియా భాటో అనేవాడు. డాఢి వారికి తన కవిత్వం నేర్పి ప్రయోజనం లేకపోయిందని తలచి భాటో వంశం వారికి కవిత్వం నేర్పదలిచారు. ఆ విధంగా భాట్ తెగ వారు ఏర్పడ్డారు. భాట్‌ల పేర్లు, 1. డిమ్మ భాటో, 2.ఠేయావత్ భాటో, 3. ఢాంగీ భాటో, 4. తారీకం భాటో, 5. సోటా భాటో, 6. సోడ్యా భాటో, 7. ఆహ్వాల్ భాటో, 8. కేరాలి భాటో, 9. పితావత్ భాటో, 10. మోటావత్ భాటో, 11. సోగావత్ భాటో, 12. రోత్వాని భాటో మొదలైన వారు వీరు నాటి నుండి నేటి వరకు బంజారాల పూర్వ చరిత్రను గానం చేస్తూ బంజారాలను ఆశ్రయిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

నేడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా, వెంకటాపురం మండలంలో భట్టుపల్లె అనే తండాలల్లో ఈ భాట్ తెగకు చెందినవాళ్ళు ఉన్నారు. రంజోళ్ భాట్ తన బృందంతో వివిధ తండాల్లో ఏకార్యం జరిగినా వెళ్ళి బంజారా నాయకుల చరిత్రను పాడి విన్పిస్తారు. వీరు బంజారాల వంశ చరిత్రను గానం చేయడమే వీరి జీవనోపాధి వృత్తిగా భావించుకొని కుటుంబాన్ని పోషించుకుంటూ ఉన్నారు. ఇతను మాత్రమే ఈ వృత్తిని వొదలిపెట్టకుండా కొనసాగిస్తున్నాడు, తర్వాత వీరి పిల్లలు కొనసాగించకపోవచ్చు. అనేది బాధాకరమైన అంశం.

**3. డప్డియా బంజార :**

డప్డియా అనగా డప్పుకొట్టేవారు అని అర్థం. వివిధ తండాల్లో శుభ అశుభకార్యం జరిగేటపుడు డప్పు ఇతడు చంకలో పెట్టుకొని వెళ్ళిపోతాడు. వారు ఇతనికి సొంత కుటుంబ సభ్యుడి వలె మర్యాద ఇస్తారు. రెండు, మూడు రోజులు అక్కడే ఉంటాడు. రాత్రిపూట డప్పు కొడ్తాడు. ఆ శబ్దం విని తండాల్లో ఉన్న యువతి, యువకులు నాయకులు అందరు అక్కడికి చేరుకుంటారు. డప్పు శబ్దం విన్న వెంటనే పెండ్లి కాని అమ్మాయిలు వచ్చి సామూహిక నృత్యం చేస్తారు. ఈ విధంగా ఉన్న రోజులు ఆ తండా వాసులకు తన డప్పు శబ్దంతో రంజింప చేసి వెళ్ళిపోతాడు. వీరు బంజారాలను ఆశ్రయిస్తూ జీవిస్తారు. కాని నేడు ఆ వృత్తికి ఆదరణ తగ్గింది ఫలితంగా వీరు తమ వృత్తికి దూరమై వ్యవసాయం చేసుకుంటున్నారు.

**4. ఢాలియా బంజార :**

హిందూ సమాజంలో ''డాఢి'' కన్నా ''ఒక వన్నె ఎక్కువగా'' వీరు పరిగణింపబడుతున్నారు. ఢాలియా (తలారి) తండాలోని నాయకుడికి సహాయకుడుగా ఉంటాడు. కార్యనిర్వహణలోను పంచాయితీలలోను ఇతని సేవను వాడుకుంటారు. నాయకుని మాట మేరకు ''ఢాలియా'' కార్యబద్ధుడై ఉంటాడు. ఏదైనా ముఖ్య సమాచారాన్ని తాండా జనులకు ''ఢాలియా'' మూలంగానే తెలియజేస్తాడు. అతడు చేతిలో తప్పిడి (తప్పెట) పట్టుకొని చాటిస్తూ తండాలోనివారికి వార్తలు తెలియజేస్తాడు. తాండాలో ఏ కార్యం జరిగినా ఇతని పాత్ర ఉంటుంది. తాండాలో ఏదైనా పంచాయితీ జరుగనున్నడు నాయకుని

మాట మేరకు "ఢాలియా" ఇంటింటికి వెళ్ళిచెప్పి వస్తాడు. అంతేకాకుండా ఒక తాండా వారి సందేశాన్ని ఇంకొక తాండాకు తెలిపే దూత కార్యాన్నీ నిర్వహిస్తాడు. "ఢాలియా" తాండాలో మంచి మర్యాదగల బ్రతుకును కొనసాగిస్తుంటాడు. ఢాలియాకు కావలసిన నిత్యావసర వస్తువులను ఇవ్వడం తాండావారు తమ ధర్మంగా భావిస్తారు. "ఢాలియా" ఎల్లప్పుడు తాండా వారి బాగోగుల కొరకే పాటుపడతాడు. తన జీవితాన్ని బంజారాలకే అంకితం చేసి బ్రతుకుతుంటాడు. తను వృత్తిగా భావించుకుంటూ అందుకు సాధారణగా తాండా జనులు "ఢాలియా"కు పండుగరోజు, పెళ్ళిరోజులలో కానుకలను తప్పక సమర్పించుకుంటారు. ఈ రోజుల్లో ఢాలియా వారు ఢాడి వారితో వివాహ సంబంధాలు కూడా ఏర్పరచుకుంటున్నారు. వీరు ఇప్పుడు ఎక్కువగా ఈ వృత్తిని చేపట్టడం లేదా, వేరే వృత్తిని స్వీకరించి జీవిస్తున్నారు.

**బంజారా తెగ జీవనాధార - వృత్తులు :**

పూర్వ బంజారాలు వివిధ రకాల వృత్తులను స్వీకరించి తమ కుటుంబాన్ని పోషించేవారు. అదేవారి జీవనోపాధిగా భావించారు. ఏది అందుబాటులో ఉందో, ఏది అవసరమో, దాన్ని వృత్తిగా స్వీకరించి ఆ వచ్చిన డబ్బుతో తమ అవసరాన్ని తీర్చుకోవడం చేసేవారు. అందుబాటులో ఉన్నదాన్నే వృత్తిగా నమ్ముకొని జీవించారు. ఆ వృత్తులను ఈ క్రింద వివరిస్తాను.

**1. గోర్ బంజార :**

గోర్ బంజార అనే పదం శరీర వర్ణాన్ని సూచిస్తుంది. గోమాత నుండి ఈ పదం ఏర్పడింది అనే ఒక అభిప్రాయం ఉంది. ఈ తెగ గురించి అనేక కథలున్నాయి. పూర్వం వీరు దేమా గురువు అనుమతితో "గేరు" జాజు మట్టి (రాతడ్ దూడ్) వ్యాపారం చేస్తారని కథలు చెప్పుతారు. వీరు బ్రతుకు దెరువు కోసం జాజు మట్టి వ్యాపారం చేసేవారని దీన్నే వృత్తిగా చేసుకొని జీవించారని పరిశోధకుల ద్వారా తెలుస్తుంది. నేడు ఈ జాజు మట్టిని బంజారేతరులు వ్యాపారం చేసుకొని జీవిస్తున్నారు.

పూర్వం బంజారాలకు పూరి గుడిసెలు ఉండేవి. దాని చుట్టూ మట్టి గోడలు, పెండ్లిళ్ళలో పండుగ రోజుల్లో ఆ మట్టి గోడలకు జాజు మట్టితో చుట్టు అలుకుతారు. అప్పుడు జాజు మట్టి వ్యాపారం కొనసాగేది. ఇప్పుడు సిమెంటు ఇటుకలతో ఇల్లు కట్టుకొని ఉంటున్నారు. కాబట్టి ఆ వృత్తిని ఒదలి వీరు ఇతర వృత్తులను చేసుకుంటున్నారు.

**2. సనార్ బంజార : (కంసాలి బంజారా)**

వీరు వెండి, బంగారంతో ఆభరణాలను తయారు చేసే వారిని (సనార్) కంసాలి అని అంటారు. బంజారా స్త్రీ, పురుషుల ఆభరణాలు తయారు చేసి ఇచ్చేవారు కాబట్టి కంసాలి కులంగా పరిగణింపవచ్చు. బంజారా స్త్రీ తన శరీర అందాన్ని పెంపొందించుట కొరకు శరీరం నిండా సరిపడు సొమ్ములను అలంకరించుకొని ఉంటుంది. వారు అలంకరించుకొనే ఆభరణాలు చాలా అద్భుతంగా ఉండేవి. దాదాపు స్త్రీ ఎనిమిది నుండి పది పౌనుల బరువు వరకు అలంకరించుకొని ఉంటారు. పురుషులు కూడా దాదాపు రెండు నుండి మూడు పౌనుల బరువు వరకు ధరించుతారు. వీటినన్నింటిని పూర్వం బంజారా (సనార్) కంసాలి తయారు చేసి ఇచ్చేవారు. కాని నేడు బంజార కంసాలి వృత్తిని చేపట్టి జీవించే వాళ్ళు లేరు. ఎందుకంటే బంజారాలో చాలా మార్పు వచ్చింది. స్త్రీల వెండికి బదులు బంగారంతో ఆభరణాలు తయారు చేయించుకొని వేసుకుంటున్నారు. కాబట్టి బంజారా కంసాలి వృత్తి కనుమరుగై పోయినది. కనుక ఇతర పనులు చేసుకుంటున్నారు.

**3. ధన్ - కుటే బంజార :**

బంజార భాషలో "ధన్‌కుటే" అంటే వడ్లు దంచే వాళ్ళు అని అర్థం. వడ్లు దంచే వృత్తిని చేపట్టిన వారని తెలుస్తుంది. పూర్వం బంజారాలు ఆ వృత్తిని చేపట్టి జీవనం సాగించారు. తమ కుటుంబ పోషణకై ఇతర అవసరాలు తీర్చుకోవడానికి ఈ వృత్తిని చేపట్టి ఉండేవారు. వడ్లు దంచి బియ్యం తయారు చేసి ఇవ్వడం అంటే ఎంతో కష్టంతో కూడుకొన్నది. అయినా బంజారాలు కష్టజీవులు, ఎలాంటి

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

కఠినమైన పనైనా చేస్తారు. కష్టానికి ఉదాహరణ వడ్లు దంచే వృత్తే, కాని నేడు ఈ వృత్తిని బంజారాలు ఎవరూ చేయడం లేదు. కాలానుగుణంగా అనేక మార్పులు వచ్చాయి. రైస్ మిల్లులు మొదలగునవి వచ్చాయి.

**4. రోహిదాస్ బంజార :**

బంజారాల కొరకు గుడ్డలు, డేరాలు కుట్టే వారిని రోహిదాస్ బంజార అని అనేవారు. వీరు దీనినే వృత్తిగా స్వీకరించారు. వీరు సంచారం చేస్తూ ఉండేవాళ్ళు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తిరుగుతుండే వాళ్ళు. వీరికి ధరించడానికి గుడ్డలు, పడుకోవడానికి, క్రింద వేసుకోవడానికి గుడ్డలు అవసరం. చిన్న చిన్న డేరాలు కుట్టి అమ్మి జీవించేవారు. అదే వీరి ధన సంపాదన ఈ వృత్తిని స్వీకరించి జీవనాన్ని కొనసాగించారు, కాని ఇప్పుడు ఈ వృత్తి లేదు. వ్యవసాయం మరియు ఇతర వృత్తిని చేపట్టి జీవిస్తున్నారు.

**5. చారణ బంజార :**

"సంస్కృతము"లో చరన్ అనగా గోవులు మేపువారు. కొంతమంది బంజారాలు గోవులను మేపే వృత్తిని స్వీక రించారు. ఇప్పుడు కూడా కొన్ని తండాలలో పాలేరుగా ఉంటూ వారికన్నా కొన్ని పశువులను మేపే వృత్తిని చేపట్టి జీవిస్తున్నారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా పకడే పల్లి తండాలో కొంతమంది బంజారాలు పశువులను కొని పెంచి పోషించి, వ్యాపారం కూడా చేస్తున్నారు. పశువులను చూసుకోవడానికి వాటిని మేపడానికి కొంతమంది బంజారాలు తమ కుటుంబ పోషణకై ఇప్పటికి ఈ వృత్తిని చేపట్టి జీవిస్తున్నారు.

**6. సింగాడియా బంజార :**

బంజార భాషలో సింగ్ అంటే కొమ్ము అని అర్థం. పూర్వం సింగ్ కొమ్ముతో వివిధ రకాల వస్తువులను తయారు చేసి అమ్మే వృత్తిని స్వీకరించారు. బంజారా స్త్రీలు చిన్న కర్రముక్కను తలపై నిలువుగా పెట్టి దానికి వెంట్రుకలను తగిలించడానికి అలంకరించడానికి కొమ్ము లను వాడుతుంటారు. ఎందుకంటే వీరు అడవి సమీ పంలో నివసిస్తూ ఉంటారు. అడవిలో వేటకు వెళ్ళేటపుడు అడవి జంతువుల కొమ్ములు క్రింద రాలి పండి ఉం టాయి. వాటితో స్త్రీలు వెంట్రుకలు గాలికి ఎగరకుంటూ ఉండటానికి చిన్న కర్ర ముక్కలు పెట్టుకొనే వాళ్ళు వీటిని తయారు చేసి అమ్మేవారు. కాని ఇప్పుడు అడవికి దూరంగా వచ్చి నివసిస్తున్నారు. అడవి నరికి వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ వృత్తి కూడా కాలగర్భంలో కలిసిపోయింది.

**7. నావి బంజార : (మంగలివారు)**

తండాల్లో శుభ అశుభ కార్యం జరగాలన్న నావి (మంగలి వారి) పాత్ర ఉండాల్సిందని చెప్పవచ్చు. వీరు మంగలి వృత్తిని చేపట్టి జీవించారు. ఇప్పటికి రాంనగర్ తండా వెంకటాపురం మండలంలో నావి వృత్తిని చేపట్టిన కుటుంబం వారసులున్నారు. వాళ్ళను నేడు నావి వాళ్ళు అని పిలుస్తారు. ఇప్పుడు ఆ నావి వృత్తిని చేసే వాళ్ళు లేరు. ఎందుకంటే బంజారేతర మంగలి కులానికి చెందిన వాళ్ళు తండాల్లో రావడం ఆ తండాలో వాళ్ళు స్థిరంగా వలస వచ్చి ఉండడం వల్ల బంజార మంగలి వారికి అవకాశం లేకపోయింది. కాబట్టి ఈ వృత్తి మానేసి వ్యవసాయం చేస్తున్నారు.

**బంజారా చేతి పని జీవనోపాధి వృత్తులు :**

బంజారా స్త్రీలు ధరించే దుస్తుల్లో ఒక రకమైన ప్రత్యే కత కన్పిస్తుంది. ఇవి వారి సంస్కృతిని చాటి చెబుతాయి. వీరు వివిధ రంగులతో కూడిన దుస్తులను ధరిస్తారు. వీరు ధరించే దుస్తులు.

**1. పేటువా :**

అనగా లంగా అని అర్థం. దీన్ని వీరు సొంతంగా తమకు ఇష్టమైన రంగులతో తయారు చేస్తారు. వివిధ రకాల చిన్న చిన్న అద్దాల పూసలతో గవ్వలతో కుట్టుకొని తయారు చేస్తారు. దీన్ని తయారు చేయడానికి చాల రోజులు పడుతుంది.

**2. కౌంచళి :**

అనగా రవిక అని అర్థం. దీన్ని వివిధ రంగు రంగుల గుడ్డలతో మందంగా ఉండేటట్లు కట్టుకుంటారు. ఇది ముందు వైపు మాత్రమే శరీరానికి అడ్డుగా ఉంటుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

దీన్ని తయారు చేయడానికి కొన్ని రోజులు తీసుకుంటారు. రవిక భుజాలపైన 'కవ్వాను', స్తనాల బాగాన 'కాంట్లి', పొట్ట బాగాన పేటి, వీటినన్నిటిని వివిధ రంగుల గుడ్డలతో ధారాలతో చిన్న పెద్దా అద్దాలతో వెండి రూపాయి బిళ్ళలతో గవ్వలతో ధగదగ మెరిసి పోయేటట్లు కుట్టు కుంటారు. చాలా శ్రద్ధతో ఇష్టంతో తయారు చేసు కుంటారు.

ఇంకా ఘుంగతో (ముసుగు) గాల (చుట్టబట్ట) పూల్యా, ఘన్నోటుక్రి (పైటా) మొదలగునవి బంజారా స్త్రీలు ధరించే దుస్తులు ఇంకా వీటిని ఈ వృత్తివాళ్ళు కుడతారు లేదా స్త్రీలు కుట్టుకుంటారు. ఇంకా కుట్టి అమ్ముతారు. ఇదే వీరి వృత్తి అని చెప్పవచ్చు.

ఈనాటి కాలంలో బంజారా స్త్రీలు ధరించే దుస్తులకు బదులు చీరలు ధరిస్తున్నారు. కాబట్టి ఈ వృత్తి కొనసాగడం లేదు కొంతమంది బంజారా స్త్రీలు మాత్రమే ధరిస్తున్నారు.

నేడు బంజారేతరులు ఈ బంజారా దుస్తులను తయారు చేసి కిరాయికి ఇచ్చి డబ్బులు సంపాదిస్తున్నారు. వివిధ సినిమాలలో, ర్యాలీలతో మొదలగు వాటిలో దీని వృత్తిగా భావించుకుంటున్నారు.

**3. గోనే సంచులు :**

బంజారా మగవాళ్ళు ఈ గోనే సంచులు కుట్టే వృత్తిని స్వీకరించి కుటుంబాన్ని పోషిస్తారు. ఇదే వీరి జీవనోపాధి బంజారాలకు గోనే సంచుల్లో దేవత భవానీల ప్రతిమను పెట్టుకుంటూ అందులో కొన్న ముఖ్యమైన వస్తువులు మరియు వడ్లు కూడా పెట్టుకుంటారు.

కాబట్టి ప్రతి బంజారాల ఇంట్లో తప్పని సరిగా గోనె సంచి ఉండేది. ఇప్పుడు కూడా ఉంది. దీన్ని తయారు చేయడం కొంతమందికి మాత్రమే వస్తుంది. అందువల్ల వీరు గోనె సంచిని తయారు చేయడమే వృత్తిగా భావించు కొని జీవిస్తున్నారు.

**4. కాకోటి :**

చెక్కతొట్టి అని అర్థం. ఈ చెక్క తొట్టిని తయారు చేయడానికి ప్రత్యేకమైన వడ్ల పని చేసే బంజారా వ్యక్తులుండేవారు. ఇది తయారు చేసి అమ్మడమే వీరి వృత్తి, కాకోటి ప్రతి బంజారా ఇంట్లో తప్పనిసరిగా ఉం డేది. ఎందుకంటే బంజారాలకు జొన్న రొట్టెలుంటే చాలా ఇష్టం ఇందులోనే జొన్నరొట్టె పిండికి కలుపుకునే వాళ్ళు, ఇంకా ప్రతి బంజారా పెళ్ళిళ్ళలో దీన్ని బోర్లించి దీనిపైన వధూవరులకు నలుగురు స్నానం చేయించడానికి ఉప యోగపడేది. దీన్ని తయారు చేసేవాళ్ళు లేరు. అందరు చేతితో తయారు చేసుకుంటున్నారు. ఈ వృత్తి వాళ్ళు కూడా లేరని చెప్పవచ్చు.

ఇంకా మరికొన్ని పరికరాలు గమనిస్తే, దండియా, దీన్ని బంజారా పెళ్ళిళ్ళలో వరుడు చేతబట్టుకుంటారు.

**5. ముంగ్రి :**

విసరరౌతు పిడిని బిగించడానికి ఉపయోగపడేది. వీటినన్నిటిని బంజారా వాళ్ళు తయారు చేయడం వీరు వృత్తిగా స్వీకరించారు. కాని నేడు ఈ వృత్తివాళ్ళు లేరని చెప్పవచ్చు.

## బంజారాల ఇతర జీవనోపాధి వృత్తులు :

**1. వేట :**

సంచార జాతుల్లో వీరి జీవితంలో ఒక భాగం వేటకు వెళ్ళడం. అది వీరి జీవనోపాధి. బంజారాలు అడవి సమీపంలో చిన్న చిన్న గుడారాలు నిర్మించుకొని ఉండే వాళ్ళు వీరు వేట కుక్కలను వెంట బెట్టుకొని, వెళ్ళేవారు. జంతువులను వేటాడి ఆ మాంసాన్ని అమ్మి డబ్బులు సంపాదించి తమ కుటుంబాన్ని పోషించేవాళ్ళు నేడు అడవికి దూరంగా వెళ్ళి జీవిస్తున్నారు. అందువల్ల వేటకు వెళ్ళడం తగ్గిందని చెప్పవచ్చు.

**2. తునికాకు :**

ఎండకాలం వస్తుందంటే బంజార తెగవాళ్ళు చాలా సంబరపడేవారు, వీరి జీవితం ఎక్కువ శాతం తునికాకు మీదనే ఆధారపడేది. తునికాకు తెంపడం డబ్బులు సంపాదించడం వీరి జీవితంలో ఒక భాగం మరియు వృత్తితో పాటు జీవనోపాధి కూడా ఒకప్పుడు నెల రెండు నెలలు దాకా తునికాకులు తెంపే పనులో ఉండేవారు. ఆ వచ్చే డబ్బులతో చాల అవసరాలు తీర్చుకొనేవారు. కుటుంబ సభ్యులందరు కాక కొంతమంది తెంపుకొని

రావడంతో ముసలి వాళ్ళు చిన్నపిల్లలు ఇంట్లో ఉండే వారు. కాని అందరు తెచ్చిన తునికాకును కూర్చొని మడతబెట్టేవారు అలాంటి తునికాకు నేడు బంజారాలకు ఆమడ దూరంలో ఉండిపోతుంది. అడవి కూడా అంత రించి పోయింది. కాబట్టి పట్టుమని పది రోజులు కూడా పని రాలేకపోతుంది.

### 3. విప్పపువ్వు :

విప్ప పువ్వు విప్పచెట్లలో పూసి క్రింద రాలిన తర్వాత సేకరించుకొని, కొన్ని రోజులు ఎండబెట్టి గుమ్ములో నింపు కొని దాచిపెట్టెవారు. దీనితోపాటు సారాయి తయారు చేసి డబ్బులు సంపాదించేవారు. కొంతమంది గిరిజేనేతరు లకు అమ్మేవారు. కాని నేడు చెట్లు నరికేసి వ్యవసాయం చేసుకుంటున్నారు. పూర్వం విప్పపువ్వు అనేది వీరి జీవితంలో గొప్ప ఆదాయం ఉండేది.

### 4. పొయ్యిల కట్టెలు :

అమ్మి జీవించడం వీరి వృత్తిగా స్వీకరించారు. తండాలో ఉండే బంజారాలు అడవికి వెళ్ళి కట్టె ఏరుకొని నెత్తిమీద ఎత్తుకొని తమ సమీపంలోనున్న వివిధ హాస్టల్స్ మరియు చిన్నా పెద్ద హోటల్స్‌కు రోజు లేసి డబ్బులు సంపాదించి తమ కుటుంబాన్ని పోషించుకొనేవారు. నేడు ఆ వృత్తి లేదు. అందరు గ్యాస్ సిలిండర్స్ పైన పంటలు చేసుకుంటున్నారు. కాలం తెచ్చిన మార్పు అని భావిం చాలి.

### 5. ఎండుగడ్డి :

అడవి సమీపంలో ఉంటూ అందరు గుడ్డ గుడిసెలు కట్టుకొని ఉండేవారు. వానాకాలం వచ్చిందంటే గుడిసే పై నుండి ఇంట్లో నీళ్ళు కారుతుండేది. అందుకోసం అడవిగుట్ట ఎక్కి గడ్డిని కోసి చిన్న చన్ని కట్టలు కట్టి కొంత మంది నెత్తిమీద ఎత్తుకొస్తారు. కొంతమంది ఎడ్లబండపైన తీసుకొస్తారు. వీళ్ళకు ఎంత అవసరమో అంత వాడు కుంటారు. మిగతాది బంజారేతరులకు అమ్ముతారు. వాళ్ళకు కూడా ఆ రోజుల్లో గడ్డి గుడిసెలే ఉండేవి. కొంత సంపాదన వచ్చేది. అప్పుడు ఆ సంపాదన లేకుండా పోయింది.

### 6. అడవి ఫలాలు :

అడవికి వెళ్ళి సీతాఫలాలు, తునికి, చిటమొట జీడి మొదలగు అడవి ఫలాలే వీరికి ఆహారంగా ఉండేది. వీటిని సేకరించుకొని ప్రక్క ఊళ్ళళ్ళలో వీటిని అమ్ముకొని జీవనం సాగించేవారు. అడవి సంపద చాలా వరకు జీవనో పాధి ఉండేది. ఆ సీజన్ వస్తే వీరికి చేతి నిండ పని ఉం డేది. అనేక మార్పులు వచ్చి వీరికి జీవనోపాధి లేకుండా చేసింది.

### 7. కొత్త వృత్తులలో బంజారాలు :

వీరు చేసే వివిధ వృత్తులకు ఆదరణ లేకపోయే సరికి, అడవిని నరికి వ్యవసాయం చేసుకుంటున్నారు. అందులో ప్రభుత్వం తరపున గాని లేదా వాళ్ళు సొంతంగా కష్టపడి డబ్బులు సంపాదించి, నీటి వసతి కోసం, భూగర్భ జలా లను బోర్ల ద్వారా వేయించుకొని కుటుంబ సభ్యులందరు వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారు. అందులో నష్టం వచ్చినా లాభం వచ్చినా, దాన్నే నమ్ముకొని జీవితాన్ని కొన సాగిస్తున్నారు. అదే ఆధునిక కాలంలో వీరికి గొప్ప జీవనో పాధిగా చెప్పవచ్చు. కొందరు ఇతర వృత్తులు కూడా చేసు కుంటున్నారు. పై వృత్తులే కాకుండా మొదలగునవి కలవు.

### ఉపసంహారం :

బంజారాలను, వారి జీనాధార వృత్తులను కాపాడుకునే అవసరం ఎంతైనా ఉంది. కొత్త వృత్తులను ఆదరించాలి. పాత వృత్తులను అక్షరబద్ధంగా అయినా భద్రపరిచే ప్రయత్నం చేయాలి.

### ఉపయుక్త గ్రంథాలు :

1. బంజారా చరిత్ర సంస్కృతి - ప్రగతి
2. దక్షిణ భారతీయ - జానపద విజ్ఞాన కోశం
3. తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు (వ్యాస సంకలనం)
4. వరంగల్ జిల్లా బంజారా సాహిత్యం - సాంస్కృతిక అధ్యయనం అముద్రిత గ్రంథం)

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పోతన చింతనామృతం భాగవతం

- డా॥ చవ్వా వెంకటరెడ్డి, హైదరాబాద్, తెలంగాణ.

పోతన భాగవతం తెలుగువారి అదృష్టఫలంగా, కల్ప వృక్షంగా అనేకమంది చేత స్తుతులందుకున్నది. భాగవతం యొక్క నిర్మాణత, ప్రసిద్ధత వీటన్నిటికీ పోతన అర్హు డౌతాడు. పోతన జీవితాన్ని పరిశీలిస్తే అతని భక్తి, ధర్మాసక్తి, కర్మాచరణం- అనే మూడు కోణాలు మనకు దర్శన మిస్తాయి. అంతేకాకుండా మానవ సంఘంలో వ్యక్తి ఎది గినా, ఎదగకపోయినా ఒదిగి ఉండాలనే తత్వాన్ని అడు గడుగునా తన జీవితంలో ప్రదర్శించడమే కాకుండా దానిని భాగవతంలో కూడా భక్తి అనే అమృత కాసారంలో పూచిన కలువలాగా విశ్వపాఠక లోకానికి అందించాడు పోతన. ఈయన ఆలోచనాపథంలో స్వతంత్రంగా రూపు దిద్దుకున్న మహాకావ్యం భాగవతం. ఈ కవి తన భాగవత ఆంధ్రీకరణకు శ్రీధరీయ వ్యాఖ్యానాన్ని ప్రధాన భూమికగా నిలుపుకున్నాడు. జీవితంలో రామభక్తి, సాహిత్య రచనలో కృష్ణభక్తి ముప్పేటలా పొదిగి చక్కని కావ్యరచనకు ప్రాతిపదికలు నిర్మించుకున్నాడు. ఈ కవి జీవిత సాహిత్యాలను పరిశీలించినపుడు అతనిలో ఆత్మ సంతృప్తి భావం అడుగడుగునా దర్శనమిస్తుంది. నిజానికి ఏ కాలానికైనా, ఏ ప్రాంతానికైనా, ఏ సమాజానికైనా ఇవి అనుసరణీయమైన సూత్రాలు. అంతేకాకుండా వ్యక్తిత్వ వికాసంలో కూడా ఇవి ప్రాధాన్యతను సంతరించు కున్నాయి. వ్యక్తిగా, హృదయవాదిగా పోతన అడుగడు గునా తన సిద్ధాంతాన్ని భాగవతంలో పాత్రలచేత తెలియ జేయిస్తాడు. అంతేకాకుండా తన భావ ప్రకటనకు భాగ వతంలోని పాత్రలలోకి పరకాయ ప్రవేశం చేసి తనవితీరా పూర్ణానుభూతితో ఆ పాత్రల్లో భక్తిని ద్విగుణీకృతం చేస్తాడు. అలాగే మానవ సంఘాన్ని ఆ సంఘంలోని అనేక ధర్మాలను కూడా సందర్భాన్ని అనుసరించి తెలియజేయడంలో ఇతడు ఎంతో విజ్ఞతను పాటిస్తాడు. అందరూ కలసి సహపంక్తి భోజనాల ద్వారా ఆనందాన్ని అనుభవించ వచ్చు, అదే మానవ జీవితం సమాజంతో ముడివేసుకున్న బంధం- అనే సూత్రాన్ని కృష్ణుని బాల్యక్రీడల్లో స్వామి గోపాలురతో కూడి చల్దులు ఆరగించిన సందర్భంలో తెలియజేస్తాడు. అక్కడ అసామాన్యుడైన స్వామి సామాన్యులైన గోపబాలురతో కలసి ఉండడం ఎవరి అదృష్టం అన్న ప్రశ్న ఉదయించినపుడు స్వామి రెండ డుగులు దిగివచ్చి వారితో సఖ్యతను ఏర్పరచుకొని, వారిలో ఒకడిగా మమేకం కావడం ఒక కోణంలో చూస్తే స్వామి అదృష్టంగా పేర్కొనవచ్చు. దానినే మన భక్తి సిద్ధాంతకర్తలు సఖ్యతా సూత్రంగా తెలియజేసారు. మరొక కోణంలో పరిశీలించినపుడు అమాయకులైన గోపబాల కులు సర్వమూ స్వామి అనే నమ్మికతో ఆతనితో కూడి ఉండడానికి ఇష్టపడడం, అదే మహద్భాగ్యంగా భావిం చడం పరిశీలించినపుడు స్వామి వారికి చేరువలో ఉం డడం బాహ్యంగా వారి అదృష్టమనే విషయం మనకు తెలుస్తుంది.

అలాగే ప్రకృతిని, ప్రకృతి ధర్మాలను అనుసరించడం భూమిపై పుట్టిన మానవుల విధిగా స్వామి తెలియ జేయడం పోతన యొక్క నిర్దిష్టమైన ధార్మిక కర్మాచరణకు మూల ధ్యేయంగా కనిపిస్తుంది. భాగవతంలో పర్వత పూజను చేసే సందర్భంలో అంతకుముందున్న ఇంద్రపూజ స్థానంలో ఉన్న గొప్పతనాన్ని, అది ఒక ఆచార ధర్మంగా కొనసాగడాన్ని పిన్నలు, పెద్దలు దానినే అనుసరించాలనే సంకల్పాన్ని కలిగి ఉన్న తరుణంలో బాలుడైన శ్రీకృష్ణుని చేత చెప్పించిన హేతువాద వైఖరి గమనిస్తే ఆ భావనలన్నీ పోతన తనకు తానుగా తెలియజేయడానికి కృష్ణ పాత్రను సమాయత్తపరచడానే సత్యం బోధపడుతుంది. అక్కడ స్వామి తెలియజేసిన అంశంలో ప్రకృతిని రక్షిస్తూ, ఆ ప్రకృతిలో జీవిస్తున్న జీవులకు ఆహార పదార్థాలను అందించే ఉన్నత ఉత్తమాదర్శంతో, త్యాగబుద్ధితో పచ్చని

ఫలసంపదను, గ్రాసమును పసరములకు, మానవులకు అందిస్తున్న ఆ గిరి నిజంగా పూజ్యనీయమైనది. అందువల్ల మనం ఆ గిరిని పూజించడం ద్వారా మన కృతజ్ఞతను తెలియపరచు కోవలసిన అవసరం ఎంతైనా ఉందనే విషయాన్ని ఒక హేతువాద పద్ధతిలో ఆ బాలగోపాలుని చేత ఆబాలగోపాలానికి తెలియజేయడం ద్వారా నాడే పోతన పర్యావరణంపైన ఒక ప్రత్యేక దృష్టిని సారించి దాని పరిరక్షణకు మార్గ దర్శకాలను ఏర్పరచాడనే సూత్రం స్పష్టమవుతుంది. అంతేకాకుండా మరొక కోణంలో హేతువాదాన్ని బలపరచి దైవమంటే- ఆత్మీయతతో అంద రినీ సమానంగా చూస్తూ సాయాన్ని అందించే మహనీయ తత్వం కలవాడని, అతడిచే సృజించబడిన భౌతిక సంపదలో కూడా ఆ తత్వం కలిగి ఉంటుందనే విష యాన్ని గోవర్ధనగిరి త్యాగబుద్ధితో పశువులకు కరువు కాటకాలు వచ్చినపుడు గ్రాసాన్ని అందించి తన యొక్క హృదయ ధార్మికతను చాటుకున్నదనే విషయాన్ని బాలగోపాలుడు గమనించడం పరికిస్తే పోతన 'ఆత్మవత్ సర్వభూతాని' అన్న మహావాక్యాన్ని కృష్ణుని ద్వారా తెలియ జేసినట్లు అవగతమవుతుంది.

అట్లే హృదయ దౌర్బల్యం చేత, మితిమీరిన గర్వం చేత, మిడిసిపాటుచేత శిశుపాలుడు నిండు సభలో కృష్ణున్ని తృణీకరించినపుడు ఓర్మి వహించడం శ్రీకృష్ణుడు చేయడం ద్వారా మానవ సమాజంలో ఎదుటివారు ఏమన్నా దానిని ఓర్మితో భరించగల శక్తిని మానవుడు అలవరచుకోవాలని, అయితే అది మితిమీరినపుడు తన ఉనికికి భంగం కలిగిస్తుందన్న సందర్భంలో బుద్ధి చెప్పే ప్రయత్నం చేయాలనే తత్వాన్ని కూడా పోతన తెలియ జేసాడు. అయితే ధర్మ రక్షణార్థం భూమిపై అవతరించిన జగన్నాథుడైన స్వామి శిశుపాలుడి తల్లికి ఇచ్చిన మాట ప్రకారం నూరు తప్పులు సహించి తరువాత దుష్ట శిక్షణ చేసి శిష్టులను రక్షించడమనే అవతార తత్వాన్ని ప్రదర్శిం చాడు. అయితే ఆ ఘట్టంలో శిశుపాలుని వధించిన క్రియను మానవ సంఘంలో ఎవరూ అనుసరించరాదనే విషయాన్ని కూడా పోతన తెలియజేసాడు. అదే తరువాతి కాలంలో సుమతీ శతకకర్త 'అపకారికి నుపకారము నెపమెన్నగ సేయువాడు నేర్పరి సుమతి' అని తెలియ జేసాడు. పోతన భాగవతంలో శ్రీకృష్ణుని కథలను తెలియ జేయడంలో ఎంతో అనుభూతిని, తాదాత్మ్యతను పొందు తాడు. ఆ పొందిన అనుభవాలను పాఠకులకు కూడా సమంగా పంచే హృదయ వైశాల్యంతో వర్తిస్తాడు. భాగ వతంలో ఏ ఘట్టంలో చూసినా పాఠకుడు తాను ఎక్కడో అక్కడ ఆ స్వామితో ఉన్న భావనను పొందడం ద్వారా ధన్యుడౌతాడు. అలాగే పోతన భాగవత కథల్లో తాను కూడా అదృశ్యపాత్రగా నిలిచి ఆ సన్నివేశానుభవాలను, అనుభూతులను స్వయంగా పొందుతాడేమో అన్నట్లుగా భాగవత కథలు నిలిచిపోతాయి. కథ ప్రాధాన్యతతో పాటు పాత్రల ఔన్నత్యం, పాత్రలు తగిన విధంగా తగిన సమయంలో స్పందించడమనేది కూడా ఎంతో జాగరూ కతతో పోతన తెలియజేస్తాడనిపిస్తుంది. అలాగే సామాజి కాంశాలను కూడా ఎన్నింటినో తన భాగవతంలో పోతన తెలియజేసాడు. నమ్మకాలు, విశ్వాసాలు, క్రతువులు, పండుగలు- అన్నింటినీ శ్రీకృష్ణుని సమక్షంలో జరిగినట్లుగా తెలియజేసినపుడు శ్రీకృష్ణుడు కూడా వారితోపాటు పాల్గొనడం ఒక విశేషంగా పేర్కొనవచ్చు. నిజానికి యశోదకు తన నోట యజాండమును చూపిన మహ నీయమూర్తి అయిన శ్రీకృష్ణుడు కొలువున్న రేపల్లెవాడ దిన దినమూ, క్షణ క్షణమూ పండుగ వాతావరణాన్నే సంతరించుకున్నట్లుగా చెప్పుకోవచ్చు. అయితే పోతన కర్మాచరణము అనే విధానాన్ని అవలంబిస్తాడు కనుక అదే సూత్ర ప్రాతిపదికను భాగవత కథల్లో కూడా అందిం చాడు.

కృష్ణుడు అవతారపురుషుడుగా కన్నా సామాన్యుల మధ్య సామాన్యుడుగా సంచరిస్తూ వారికి నమ్మకాన్ని, శక్తిని అందిస్తూ వారు నిరంతరం శ్రమను ఆశ్రయించి ఫలాలు పొందాలనే సూత్రాన్ని తాను ఆచరించి వారి చేత ఆచరింపచేస్తాడు. నిజానికి కృష్ణుడు చేసిన ఈ మహత్ కార్యం పోతన జీవితంలో ప్రతినిత్యం చోటు చేసుకొని అతనిని కర్మయోగిగా నిలబెట్టింది. అందుకే

అతడు హాలికుడుగా, అటు జీవన పథంలో ఆహార ఫలాలను పొందడమే కాకుండా జీవిత పరమార్థానికి హేతువైన భక్తి భావనాక్షేత్రంలో భాగవత కేసరాలను పండించి జీవితాన్ని ధన్యం చేసుకున్నాడు. అదే సూత్రాన్ని భాగవత కథల్లో కృష్ణుడు చేత కూడా చేయించడం మనం గమనించవచ్చు. నిజానికి కృష్ణుడు గోవులను కాయవలసిన పని లేదు. కానీ ఆ పనిని చేపట్టడం ద్వారా తనను అనుసరించి మిగిలినవారు కూడా కాయకష్టం చేయడం, తద్వారా ఫలాలను అనుభవించడమనేటటువంటి విధానానికి కృష్ణుని యొక్క సేవా పాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ కోణంలో చూసినపుడు పసరాలు సమృద్ధిగా ఆహారం స్వీకరించడం ద్వారా వచ్చిన ఫలాలు వారి కడగండ్లను తొలగించేవిగాను వారి జీవితాల్లో పని పట్ల విధేయతను, ధార్మికతను పెంపొందింపచేసేవిగా ఉండడానికి దోహదపడతాయనే సత్యాన్ని పోతన తెలియజేస్తాడు. నిజానికి పోతన తెనిగించిన భాగవత అమృత కాసారం ఎన్నో ఫలాలను ఈ మానవజాతికి అందచేసింది. మానవ లోకంలో వ్యక్తులంతా నిరంతరం లక్ష్యంతో పని చేస్తూ శ్రమ ఫలాలను స్వీకరిస్తూ, దురాశకు లోను కాకుండా సత్క్రియలను అనుసరిస్తూ జీవించడం ద్వారా మానవ సమాజం నిరంతరం స్థిరంగా ఒడుదుడుకులు లేకుండా నిలబడుతుందనే వాంఛను ఒక కోణంలో తెలియజేస్తూ, మరొక కోణంలో సమసమాజం అనేది అసమానతలకు తావు లేకుండా నిలబడడానికి భాగవతంలో కృష్ణుడు నిలిచి ఉన్న సమాజాన్ని మనకు ఒక ఆదర్శ సమాజంగా తెలియజేసాడు పోతన. అలాగని కృష్ణుడు ఉండడం వలన అది ఆదర్శ సమాజం కాలేదు. కృష్ణుడు ఆచరణాత్మకమైన క్రియలను చేపట్టడం ద్వారా, తాను చేసి చూపించడం ద్వారా, ఇతరులతో చేయించడం ద్వారా తన అవతారానికి పరిపూర్ణతను గావించుకున్నాడు. పరిశీలించి చూస్తే భగవంతుడు భక్త రక్షణార్థం ఎత్తిన అవతారాలు 22. అందులో 22వ అవతారం కృష్ణావతారం. అయితే ఆ 22 అవతారాల్లో పది అవతారాలు ఎక్కువగా ప్రాశస్త్యం పొందడంవల్ల వాటినే పెద్దలు, తపోధనులు, మహాత్ములైనవారు స్వీకరించి సమాజానికి శ్రీకృష్ణుని దశావతారునిగా తెలియజేసారు. ఏ కోణంలోంచి చూసినా దశావతారాల్లో కృష్ణావతారం మాత్రం పరిపూర్ణ అవతారమే అన్నది స్పష్టమైన సత్యం. భాగవత విషయానికి వస్తే భాగవతంలో పేర్కొన్న అయిదు సూత్రాలు- భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్వ, ముక్తి అనేవి మానవ జీవితంలో హిందూ ధర్మశాస్త్రాలు తెలియజేసిన చతురాశ్రమ ధర్మాలకు దగ్గరగా ఉండి మానవ జీవితం నిర్దిష్టమైన క్రమశిక్షణాత్మక ప్రణాళికతో ఏవిధంగా తన్ను తాను సంస్కరించుకొని ఇతరులను సంస్కరించే విధానాలను రూపొందించాలో తెలియజేయడమే కాకుండా వాటిని తరం నుండి తరానికి నిరంతరం ఆచరణ యోగ్యంగా తెలియజేయడంలో ఏవిధమైన కృషిని సాగిస్తాయో భాగవతంలో పేర్కొన్న పంచ సూత్రాలు కూడా అదే ఆశ్రమ ధర్మాన్ని సమర్థించినట్లుగా మనకు కనిపిస్తుంది. పోతన భాగవతం ద్వారా దానం, ధర్మం, సత్యం, రక్షణ, న్యాయం, ఆత్మశోధన, దివ్యానుభూతి అనే సిద్ధాంతాలను తెలియజేసాడు. నిజానికి మానవ సమాజం వీటిని నిరంతరం అనుసరించినపుడు వ్యక్తుల మధ్య వ్యక్తికి, వ్యవస్థ మధ్య ఎలాంటి పొరపొచ్చాలు ఉండకుండా అందరూ కలసి సహజీవనం చేస్తూ జీవించడం ద్వారా ఆనందాన్ని నిరంతరం పొందవచ్చు అనే ప్రాథమిక ధార్మిక సూత్రాన్ని కూడా మనకందించినట్లు అవగతమవుతుంది.

పోతన మానవ పాత్రలకు ఎంత పరిపుష్టిని కలిగిస్తాడో అదేవిధంగా మానవేతర పాత్రలకు కూడా అంతే పరిపుష్టిని తెలియజేస్తాడు. బుద్ధిజీవులైన మానవులు ఏవిధంగా ఆర్తితో సహాయం కోరతారో అదేవిధంగా మానవేతర పాత్రలు కూడా అలమటించినట్లుగా తెలియజేసే వైవిధ్య భరితమైన కథాంశం భాగవతంలో గజేంద్ర మోక్షం ఘట్టం ద్వారా మనకు అందించాడు. ఇందులో జీవాత్మ, పరమాత్మ తత్వానికి ప్రతినిధులుగా గజేంద్రుడు, ఉపేంద్రుడు కనిపిస్తారు. ఇద్దరిలోనూ ఒకే రకమైన భావన కనిపిస్తుంది. ఒకరిది బతకాలనే భావనైతే మరొకరిది బతి

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

కించాలనే భావన. ఇక మూడో పాత్ర మకరి పాపసంచితా లకు ప్రతీకగా కనిపిస్తుంది. ప్రధానంగా దీనిలో పట్టి పీడించే గుణం చోటు చేసుకోవడంవల్ల అసురత్వంతో ఉన్న జీవిగా మనకు పోతన తెలియజేసాడు. మరొక కోణంలో చూసినపుడు మానవుడు ఎంతటి కర్మర్షి అయినప్పటికీ అతనిని పట్టి పీడిస్తున్న బాధలకు కారణమనే సామాన్యవాదాన్ని గజేంద్రుడికి కూడా ఆపాదించాడు. ధర్మం శ్రీకృష్ణుడు. కర్మం గజేంద్రుడు. దుష్టక్రియ మకరి. ఈ ముగ్గిరి ఆచరణాత్మక క్రియలు నాడే కాదు ఈనాడూ సమాజంలో మనం అనుభ విస్తున్నదేనని అనిపిస్తాయి. అందుకే కష్టం వచ్చినప్పుడల్లా ఈనాటి సమాజంలో ప్రతి వ్యక్తీ 'నీవే తప్ప నితఃపరం బెరుగ' అని భగవంతుని ప్రార్థిస్తున్నామంటే నాటి గజేం ద్రుని మార్గాన్నే మనమూ అనుసరిస్తున్నామనే విషయం మనకు తెలుస్తుంది. అందుకే ఇటువంటి విషయాలను ప్రదర్శనాత్మకం చేసిన పోతన భాగవతం సార్వకాలీనమూ, సార్వజనీనమై ప్రపంచ సమాజానికి మార్గదర్శనం చేస్తోం దనే విషయాన్ని మనం అనుభవం ద్వారా గుర్తించినదే.

భాగవతంలో బాలభక్తుల చరిత్రలు నిత్యశ్రేయో దాయకాలుగా పోతన తెలియజేసాడు. ధ్రువుడు, ప్రహ్లాదుడు ఈ బాలభక్తులకు ప్రతీకలుగా నిలబడతారు. వీరిద్దరి మధ్య పోలికలు గమనిస్తే ఇద్దరిలోనూ ప్రధా నంగా కనిపించేది పట్టుదల. వీరిద్దరూ నారాయణ సంసేవనంలో తమ జీవితాన్ని ధన్యం చేసుకున్న పుణ్య మూర్తులు. అయితే వీరికి బాల్యంలోనే ఈవిధమైన జ్ఞానం అబ్బడానికి ప్రధాన కారణాన్ని మనం గమనిస్తే వీరిద్దరిలో దైవాంశ ద్యోతకమైనట్లు తెలుస్తుంది. అంతేకాకుండా వైర భక్తి గలవారి మధ్య వీరు జీవించి, వారి సదాశయాన్ని పరిపూర్ణం చేసుకోవడం కూడా మనం గమనించవచ్చు. ఈ విషయాన్ని గమనించే ఒక కవి 'ద్వేషించే కూటమిలోన నిలిచి ప్రేమించే మనిషే కదా మనిషి' అని ఒక నిర్వ చనాన్ని కూడా తెలియజేసాడు. ధ్రువుడుగాని, ప్రహ్లాదుడు గాని భగవంతుడు పెట్టిన అన్ని పరీక్షలను ద్విగుణీ కృతమైన ఉత్సాహంతో ఎదుర్కున్నారేగానీ ఎక్కడా జారి పోయినట్లు కనిపించదు. అందుకే ఎన్నిసార్లు మరణ దండన విధించినా దానిని ఏవిధంగా తప్పించుకుంటున్నా డనే విషయంలో సందేహించిన హిరణ్యకశిపునికి సందేహ నివృత్తి చేస్తూ తనకు విధించిన శిక్షలన్నింటి నుండీ రక్షించినవాడు శ్రీహరే అని ప్రహ్లాదుడు ఘంటాపథంగా తెలియజేస్తాడు. అక్కడ హిరణ్యకశిపుడు ఆశ్చర్యపోవడమే కాకుండా ఆ బాలుని రక్షించిన భగవంతుని చూడాలనే తొందరను కూడా పొందుతాడు. ఆ తొందరపాటు తనంలోనే హరిని చూపమంటూ స్వయంగా బాలుని హింసకు గురి చేస్తాడు. ఈ విషయాల్లో పోతన ఆధ్యాత్మి కతతో పాటు జ్ఞానాన్ని కూడా ఇక్కడ తెలియజేస్తాడు. అదేమిటంటే బంగారం నిప్పులో ఎంత పుటం పెడితే అంత వన్నె పెరిగి ఆభరణంగా శోభిస్తుందనే విషయానికి పొంతనగా ప్రహ్లాదుడు శిక్షలన్నిటిని భరించడంవల్లనే నారాయణుడు ద్వయ రూపంతో అద్వితీయుడుగా స్తంభం నుండి వెడలి దైత్యుని తృంచి ధర్మరక్షణ చేసాడు. ఈ విషయంలో ప్రహ్లాదుడిది వీగిపోని నమ్మకం. ఆ మాటకొస్తే ప్రహ్లాదుడు తన తండ్రి చనిపోవాలనుకోలేదు. కానీ తండ్రికి మోక్షం కలిగించడంలో మాత్రం తనవంతు పాత్రను పరిపూర్ణంగా పోషించాడు. తనను అంత కాలం రక్షించిన శ్రీమన్నారాయణుడు ఆ ద్వయరూపంలో స్తంభం నుండి వెడలినపుడు అతడిని చూసిన ప్రహ్లాదుడు కొంత తడబాటు పొందాడు. అయితే జ్ఞానవంతుడవటంవల్ల అంతలోనే తేరుకోగలిగాడు. ఇంకేమీ ఆలోచించకుండా తన తండ్రికి ముక్తిని ప్రసాదించిన నరసింహస్వామిని తనకు కూడా ముక్తిని ప్రసాదించమన్నాడు. ఈ విషయాన్ని పోతన పరంగా ఆలోచించినపుడు అతడు చిన్ననాటి నుండి భగవత్ భక్తి పట్ల పెంచుకుంటూ వచ్చిన మానసిక, శారీరక సంసిద్ధత అతని జీవితంలో అనేక కష్టాలను అనుభవించినప్పటికీ తద్వారా అతనికి తృప్తిని కలిగించిన జీవితాన్ని కూడా ప్రసాదించింది. ఈ అనుభవమే భాగ వతంలో ప్రతిపాదించి భక్తి ద్వారా ముక్తిని పొందవచ్చనే సిద్ధాంతాన్ని ప్రబలంగా తెలియజేసాడు. అందుకే మహా మహులైన పరమహంసల పక్కన ప్రహ్లాదునికి స్థానం

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

లభించేట్లు చేయగలిగాడు. అదే ఈనాడు ప్రచారంలో "ప్రహ్లాద నారద పరాశర పుండరీక" అని ప్రసిద్ధమైన స్తుతిగా మానవ సమాజంలో స్థిరపడిపోయింది.

పోతన భాగవతంలో ప్రతి విషయాన్ని స్పష్టంగా, దాపరికం లేకుండా తెలియజేసాడు. సమాజంలో ప్రతి వారికీ అది ఆనందం కలిగించేదిగా ప్రతి వాక్యం రసాత్మ కంగా తీర్చిదిద్దాడు. అలాగే భాగవత కావ్యానికి శబ్ద, అర్థ గౌరవాన్ని కూడా సమానంగా తెలియజేసిన తెలుగు కవి ఇతడొక్కడే అన్నది సాహిత్య చరిత్రకర్తలు తెలియజేసిన సత్యంగా పేర్కొనవచ్చు. అలాగే రమ్యమైన భావాలను, పాత్రలు పడే వ్యథలను ఎంతో ప్రతిభతో తాను అనుభ విస్తూ ఆ పాత్రల చేత అనుభవింపచేసాడా అన్నట్లుగా ప్రతి అంశాన్నీ, ప్రతి పాత్రనూ ఎంతో శ్రద్ధగా తెలియ జేసాడు. తన కాలం నాటి పలుకుబళ్ళను, ఆచార వ్యవహారాలను, తాను దర్శించిన సామాజిక అంశాలను అన్నింటిని కూడా భాగవతంలో సందర్భోచితంగా ప్రదర్శితం చేసాడు. సమాజానికి ఏవిధంగా వ్యక్తి ప్రవర్తన వికాసాన్ని అందిస్తుందో తెలియజేస్తూ ఆ ప్రవర్తన రాజుదైనా, సామాన్యుడిదైనా గర్వానికి లోనుకానంతవరకు అవి సత్యనిష్ఠతో నిలబడతాయనే విషయాన్ని ప్రాతి పదికగా అందచేసాడు. ప్రధానంగా వామనావతార ఘట్టంలో బలి గర్వాన్ని అణచే సందర్భంలో స్వామి ద్వారా ప్రయోగించిన పద లాలిత్యం, సామాజిక ధర్మాలన్నీ కూడా అన్ని కాలాలకు ఆచరణీయంగా, అనుసరణీయంగా పోతన తెలియజేసాడు. దానం అనేది దైవ గుణంగా ప్రతి పాదించాడు. దానికి సాక్షీభూతంగా రంతిదేవోపాఖ్యానాన్ని మనోహరంగా తీర్చిదిద్దాడు. ఈ ఉపాఖ్యానంలో పరీక్ష లెదుర్కొన్న రంతిదేవుడు ఒకప్పుడు రాజుగా రాజభోగాలు అనుభవించినప్పటికీ వానప్రస్థాశ్రమంలో తపోధనుడై అతిథి అభ్యాగతులను సేవిస్తూ కాలం గడిపే సందర్భంలో అతడి సత్యనిష్ఠను, దానత్వాన్ని పరీక్షించడానికి త్రిమూర్తులు మారు రూపాల్లో రావడం, అతడి నుండి ఆహార జల సామగ్రిని తీసుకోవడం చేస్తారు. అయితే వీటన్నిటినీ భగవంతుడి పరీక్షగా జ్ఞాని అయిన రంతి దేవుడు సహనంతో భరిస్తాడు, తన సత్యనిష్ఠను పాటి స్తాడు. ఇక్కడ మనం గమనించాల్సింది సమాజంలో త్యాగమనేటటువంటిది ధార్మికతను ఉన్నతం చేసే ప్రధాన క్రియగా పోతన తెలియజేసినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా మానవ జీవన ఆశ్రమ ధర్మాలలో అతిథి, అభ్యాగత సేవ అనేది గృహస్థ, వానప్రస్థాశ్రమాలకు ఒక ప్రధాన ప్రబల సూత్రంగా తెలియజేయబడడంవల్ల ప్రతి గృహస్తు అతిథి అభ్యాగతులను ఆదరించి వారు తృప్తిపడిన తరువాతనే తాను క్షుద్బాధను తీర్చుకోవాలనే సామాజిక సూత్రాన్ని పోతన రంతిదేవుడు పాత్రలో తెలియజేసినట్లు అనిపిస్తుంది. అయితే ఈ ఉపాఖ్యానాన్ని చదువుతున్న పాఠకుడు రంతిదేవుని పాత్రలో ఉండే ఔన్నత్యాన్ని కనుగొనడమే కాకుండా ఆ పాత్రలోకి పోతనగారు పర కాయ ప్రవేశం చేసినట్లుగా భావన పొందుతాడు.

ఈవిధంగా తెలుగు సాహిత్యంలో పోతన భాగవతం స్పృశించని అంశం లేదు. సర్వశాస్త్ర సమ్మిశ్రణం భారతం అయినట్లే సర్వ విషయ సమాహారం భాగవతం. పాంచ భౌతిక దేహానికి, పంచభూతాలు సంతృప్తి పొందడానికి, పంచ యజ్ఞాలు ఫలవంతం కావడానికి తద్వారా మానవ జీవితం సంచితపాపాల నుండి విముక్తి పొందడానికి హేతువుగా భక్తికి సేతువుగా పోతన భాగవత నిర్మాణం చేసాడు. అందుకేనేమో కావ్య పురాణ యుగంలో తెలుగువారి నాల్కలపై ఈనాటికీ, ఏనాటికీ పోతన పద్యాలు నాట్యం చేయడం గమనిస్తే పోతన తన భాగ వతం ద్వారా విశ్వ సమాజాన్ని ఏవిధంగా ప్రభావితం చేసాడో మనకు తెలుస్తుంది. అందుకే పోతన జీవిత సాహిత్యాలు మానవజాతికి అనుసరణీయాలు. పోతన భక్తిలో పొందిన తాదాత్మ్యత భాగవతాన్ని పఠించడం ద్వారా ప్రతి వ్యక్తీ పొందగలగాలి. భాగవతం మన జాతికి భగవంతుడు పోతన ద్వారా ప్రసాదించిన అమృతం. క్షీరసాగర మథనంలో అమృతాన్ని నాడు భగవంతుడు మోహినీ అవతారంలో దేవతలకందిస్తే పోతన అసమాన తలు లేకుండా అందరికీ భాగవతామృతాన్ని పంచి భగ వంతుని దృష్టిలో, మానవ సమాజ దృష్టిలో వినయశీలిగా, ఉత్తముడిగా జీవితాన్ని పరిపూర్ణం చేసుకున్నాడు.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# సత్యహరిశ్చంద్ర నాటకం - ఆస్థి అశాశ్వితం

- డా॥ గరికపాటి కొరిబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్, యస్.జి.వి. ఓరియంటల్ కళాశాల, తిమ్మసముద్రం, ప్రకాశం జిల్లా.

ఆస్థి లేనిదే అన్నంలేని సమాజం ఇది. మనిషి బ్రతకడానికి ఆహారం అవసరం. మానవునికి సిగ్గు, మానం, అభిమానం ఉన్నవి కనుక ధరించడానికి వస్త్రాలు కూడా చాలా అవసరం. నివసించడానికి గూడు కూడా అవసరం. ఆదిమ జాతిగా మానవుడు ఉన్నప్పుడు మానవునికి ఈ మూడే అవసరాలు ఉండేవి. కాని నేటి నవ నాగరిక మానవుడికి కావలసినవి "అనంతం" ఈ సృష్టిలో లేనివి కూడా అవసరం కొద్దీ మానవుడు తయారు చేసుకుంటున్నాడు. ఆధునిక ఆలోచనలు, అవసరాలకు కావలసినవి సమకూర్చు-కోవడానికి ధనం చాలా అవసరం.

ఆధునిక సమాజంలో నివసించే మానవుడికి డబ్బు ఎంత కావాలోనన్న లెక్కను లెక్కకట్టిన వారుగాని, నిర్వచించినవారుగాని ఇంతవరకు ఎవరూలేరు. విచిత్రమేమంటే ఒక మనిషికి చనిపోయేవరకు ఎంత ధనం అవసరమో అంతవరకు మాత్రమే ఆశించటంలేదు. వారి బిడ్డలకు, మనుమడు, ముదిమనమడు! ఇలా కొన్ని తరాలకు సరిపడా సంపాదించడానికి సమాజాన్ని దోచేస్తున్నారు. శ్రమించటం లేదు. అక్రమ మార్గాల అన్వేషణలో మునిగిపోతున్నారు. మానవీయ విలువలు, నైతిక విలువలు మంటగలిపి మానవత్వం లేని మనుష్య లోకంగా సమాజాన్ని తయారుచేసారు. ఎంత ఆస్థి ఉన్నా, ధన ధాన్యాలు, వజ్రాలు, మణులు మాణిక్యాలు, మేడలు, మిద్దెలు ఇవి ఏవీ శాస్వితం కావని అవన్నీ అశాస్వితాలని వాటి వ్యామోహం నుండి బయటకు వచ్చి మనిషి మనీషిగా బ్రతకాలని - సత్యహరిశ్చంద్రీయ నాటకంలోని హరిశ్చంద్రుని పాత్ర ద్వారా మనం తెలుసుకోవచ్చు. విశ్వంభరాఖండ రాజ్యాధిపతియైన హరిశ్చంద్రుడు సర్వ రాజ్య భోగములును కోల్పోయి చివరికి కాటి కాపరిగా జీవించాడు. అందువల్ల డబ్బు శాసిత్వం కాదు అని తెలుసుకోవాలి.

తిరమై సంపదలెల్ల వెంట నొకరీ తిన్ సాగిరావేరి కే
సరికేపాటు విధంచెనో విధి యవ శ్యప్రాప్య మద్దాని నె
వ్వరు దప్పించెద రున్నవాడ ననిగ ర్వం బేరికిన్ గాదు కిం
కరుడే రాజగు రాజె కింకరుడగున్ గాలాను
కూలంబుగన్

ఎంత సంపాదించినా దానిలో రవ్వంత కూడా చనిపోతూ తీసుకెళ్ళినవారు ఎవరూలేరు. ఎప్పుడు ఎవరికి ఎలా విధి రాత ఉంటుందో అది అలా జరిగి తీరుతుంది. విధి నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు. ఈ రోజు లెక్కగట్టలేనంత ధనం ఉన్నవాడు రేపు బికారి కావచ్చు. నేడు బికారిగా ఉన్నవాడు రేపు అధికారి కావచ్చు, శ్రీమంతుడు కావచ్చు. ఎంత సంపాదించినా చివరి దశలో తులసి నీళ్ళు పోసేదిక్కు లేకుండా పోవచ్చు. ఇలాంటి అశాస్వితమైన సంపదలు కోసం మానవత్వాన్ని మంటగలపకూడదు.

కలికీ! ఱెక్కలురాని పిల్లలను సాకన్ గూటిలో నుంచి మే
తలకైపోతొక చెంత బెంటియొకచెం తన్ బాఱ నీలోన బి
ల్లలం(బామే గ్రసియించునో వలలపా లన్ జిక్కు
నోపున్న లీ
యిలపై బ్రాణులకున్ వియోగమగుచో! నెవ్వారి
కెవ్వారలో!

ఈకలు కూడా రానటువంటి నెత్తుటి ముద్దలైన పిల్లలను గూటిలోనే ఉంచి, వాటికి మేతను తీసుకు రావడానికి ఆడ పక్షి ఒక వైపుకు మగ పక్షి మరొక వైపుకు వెళితే ఆ పక్షులు వేటగాళ్ళు వేసిన వలలో చిక్కుకొని, వాడికి ఆహారంగా మారితే అప్పుడు పిల్లల పరిస్థితి ఏంటి? లేదా తల్లి దండ్రి పక్షులు క్షేమంగానే ఉన్నవి అనుకుంటే అవి తిరిగొచ్చేలోపు చెట్టుపైకి ఏపామో ఎక్కి గూట్లోఉన్న పిల్లల్ని తినేస్తే అప్పుడు తల్లి పక్షుల ప్రేమామృతాన్ని స్వీకరించేదెవరు.

ఈ భూమి మీద ప్రాణులకు ప్రేమలు తెగిపోకుండా, వియోగాలు సంభవించకుండా ఆపేదెవరు? మనుష్య జాతికి తాను సంపాదించిన ధనం దుఖాఃన్ని ఆపగలుగుతుందా? ఆపలేనప్పుడు ఆధనం ఎందుకు? అని గ్రహించాలి.

మాయామేయజగంబె నిత్యమని సం భావించి మోహంబునన్
నాయిల్లా లని నా కుమారుడ౹డని ప్రాణంబుడు నందాక నెం
తో యల్లాడిన యీ శరీరమిపుడిం దుంగట్టెలం గాలుచో
నా యిల్లాలునురాదు పుత్రుడునుదో డైరాడు తప్పింపగన్!

మాయలోకం, మాయజన్మ వీటిని గ్రహించి సత్యం తెలుసుకోవాలి. మనలో ప్రాణం ఉన్నంతవరకు కుటుంబాపేక్ష కలిగి ఉంటాం. మనిషి ఏ పాపాలు చేసినా భార్య పిల్లలు కోసమే చేస్తాడు. తన ఒక్కడి కోసం మాత్రం కాదు. తనకోసమే అయితే జానెడు పొట్టకోసం అన్ని పాపాలు చేసి బ్రతనక్కరలేదు. భార్యన్నా, కొడుకులన్నా ప్రతి మానవుడికి అమితమైన ప్రేమ. వారికోసం అంతలా తల్లడిల్లిన వ్యక్తి, చివరకు చనిపోతాడు. తన శరీరాన్ని స్మశానంలో కట్టెలపై బెట్టి కాల్చుతుంటే బ్రతికిఉన్న భార్యగాని, ఆస్థులన్ని పొగేసుకుని సుఖిస్తున్న పుత్రుడుగాని భగభగ మండే మంటలనుండి శరీరాన్ని తప్పించడానికి రారు అంటున్నాడు. ఇంత సత్యాన్ని గ్రహించి కూడా మానవత్వాన్ని కోల్పోతున్న మానవుడు నిజంగా పశువుతో సమానం. జన్మనిచ్చిన వాళ్ళు, సంబంధాలతో బంధాలను ఏర్పరచుకున్నవారే శాస్వతం కానప్పుడు ఈ తరగని ఆస్థుల రాసులెందుకు.

"అయ్యో! ఈ కటిక చీకటిలో దారిబొత్తుగా నిర్ణయింప లేకున్నాను. ఈ చితిలోని కాష్టము నేను నిప్పుడు దీపముగా నుపయోగించు కొనియెద. ఆహా చక్రవర్తులకు సేవకాజనముపట్టు బంగారు గరదీపికలకంటె నా యిప్పటి నీచస్థితికి నీ కొఱవియే మిక్కిలి యుచితమైనది".

అఖండ భూభాగాన్ని పాలించే చక్రవర్తికి, రాజ సేవకులు వెన్నంటి యుండి చీకట్లలో బంగారపు కరదీపికలను పట్టి మార్గమును కల్పిస్తారు. అలాంటి భోగ భాగ్యములను అనుభవించిన హరిశ్చంద్రుడు ఇప్పుడు వల్లకాటియందు కాపరిగా ఉంటున్నాడు. స్మశానంలో కటిక చీకటిలో దారి కనిపించక శవం కాలుతూన్న చితిలో ఒక కట్టెను తీసుకొని ఆ కొరివి వెలుతురులో నడుస్తున్నాడు. విధి ఎంత విచిత్రమైనది? బలీయమైంది? మన జీవితాన్ని శాసించేది విధయేగాని ధనం కాదని అర్థమౌతుంది.

"హా! విశంభరాఖండరాజ్య ప్రదాన సమర్పిత కౌశికా! హా! నేనే మందభాగ్యురాలనగు నీ జీవితేశ్వరిని చంద్రమతిని. ఎల్లప్పుడల్లారు ముద్దుగా బెంచిన నీ వంశాంకురంబగు నీ కుమారుడు లోహితాస్యుడీ కాటిలో గులకరాలపై నెట్లు పండుకొని యున్నాడో యొక్క మాఱుకన్నెత్తి చూడు. ప్రాణపతీ! రాజ రాజ కోటీరమణి రంజిత పాదాంభోజుడవగు నీకా యీ కాటికాపరితనం? దురవలోకనంబగు నీ ప్రేతాలయంబే నీకయోధ్యాపురం బయ్యనే? బయంకరంబులగు నీ భూత భేతాళ పిశాచ గణంబులా నీకు భట సముదాయము? శవనికరంబుల దహించు చుండిన పొగగుంపా నీకు కరదీపికా సహస్రములు? నాథా! నీ రాజసం బెందుబోయినది? జీవితేశ్వరా! అశ్రాంతంబు పాదాక్రాంతులై నమస్కరించు సామంతులెల్ల నీకిప్పుడేల యడుగులకు మడుగు లొత్తకుండిరి? రాజచూడామణీ"!

గుండెలను పిండినట్లున్నది చంద్రమతి ప్రేమాభిమానం షట్చక్రవర్తియైన సత్యహరిశ్చంద్రుడు స్మశానంలో పిండాకూడు భోంచేస్తున్నాడు. చుట్టూ శవాలు, భూతాలు, ప్రేతాత్మలే స్నేహం చేస్తున్నవి. శరీరాలను కాల్చు కట్టెల వెలుగే, దేదీప్యకాంతులైనాయి. రాజరాజులే హరిశ్చంద్రునికి సామంతులై జీవించే రాజసం కలవాడు. అలాంటి హరిశ్చంద్రుడు ఇప్పుడు కాటికాపరి వృత్తి చేస్తున్నాడు. దుర్గంధంతో శవాలు కాలుతున్న ఈ స్మశానమే అతనికి రాజ్యమైంది. ఇలాంటి స్థితిలో ఉన్న భర్తను చంద్రమతి చూసి తల్లడిల్లుపోతుంది.

**ముగింపు :**

సత్యహరిశ్చంద్రుడు ఎక్కడి నుండి ఎక్కడికి వచ్చాడు? ప్రస్తుత మన ఆధునిక ప్రపంచంలో కూడా ద్వాపర యుగంలో ఉన్న కుబేరుని సంతతివారు వేలమంది ఉన్నారు, వీరి అందరికన్నా ధనవంతుడు సత్యహరిశ్చంద్రుడు. అతని ఆస్థులు, రాజ్యాలు, భటులు, భోగాలు, భాగ్యాలు ఏవీ అతన్ని సుఖించేటట్లు చేయలేకపోయినవి. అందునా భారతీయ, ఇతిహాస పురాణాల్లోను, చరిత్రలోనూ, నిజసమాజంలోనూ సత్యహరిశ్చంద్రుని మించిన సత్యవాక్మనీషి లేడని చెప్పొచ్చు. అతనికే అంత దయనీయస్థితులు సంభవించినవి. కనుక ఈ లోకంలో ఆస్తులు అశాస్వితం అని గ్రహించి ప్రతి మనిషి లోకహితం కోరతూ దానికి తగినట్లు బ్రతకాలని ఆశతో ఈ వ్యాసం రాస్తున్నాను. ఇలాంటి కనువిప్పు కలిగించి సన్నివేశాలను నాటకం ద్వారా కల్పించిన శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు ధన్యజీవులు.

**ఉపయుక్త గ్రంథం :**

1. సత్యహరిశ్చంద్రీయ నాటకం - శ్రీ బలజేపల్లి లక్ష్మీకాంతం గారు

❀❀❀

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

# సమకాలీన తెలుగు సాహిత్యంలో జిగిరి నవల - సామాజిక దృక్పథం

- డా॥ అజ్మీరా సిల్మానాయక్, తెలుగు అధ్యాపకులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, తిలక్ రోడ్డు, హైద్రాబాదు.

## కవి పరిచయం :

పెద్దింటి అశోక్‌కుమార్ గారు కరీంనగర్ జిల్లా, గంభీ రావుపేట మండలంలోని భీముని మల్లారెడ్డిపేట గ్రామంలో జన్మించారు. తల్లి మల్లవ్వ, తండ్రి అంజయ్య. ప్రాథమిక విద్య గంభీరావుపేటలో, ఇంటర్మీడియేట్ మరియు బి.ఎస్సీ డిగ్రీ సిద్ధిపేటలోను, ఎం.ఎస్సీ, ఎం.ఏ. పట్టాలను కాకతీయ విశ్వవిద్యాలయం నుండి బి.ఎడ్ డిగ్రిని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పూర్తి చేశారు. ప్రస్తుతం గణిత ఉపాధ్యాయునిగా పని చేస్తు న్నారు. వృత్తి అధ్యాపకం అయినా ప్రవృత్తి మాత్రం రచ యిత. ఆధునిక తెలుగు సాహిత్యంలో తెలంగాణ ప్రాంతం నుండి వివిధ ప్రక్రియల పై విశ్లేషణాత్మకమైన, పరిశోధ నాత్మకమైన రచనలు చేశారు. వీరు ప్రధానంగా సుమారు 200 కథలు, ఐదు నవలలు (అవి:-) ఎడారి మంటలు, 2) ఊరికి ఉప్పలం, 3) సంచారి, 4) జిగిరి 5) దాడి) రాశారు. వీరు అటు కథలు, ఇటు నవలలతో పాటు వివిధ సాహిత్య వ్యాసాలు, సామాజిక వ్యాసాలు కూడా రాశారు. వీరు రాసిన కథలు వేరే వేరే భాషల్లో అనువాదం అయ్యాయి. వీరు నచించిన ''జిగిరి'' అనే నవల ఏడు భాషల్లో అనువాదం అయ్యాయి. ఇది హింది, ఆంగ్లం, పంజాబీ, మరాఠి, ఒరియా, కన్నడ, బెంగాలి భూషల్లో ప్రచరితమైనది. ఈ నవలకు అనేక బహుమతులు కూడా వచ్చాయి. ''పాఠశాలనే నా ప్రయోగశాల, పిల్లలకు పాఠాలు చెప్పడమన్నా కథలు రాయడమన్నా నాకు ఎక్కువ ఇష్టం'' అని సగర్వంగా చెప్పుకునే ఆధునిక కథ, నవలా రచయితగా మంచి పేరొందిన కవి పెద్దింటి అశోక్‌కుమార్. జిగిరి నవల 2011 లో మొదటి సారిగా పుస్తక రూపంలో అచ్చు అయ్యింది.

## జిగిరి నవల గురించి :

జిగిరి అంటే అత్యంత సన్నిహితంగా ఒకరిలో ఒకరు కలిసిపోవడం. సన్నిహితంగా ఉండడం అనే అర్థాలు చెప్పు కోవచ్చు. ఇక్కడ ఒక క్రూర జంతువు అయినా ఎలుగు బంటి (గెడ్డెలుగు) అడవి నుండి ఊరికి వచ్చి మనుష లతో స్నేహం చేసి మృగలక్షణాలను పోగొట్టుకుని సాధువై పోతుంది. కాని సాధువులా ఉండవలసిన మనిషి మాత్రం మృగమైపోతాడు. మృగ లక్షణాలున్న మనిషికి, సాధువు లక్షణాలున్న మృగానికి హత్తుకునేలా చిత్రించిన నవల "జిగిరి". ఇందులో ప్రధానంగా గుడ్డెలుగును మచ్చిక చేసు కుని ఆటలు ఆడిస్తూ జీవించే ఒక ముస్లీం కుటుంబం, గురించి ఉన్నది. ఈ నవల చూడడానికి చిన్నదే అయినా మనస్సు మీదా పెద్ద పెద్ద ప్రశ్నలను లేవదిస్తుంది. గుడ్డె లుగును పసితనంలో తీసుకొచ్చి, దానిని కన్న బిడ్డకన్నఏ అత్యంత ప్రేమగా చూసుకునే మనుషుల ప్రేమను, ఆప్యాయతను ఇందులో చూస్తాము. వన్యప్రాణుల సంర క్షణ చట్టం ద్వారా మూగ జీవాలను హింసించకూడదు. అది అందరి కర్తవ్యం కూడా కాని ఈ మూగ జీవులకు మానవులకు మధ్యన ఉన్న ప్రేమ బంధం చాల గొప్పది. జిగిరి నవలను చదివితే మనసు చలించిపోవల్సిందే. ఇమామ్‌కు గుడ్డెలుగుకు మధ్య ఉన్న తండ్రి కొడుకుల ప్రేమ. కంట తడి పెట్టిస్తుంది. స్వార్థం మనిషిని, మానవ సంబంధాలను చిన్నా భిన్నం చేస్తుంది.

ఈ నవలలో ఒక గుడ్డెలుగు షాదుల్ అనే పేరుతో ఇమామ్ కుటుంబంలో ఒక వ్యక్తిగా, బీబమ్మకు, చాంద్ అనే కొడుకుతో సమానంగా పెరుగుతుంది. షాదుల్ రెండు దశాబ్దాల పాటు ఆట పాటలతో ఆ కుటుంబానికి జీవనా ధారం అయ్యింది. ప్రభుత్వం ప్రకటించే రెండు ఎకరాల భూమి ఆశ ఆ కుటుంబంలో పేను తుఫాను లేపింది. ఒక కుటుంబ మనిషిగా, చాంద్‌కు తోబుట్టుగా పెరిగిన షాదుల్‌ను వదిలించుకోవాలనే నిర్ణయం వచ్చినప్పుడు తల్లి బీబమ్మ, కొడుకు చాంద్‌వైపు, ఇంటి యజమాని

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

అయినా ఇమామ్ అటూ భార్యకు ఇలుకన్న కొడుకు అయినా చాంద్‌కు, పెంచిపోషించిన షాదుల్ విషయంలో ఏమి చేయాలో దిక్కుతోచని ఆలోచన ఇమామ్‌ను మాన సిక ఆవేదనకు గురిచేసింది. ఇమామ్, సాదుల్ ఇద్దరూ జాన్ జిగిరిలు. ఇద్దరు రూడా విడిచి ఉండలేని స్థితి. ఒకరంటే మరొకరికి మానసిక స్థైర్యం, ధైర్యం, పరస్పర ప్రేమ, గౌరవం అనుబంధం, అనురాగం. స్వార్థం మనిషిని ఏటువైపు తీసుకుపోతుందో ఈ నవలలో కనిపించే ఘట్టాలు.

## నవలలోని పాత్రలు :

### 1) ఇమామ్ :

ఈ నవలలో ప్రధాన పాత్ర ఇమామ్‌ది. ఇతను ఒక ముస్లీం, ఇతన్ని అందరు పక్కీరొడు, పక్కీర్‌సాబ్ అని పిలుస్తారు. వృత్తి గుడ్డేలుగుతో ఆటలు ఆడించేవాడు. జంతువు వెంట తిరిగే జంతువులాంటి మనిషి. పొట్టిఆ, సన్నగా, తెల్లని గడ్డం, సన్నటి మీసం, మొనదేలిన ముక్కు, చురుకైన కండ్లు, నల్లని కోటు, మస్కట్ లుంగి, నల్లటి బూట్లు, కుడిచేతిలో రాగి కడియం, మెడలో లాయితులు ఉంటాయి. ఇమామ్‌కు, గుడ్డేలుగుతో స్నేహం ఏర్పడింది. గుడ్డేలుగు ఇమామ్ ఇద్దరూ ఒకరిని విడిచి ఒకరు ఉండని తండ్రి కొడుకుల అనుబంధం లాంటిది. వాళ్ళిద్దర్ని వేరువేరుగా ఎప్పుడూ, ఎక్కడా ఎవరు చూడలేదు. ఎప్పుడు ఎక్కడకనిపించినా ఇద్దరూ ఒకేచోట కనిపిస్తారు. ఇమామ్ ఏది చెబితే దానికి తగ్గట్టుగా వినేది. ఇమామ్ చేతిలో తాడు ఉంటుంది. ఆ తాడు రెండవ చివరన షాదుల్ మూతికి బిగించి ఉంటుంది. ఇమామ్ ముందు నడిస్తే షాదుల్ అతని వెనక నడిచేది. రోజూ పొద్దుకంటే ముందే లేచి బయలుదేరి, చీకటి తర్వాతా ఇల్లు చేరేవారు. ఒకరినొకరు చూపులతోనే అర్థం చేసేకునే వారు. చేతిలో తాడు ఉన్న లేకున్నా షాదుల్ ఇమామ్‌ను వెంబడించేది. ఆక్కడక్కడా లేకున్నా షాదుల్ ఇమామ్‌ను వెంబడించేది. అక్కడక్కడా ఆగి ముక్కును నేలకు ఆనించి గురుక్కుమని చీమల్ని పీలుచుకుని చప్పరించేది. రోజు అలవాటైనా ఐర కుక్కలు మొరుగుతూనే ఉండేవి. వాటికి భయపడకుండా షాదుల్ ఇమామ్ వెంట గంభా రంగా నడుస్తుండేది.

ఇమామ్ షాదుల్‌ను చూస్తుంటే చేతికందిన కొడుకును చూస్తున్నట్టుగా గర్వంగా ఉండేది. ప్రేమగా జూలు నిమురుతూ, మెడను ముద్దాడేవాడు. సంతోషంతో అరే బేకూఫ్...'' అని ప్రేమగా తిట్టేవాడు. తాగినప్పుడు మాత్రం దానిని పట్టుకుని ఏడ్చేవాడు. ఇమామ్, బీబమ్మ, చాంద్ ముగ్గురు ఎక్కడ కూర్చున షాదుల్ గురించి మాట్లాడే వారు. అది చేసిన అల్లరి గురించి దాని ఆటల గురించి ముచ్చట్లు నడిచేది. ఇమామ్, షాదుల్‌ను కన్నబిడ్డలాగా చూసుకునేవాడు. అది కూడా ఇమామ్‌ను తండ్రిలాగా మెలిగేది. మాట ఒక్కటే రాదు కాని ఇమామ్ చెప్పినట్లు వినేది. "షాదుల్ ఒకరి కష్టంతో బతకుదు. అది బతికినన్ని రోజులు మనకు తిండికి కొదవలేదు. చివరికి అది చచ్చి పోయినా ! దాని తొలుకు బోలెడంత గిరాగి" అని గర్వంగా చెప్పుకునేవాడు. ఇమామ్ అప్పుడప్పుడు బాధగా కొడుకుతో, భార్యతో "షాదుల్ మనకోసం అన్నీ త్యాగం చేసింది. అలవాట్లు మార్చుకున్నది. అడవిని విడిచి ఐరికి వచ్చింది. మనకోసం సాధువైపోయింది. మన ఇంట్లో మనిషిలాగా మన ఇంట్లో దీపం పెట్టిందనేవాడు''. ఇమామ్ తాను ఏది తిన్నా ముందుగా షాదుల్‌కు పెట్టి తినేవాడు.

### 2) బీబమ్మ :

బీబమ్మ ఇమామ్ భార్య, చాంద్‌కు కన్నతల్లి, షాదుల్‌కు పెంచిన తల్లి. షాదుల్ అంటే ఆమెకు పంచ ప్రాణం. చాంద్, షాదుల్ ఇద్దర్ని కన్న బిడ్డలాగా చూసు కునే మనిషి. చాంద్‌ను, షాదుల్‌ను ఎప్పుడు కూడా వేరు చేసి చూడలేదు. షాదుల్ త్యాగాన్ని బాగా అర్థం చేసుకున్న మనిషి. "ఇంట్లో దీపమే కాదు. మనకు బతుకునిచ్చింది గదయ్యా. ఏ జన్మలో మనం దీని కడుపున పుట్టినట్లున్నం. ఆ రుణం తీర్చుకోవడానికి మనం ఎన్ని జన్మలెత్తాలెనో..'' అంటూ షాదుల్ గురించి చెప్పేది. షాదుల్‌కు జ్వరమోస్తే బీబమ్మకు ముద్ద దిగేది కాదు. ఆమె కడుపు మాడ్చుకుని షాదుల్ కొరకు పొయ్యి వెలిగించేది. దాని కాళ్ళకు ముల్లు

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


గుచ్చుకుంటే గిలగిల కొట్టుకునేది. రోజూ పొద్దున లేవగానే ఇమామ్ మక్కపిండి తడిపితే బీబమ్మ ఉడికించేది. ఇంట్లో ఉన్నంతసేపు బీబమ్మ ఏదో ఒకటి షాదుల్ మందు వేసేది. దానికొకరు వారానికి ఒకసారి బీబమ్మ జాజికాయలు నూరి రసం పోసేది. అది అజీర్తిని పోగొట్టి జీర్ణశక్తిని పెంచేది. షాదుల్‌కు జ్వరమస్తే కంటికి నిద్ర ఉండేది కాదు బాబమ్మకు. ఒకసారి షాదుల్‌కు సుస్తి చేస్తే తన చనుపాలు ఇచ్చింది. తన పుట్టింటి బంధువుల నానా రకాలుగా మాట్లాడిన బాబమ్మ మాత్రం తనకు ఇద్దరు కొడుకులనే మురిసిపోయేది. వారిద్దరిది తల్లి కొడుకుల ప్రేమ. కాని ప్రభుత్వం ప్రకటించిన రెండు ఎకరాల భూమి వారిద్దరిని వేరు చేసింది. కన్న కొడుకు వైపు మొగ్గు చూపెటట్టు చేసింది. బీబమ్మతో షాదుల్ గావురాలు చేసేది. బీబమ్మ చుట్టూ పిల్లికూనలా తిరిగేది. అలాంటిది ప్రపంచీకరణ ప్రభావంతో మానవ సంబంధాలన్ని మంట కల్సిపోయేటట్లు అయింది.

### 3) చాంద్ :

ఇమామ్, బీబమ్మల గారాబాల కొడుకు. షాదుల్‌కు తమ్ముడు లాంటివాడు. చాంద్‌ది షాదుల్‌ది ఒకటే వయస్సు. ఇరువై ఇరువై ఒక్కటి మధ్యన ఉంటాడు. అతడు కళ్ళు తెరిచే సరికే షాదుల్ ఇంట్లో తిరుగుతుంది. చాంద్ కంటే ముందుగా ఎదిగి ఆ కుటాంబాన్ని ఆదుకున్నది. చాంద్ రోజు పొద్దున లెవగానే తల్లి తండ్రులతో పాటు షాదుల్ కొరకు పాలు తెచ్చేవాడు. అప్పుడప్పుడూ షాదుల్ వెంట చాంద్ ఉండేవాడు. చాంద్ ఉన్నప్పుడు షాదుల్ ఆద్దరు కూడా అల్లరిగా ఆడుకునేవారు. ఊరి చివరన ఉన్న గుడిసెలో ఆ నలుగురు ఉండేవారు. చాంద్ షాదుల్‌ను ఆట పట్టించడానికి మండుతున్న పుల్లను తీసి షాదుల్ వైపు చూపేవాడు. షాదుల్‌కు మంట అంటే భయం. అది ఒదిగి ఒదిగి, నక్కి నక్కి మూలకు కూర్చుండేది. ఆ విధంగా స్నేహంగా, అనకనదమ్ముల్లాగా ఉన్న ,ఆంద్, షాదుల్ ఇద్దరూ విడిపోయే ప్రమాదం వచ్చిపడింది. ప్రభుత్వం తెచ్చిన వన్యప్రాణి సంరక్షణ చట్టం వారిద్దరినీ వేరు చేసింది. మూగ జీవులను ఆధారం చేసుకుని జీవించే వారికి వాటిని అడవుల్లో వదిలేస్తే ప్రభుత్వం రెండెకరాల భూమి ఇస్తుందనే ప్రకటన చాంద్ షాదుల్ ఇద్దర్ని వేరు చేసింది. ఇరవై ఎండ్ల అనుబంధం ఆ కుటుంబంలో పెను సంక్షోభానికి దారి తీసింది. ప్రపంచీకరణ ప్రభావంతో కుటుంబాలన్ని ధ్వంసమైనాయి. స్వార్థం మనిషిని మృగంగా మార్చి వేసిందనడానికి ఈ పాత్ర చాలు. అన్నదమ్ములుగా పెరిగిన షాదుల్, చాంద్ విడిపోవాల్సి వచ్చింది. చివరకు చాంద్ దానిని విషం పెట్టి చంపడానికి సిద్దపడ్డాడు.

### 4) షాదుల్ :

ఒక గుడ్డెలుగు, క్రూర జంతువు. అడవి నుండి వచ్చి మనుషులతో స్నేహం చేసి మృగ లక్షణాలను పోగొట్టుకున్న సాధు జంతువు అయిపోయింది. ఇమామ్, బీబమ్మ, చాంద్ కుటుంబానికి ఆసరగా నిలిచింది. తన ఆటలతో వారికి జీవనాధారమైంది. షాదులేను చూడకుండా ఆ కుటుంబంలో ఎవరు వుండేవారు కాదు. షాదుల్ ఆడిందే ఆట పాడిందే పాట. దాని కాళ్ళకు ముల్లు గుచ్చుకుంటే ఆ ముగ్గురు గిలగిల కొట్టుకునేవారు. షాదుల్‌కు ఆకలేస్తే వారి పేగులు గుర్రుమనేవి. దానికి జ్వరమొస్తే వీళ్ళకు ముద్ద దిగేది కాదు. వాళ్ళు ఉప్పిడి ఉపాసమున్నా షాదుల్ కోసం పొయ్యి వెలిగించవలసిందే! కడుపు మాడ్చుకున్నా షాదుల్‌కు కడుపునిండా ఉండవలసిందే! ఎవరు ఎక్కడున్నా షాదుల్‌కు మాత్రం సమయానికి సత్తు గిన్నెలో తిండి పెట్టవలసిందే. వారితో అంతగా కలిసిపోయినా షాదుల్ నిజంగా మనిషి కాదు. అది జంతువు. క్రూర లక్షణాలను పోగొట్టుకుని సాధువుగా మారిన జంతువు. నల్లని మూతి, నల్లని బూరు, వాడిగా ఉన్న పండ్లు, కత్తుల్లాంటి గోర్లు, చిన్నని కండ్లు, షాదుల్ తింటున్న, నడుస్తున్నా ఆడుతున్నా, అడవిలో ఉన్నా, ఐరిలో ఉన్నా ఇమామ్‌ను గమనిస్తునే ఉండేది. ఎవరైనా ఇమామ్‌తో మాట్లాడుతుంటే కనిపెట్టుకుని గమనించేది. మాటల తీరును బట్టి పరిస్థితిని అంచనా వేస్తుంది. ఇమామ్ మీదికి ఎవరు అరిచినా, ఇమామ్ ఎవరి మీదికి అరిచినా వెంటనే గుర్రుమని లెస్తుంది. ఇమామ్ మాటలతోనో, కళ్ళతోనో,

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

సైగ చేస్తే తప్ప వారి మీద దాడి చేస్తుంది. ఇమామ్ గుడ్డెలుగు సైనా షాదుల్‌ను కన్న బిడ్డలాగా చూసుకునే వారు. కాని ప్రపంచీకరణ మూలంగా వన్యప్రాణుల సంరక్షణ చట్టం షాదుల్‌ను వారందరి నుండి విడిపోయే టట్లు చేసింది. ప్రభుత్వం ప్రకటించిన రెండు ఎకరాల భూమి వారి కుటుంబాల్లో తల్లి కొడుకులైన బీబమ్మ చాందేలు షాదులపై ఈర్ష్య పెంచుకున్నారు. ఇమామ్ ఒక్కడే షాదుల్ వైపు నిటబడిన దానిని వదిలించు కోవడానికి నానా ప్రయత్నాలు చేసినా, చివరికి షాదుల్, ఇమామ్‌లు అడవికి వెళ్ళిపోయారు. తిరిగి రాలేదు. వారెమైనారో తెలియని పరిస్థతి ఎర్పడింది.

## జిగిరి నవల కథా సారంశం :

ఈ నవల భారతీయ సాహిత్యంలో వివిధ భాషల్లో అనువాదమైనది. ఎలుగుబంటితో ఆటలు ఆడిస్తూ జీవించే వారిని మనం చిన్నప్పటి నుండి చూస్తూనే ఉ న్నాం. ఆటను చూసి అనందిస్తూనే ఉన్నాం. మనం చూసి వదిలేసిన విషయాన్ని కవి పెద్దింటి అశోక్‌కుమార్ గారు మంచి తాత్వికకోణంలో ఆలోచించి పరిశోధనాత్మకంగా, ఈలోచనాత్మకంగా "జిగిరి" నవలను రాశారు. గుడ్డెలుగు లక్షణాలు, అవి ఉండే తావులు, వాటి మచ్చిక, ఆటలు, వాటి చేష్టలు, వాటి ఆహారపు అలవాట్లు మొదలైన అంశాలన్నింటిని నిషితంగా పరిశోధించి ఈ నవలను రాశారు. కాలానుగుణంగా సమాజంలో వస్తున్న రకరకాల మార్పులు వ్యవస్థ మీదా ఎలాంటి ప్రభావాన్ని చూపి స్తాయో ఈ నవలను చదివితే అర్థమౌతుంది. ఇందులో చిన్న పిల్లగా ఉన్న ఎలుగుబంటిని తెచ్చి పెంచి పోషించి, ఆటలు ఆడించి వాటితోనే జీవనాధారంగా చేసుకుని జీవించే వారి కుటుంబాల జీవితాలను మనకు కళ్ళకు కట్టినట్లు చూపించారు. అశోక్‌కుమార్ గారు.

ప్రపంచీకరణ ప్రభావంతో సమాజంలో వచ్చిన మార్పులు మానవ సంబంధాలను ఏరకంగా చిన్నా భిన్నం చేసిందో ఈ నవలలో చూడవచ్చు. ప్రపంచీకరణ అంటే ప్రపంచానంతా ఒక కుగ్రామంగా మార్చడం. అంటే సంపదను, తెలివిని, ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి. ఈ నవలలోని కథ సాధారణంగా ఉన్న అసాధారణత్వాన్ని పరికించి కళాత్మకంగా తిర్చిదిద్దడంలో అశోక్‌కుమార్ గారు సఫలికృతమైనారు. మామూలుగా చూస్తే ఇది సాధారణ విషయమే కాని ఆ విషయం వెనక ఉన్న గాఢతను, లోతుని పట్టుకుని మన కళ్ళముందే కళాత్మకంగా, సృజనాత్మకంగా రచన చేశారు కవి.

జిగిరి నవలలో ఇమామ్, బీబమ్మ, చాంద్, షాదుల్ అనే పాత్రలు ముఖ్యమైనవి. ఇందులో షాదుల్ ఒక ఎలుగుబంటి, క్రూర జంతువు. అడవి నుండి ఊరికి వచ్చి మనుషులతో స్నేహం చేసి మృగలక్షణాలను పోగొట్టుకుని సాధువుగా మారిపోతుంది. కాని సాధువులా ఉండాల్సిన మనిషి మృగమైపోతాడు. ఇందులోని కథనే ఆసక్తికరంగా ఉన్నది. షాదుల్ అనే ఎలుగుబంటిని ఆటలు ఆడిస్తూ పొట్టపోసుకునే పక్కిరోల జీవితం ఇందులో ఉన్నది. ఇరవై సంవత్సరాల పాటు, ఇమామ్, బీబమ్మ,. చాంద్, షాదుల్ ఎంతో అన్యోన్యంగా ఒకరిలో ఒకరు కలిసి జీవించారు. కాని ప్రభుత్వం ప్రకటించిన రెండెకరాల ఉచిత భూమి వారిని చిన్నాభిన్నం చేసింది. పరిస్థితులు తారుమారు అయ్యాయి. అప్పటి వరకు బీబమ్మ చాంద్‌లు ఎంతో ప్రేమగా చూసుకునే ఎలుగు బంటిని శత్రువులాగా యూడడం హృదయాన్ని కదిలింప చేస్తుంది. ఇరవై సంవత్సరాల పాటు గుడ్డెలుగుతో ఆ కుటుంబానికి ఉన్న బంధం పటాపంచాలలు అయినాయి. ఎలుగుబంటిని సొంత బిడ్డలాగా చూసుకునే బీబమ్మ ఆలోచనలో మార్పులు వచ్చాయి. చాంద్, షాదుల్‌ను తొబుట్టులాగా చూసుకునే పరిస్థితి భిన్నమైపోయింది.

జంతు సంరక్షణ చట్టం ద్వారా ఎవరైనా మూగ జీవు లను పెంచి, పోషించి వాటిని బాదించేవారు చట్టపరంగా శిక్షార్హులు. అలాంటిది ఎలుగుబంటితో ఆటలు ఆడిస్తూ పొట్టపోసుకునే వారికి ఆ చట్టం శాపంగా మారింది. ఇమామ్, బీబమ్మ, చాంద్ కుటుంబంలో ఒక మనిషిగా ఉన్న షాదుల్ అనే ఎలుగుబంటిని కనిపించకుండా చేస్తే రెండెకరాల భూమిని ఇస్తారని ఎమ్మార్వో చెప్పడంతో దానిని వదిలించుకోవాలని చాంద్, అతని తల్లి బీబమ్మ

పట్టుబడుతారు. కానీ ఇరవైయేళ్ళపాటు తమకు జీవనో పాదిని కల్పించిన ఎలుగుబంటిని వదులుకోవడం ఇమామ్‌కు ఇష్టం ఉండదు. భూమికోసం ఇరవై ఎండ్ల అనుబంధాన్ని వదులించుకుని దానిని ఎండ్రిన్ పెట్టి చంపాలనుకున్నాడు చాంద్. ఎలాగైనా కన్న కొడుకును రైతును చేయాలనే తపనలో తల్లి బీబమ్మ వత్తాసు పలుకుతుంది. గుడ్డెలుగును వదలలేక, చంపలేక, దానితో ఉన్న రెండు దశాబ్దాల అనుబంధాన్ని తలుచు కుంటూ, మథనపడుతూ ఉంటాడు ఇమామ్.

మనం చిన్నప్పుడు గ్రామాల్లో ఊరి చివర్లో వలసలుగా వచ్చి గుడిసెలు వేసుకుని జీవించేవారు రకరకాలుగా ఉంటారు. అందులో ఒక కుటంబం పక్కిరోళ్ళది. అది ఇమామ్ కుటుంబం. ఎటుగుబంటితో ఆటలు ఆడిస్తూ జీవిస్తుంటారు. ఇప్పుడు అలాంటి వారు అరుదుగా కనిపిస్తారు. జంతు పరిరక్షణ చట్టం వచ్చినాక ప్రభుత్వం వారు, రెవిన్యూ అధికారులు, పోలీసులు ఆ పని చేయని యడం లేదు.ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని అద్భుతంగా నవల రూపంలో చిత్రించారు. పెద్దింటి అశోక్‌కుమార్ గారు. మనకు తెలిసిన కథ సాధారణం కావచ్చు కాని కవి దానిని నిషితంగా పరిశీలించి, పరిశోధించి వారి జీవిత విషయాలను, తీరుతెన్నులు, జీవన సంఘర్షణ, వారి విషాదానందాలను ఎవరు పట్టించుకోరు కాని రచయిత లోతులుగా పరిశీలించి ఈ నవలను రాశారు. సమాజంలో ఇలాంటి వారి మీదా చులకన భావన ఉంటుంది. ఎవరు పెద్దగా పట్టించుకోరు. అలాంటి వారి జీవితాన్ని ఇతి వృత్తంగా చేసుకుని ఈ నవలను రాశారు రచయిత. ఇది చాల గొప్ప. కాని తెలిసిన దానిని అందరికి అర్థమయ్యే టట్లు, ఆలోచించేటట్లు చేయడం, అందరి మెప్పును పొందడం గొప్ప విషయం. ఏ రచయితకు రాని ఆలో చనలు ఈ రచయితకు రావడం గొప్ప విషయం. ఇతరు లెవరూ పట్టించుకొని అంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని అటూ కథలు, ఇటూ నవలలు రాసి తెలుగు సాహిత్యంలో సంచలనం సృష్టించిన కవి అశోక్‌కుమార్ గారు. ఇప్పుడు ఈ ''జిగిరి'' నవల కూడా విలక్షణమైనది. అందుకే ఎలుగుబంటిని జీవనాధారం చేసుకుని జీవించే వారి బతుకుల్ని ఇతివృత్తంగా చేసుకుని ఈ నవలను రాశారు.

ఎలుగుబంటి స్వభావం, దానిని పట్టుకోవడంలోని నైపుణ్యాలు, దాని ఆహారపు అలవాట్లు, దానిని పోషిం చడంలోనూ, ఆడించడంలోనూ ఉండే సాధక బాధకా లను సహజంగా చిత్రించారు రచయిత. అంతే కాకుండా ఎలుగుబంటికి వచ్చే రోగాలు, మనిషితో అది పెనవేసు కున్న ఆప్యాయత, అది వ్యక్తం చేసే రకరకాల కదలికల్ని అక్షరబద్ధం చేసి కళ్ళకు కట్టినట్లు చూపారు. ఎలుగుబంటి యెక్క ప్రాకృతిక స్వభావాన్ని, దాని ఆయుష్షును దానిని వలపన్ని పట్టుకోవడంలో మనుషులు చూపే నేర్పరి తనాన్ని, దానిని మచ్చక చేసుకుని పెంచి పోషించే విధా నాన్ని దృశ్యమానం చేశారు రచయిత. అందుకే ఈ నవల అందరికి అన్ని భాషల్లో జాన్ జిగిరిగా మారింది.

## ప్రపంచీకరణ ప్రభావం :

90 వ దశకంలో భారతదేశంలో నూతన ఆర్థిక సంస్క రణలు ప్రారంభమయ్యాయి. గాట్ (జనరల్ అగ్రిమెంట్ ట్రేడ్ అండ్ టారిఫ్సి) ఒప్పందంపై మనదేశం సంతకం చేశాక అనేక మార్పులు జరిగినాయి. ప్రపంచబ్యాంకు గాట్ (జనరల్ అగ్రిమెంట్ ట్రేడ్ అండ్ టారిఫ్సి) కలిసి ఉమ్మడిగా ప్రపంచంపై పట్టు బిగించాయి. దీనితో ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. ప్రపంచ బ్యాంకు వద్దకు వెళ్ళిన దేశాలకు శరతులు పెట్టి అప్పులివ్వడం మొదలయ్యింది. అంతర్జా తీయ వాణిజ్యానికి దేశాల మధ్య సరిహద్దులు చెరిగి పోయాయి. ఈ పరిణామాలతో బలహీనుడికి, బలవం తుడికి మధ్య పోటి ఏర్పడింది. ప్రపంచీకరణ పరిణామాల నేపథ్యంలో మనిషిని మనిషిగా చూసుకునే స్థితి లేదు. గ్లోబలైజెషన్ కారణంగా డాలర్‌కు అత్యధిక ప్రాధాన్యత పెరిగింది. మన సంస్కృతి పరాయికరించబడింది, కార్పో రేట్ వ్యవస్థను భారతీయ యవ్వనం బహుళజాతి కంపెనీల గేట్లకు వేలాడుతున్నాయి. సమస్త మానవ విలువలిన్ని డాలర్ కట్టల క్రింద నలిగిపోతున్నాయి. వస్తు వ్యామోహంలో పడి మనిషి తనను తాను మర్చిపోయే

ప్రమాదం ఏర్పడింది. దీనితో సమాజంలో సమస్తవృత్తులు, సంస్కృతులు ధ్వంసమైపోయాయి.

సమకాలీన తెలుగు సాహిత్యంలో అనేక నవలలు వెలువడ్డాయి. అందులో 2011 లో 'జిగిరి' నవలను పెద్దింటి అశోక్‌కుమార్ గారు వెలవరించారు. ప్రపంచీకరణ ప్రభావంతో ఈ నవలలో ఒక మూగ జంతువుకు, మానవులకు మధ్యన ఏర్పడిన సంబంధం పటాపంచలాలు అయినది. ప్రపంచీకరణ విధ్వానం వల్ల ఇమామ్ కలలన్ని నేల మట్టం అయ్యాయి. ఇమామ్ మానసిక సంఘర్షణకు గురి అయ్యాడు. రెండు ఎకరాల భూమి ఎమ్మార్వో ప్రకటించడంతో కుటుంబ అనుబంధం చిన్నాభిన్నాం అయ్యింది. కేవలం రెండెకరాల భూమి ఇచ్చినంత మాత్రానే అభివృద్ధి కాదు. భూమిని సాగు చేయడానికి కావలసిన అన్ని రకాల సామార్థ్యాలను, సౌకర్యాలను కల్పించాలి. అంతమాత్రాన తమ జీవితంలో, కుటుంబంలో భాగమైన ఎలుగుబంటిని వదిలించుకోవాలనే కోరిక చాంద్‌లోనూ, బీబమ్మలోను కలిగింది. నిజంగా అట్లా చేయవలసిన అవసరం లేదు. భూమి ఆశ కల్పించి మానవ విలువల్ని మంట కలిపారు. అతి ప్రేమగా చూసుకుంటున్న ఎలుగుబంటిని వదిలేసి భూమిని తీసుకోవడం అవివేకం అవుతుంది. బీబమ్మ కన్న కొడుకులాగా పెంచి పోషించి పాలిచ్చిన తల్లి, షాదుల్ విషయంలో సవతి ప్రేమను ప్రదర్శించింది. కన్న కొడుకు చాంద్‌వైపే మొగ్గు చూపింది.

ప్రపంచబ్యాంక్ విధివిధానాలు మనిషిని, మానవ విలువల్ని ధ్వంసం చేశాయి. ఇలాంటి అభివృద్ధి పేరిట జీవవైవిధ్యాన్ని చిన్నాభిన్నం చేస్తున్నది. ప్రపంచబ్యాంకు విధివిధానాలు, జంతు పరిరక్షణ చట్టం వల్ల ఎలుగుబంటిని మొదట అడవిలో వదిలివేయాలనుకోవడం, తర్వాత విషం పెట్టి చంపాలనుకోవడం, మత్తుమందు వియాలనుకోవడం, చివరికి సజీవంగానే బొందపెట్టాలనుకోవడం అనే అంశాలు హృదయ విదారకమైన అంశాలు. ఇవన్ని కూడా రచయిత 'జిగిరి' నవలలో చక్కగా చిత్రించారు. ఈ నవల సామాజిక దృక్పథంతో రచించారు.

## ముగింపు :

తెలంగాణ ప్రాంతం నుండి నవలలకంటే కథలే ఎక్కువగా వచ్చాయి. ఇక్కడి ప్రజల గోసను కళ్ళకు కట్టినట్లు చూపించారు కవులు. పెద్దింటి అశోక్‌కుమార్ గారు ప్రధానంగా ఊటబాయి, వలసబతుకులు, మాఊరి బాగోతం, మాయిముంత, భూమడు, పోరుగడ్డ, జమ్మేకి రాత్‌మే అనేవి కథా సంపుటాలు. విటితో పాటు ఐదు నవలలు రాశారు. వీటిలో "జిగిరి" నవల అత్యంత ప్రాచుర్యం పొందిన నవల. ఏడు భాషల్లో అనువాదం చేయబడింది. సమకాలీన తెలంగాణ తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజంలో వచ్చిన మార్పుల్ని నచయిత ఈ నవలలో చక్కగా చిత్రించారు. ఈ నవలలోని ప్రతి పాత్ర కూడా మనకు చిరకాలం గుర్తుండిపోతుంది. ఈ నవలను చదివి ప్రతి హృదయం కదిలిపోవలసిందే. ఇమామ్‌కు గుడ్డేలుగుకు మధ్య ఉన్న తండ్రి కొడుకుల ప్రేమ కంట తడి పెట్టిస్తుంది. స్వార్థం మనిషిని, మానవ సంబంధాలను ఎట్లా కలుషితం చేస్తుందో ఇందులో చూడవచ్చు. షాదుల్ ఇరవై సంవత్సరాలుగా తన ఆట పాటలతో తన జీవితాన్ని ధారపోసింది. అంతిమ దశలో దాన్ని వదిలించుకోవాలనే ఆలోచన ఇమామ్, గుడ్డేలుగు ఇద్దరూ ఏమైనారో తెలియని ప్రశ్నగా మిగిలిపోయింది. కాలం మారుతున్న కొద్ది మానవ విలువల, సంబంధాలు ఎట్లా చిన్నాభిన్నం అయ్యాయో ప్రపంచీకరణ ప్రభావం మానవ విలువల్ని ఎట్లా చిన్నాభిన్నం చేస్తుందో కవి చక్కగా చిత్రించారు.

## ఉపయుక్త గ్రంథం :

1) జిగిరి (నవల) - పెద్దింటి అశోక్‌కుమార్ ; పాలపిట్ట పుస్తక ప్రచురణ, హైద్రాబాద్ -2001.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# Intricacies in Translation at News Broadcasting

- ***Dr. Bolugadde Anil Kumar***, Telugu Lecturer, Narayana IAS Academy, Hyderabad.

**Abstract :**

The translation of ideas from one to the other language becomes a part of the day's work in the modern offices especially in the fields of technology and education. So translation in the global world has gained momentum and attracted the attention of the translators in due course.

When a text is to be translated from English to Telugu and vice versa, translators face some challenges which make them difficult to do translation. But in this article some advanced techniques have been proposed to overcome such difficulties.

I shall be glad if readers, especially professional translators, take their own time to find the techniques resourceful and worth noting.

**Introduction :**

Words of different languages usually have similar meanings named as 'words of equivalance'. In translation more than the meaning of the words the context of the words is taken into consideration. So finding the suitable contextual word meaning is the ultimate objective of translation (JC cartford 1965 :219)

However, let's not think that there is always word to word meaning of different languages. The reason is the word origin takes place from various sources like socio-cultural and technical aspects of that particular region, state or nation. For example the cold countries have different synonyms for cold like mist, dew, frost, snow, ice, sleet, slush etc; But such number of words are not in use in hot climatic countries. As for telugu words 'vedi' 'vecha' it is used as 'sun' in English.

'Panakamlo Pudaka' 'Vadikanna rendu akulu ekkuve chadivanu' 'mee chaduvulu kattipettandi' reflect the telugu culture which is not found obviously in any other culture which is one of the bases for language origin. Some countries US, USSR, china, Japan, Germany are technologically advanced. But countries like India which is not advanced technologically doesn't have those many technical words. Animals like kangaroo, armedillo are not found in India. So we have to use them as kangaroo-armedillow only.

In the context of colours there are no equivalent words in telugu for english 'purple grey'. Colour 'green' in English can't be equivalent for both 'akupaccha' and 'pasupupaccha' in telugu. Also there is no telugu word for 'widower'.

Language also depends on political set up of a particular country if a country has democratic setup the words are used accordingly and if the country has a president from of political set-up the similar kind of words are used. Negro minister in English can't be negru manthri in telugu because the word Manthri in US is secretary. Secretary can't be manthri in telugu. Even in gender or sex for 'male' in telugu there are different words like 'athadu' 'athani' 'vaadu','aayana','vaaru'. So translation of male into telugu should be done appropriately based on the context.

He can be 'athanu' or 'aayana' in Telugu. In a criminal case a telugu daily wrote for convict 'athadu' and for an acquit 'athanu'.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

Sometimes we do not find exact words in other languages. In such a case only the nearest or closest word are only used. For example both 'house' and 'home' the nearest telugu word is 'illu'. I In such situations vladimiraivir proposes seven strategies. They are

1. Borrowing 2. Definition
3. Literal translation 4. Substitution
5. Lexical creation 6. Omission
7. Addition

**1. Borrowing :**

When there are no equivalents in Telugu journalism gives an idea of transliteration. Words like computer, cellphone are under the process of transliteration today.

**2. Omission :**

When there are no equivalent words in two languages then by way of defining the words it will be understood. 'Nirvasithulu" in english is displaced persons and 'necrophiliac' as 'mrutha dehalatho kamavancha thirchukunevaru'

**3. Substitution :**

When words of different languages have no common mean- ingful word in such asituation the substitution of nearest mean- ingful word is done.

**4. Lexical creation :**

The fifth strategy for translation is creating altogether a new word which gives similar meaningful word. The words in english like inflation, astronaut, defamation, coup, deadlock/ stalemate, civilwar, cold war are created lexically in telugu Dravyolbhanamu - rodhasi yathrikudu - vyomagami - paruvunastam - sainika thirugubatu- prathistambhana - Antharyuddham - pracchanna yuddham.

**5. Omission :**

When there is no similar meaningful word in the languages which makes difficult to translate then omission is an alternative. Thus omission is only done in the case of exceptional case where it is felt highly impossible to translate.

**6. Addition :**

One of the important strategies in translation is addition. when newly created words try to confuse the readers in such a case the additional information of that word should be provided in the bracket this will make the readers easy to understand.

**Example :**

**1.** The CBI described Koli as 'necrophiliac', a person who has a sexual interest in dead bodies. (Deccan Chronicle 23-3-07)

**2.** Dr. Reddy took strong objection to the TRS allegation that the Congress Government has deliberately delaying works on the 'tailpond' used as 'pond' for the benefit of farmers in the Krishna Delta (24-03-07)

**7. Literal Translation of Idioms :**

Idioms in Telugu are named as Nudikaralu or Jathiyalu. To translate Idioms into Telugu Language Engent A Nide has proposed three different methods

1. By finding the similar meaning of the idioms or phrases in telugu for english words
   a. bite the dust = matti karavadam
   b. throw the mind = buradha challadam
   c. back stabbing = vennupotu podavadam
2. By explaining idioms in simple language
   poke one's nose into = thaladhurchatam
   grease one's palm = Cheyi thadapadam
   cock and bull stories = Kakamma kathalu

3. By literal translation
   a. lame excuses = kunti sakulu
   b. nake truth = nagna sathyam
   c. iron curtain = inupathera
   d. war clouds = yuddha meghalu
   e. crocdile tears = mosali kanneeru
4. By creating a new idiom in Telugu as that of English
   a. Cold war = Pracchanna yuddham
   b. Civil war = Anthar yuddham

**Conclusion :**

The above four different methods have been mentioned by Bolanath Thivari (1995: 105-115)in the book 'anuvadvignam' which makes easy to translate idioms from English to Telugu.

**References :**

1. Mass communication and Translation techniques in telugu - Prof. P.Ramanarasimham-- University of Hyderabad , 2007.
2. Translation Studies in Telugu - D r.Addanki Srinivas - RGUKT - Vijayawada, 2014.

✿ ✿ ✿

భావ వీణ **BHAVA VEENA** ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
Journal of Telugu Literary, Culture & Language Study
August (1) 2019 తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.